
'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 224
మంగళవారం 5-11-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బేర్ ఎటాక్!
మూడు నెలల కనిష్టానికి సూచీలు

సెన్సెక్స్ 942 పాయింట్ల క్రాష్
నిఫ్టీ 24,000 పాయింట్ల దిగువకు

దేశీయ స్టాక్ మార్కెట్లలో సోమవారం అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లు సెన్సెక్స్, నిఫ్టీ ఒక శాతానికి పైగా పతనమయ్యాయి. ముగింపు స్థాయిలు మూడు నెలల కనిష్టం కావడం గమనార్హం.
15 లో



కస్తూరి అనుచిత వ్యాఖ్యలు
అంతఃపుర మహిళలకు సేవలు చేయడానికి తమిళనాడుకు తెలుగు వారు వచ్చారంటూ నటి కస్తూరి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.
- వివరాలు 12లో▶



ఆదాయంపై దృష్టి పెట్టండి
ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు.
- వివరాలు 2లో▶



కాకి పగ పదిహేడేళ్లు..
కాకులు పగబడతాయట. అదీ నెలో, ఏడాదో కాదు.. ఏకంగా 17 ఏళ్ల పాటు గుర్తుపెట్టుకుని మరీ పగ తీర్చుకునేందుకు ప్రయత్నిస్తాయట.
- వివరాలు 16లో▶



హర్మీత్ డబుల్ ధమాకా
వెనిజులాలో జరిగిన డబ్ల్యూటీటీ టోర్నీలో పురుషుల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచిన భారత స్టార్.
- వివరాలు 14లో▶

న్యూస్‌రీల్

'గ్రీన్‌చానల్'లో ఇందిరమ్మ ఇళ్లు



రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఇందిరమ్మ ఇళ్లు కట్టుకొనే వారికి ఆర్థిక సమస్యలు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తమ ప్రభుత్వం గ్రీన్‌చానల్ రూపొందించిందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
- వివరాలు 2లో▶

12 నుంచి ఐఏఎస్‌ల విచారణ!



కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లపై విచారణ చేస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెల 12 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పునరుద్ధరించనున్నట్టు తెలిసింది. ఈ నెల 11న జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.
- వివరాలు 5లో▶

జనవరి 1 నుంచి టెట్



ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) 2025 జనవరి 1 నుంచి 20 వరకు జరగనుంది. పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి సోమవారం ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ నెల 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
- వివరాలు 16లో▶

'సీతారామ'పై ఈఎన్‌సీ, సీఈకి షోకాజ్ నోటీసులు



పరిపాలనా అనుమతులు లేకుండానే సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి టెండర్లను ఆహ్వానించిన అంశంపై మంత్రుల సమక్షంలో వాగ్వాదానికి దిగినందుకు నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్, కొత్తగూడెం సీఈ శ్రీనివాస్‌రెడ్డికి ఆ శాఖ కార్యదర్శి షోకాజ్ నోటీసులిచ్చారు.
- వివరాలు 16లో▶

కేటీఆర్ చుట్టూ..
'ఫార్ములా - ఈ' ఉచ్చు!



ఆర్థిక శాఖ అనుమతి లేకుండా రూ. 55 కోట్ల చెల్లింపు ఆధారంగా సర్కారు చర్యలు

- రాజకీయ బాంబులు పేలుతాయన్న మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు ఆ దిశగా సంకేతాలేననే చర్చ
- ఈ వ్యవహారంలో అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమారే కీలకం
- సీఎస్‌కు ఇచ్చిన వివరణలో నాటి మంత్రి కేటీఆర్ మౌఖిక ఆదేశాలతోనే సొమ్ము ఇచ్చామన్న అర్వింద్‌కుమార్!
- ఫార్ములా-ఈ రేస్ కేసులో దర్యాప్తు ప్రారంభించిన ఏసీబీ

రంగంలోకి ఈడీ?
ఫార్ములా-ఈ రేసు అంశంలో విదేశీ సంస్థకు నిధులు బదిలీ అయిన నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు కూడా ప్రభుత్వం సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ఏసీబీ కేసు రిజిస్టర్ చేసిన నేపథ్యంలో ఈడీ కూడా విచారణ చేపట్టవచ్చని భావిస్తున్నారు.



సాక్షి, హైదరాబాద్: 'ఫార్ములా-ఈ' కార్ల రేసింగ్ అంశంలో పురపాలక శాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు చుట్టూ ఉచ్చుబిగిస్తున్నట్టుగా సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ-కార్ల రేస్ నిర్వహణ సంస్థ ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు కేటీఆర్ మౌఖిక ఆదేశాల మేరకు అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే రూ.55 కోట్లు చెల్లించారన్న అంశాన్ని ఆధారంగా చేసుకుని.. కేటీఆర్ అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నట్టు చర్చ జరుగుతోంది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల సియోల్ పర్యటన సందర్భంగా రాజకీయ బాంబులు పేలబోతున్నాయంటూ చేసిన కామెంట్లు.. తాజాగా అర్వింద్ కుమార్‌కు ఏసీబీ నోటీసులు.. కేటీఆర్ బావమరిది జన్వాడ నివాసంలో దాడులు.. కేటీఆర్ లక్ష్యంగా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి చేసిన కామెంట్లు వంటి పరిణామాలన్నీ కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుస్తున్న దిశగా వస్తున్న సంకేతాలే అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఫార్ములా-ఈ రేసుకు సంబంధించి ఏసీబీ విచారణ చేయాలంటూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ లేఖ రాయగా.. ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారి నేతృత్వంలోని అధికారులు ఫార్ములా-ఈ రేసు అంశాన్ని తిరగదోడుతున్నారు. అందులో భాగంగానే
మిగతా 12వ పేజీలో ▶



కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ స్థలం

వందే భారత్
మేడిన్ తెలంగాణ

- కాజీపేటలో అత్యాధునిక కోచ్‌ల తయారీకి ఏర్పాట్లు
- రోబోటిక్ యంత్రాల కోసం జపాన్‌కు ఆర్డర్
- కోచ్ ఫ్యాక్టరీ బడ్జెట్ మరో రూ.150 కోట్లు పెంపు
- అదనంగా 35 ఎకరాల భూమి సమీకరణ
- 2026 మార్చి నాటికి కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: భారతీయ రైల్వేలో త్వరలోనే రైల్ కోచ్.. మేడ్ ఇన్ తెలంగాణ అన్న అక్షరాలు కనిపించబోతున్నాయి. దశాబ్దాలుగా కలగానే మిగిలిన కాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీ మరికొన్ని నెలల్లో కార్యరూపం దాల్చబోతోంది. దేశవ్యాప్తంగా దూసుకుపోతున్న వందేభారత్ రైళ్లకు ఇక్కడి నుంచి హైస్పీడ్ బోగీలు సరఫరా కాబోతున్నాయి. ప్రస్తుతం వందేభారత్ రైళ్లకు డిమాండ్ పెరగటం, కేంద్రం కూడా భవిష్యత్తులో సాధారణ రైళ్ల స్థానంలో వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టాలని భావిస్తుండటంతో కాజీపేటలో ఎక్కువగా వందేభారత్ రైల్ కోచ్‌లు తయారుచేయాలని నిర్ణయించింది. ఇందుకోసం చకచకా ఏర్పాట్లు చేస్తున్నది. ఫ్యాక్టరీ ఏర్పాటుకు బడ్జెట్‌ను కూడా పెంచింది. వచ్చే ఏడాది మార్చి నుంచి
మిగతా 12వ పేజీలో ▶



600 మంది ఉద్యోగులు
కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో వివిధ విభాగాల్లో ప్రత్యక్షంగా 600 మంది ఉద్యోగులు పనిచేస్తారు. పరోక్షంగా 8 వేల నుంచి పది వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వాలు చెప్తున్నాయి. వేగంగా కోచ్‌లను సిద్ధం చేయాల్సిన నేపథ్యంలో ఇది అసెంబ్లింగ్ యూనిట్‌గా ఏర్పాటవుతోంది. కోచ్‌ల తయారీకి కావాల్సిన ముడి సరుకు పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారు. దీంతో ఈ ఫ్యాక్టరీకి అనుబంధంగా స్థానికంగా ప్రైవేటు సంస్థలు లాభపడతాయి. వాటిల్లో పనిచేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రాబోతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరగాలి



సీఎం రేవంత్ ఆదేశం
- ప్రత్యేకాధికారులకు ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ బాధ్యతలు
- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, రైతుల ఇబ్బందులపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ రైతులకు ఇబ్బందులు ఎదురవకుండా సాఫీగా జరిగేలా అధికార యంత్రాంగం కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో ప్రాధాన్యతాంశంగా ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని పర్యవేక్షించే బాధ్యతను తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో జరుగుతున్న జాప్యం, రైతులు ఇబ్బందులు ఎదుర్కోవడంపై సీఎం సోమవారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన వార్తా కథనాలపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. కాగా ఉమ్మడి జిల్లాలకు గతంలో నియమించిన ప్రత్యేకాధికారులకు రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణ బాధ్యతలను ముఖ్యమంత్రి
మిగతా 5వ పేజీలో ▶

సన్న ధాన్యంపై వ్యాపారుల కన్ను
- పొలాల్లో పచ్చి వడ్లనే కొనుగోలు చేస్తున్న వైనం
- ఫైన్ వెరైటీ రకాన్ని బట్టి రూ. 2,000 నుంచి రూ. 2,600 వరకు చెల్లింపు

5 లో

మాజీ సర్పంచ్‌ల చలో హైదరాబాద్ భగ్నం
- ఎక్కడికక్కడ మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు
- పలు పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- వారికి మద్దతుగా హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ నేతల ఆందోళన

3 లో










'కమల' వికాసమా! ట్రంప్‌కే పట్టమా!
నేడే అమెరికాలో పోలింగ్

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ.. హోరాహోరీగా తలపడ్డ హారిస్, ట్రంప్
- పోలింగ్ ముంగిట అనూహ్య పరిణామాలు
- ఏడు స్వింగ్ రాష్ట్రాల్లోనూ ఆధిక్యంలోకి ట్రంప్
- రిపబ్లికన్ల రాష్ట్రం అయోవాలో హారిస్ ముందంజ

6 లో

భారత మూలాలున్న కమలా హారిస్ కొత్త చరిత్ర లిఖిస్తారా? అమెరికా అధ్యక్ష పీఠమెక్కిన తొలి మహిళగా రికార్డు సృష్టిస్తారా? లేక ఆమెతో హోరాహోరీ పోరులో పైచేయి సాధించి ట్రంపే రెండోసారి గద్దెనెక్కుతారా? ఈ ప్రశ్నలకు మరికొద్ది గంటల్లో సమాధానం లభించనుంది. అగ్రరాజ్యంలో అధ్యక్ష ఎన్నికల పోరు అతి కీలక ఘట్టానికి చేరింది. మంగళవారం దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. అమెరికాకు 47వ ప్రెసిడెంట్ ఎవరన్నది రాత్రికల్లా తేలిపోయే అవకాశముంది.



బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్
- విశ్రాంత ఐఏఎస్ బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- నెలరోజుల్లో అధ్యయనం పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశం
- గతంలో నియమించిన బీసీ కమిషన్లు సేకరించిన సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచన
- హైకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం

2 లో



రుణమాఫీపై సిట్టింగ్ జడ్జికి నివేదిక ఇవ్వండి
రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్

మొత్తం రుణమాఫీ చేశామంటూ రాహుల్ అబద్ధాలు చెప్తున్నారు
వివరాలు 3లో▶


- హామీల అమల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న అన్నిచోట్లా వైఫల్యం
- ఏడాది తిరక్కుండానే రూ. లక్ష కోట్ల అప్పులు చేశారు



అధికారంలోకి వచ్చినా అవే డ్రామాలు!
పిఠాపురం సభలో కొత్త అంకానికి తెర తీసిన పవన్‌కళ్యాణ్

- శాంతిభద్రతల వైఫల్యాలతో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంకు సంబంధం లేదన్నట్లు పవన్ వ్యాఖ్యలు..
- నిజానికి శాంతిభద్రతల విభాగం ఉండేది సీఎం వద్దే కదా!
- అవి విఫలమయ్యాయంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు వైఫల్యం చెందినట్లు కాదా?
- పవన్ నిజంగానే నిజాయితీగా వ్యవహరించదలచుకుంటే నిలదీయాల్సింది చంద్రబాబునే కదా?
- దీనికి విరుద్ధంగా దళిత మంత్రి అనితపై నెపం వేస్తూ పవన్ వ్యాఖ్యలు.. మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, అకృత్యాలతో వెల్లువెత్తుతున్న జనాగ్రహాన్ని తప్పించుకునే వ్యూహం
- పవన్ కళ్యాణ్ సభలో ప్రసంగిస్తున్న సమయంలోనే.. ఓ బాలికపై లైంగిక దాడి ఘటన వెలుగులోకి..
- గత ఐదేళ్లూ టీడీపీ – జనసేన వేర్వేరు పార్టీలైనా బాబు– పవన్‌ది ఒకే మాట, ఒకే నిర్ణయాలు

సాక్షి, అమరావతి: ఎన్నికలకు ముందు ప్రతిపక్ష పార్టీల పాత్రలో పరస్పరం సహకరించుకుంటూ అనేక రాజకీయ డ్రామాలను రక్తి కట్టించిన చంద్రబాబు – పవన్‌కళ్యాణ్ ద్వయం ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కూడా అదే పంథాను అనుసరిస్తోంది! కూటమి ప్రభుత్వంపై కొద్ది నెలల్లోనే సర్వత్రా తీవ్ర స్థాయిలో వ్యక్తమవుతున్న ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు సరికొత్త డ్రామాకు తెర తీసింది!! రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై వరుసగా జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో సర్కారు దారుణ వైఫల్యాలపై సామాన్య ప్రజలతో పాటు అధికార పక్షంలోనూ వ్యతిరేకత వెల్లువెత్తుతున్న విషయం విదితమే. శాంతి భద్రతల వైఫల్యంపై టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల నుంచి సైతం పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తీవ్రతరమవుతున్న ప్రజా వ్యతిరేకతను తప్పించుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ తన ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు, డిప్యూటీ సీఎంగా ఉన్న తనకు ఎలాంటి సంబంధం లేదని పవన్‌కళ్యాణ్ రాష్ట్ర ప్రజలను నమ్మించే యత్నాల్లో నిమగ్నమయ్యారు. దీనిపై ఆయన నిజంగానే నిజాయితీగా వ్యవహరించదలచుకుంటే ముఖ్యమంత్రి చంద్రబాబును గట్టిగా నిలదీసి
మిగతా 12వ పేజీలో ▶



పిఠాపురం సభలో మాట్లాడుతున్న పవన్



నిజాయితీగా వాస్తవాలు చెప్పండి
మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను ఉద్దేశించి తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యలు
- ఉండవల్లికి పెన్‌డ్రైవ్ ఇచ్చే విషయంలో తగిన సమయంలో ఆదేశాలిస్తాం
- మార్గదర్శిపై మాట్లాడకుండా గ్యాగ్ ఆర్డర్ ఈ దశలో ఇవ్వలేం
- స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం
- ఉండవల్లి మీడియాతో మాట్లాడుతున్నారన్న సిద్ధార్థ లూథ్రా
- తీవ్రంగా స్పందించిన అరుణ్ కుమార్
- అవాస్తవాలతో లూథ్రా కోర్టును తప్పుదోవ పట్టిస్తుంటారని వెల్లడి
- తదుపరి విచారణ గురువారానికి వాయిదా

12 లో

క్లుప్తంగా...

రేవంత్‌రెడ్డి పాలన సంతృప్తికరంగా లేదు

తమ్మినేని వీరభద్రం



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సంతృప్తికరంగా లేదని, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హెచ్చరించారు. కాంగ్రెస్ పాలన ప్రజాస్వామ్యయుతంగా లేదని ఆరోపించారు. మూడు రోజుల పాటు ఢిల్లీలోని హరికిషన్‌సింగ్ సుర్జీత్ భవన్‌లో జరుగుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సమావేశాలకు హాజరైన ఆయన.. సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ఉందని దుయ్యబట్టారు. గ్రూప్–1 అభ్యర్థులు వ్యతిరేకించినప్పటికీ జీవో 20 అమలు చేశారని, దామగుండం ఫారెస్టులో వేల చెట్లు నరికి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒకటి రెండు మాత్రమే అమలు చేసి.. హైడ్రా, మూసీ ప్రక్షాళన అంటూ కొత్త అంశాలను తెర పైకి తెచ్చారని తమ్మినేని ధ్వజమెత్తారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగబోయే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్కూల్ అసిస్టెంట్ టీచర్లతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్లకు (ఎస్‌జీటీ) కూడా ఓటు హక్కు కల్పించాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేత పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో 70 శాతం మంది ఉపాధ్యాయులు ప్రాథమిక స్థాయిలో బోధన చేసేవారే ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఉపాధ్యాయుడికీ ఓటు హక్కు కల్పించాలని కోరారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రునికి ఓటు హక్కు ఉన్నట్లే, ఉపాధ్యాయ ఎన్నికల్లో కూడా ప్రతి టీచర్‌కు ఓటు హక్కు ఉండాలని ఆయన పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణపై పరువునష్టం దావా

ఆధారాలు లేకుండా వార్తలు ప్రచురించారని ఆరోపణ

పంజగుట్ట (హైదరాబాద్): ఎలాంటి ఆధారాలు లేకుండా నాదర్‌గుల్‌లో తన క్లయింట్ 290 ఎకరాల స్థలం కబ్జా చేశారని ప్రధాన శీర్షికన ప్రచురించిన పత్రిక (నమస్తే తెలంగాణ)పై రూ.10 కోట్లు పరువునష్టం దావా వేసినట్లు హైకోర్టు న్యాయవాది ఇంద్రగంటి మధు శర్మ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. ఎలాంటి ఆధారాలు లేకుండా తన క్లయింట్ ప్రవీణ్‌కుమార్‌పై గత నెల 30, ఈ నెల 2, 3, 4వ తేదీల్లో వరుసగా ప్రధాన శీర్షికన అసత్య ఆరోపణలు చేస్తూ ఆ పత్రిక రాసిన వార్తలతో తన క్లయింట్, అతని కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని ఆయన అన్నారు. వారి కుటుంబం మొత్తం ఆత్మహత్యకు పాల్పడే పరిస్థితి సదరు పత్రిక తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ్ కుమార్ పేరున 290 ఎకరాలు కాదుకదా 29 గజాల స్థలం కూడా అక్కడలేదని, ఉన్నట్లు సదరు పత్రిక నిరూపిస్తే ఏం చేసేందుకైనా సిద్ధమే అన్నారు. సదరు పత్రిక చేసిన అసత్య ఆరోపణలు 12 గంటల్లో విత్‌డ్రా చేసుకుని అదే ప్రధాన శీర్షికన తాము రాసింది అసత్య ఆరోపణలు అని ప్రచురించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరువునష్టం దావాతోపాటు త్వరలోనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు న్యాయవాది తెలిపారు.

'రజాకార్' సినిమాకు అరుదైన గౌరవం

55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాకు ఎంపిక

సాక్షి, న్యూఢిల్లీ: గోవాలో నిర్వహించనున్న 55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఐఎఫ్‌ఎఫ్‌ఐ)కు తెలుగు సినిమా 'రజాకార్ (హైదరాబాద్ సైలెంట్ జెనోసైడ్)' ఎంపికైంది. దేశంలో నూతన ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో ఐఎఫ్‌ఎఫ్‌ఐలో 'బెస్ట్ డెబ్యూ డైరెక్టర్ ఆఫ్ ఇండియన్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీని ఈ ఏడాది ప్రారంభించారు. ఈ కేటగిరీలో తెలుగు సినిమా 'రజాకార్'తో పాటు మణిపురి, మరాఠీ, కన్నడ, మలయాళం సినిమాలను 55వ ఐఎఫ్‌ఎఫ్‌ఐ సందర్భంగా ప్రదర్శించనున్నారు. ఈ కేటగిరీలోని ఐదు సినిమాల్లో విజేతను నవంబర్ 28న గోవాలో జరిగే ముగింపు వేడుకలో ప్రకటిస్తారు. ఈ కేటగిరీకి వచ్చిన మొత్తం 117 అర్హత గల ఎంట్రీల నుంచి ఐదు చిత్రాలను ప్రివ్యూ కమిటీ ఎంపిక చేసింది.

శ్రీవారి దర్శనానికి ప్రత్యేక చర్యలు

తిరుమల: వారాంతాల్లో శ్రీవారి దర్శనాల్లో సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తున్నట్టు టీటీడీ ప్రజాసంబంధాల విభాగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. శని, ఆదివారాల్లో అత్యధిక మంది భక్తులు శ్రీవారిని దర్శించుకునేలా టీటీడీ చర్యలు చేపట్టిందని పేర్కొంది. గత శని, ఆదివారాల్లో 1,72,565 మందికి శ్రీవారి దర్శనం కల్పించినట్టు తెలిపింది.

బీసీ రిజర్వేషన్లపై ప్రత్యేక కమిషన్

విశ్రాంత ఐఏఎస్ బూసాని వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం

నెలరోజుల్లో అధ్యయనం పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశం



బూసాని వెంకటేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను నిర్దేశించేందుకు రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ (ప్రత్యేక) కమిషన్‌ను ఏర్పాటు చేసింది. మాజీ ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు ఈ కమి షన్‌కు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం, రిజర్వేషన్లలో లోటుపాట్లు, ఇతర అంశాలపై కమిషన్ సమగ్ర విచారణ చేపట్టనుంది. రాజ్యాంగంలోని నిబంధనలు, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నెలరోజుల్లో నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం ఉత్తర్వులుజారీ చేశారు. బీసీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి బి.సైదులు ఈ కమిషన్‌కు కార్యదర్శిగా వ్యవహరిస్తూ సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

న్యాయస్థానం ఆదేశాలకు కట్టుబడి..

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్ 6వ తేదీన జి.నిరంజన్ చైర్మన్‌గా బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అధ్యయనం కోసం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కానీ రాజ్యాంగ నిబంధనలకు లోబడి, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్ల అధ్యయనానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలంటూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మంత్రులు, ఇతర ఉన్నతాధికారులతో ఆదివారం తన నివాసంలో లోతుగా చర్చించి ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు.

ఆ సమాచారాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి

తాజాగా ఏర్పాటైన ప్రత్యేక కమిషన్ అధ్యయనం పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించే క్రమంలో గతంలో నియమించిన బీసీ కమిషన్లు సేకరించిన సమాచారాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వరంగ సంస్థలు, కమిషన్లు, విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థలు, ప్రముఖులు, కీలక వ్యక్తుల నుంచి సమాచారం సేకరించడంతో పాటు గణాంకాలు తీసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. అవసరాన్ని బట్టి నిపుణులు, పరిశోధకులతో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, అధ్యయనానికి సంబంధించి పర్యటనలు చేపట్టవచ్చని, పరిశోధన సంస్థల నుంచి సమాచారం తీసుకోవచ్చని తెలిపింది. డెడికేటెడ్ కమిషన్‌కు అవసరమైన సిబ్బంది, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేయనుంది.

వివిధ శాఖల్లో విశేష సేవలు

వెనుకబడిన తరగతులకు చెందిన బూసాని వెంకటేశ్వరరావు బీఈ (ఎలక్ట్రానిక్స్), ఎంఈ (సాలిడ్ స్టేట్ ఎలక్ట్రానిక్స్), ఎల్‌ఎల్‌బీ చదివారు. ఈయన 1993 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. 1987లో గ్రూప్–1 (స్టేట్ సివిల్ సర్వీసు) టాపర్‌గా నిలిచి ప్రభుత్వ అధికారిగా ప్రస్థానం ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో విజయనగరం జిల్లా కలెక్టర్‌గా, పర్సనల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వెల్ఫేర్ విభాగం డైరెక్టర్‌గా, స్టేట్ ఎలక్షన్ కమిషన్ కార్యదర్శిగా, ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీసీఎండీగా, రెవెన్యూ, ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా, మత్స్య శాఖ కమిషనర్‌గా, జీఏడీ (సర్వీసెస్–హెచ్‌ఆర్‌ఎం) కార్యదర్శిగా, చివరిగా తెలంగాణ ప్రభుత్వంలో రెవెన్యూ(డిజాస్టర్ మేనేజ్‌మెంట్) విభాగం ముఖ్య కార్యదర్శిగా సేవలందించి 2019 డిసెంబర్–31న పదవీ విరమణ పొందారు.

'డెడికేటెడ్ కమిషన్' ఏర్పాటు భేష్: జాజుల

సాక్షి, హైదరాబాద్: కుల గణనపై డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం తెలంగాణ సచివాలయ మీడియా పాయింట్ బయట విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు ప్రకారం.. ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించడం గొప్ప నిర్ణయమన్నారు. రాష్ట్రంలో కులగణనపై బీసీల్లో చైతన్యం కలిగించడానికి ఈనెల 6 నుంచి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు 33 జిల్లాల్లోని 119 నియోజకవర్గాల్లో చైతన్య సదస్సులు నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, జాజుల లింగంగౌడ్ పాల్గొన్నారు.



తన నివాసానికి వచ్చిన విద్యార్థులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

విద్యలో సమూల మార్పులు

- ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తాం
- పదేళ్లలో విద్యావ్యవస్థను నాశనం చేసిన బీఆర్‌ఎస్
- వసతిగృహ విద్యార్థులతో సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో విద్యావ్యవస్థ సర్వనాశమైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో పలువురు వసతిగృహ విద్యార్థులు సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వచ్చారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి విద్యార్థులతో ముచ్చటించారు. సామాజిక స్పృహతో ప్రజలకు సేవ చేసేవారే నిజమైన హీరోలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించామని, స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తామని చెప్పారు. గంజాయి, డ్రగ్స్ పెద్ద ప్రమాదమని, యువత అలాంటి వ్యసనాల బారిన పడొద్దని సూచించారు. రాజకీయ పార్టీల రెచ్చగొట్టే ప్రకటనలు నమ్మకుండా విద్యార్థులు, ఉద్యోగార్థులు చదువుపై దృష్టిపెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అద్దె భవనాల్లో నడుస్తున్న వసతిగృహాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని పలువురు విద్యార్థులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో విడతలవారీగా సొంత భవనాలను నిర్మిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటుపై ఆర్ కృష్ణయ్య కృతజ్ఞతలు

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయటంపట్ల బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆర్.కృష్ణయ్యతో పాటు ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, బీసీ సంఘం ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

డెడికేటెడ్ కమిషన్‌పై జీవన్‌రెడ్డి హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ వివరాల సేకరణకు డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఎలాంటి భేషజాలకు పోకుండా, హైకోర్టు సూచనల మేరకు కమిషన్‌ను ఏర్పాటు చేయడం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీకి బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఎంసీహెచ్‌ల తరహాలో ఎన్‌సీడీ క్లినిక్స్

అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్(ఎన్‌సీడీ) నియంత్రణ, వాటి బారిన పడిన ప్రజలకు చికిత్స అందించడంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని అధికారులను వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ప్రజలకు ఎన్‌సీడీపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రాల తరహాలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ క్లినిక్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు సోమవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీసులో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ బర్డెన్ ఏటేటా పెరుగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. మొత్తం డిసీజ్ బర్డెన్‌లో 60 శాతం ఎన్‌సీడీతో లింక్ అయ్యి ఉంటున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్‌సీడీ సమస్య తీవ్రత గురించి ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్‌సీడీ రోగులకు వైద్యం అందించేందుకు అన్ని బోధన ఆస్పత్రుల్లో స్పెషల్ క్లినిక్స్ ఏర్పాటు చేయాలని, ఇప్పటికే ఎక్కడైనా క్లినిక్స్ ఉంటే వాటిని ఆధునీకరించాలని మంత్రి ఆదేశించారు. ఎన్‌సీడీ క్లినిక్స్‌ను తొలుత బోధన ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసి, ఆ తర్వాత జిల్లా, ఏరియా ఆస్పత్రులకు విస్తరించాలని మంత్రి చెప్పారు. ఆరోగ్యశ్రీ సేవలపై మంత్రి ఆరా తీశారు. సమావేశంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'గ్రీన్‌చానల్'లో ఇందిరమ్మ ఇళ్లు

- ఎటువంటి అడ్డంకుల్లేకుండా లబ్ధిదారులకు నిధుల జమ
- నాలుగేళ్లలో 20 లక్షల మంది పేదలకు ఇళ్లు నిర్మిస్తాం
- తొలి దశలో రేషన్‌కార్డు లేకున్నా అర్హులకు మంజూరు
- రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి వెల్లడి



ఖమ్మం దానవాయిగూడెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఇందిరమ్మ ఇళ్లు కట్టుకొనే వారికి ఆర్థిక సమస్యలు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తమ ప్రభుత్వం గ్రీన్‌చానల్ రూపొందించిందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఖమ్మంలోని దానవాయిగూడెంలో పొంగులేటి మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విభాగాలు, శాఖల మధ్య సాంకేతిక అడ్డంకులు లేదా ఆర్థికపరమైన చిక్కులు తలెత్తకుండా గ్రీన్ చానల్ విధానం ద్వారా లబ్ధిదారులకు నిధులు చెల్లిస్తామన్నారు. పునాదుల సమయాన రూ. లక్ష, లింటెల్ లెవల్ పూర్తి కాగానే రూ. 1.20 లక్షలు, స్లాబ్ వేశాక రూ. 1.75 లక్షలు, గృహప్రవేశంకన్నా ముందు లేదా ఆ తర్వాత మిగిలిన సొమ్ము చెల్లిస్తామని చెప్పారు. ఇదంతా గ్రీన్‌చానల్ విధానంలో ఆటంకాలు లేకుండా పూర్తవుతుందన్నారు. తొలిదశలో రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించామని.. త్వరలో రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ మొదలుకానుండగా రెండో విడత నుంచి రేషన్ కార్డు ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లు పొందేందుకు అర్హులవుతారని తెలిపారు.

వై.ఎస్. హయాంలో తెలంగాణలో 19.56 లక్షల ఇళ్లు..

ఇందిరమ్మ ఇళ్లు అంటేనే కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని పొంగులేటి తెలిపారు. నాటి ఉమ్మడి ఏపీ పరిధిలోకి వచ్చే నేటి తెలంగాణలో 19.56 లక్షల ఇళ్లను దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి కేటాయించారని గుర్తు చేశారు. ఇప్పుడు తహసీల్దార్ లేదా ఎంపీడీఓ గుర్తించాక కలెక్టర్ ద్వారా ఇన్‌చార్జి మంత్రి ఆమోదిస్తారని తెలిపారు. మహిళల పేరుతో 400 చదరపు అడుగుల్లో ఇళ్లు నిర్మించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రాబోయే 2, 3 రోజుల్లోనే గ్రామసభల ద్వారా అర్హులను గుర్తిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో సాంకేతికత కోసం యాప్ రూపొందించామని, లబ్ధిదారులను ఇళ్ల వద్దకు తీసుకెళ్లి వివరాలు అప్‌లోడ్ చేయడం వల్ల ఎప్పటికప్పుడు పురోగతి తెలుస్తుందన్నారు. భేషజాలకు పోకుండా కేంద్ర ప్రభుత్వ సాయం కూడా తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు మాజీ సీఎం కేసీఆర్ సొంతూరు చింతమడకతో సహా గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ దశల్లో నిలిచిపోయిన సుమారు 63 వేల డబుల్ బెడ్రూం ఇళ్లను కూడా నిర్మించి పేదలకు ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు పొంగులేటి వివరించారు.

సంగెం బ్రిడ్జిపై సీఎం మూసీ పునరుజ్జీవ యాత్ర

- ఈ నెల 8న ఖరారైన పర్యటన
- ముందుగా యాదాద్రి ఆలయంలో పూజలు
- రైతులు, కులవృత్తుల వారితో సీఎం మాట ముచ్చట

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నెల 8న రేవంత్ తన పుట్టినరోజు సందర్భంగా ముందుగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమావేశమవుతారు. ఆ తర్వాత మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసి, పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వలిగొండ మండలం సంగెం–బొల్లేపల్లి గ్రామాల మధ్య గల భీమలింగం వద్ద లోలెవల్ బ్రిడ్జిపై మూసీ పునరుజ్జీవ యాత్ర చేపడతారు. మూసీ కాలుష్యంతో రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఆయావర్గాల ప్రజలతో అక్కడే సమావేశమవుతారు.

జిల్లా ప్రజా ప్రతినిధులతో కోమటిరెడ్డి సమీక్ష: సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, భువనగిరి డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్న ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టాలని కోరారు. మల్లన్నసాగర్‌నుంచి యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు సాగు నీరందించే పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారన్నారు.

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం: భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సోమవారం సంగెం–బొల్లేపల్లి బ్రిడ్జిని పరిశీలించారు. యాదాద్రిలో హెలీప్యాడ్, మిషన్ భగీరథ పైలాన్ ఏర్పాటు చేసే ప్రాంతాలను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో కలిసి అదనపు కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు.

రాహుల్ రెండు గంటల పర్యటన

- నేడు హైదరాబాద్‌లో 'కులగణన' సదస్సుకు హాజరు
- బీసీ సంఘాల నేతలతో కాంగ్రెస్ అగ్రనేత సంప్రదింపులు



సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు. సుమారు రెండు గంటల పాటు నగరంలో గడపనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన కార్యక్రమంపై ప్రజాసంఘాలు, బీసీ సంఘాల నేతలతో సంప్రదింపులు జరపడంతో పాటు వారి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. మంగళవారం సాయంత్రం 5:30 గంటలకు బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో జరగనున్న సమావేశంలో ఆయన పాల్గొంటారు. టీపీసీసీ వర్గాల సమాచారం ప్రకారం.. సాయంత్రం 4:45కు ప్రత్యేక విమానంలో మహారాష్ట్ర నుంచి రాహుల్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడినుంచి నేరుగా బోయిన్‌పల్లి సమావేశానికి వెళ్తారు. దాదాపు 200 మంది ప్రజా సంఘాలు, బీసీ సంఘాల నేతలు, మరో 200 మంది కాంగ్రెస్ నాయకులతో జరిగే సదస్సులో పాల్గొంటారు. వారి అభిప్రాయాలు తీసుకోవడంతో పాటు తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు. కులగణన ప్రాధాన్యతను ఆయన వివరించనున్నారు. 6:30 గంటల సమయంలో అక్కడి నుంచి బేగంపేట చేరుకుని ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్తారు. కాగా టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో కులగణన సదస్సుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. సోమవారం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన జిల్లా కాంగ్రెస్ నేతలతో భేటీ అయ్యారు. బోయిన్‌పల్లిలో ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు సదస్సులో పాల్గొంటారని టీపీసీసీ వర్గాలు తెలిపాయి.

ఆదాయం పెంపుపై దృష్టి పెట్టండి

- గృహ నిర్మాణ, పురపాలక శాఖల ద్వారా ప్లాట్లు, ఫ్లాట్ల బహిరంగ వేలం ప్రారంభించండి
- రీసోర్స్ మొబిలైజేషన్ సబ్‌కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు
- జాయింట్ వెంచర్ల న్యాయ వివాదాల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు



సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్,శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: సామాన్య ప్రజలపై ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరుల సమీకరణకు ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్‌కమిటీ సోమవారం సచివాలయంలో భేటీ కాగా, సబ్‌కమిటీ సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులతోపాటు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టిన జాయింట్ వెంచర్లపై చర్చ జరిగింది. ఈ వెంచర్ల కోసం జరిగిన ఒప్పందాలను అమలు చేయకుండా కొందరు వ్యక్తులు కోర్టులకు వెళ్లి న్యాయ వివాదాలు సృష్టిస్తున్నారని అధికారులు సబ్‌కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఈ వివాదాల పరిష్కారానికి ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు చైర్మన్‌గా పురపాలక, గృహ నిర్మాణ, న్యాయ శాఖ కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేయాలని, ఈ కమిటీ సమావేశమై వారం రోజుల్లోగా సమస్యలను పరిష్కరించేలా ప్రణాళికలు రూపొందించాలని సబ్‌కమిటీ సూచించింది.

- ➤ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్లాట్ల బహిరంగ వేలం ప్రక్రియను కొనసాగించాలని, ముందుగా కొంత భాగంలోని భూములను వేలం వేసి రాష్ట్ర ప్రభుత్వానికి గరిష్ట ఆదాయం సమకూరేలా ముందుకెళ్లాలని సూచించింది.
- ➤ రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫ్లాట్ల అమ్మకాల స్థితిగతులను సమీక్షించిన సబ్‌కమిటీ ఈ ఫ్లాట్ల అమ్మకాల ప్రక్రియకు ప్రణాళిక రూపొందించాలని కోరింది. ఈ సమావేశంలో చర్చించిన అంశాలను మినిట్స్ రూపంలో నమోదు చేయాలని, మరో వారంలో జరిగే సమావేశానికి యాక్షన్ టేకెన్ రిపోర్టుతో హాజరుకావాలని అధికారులను భట్టి ఆదేశించారు.
- ➤ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ మందకొడిగా సాగుతుండడంపై సబ్‌కమిటీ అధికారులను ప్రశ్నించింది. అయితే, న్యాయ పరమైన ఇబ్బందులు రాకుండా జాగ్రత్తగా చేపడుతున్నందునే కొంత ఆలస్యం జరుగుతోందని అధికారులు సబ్‌కమిటీకి వివరించారు.

జీరో కాలుష్యం ఉండాలి

కాలుష్య సమస్య కారణంగా తాము ఓఆర్‌ఆర్ బయటకు వెళ్లేందుకు కూడా ముందుకొస్తున్నట్టు పరిశ్రమల నిర్వాహకులు సబ్ కమిటీకి స్పష్టం చేసిన నేపథ్యంలో వారి విజ్ఞప్తులను పరిశీలించి ఓఆర్‌ఆర్ బయట పరిశ్రమలను ప్రోత్సహించాలని, హైదరాబాద్‌నగరంలో జీరో కాలుష్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల అధికారులను సబ్‌కమిటీ ఆదేశించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో 5 ఎకరాల విస్తీర్ణంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా ఇండస్ట్రియల్ పార్కులు నిర్మించాలని, తద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి, ఆర్థిక చేయూత లభిస్తుందని సబ్‌కమిటీ సూచించింది. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, పురపాలక, రెవెన్యూ, ఐటీ, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులు దానకిశోర్, నవీన్ మిత్తల్, జయేశ్ రంజన్, సందీప్‌కుమార్ సుల్తానియా, హౌసింగ్ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాశ్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.

గంటకు రూ.3 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం

- గిరిజన సంక్షేమశాఖ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి సీతక్క
- గిరిజన గురుకులాల్లో హెల్త్ మానిటరింగ్ యాప్ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా తయారైందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేసిన అప్పులకు ఇప్పుడు గంటకు రూ.3 కోట్ల చొప్పున వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా, ప్రజాప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేస్తున్నట్టు వివరించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని కుమురంభీం ఆదివాసీభవన్‌లో గిరిజన సంక్షేమ శాఖ విస్తృత స్థాయి సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కుమురంభీం విగ్రహానికి నివాళులు అర్పించారు. గిరిజన గురుకుల విద్యా సంస్థల్లోని విద్యార్థుల కోసం రూపొందించిన హెల్త్ మానిటరింగ్ యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో విద్యావ్యవస్థ సర్వనాశనమైందన్నారు. చిన్నపాటి సమస్యలు సృష్టించి బయట శక్తులు ప్రభుత్వానికి అపఖ్యాతి తెచ్చే కుట్రలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియ విజయవంతంగా ముగిసిందన్నారు. దీంతో 5 వేల మంది ఆశ్రమ పాఠశాలల టీచర్లకు లబ్ధి కలిగిందని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు ఉద్యోగులు, టీచర్లు వారధులని, వీరంతా మనసు పెట్టి పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. గూడేలు, తండాలు, పెంటల నుంచి వచ్చిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో సత్తా చాటుతున్నారన్నారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం రూ.17 వేల కోట్లు కేటాయించిందని, వీటిని పక్కా ప్రణాళికతో పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని చెప్పారు. సాంకేతికత, పారిశ్రామిక అవసరాలకు అనుగుణమైన కోర్సుల వైపు విద్యార్థులను ప్రోత్సహించాలని సీతక్క సూచించారు. అనంతరం జాతీయ, ఇతర ప్రఖ్యాత విద్యాసంస్థల్లో అడ్మిషన్లకు అర్హత సాధించిన పలువురు గిరిజన విద్యార్థులకు మంత్రి ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, అదనపు సంచాలకులు వి.సర్వేశ్వర్‌రెడ్డి, ఎస్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ ప్యాకేజీలపై త్వరలో ఉత్తర్వులు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణ ప్యాకేజీలకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. సోమవారం ఆమె సచివాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సంఘం ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో ఉత్తర్వుల విడుదలలో జాప్యం జరిగిందని, పది రోజుల్లో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కాగా, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు పంపిణీ చేసే చీరలు నాణ్యతతో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని మంత్రి తెలిపారు.

క్లుప్తంగా...

అన్యాయం జరిగితే.. కాంగ్రెస్‌కు రాజీనామా

- వర్గీకరణ అమలుకోసం సర్కార్‌పై పోరాటానికి సిద్ధం
- ఏఐసీసీ కార్యదర్శి సంపత్



హసన్‌పర్తి: సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణను అమలు చేయని పక్షంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి సంపత్ స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టులో మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో సంపత్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి వర్గీకరణపై హర్షం వ్యక్తం చేశారని, ఈ అంశంపై కమిషన్‌ను కూడా నియమించారని వివరించారు. అయితే కొంత మంది కాంగ్రెస్ అధిష్టానంపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వర్గీకరణ అమలు విషయంలో ముఖ్యమంత్రిపై పూర్తి విశ్వాసం ఉందని, ఒక వేళ మాదిగలకు అన్యాయం జరిగితే పార్టీ వీడి బయటకు వచ్చి పోరాటం చేస్తానని చెప్పారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, వేముల వీరేశం, సత్యనారాయణ, లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, తాటికొండ రాజయ్య, ఆరెపల్లి మోహన్, జెడ్పీ మాజీ చైర్మన్ సుధీర్‌కుమార్, ప్రొఫెసర్ కాసీం, ప్రొఫెసర్ ముత్తయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్, ఎంఎస్‌పీ జాతీయ నాయకులు పుట్ట రవి మాదిగ, మంద కుమార్ మాదిగ, బొట్ల భిక్షపతి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

అధికారం పోయాక సర్పంచ్‌లపై ప్రేమా?

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: అధికారం కోల్పోయాక బీఆర్ఎస్ నేతలకు సర్పంచ్‌లపై ప్రేమ పుట్టిందా? అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. సర్పంచ్‌లకు బకాయిలు చెల్లించాలంటూ బీఆర్ఎస్ పార్టీ, హరీశ్‌రావులు మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే పదుల సంఖ్యలో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. కనీసం వారి కుటుంబాలను ఏనాడూ హరీశ్‌రావు పరామర్శించిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరిట సర్పంచ్‌ల గొంతులపై కత్తులు పెట్టి.. రైతు వేదికలు, శ్మశాన వాటికలు కట్టించారని ఆరోపించారు. సమయానికి పనులు చేయలేదని సర్పంచ్‌లను సస్పెండ్ చేశారని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన పాపాలను ఒక్కొక్కటిగా కడుక్కుంటూ వస్తున్నామని పేర్కొన్నారు. రూ.40 వేల కోట్లకు పైగా బకాయిలు వదిలిపెట్టి వెళ్లారని, వాటిని ఒక్కొక్కటిగా తీరుస్తున్నామని వివరించారు. సర్పంచ్‌ల బకాయిలన్నింటినీ తీర్చేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

సర్పంచ్‌లను బీఆర్ఎస్ బిచ్చగాళ్లుగా చేసింది

- వారికి బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ మోసగించింది
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజం



కరీంనగర్ కార్పొరేషన్/కరీంనగర్ టౌన్/బోయినపల్లి (చొప్పదండి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లను బిచ్చగాళ్లను చేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ మండిపడ్డారు. వారి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సైతం సర్పంచులను మోసం చేసిందని విమ ర్శించారు. బకాయిల కోసం ఆందోళన చేస్తు న్న మాజీ సర్పంచ్‌ల అరెస్ట్‌ను ఆయన ఖండించారు. కరీంనగర్‌లోని ఫిల్టర్‌బెడ్ వద్ద సోమ వారం అమృత్–2 పథకం పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మూసీ పునరుజ్జీవానికి రూ. 1.50 లక్షల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వానికి మాజీ సర్పంచుల బకాయిలు చెల్లించేందుకు మనసు రావట్లేదని విమర్శించారు. రూ. 2 లక్షల రుణమాఫీ సర్వే ఏమైందని ప్రశ్నించారు. మోదీపై యుద్ధం చేస్తామని ప్రగల్భాలు పలకడం కాదని, యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనాలని సూచించారు. కులగణనకు తాము వ్యతిరేకం కాదని.. ప్రభుత్వం హడావుడిగా చేయకుండా అందరికీ న్యాయం చేయాలని కోరారు. మరోవైపు సిరిసిల్ల జిల్లా మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లోని వరదవెల్లి దత్తాత్రేయస్వామి ఆలయానికి మంజూరు చేసిన బోటును ప్రారంభించిన అనంతరం బండి సంజయ్ విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడంలేదని, అందులో పూర్తి వివరాలు ఉన్నప్పుడు మళ్లీ కులగణన ఎందుకని నిలదీశారు. కాగా, కరీంనగర్‌లోని తన కార్యాలయంలో 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ'అసోసియేషన్‌కు చెందిన ఎన్నారైలతో జూమ్ మీటింగ్‌లో బండి మాట్లాడుతూ 2028లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని జోస్యం చెప్పారు.

ప్రజల ముందుకొచ్చే దమ్ముందా?

మీరిచ్చిన హామీలేమైనయ్ రాహుల్‌గాంధీ?

- నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాల హామీ ఏది?
- సొంత ట్యాక్స్‌లు వసూలు చేస్తున్న సీఎం, మంత్రులు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ కబంధ హస్తాల్లో చిక్కుకొని తెలంగాణ రాష్ట్రం విలవిలలాడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు విమర్శించారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు చిత్రగుప్తుడి చిట్టాను మించిపోయాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలను నయవంచన చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి హింసించే పులకేశిలా వ్యవహరిస్తున్నా కాంగ్రెస్ అధిష్టానం ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మంగళవారం రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆయనను ఉద్దేశిస్తూ కేటీఆర్ సోమవారం సుదీర్ఘ బహిరంగ లేఖ విడుదల చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలోనే తెలంగాణ వందేళ్ల విధ్వంసానికి గురైందని, అధికారంలోకి వచ్చిన తర్వాత తడిగుడ్డతో రాష్ట్ర ప్రజల గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మోసగించడమే కాంగ్రెస్ నైజం

ప్రజలను నమ్మించి మోసం చేయటమే కాంగ్రెస్ నైజమని, ఆరు గ్యారంటీల పేరుతో ఆ విషయాన్ని మరోసారి నిరూపించిందని కేటీఆర్ విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు బాధ్యత తీసుకున్న రాహుల్.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువైపు తొంగిచూడటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణలో చిన్న పిల్లాడు పిలిచినా వస్తా అని బీరాలు పలికిన రాహుల్.. ఇన్నాళ్లు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీకి దమ్ముంటే కాంగ్రెస్ పాలనలో ఇబ్బందులు పడుతున్న నిరుద్యోగులు, రైతులు, పోలీసులు, హైడ్రా, మూసీ బాధితులు, ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికుల కుటుంబాలు, ఆటో డ్రైవర్ల ముందుకు, తెలంగాణ ప్రజల ముందుకొచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. పాలన అనుభవం లేని బ్లాక్ మెయిలింగ్ ముఖ్యమంత్రి కారణంగా తెలంగాణ వందేళ్ల వెనక్కి వెళ్లిందని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు తెలంగాణను దోచుకుంటూ రాష్ట్రాన్ని కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశారని ఆరోపించారు. సీఎం ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తుండగా, మంత్రులు తలోరకమైన ట్యాక్స్ వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారని మండిపడ్డారు. రూ.1.50 లక్షల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్టులో ఢిల్లీ కాంగ్రెస్ వాటా ఎంతో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయిస్తే వెంటనే పదవిని కోల్పోయేలా చట్టం చేస్తామని ప్రకటించిన రాహుల్.. తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతున్నా మౌనం పాటిస్తున్నారని విమర్శించారు. హామీలు నెరవేర్చకుండా మోసం చేసిన రాహుల్‌గాంధీ రాష్ట్రాన్ని అవినీతి తెలంగాణగా మార్చినందుకు ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కేటీఆర్ తన లేఖలో డిమాండ్ చేశారు.

నీళ్లలో ధాన్యం.. ధర్నాలో రైతులు

ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేటీఆర్ సోమవారం ట్వీట్ చేశారు. ధాన్యం కొనుగోళ్ల తీరు అధ్వానంగా ఉందని ధ్వజమెత్తారు. 'నీళ్లలో ధాన్యం ఉంటే.. ధర్నాలో రైతు ఉన్నాడు. షరతుల్లో మిల్లర్లు ఉన్నారు. సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మాత్రం పెళ్లిళ్లలో ఉన్నారు'అని విమర్శించారు. సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'మిల్లర్ల కతలు..రైతుల వెతలు'కథనాన్ని ట్యాగ్ చేస్తూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'మిల్లర్లతో చర్చలు లేవు..రైతుకు భరోసా కరువు..అన్నదాతను గాలికి వదిలిన గాలి మోటార్ సర్కార్, ధాన్యం కొంటే 500 బోనస్..అసలు కొనకుంటే అంతా బోగస్' అన్నట్టుగా తయారైందని విమర్శించారు.

రుణమాఫీపై సిట్టింగ్ జడ్జికి నివేదిక ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్

- మొత్తం రుణమాఫీ చేశామంటూ రాహుల్ అబద్ధాలు చెప్తున్నారు... హామీల అమల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్న అన్నిచోట్లా వైఫల్యం



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, తాము ఇచ్చిన హామీ అమలు చేశామని చెప్పే ధైర్యముంటే.. రుణమాఫీ విషయంలో హైకోర్టు సిట్టింగ్ జడ్జికి నివేదిక సమర్పించాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చాక వాటి అమలుకు మధ్య నక్కకు నాగలోకానికి మధ్య ఉన్నంత తేడా ఉందని విమర్శించారు. తెలంగాణతో పాటు కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో సైతం హామీలు, సంక్షేమ పథకాల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఘోర వైఫల్యం చెందాయని సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన ధ్వజమెత్తారు.

ఏడాది తిరక్కుండానే రూ.లక్ష కోట్ల అప్పులు

మిగులు బడ్జెట్‌తో తెలంగాణ ఏర్పడిందని, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులు చేస్తే, కాంగ్రెస్ ఏడాది తిరగకుండానే రూ.లక్ష కోట్ల అప్పులు చేసిందని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 'ప్రచారం ఫుల్ పనులు మాత్రం నిల్'అన్న చందంగా పరిస్థితి తయారైందన్నారు. రాష్ట్రంలో 38 లక్షల మంది రైతులకు గాను 22 లక్షల మందికే రుణమాఫీ చేసి, మొత్తం చేశామంటూ మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ అబద్ధాలు చెప్తున్నారని ధ్వజమెత్తారు.

నిరుద్యోగ భృతి, మహిళలకు సాయం ఏదీ?

కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా, ప్రియాంక, రాహుల్.. డిక్లరేషన్లు, గ్యారంటీల పేరిట ఇచ్చిన అనేక హామీల అమలు ఏమైందని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కర్ణాటక, తెలంగాణలలో మాదిరిగానే మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో సైతం మభ్యపెట్టే హామీలు, గ్యారంటీలతో కాంగ్రెస్ మోసం చేసే ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా హామీలను ఎప్పటిలోగా, ఏవిధంగా అమలు చేస్తారనే ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానం కరువవుతోందని అన్నారు. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, ప్రతి మహిళకు రూ.2,500 ఆర్థిక సాయం, వివాహం చేసుకున్న అమ్మాయిలకు తులం బంగారం హామీలు ఏమయ్యాయని కిషన్‌రెడ్డి నిలదీశారు.

మాజీ సర్పంచ్‌ల చలో హైదరాబాద్ భగ్నం

- ఎక్కడికక్కడ మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు
- పలు పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- వారికి మద్దతుగా మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ నేతల ఆందోళన
- పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఎన్నికలు నిర్వహించొద్దని మాజీ సర్పంచ్‌ల డిమాండ్
- తమను సీఎం రేవంత్‌రెడ్డి చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి



తిరుమలగిరిలో సర్పంచ్‌ల ఆందోళనకు మద్దతుగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు తదితర బీఆర్ఎస్ నేతలు

బంజారాహిల్స్/ రసూల్‌పురా (హైదరాబాద్): గ్రామ పంచాయతీల్లో చేసిన వివిధ పనులకు సంబంధించి తమకు రావాల్సి ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలంటూ సర్పంచుల సంఘం చేపట్టిన చలో హైదరాబాద్ పోరుబాట కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. సోమవారం ఆందోళనకు సిద్ధమైన మాజీ సర్పంచులను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌కు చేరుకుని, పోరుబాటకు సిద్ధమైన మాజీ సర్పంచులు, సంఘం నేతలను బంజారాహిల్స్ పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. చలో పోరుబాట పేరుతో సీఎం రేవంత్‌రెడ్డిని కలసి వినతిపత్రాన్ని అందజేస్తామని వారు కోరినా పోలీసులు వినిపించుకోలేదు. ఈ సమయంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ఇతర నేతలు మీడియాతో మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకుండా.. ప్రభుత్వం వచ్చే నెలలో పంచాయతీ ఎన్నికలకు వెళతామనడం సరికాదని పేర్కొన్నారు. 2019 నుంచి హరిత హారం, మిషన్ భగీరథ, నర్సరీల పెంపకం, వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డుల, రైతు వేదికలు, సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి పనులకు అప్పటి సర్పంచులు అప్పులు చేశారని.. పెండింగ్‌లో ఉన్న ఆ బిల్లులు ఇవ్వకుండా ఎన్నికలకు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే మాజీ సర్పంచుల కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని వాపోయారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, మాట్ల మధు, కార్యదర్శి రాపాక నాగయ్య, నవీన్‌గౌడ్, సుభాష్‌గౌడ్, గణేశ్ ముదిరాజ్, రాజేందర్, మల్లేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌లకు మద్దతుగా హరీశ్‌రావు నిరసన

పోలీసులు మాజీ సర్పంచ్‌లను అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనితో మాజీ మంత్రి హరీశ్‌రావు, పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు అక్కడికి చేరుకుని మాజీ సర్పంచులకు మద్దతుగా ఆందోళనకు దిగారు. దీనితో పోలీసులు హరీశ్‌రావు, ఇతర నేతలను అదుపులోకి తీసుకుని తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనితో వారు పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన మాజీ సర్పంచులను ఎక్కడికక్కడ దొంగలనో, టెర్రరిస్టులనో అరెస్టు చేసినట్టుగా అదుపులోకి తీసుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మాజీ సర్పంచుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. వారు అప్పులు చేసి, భార్యాపిల్లల మీద బంగారం అమ్మి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశారని.. ఆ పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ నిరసనలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంజయ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి. పద్మా దేవేందర్‌రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాల ఉసురు తగిలే బీఆర్ఎస్ నేతలు ఇంట్లో కూర్చున్నారు

ఫిషరీస్ చైర్మన్ 'మెట్టు'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని మత్స్యకార కుటుంబాల ఉసురు తగిలినందుకే బీఆర్ఎస్ నేతలు ఇంట్లో కూర్చున్నారని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో 571 మంది మత్స్యకారులు చనిపోతే వారి కుటుంబాలకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదని విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, చేపపిల్లల కొనుగోళ్లలో రూ.300 కోట్ల స్కాం జరిగిందని, వారం రోజుల్లో బావ బావమరుదుల రొయ్యల కుంభకోణం బయటపెడతామని చెప్పారు. అధికారం పోయాక కేటీఆర్‌కు ఏం పనిలేకుండా పోయిందని, అందుకే ట్వీట్లు పెడుతున్నారని సాయికుమార్ ఎద్దేవా చేశారు.

అప్పటి పనులపై విచారణ జరిపి బిల్లులు చెల్లిస్తాం

- మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందొద్దు.. పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తాం
- బీఆర్ఎస్ ట్రాప్‌లో పడొద్దు.. వారి రాజకీయ కుట్రలకు బలి కావొద్దు
- హరీశ్‌రావు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క కౌంటర్



సాక్షి, హైదరాబాద్: మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందొద్దని..పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అప్పుడు జరిగిన పనులపై విచారణ జరిపి బిల్లులు చెల్లిస్తామన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సర్పంచ్‌లతో బలవంతంగా పనులు చేయించలేదని, బిల్లులు ఆపలేదన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదని, అయినా బిల్లుల చెల్లింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. 'మీ బిల్లులను ఆపిన మాజీ మంత్రులకు మీరు వంత పాడటం తగదు. వారి రాజకీయ కుట్రలకు మాజీ సర్పంచ్‌లు బలి కావొద్దు'అని కోరారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు ఇంకా రాలేదని, అలాంటప్పుడు వాటిని దారి మళ్లించే ప్రశ్న ఉత్పన్నం కాదన్నారు. మాజీ సర్పంచ్‌లను బీఆర్ఎస్ రెచ్చగొడుతున్నదని సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకుల ట్రాప్‌లో పడొద్దని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్పంచ్‌ల ఆత్మహత్యలు, పెండింగ్ బిల్లులపై పత్రికల్లో వచ్చిన కొన్ని వార్తా కథనాలను ఆమె మీడియాకు విడుదల చేశారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లకు బిల్లులు ఇవ్వకపోగా, వారితో బలవంతంగా పనులు చేయించింది. ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకుండా వారి ఆత్మహత్యలకు కారణమైంది' అని ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఇప్పుడు మాజీ సర్పంచ్‌లపై ప్రేమ ఉన్నట్టుగా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. ఆర్థిక మంత్రిగా హరీశ్ ఉన్నప్పుడే తమ బిల్లులు పెండింగ్‌లో పెట్టారని మాజీ సర్పంచ్‌లకు స్పష్టంగా తెలుసని, తాము వచ్చాక రూ. 580 కోట్లు చెల్లించామన్నారు.

కేసీఆర్, హరీశ్‌ల ఇళ్ల ఎదుట ధర్నా చేయండి

'డ్రామాలు చేయడం.. ఆత్మహత్యలకు పురికొల్పడం హరీశ్‌రావుకు అలవాటు. నాడు సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమై...నేడు తిరిగి వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం స్వార్థ రాజకీయాల కోసమే హరీశ్, బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లను వాడుకుంటోంది. గతంలో సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కేసీఆర్, హరీశ్‌రావు కారణం కాదా ? బిల్లులు పెండింగ్‌లో పెట్టిన వారి ఇళ్ల ముందు మాజీ సర్పంచులు ధర్నా చేయాలి' అని సీతక్క అన్నారు.

సర్పంచ్‌ల బకాయిలకు మాదీ గ్యారంటీ

- పొలిటికల్ ట్రాప్‌లో పడకండి: పొన్నం
- సర్పంచుల ఆత్మహత్యలకు కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమే



సాక్షి, హైదరాబాద్: సర్పంచులు పొలిటికల్ ట్రాప్‌లో పడొద్దని, వారి బకాయిలను చెల్లించే గ్యారంటీ తాము తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. నాడు సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైన బీఆర్ఎస్ ఇప్పుడు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాహుల్‌గాంధీ పర్యటన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించేందుకు సోమవారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన మీడియాతో ఇష్టాగోష్టి మాట్లాడారు. సర్పంచులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఓపిక పట్టాలని, మార్చి నెలాఖరులోగా సర్పంచుల బకాయిలు దఫాలవారీగా చెల్లిస్తామని అన్నారు. సర్పంచులకు నిధుల బకాయిలు బీఆర్ఎస్ చేసిన పాపమేనని, వారి ఆత్మహత్యలకు బీఆర్ఎస్ కారణం కాదా అని ప్రశ్నించారు.

కిషన్‌రెడ్డిది తెలంగాణ డీఎన్ఏ కాదు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ డీఎన్ఏ లేదని, ఆ డీఎన్ఏ ఉంటే తెలంగాణ కోసం ఆయన ఏదైనా చేసేవారని మంత్రి పొన్నం వ్యాఖ్యానించారు. తెలంగాణకు బీజేపీ ఏం చేసిందో అమరవీరుల స్తూపం వద్ద చర్చకు రావాలని ఆ పార్టీ నేతలకు పొన్నం సవాల్ విసిరారు. కేసీఆర్ సలహాతో బీజేపీ అధ్యక్షుడు అయిన కిషన్‌రెడ్డి విమర్శలు చేస్తే తాము ఊరుకోవాలా అని ప్రశ్నించారు.



ప్రతీదీ మట్టిలోనే పుడుతుంది.
ప్రతీదీ మట్టిలోనే అంతమవుతుంది.
– జెనోఫనీజ్

సాక్షి
మంగళవారం, 5 నవంబర్ 2024

ఆత్మపరిశీలన అవసరం!

సొంతగడ్డపై చిరకాలంగా భారత క్రికెట్ జట్టు అజేయమైనదనే రికార్డు కుప్పకూలింది. భారత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ చేతిలో మనవాళ్ళు మొత్తం 3 టెస్టుల్లోనూ ఓటమి పాలయ్యారు. స్వదేశంలో టెస్ట్‌సిరీస్‌ను ఇలా 0–3 తేడాతో చేజార్చుకోవడం భారత క్రికెట్‌చరిత్రలో ఇదే ప్రథమం. కాగా, ఈ సిరీస్ పరాభవంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ర్యాంకింగుల్లో భారత్ అగ్రస్థానం ఆస్ట్రేలియాకు కోల్పోయి, ద్వితీయ స్థానానికి పడిపోయింది. ఆటలో గెలుపోటములు సహజమైనా, ఈ స్థాయి పరాజయం భారత జట్టు అత్యవసరంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. టీ20ల మోజులో పడి టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన కనీసపాటి సన్నద్ధత అయినా లేకుండానే బరిలోకి దిగిన మన ఆటగాళ్ళ నిర్లక్ష్యాన్ని నిలదీస్తోంది.

ఆఖరుసారిగా 2012లో ఇంగ్లండ్‌కు చెందిన అలస్టయిర్ కుక్ చేతిలో ధోనీ సేన 2–1 తేడాతో టెస్ట్ సిరీస్‌లో ఓటమి పాలైన తర్వాత గత పుష్కరకాలంగా భారత క్రికెట్ జట్టు స్వదేశంలో ఎన్నడూ మళ్ళీ సిరీస్‌ను కోల్పోలేదు. భారత జట్టు సారథులు మారుతూ వచ్చినా, 18 టెస్ట్ సిరీస్‌లలో విజయం మనదే. కివీస్‌పైనా ఆ ట్రాక్ రికార్డ్ కొనసాగుతుందని అందరూ భావించిన నేపథ్యంలో ఇది ఊహించని ఎదురుదెబ్బ. గత నెలలో బెంగుళూరులో 8 వికెట్ల తేడాతో తొలి టెస్ట్, ఆ వెంటనే పుణేలో 113 పరుగుల తేడాతో మలి టెస్ట్ ఓడిపోయినప్పుడే సిరీస్ చేజారింది. అయితే, ముంబయ్‌లో జరుగుతున్న ఆఖరి టెస్ట్‌లోనైనా గెలిచి, భారత జట్టు పరువు నిలుపుకొంటుందని ఆశించారు. చివరకు ఆ ఆశను కూడా వమ్ము చేసి, కివీస్ ముందు మన ఆటగాళ్ళు చేతులెత్తేయడం ఇప్పుడిప్పుడే మర్చిపోలేని ఘోర పరాభవం. ముంబయ్‌లో 147 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సైతం ఛేదించలేక ఆదివారం భారత జట్టు 121 పరుగులకే ఆలౌట్ అవడంతో, అవమానకరమైన రీతిలో 0–3 తేడాతో సిరీస్‌ను పోగొట్టుకోవాల్సి వచ్చింది. కచ్చితంగా ఇది భారత జట్టుకు మేలుకొలుపు.

భారత జట్టు వ్యూహరచన లోపాలు కొల్లలు. కివీస్‌తో బెంగుళూరు టెస్ట్‌లో టాస్ గెలిచాక మన వాళ్ళు మొదట బ్యాటింగ్ ఎంచుకోవడం అలాంటిదే. బ్యాట్స్‌మన్ల ఆర్డర్‌లో అనూహ్య ప్రయోగాల సంగతీ అంతే. ఇక, అవసరం లేకున్నా పుణేలో బంతి సుడులు తిరిగేలా పిచ్ రూపొందించారు. అదీ ప్రత్యర్థి జట్టుకే లాభించింది. కాబట్టి, భారత జట్టులోని మేధాబృందం ఆగి, ఆలోచించాలి. సిరీస్‌కు ముందు దులీప్ ట్రోఫీలో ఆడాలని చెప్పినా, మరిన్ని వసతుల కోసం అనంతపురం నుంచి బెంగుళూరుకు వేదిక మార్చినా అగ్రశ్రేణి ఆటగాళ్ళు ముందుకు రాకపోవడం ఘోరం. వారిని అందుకు అనుమతించడం ఒక రకంగా క్రికెట్ బోర్డ్ స్వయంకృతాపరాధమే. దాని పర్యవసానం, సిరీస్ భవిత తొలి టెస్ట్, తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల అత్యల్పస్కోర్‌కి భారత్ అవుటైనప్పుడే అర్థమైపోయింది.

స్పిన్ ఆడడంలో భారత ఆటగాళ్ళు దిట్టలని ప్రతీతి. కానీ, అదంతా గతం. ఇప్పుడు పరిస్థితి మారింది. జట్టులో బెస్ట్ బ్యాట్స్‌మెన్ అయిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు ఇద్దరూ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌లో తరచూ ఔటవుతున్నారనీ, 2021 – 2024 మధ్య సొంత గడ్డపైన స్పిన్ బౌలింగ్‌లో సాధించిన సగటు పరుగులు 30 మాత్రమేననీ విశ్లేషకులు లెక్కలు తీశారు. అసాధారణ స్పిన్నర్లు కాకున్నా, కివీస్ బౌలర్ల చేతుల్లో భారత ఆటగాళ్ళు టకటకా ఔటవడం చూస్తే, స్పిన్‌లో మనం మాస్టర్లం కాదని తాజా సిరీస్ ఎత్తిచూపినట్టయింది. అలాగే, ఎర్ర బంతితో ఆడే టెస్ట్‌లకూ, తెల్ల బంతితో నడిచే టీ20లకూ మధ్య చాలా తేడా ఉందని ఆటగాళ్ళు గ్రహించాలి. అన్ని బంతులూ ఆడి తీరాలి, పరుగులు చేయాలనే టీ20ల ధోరణితోనే టెస్ట్‌లు ఆడితే చిక్కులు తప్పవు. 2021లో టెస్ట్ ఓపెనర్‌గా ఇంగ్లండ్‌లో సక్సెస్ సాధించిన రోహిత్ మార్చుకున్న టీ20 ధోరణితోనే కివీస్‌పై ఆడడం వల్ల ఇబ్బంది పడ్డారు. కెప్టెన్‌గా ఆయనే పరుగులు చేయకపోతే, జట్టు పైన, ఆయన సారథ్యంపైన ఒత్తిడి తప్పదు.

గతంలో 2011–12 ఆస్ట్రేలియా పర్యటన భారత జట్టు నుంచి ద్రావిడ్, లక్ష్మణ్‌ల రిటైర్మెంట్‌కు దారి తీసింది. చరిత్ర పునరావృతమై, ఇప్పుడు రానున్న టూర్ కోహ్లీ, రోహిత్‌లకు చివరిది అవుతుందా? చెప్పలేం. అనూహ్యంగా వారిద్దరూ విఫలమైన కివీస్ సిరీస్ పరిస్థితే ఆస్ట్రేలియా టూర్‌లోనూ ఎదురైతే, సీనియర్లు రిటైర్ కావాలంటూ ఒత్తిడి పెరుగుతుంది. ఇక, వచ్చే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ విషయానికొస్తే, కివీస్ సిరీస్ దెబ్బతో వరల్డ్ టెస్ట్ ర్యాంకింగుల్లో మన స్థానం పడిపోయినందున భారత్ ఫైనల్‌కు చేరడం కష్టమే. ఇంకా చెప్పాలంటే, ఆస్ట్రేలియాను దాని సొంత గడ్డపై 4–0 తేడాతో ఓడిస్తే కానీ, మన ఫైనల్ ఆశ పండదు. ఏ రకంగా చూసినా అసాధ్యమే. ఈ పరిస్థితుల్లో ఆస్ట్రేలియా టూర్‌లోనైనా మన జట్టు మితిమీరిన ఆలోచనలు, అంచనాలు పక్కనబెట్టి కేవలం ఆడుతున్న టెస్టులపై ఒకదాని వెంట మరొకటిగా దృష్టి పెడితే మేలు. పరిస్థితులు, పిచ్ స్వభావాన్ని బట్టి అప్పటికప్పుడు ఆట తీరును మలుచుకోవాలే తప్ప, ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చి దూకుడు చూపుదామనుకుంటే చిక్కే. మారకపోతే మళ్ళీ కివీస్‌తో సిరీస్‌లో లాగా బోర్లా పడక తప్పదు.

నిజానికి, భారత్ ఇప్పటికీ మంచి జట్టే. ఆటగాళ్ళలో ప్రతిభకు కొదవ లేదు. అయితే, టాలెంట్ ఎంత ఉన్నా ఆటలో టెంపర్‌మెంట్ ముఖ్యం. వాటికి తోడు కింద పడినా మళ్ళీ పైకి లేచి సత్తా చాటే చేవ కీలకం. మన జట్టు ఇప్పుడు వీటిని ప్రదర్శించాలి. అందుకోసం తాజా సిరీస్ ఓటమికి కారణాలను ఆత్మపరిశీలన చేసుకోవాలి. భారత క్రికెట్ చరిత్రలో ఎన్నడూ లేనట్లుగా 3–0 తేడాతో సిరీస్‌ను కోల్పోయి, ఈ అధఃపాతాళానికి ఎలా పడిపోయామో స్వీయ విశ్లేషణ జరుపుకోవాలి. టీ20 వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచిన ఆనందాన్ని మర్చిపోక ముందే ఈ పరాజయాన్ని ఎలా కోరి కొని తెచ్చుకున్నామో విశ్లేషించుకోవాలి. ఎంతైనా, పరాజయాలే విజయాలకు మొదటి మెట్టు కదా!

చేతులు కాలినా విధానాలు మారవా?

విశ్లేషణ



దేవీందర్ శర్మ

పంజాబ్ రైతులు పత్తిలో భయంకరమైన బోల్‌వార్మ్ తెగుళ్ళను ఎదుర్కోవడానికి ఏళ్లుగా వాడిన బీటీ–1, బీటీ– 2 రెండూ విఫలమైనాయి. చేతులు కాలిన తర్వాత కూడా విధాన నిర్ణేతలు ఎలాంటి పాఠాలూ నేర్చుకోలేదు. హెర్బిసైడ్(కలుపు నివారిణి గ్లైఫోసేట్)ను తట్టుకోగల జన్యుపరివర్తిత కొత్త తరం పత్తి (హెచ్‌టీబీటీ)ని అనుమతించే ప్రయత్నం కలవరపెడుతోంది. బీటీ పత్తి సాగు వల్ల అధిక దిగుబడి వస్తుందనే అపోహను బద్దలుకొట్టే విషయం ఏమిటంటే, పత్తి దిగుబడిలో భారత్ కంటే ముందున్న చాలా దేశాలు వాస్తవానికి జన్యుమార్పిడి రకాలను పండించడం లేదు. జీఎం మొక్కజొన్న, జీఎం సోయా, జీఎం అల్ఫాల్ఫా పైలట్ ప్రాజెక్ట్‌లకు అమెరికా ప్రయత్నిస్తోంది. నెమ్మదిగా ఇవి జన్యుమార్పిడి ఆహార పంటల తుది ప్రవేశానికి తలుపులు తెరుస్తాయి.

ఏదో తప్పు జరుగుతోంది. 2070 నాటికి భారతదేశం నికర–జీరో ఉద్గారాలకు కట్టుబడి ఉన్న సమయంలో, మన విధాన ప్రతిస్పందన కూడా అలాగే ఉండాలి. రసాయన రహిత వ్యవసాయ పద్ధతుల కోసం మార్గదర్శకాలను రూపొందించడంపై దృష్టి పెట్టాలి. కానీ హానికరమైన కలుపు నివారిణి గ్లైఫోసేట్ (గడ్డిమందు)ను పత్తి సాగులోకి విస్తృతంగా అనుమతించడానికి వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారులు పరిశ్రమల శ్రేణులతో జతకట్టడం కలవరపెడుతోంది.

ఇది ఇక్కడితోనే ఆగదు. హెర్బిసైడ్(కలుపు నివారిణి)ని తట్టుకోగల జన్యుపరివర్తిత కొత్త తరం పత్తి(హెచ్‌టీబీటీ)ని ఆమోదించడంలోని చిక్కులను కూడా ప్రత్యేక కమిటీ పరిశీలిస్తోందని నివేది కలు చెబుతున్నాయి. భారతదేశంలో వాణిజ్య సాగు కోసం ఆమోదించిన ఏకైక జన్యుమార్పిడి పంట అయిన బీటీ పత్తి విస్తీర్ణం పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లలో కుప్పకూలిన సమయంలో ఇది వస్తోంది. సాగులో 46 శాతం క్షీణత, వాయవ్య ప్రాంతాల్లో పత్తి దెబ్బతినడం మన కళ్లు తెరిపించాల్సి ఉంది. దీనికి విరుద్ధంగా, అదే పరిష్కారంగా ముందుకు సాగడం కలవరపెడుతోంది (ఇప్పుడు కలుపు సంహారిణిని తట్టుకునే అదనపు జన్యువుతో).

గతంలోనూ ఇలాగే చెప్పారు!

రైతులపై, పర్యావరణంపై బీటీ పత్తిపంట కలిగించిన విధ్వంసం నుండి ఏదైనా పాఠాలు నేర్చుకుంటే తక్షణ దిద్దుబాటు జరగాలి. కానీ పరిశ్రమ లాబీ ఎంత బలమైనదంటే, మన విధాన రూపకర్తలు వాళ్ల ఒత్తిడికి ప్రతిస్పందిస్తున్నట్లు కనిపిస్తోంది. బీటీ పత్తి సాగు విస్తీర్ణం కనిష్ఠ స్థాయికి పడిపోయిన పంజాబ్ నుండే ఇది మొదలైంది. బీటీ–3 విత్తనాలను కేంద్రం అందుబాటులోకి తేవాలని ఆ రాష్ట్రం డిమాండ్ చేసింది. పంజాబ్ రైతులు భయంకరమైన బోల్‌వార్మ్ తెగుళ్ళను ఎదుర్కోవడానికి సంవత్సరాలుగా వాడిన బీటీ పత్తి రకాలైన బీటీ–1, బీటీ– 2 (బోల్‌గార్డ్ అని పిలుస్తారు) రెండూ విఫలమై దెబ్బతిన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం వినాశకరమైన తెల్లదోమ దాడి అనేకమంది రైతుల ఆత్మహత్యలకు కారణమైంది. ఈ నేపథ్యంలో పంజాబ్ రెండింతలు జాగ్రత్తగా ఉంటుందని నేను అనుకున్నాను. చేతులు కాలిపోయిన తర్వాత కూడా పంజాబ్ ఎలాంటి పాఠాలూ నేర్చుకోలేదు. జాతీయ స్థాయిలో విధాన నిర్ణేతలు సరేసరి.

మరింత ముందుకు వెళ్ళేముందు, హెర్బిసైడ్లను తట్టుకునే జన్యుమార్పిడి పత్తి అంటే ఏమిటో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిద్దాం. సులువుగా చెప్పాలంటే, హెర్బిసైడ్‌ని తట్టుకోవడం కోసం ఒక అదనపు జన్యువును పత్తి రకంలో చొప్పిస్తారు. ఇక్కడ గ్లైఫోసేట్ అని భావించాలి. ఇంతకుముందు మోన్‌శాంటోను కొనుగోలు చేసిన బేయర్ కంపెనీ వెబ్‌సైట్‌లో, బోల్‌గార్డ్–3 (రైతులు దీనిని బీటీ–3 అని పిలుస్తున్నారు) 'మూడు ప్రోటీన్‌లతో మీ పత్తి మొక్కలను బోల్‌వార్మ్



నుండి, ఇతర తెగుళ్ల నుండి రక్షించడంలో సహాయపడుతుంది' అని పేర్కొన్నారు. పురుగు నియంత్రణను తక్కువ పిచికారీలతో అరికట్ట వచ్చనీ, పత్తికి అన్ని సీజన్లలోనూ తక్కువ నష్టం కలిగిస్తుందనీ చెప్పారు.

జన్యుమార్పిడి పత్తికి చెందిన మునుపటి రెండు జాతుల పనితీరుపై కూడా ఇలాగే అతిశయించి చెప్పారు. వాస్తవ సత్యాలను మాత్రం చాలా సౌకర్యవంతంగా ఫుట్‌నోట్‌లలో పెట్టేశారు. 'నేచర్ ప్లాంట్స్ జర్నల్' 2020 మార్చిలో ప్రచురించిన ఒక పత్రంలో, నాగ్‌పూర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ కె.ఆర్. క్రాంతి, ప్రసిద్ధ మానవ శాస్త్రవేత్త, వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన గ్లెన్ డేవిస్ స్టోన్ ఇద్దరూ భారతదేశంలో బీటీ పత్తి దీర్ఘకాలిక ప్రభావాన్ని పరిశీలించారు. వారి అంతిమ నిర్ధారణ ఏమిటంటే, దిగుబడి విషయంలో జన్యుమార్పిడి పత్తి పేలవంగా పనిచేసింది. పురుగుమందుల వాడకం తగ్గిన ప్రారంభ దశ తర్వాత, రసాయనాల వినియోగం వాస్తవానికి పెరిగింది. బీటీ పత్తిని విడుదల చేసిన తర్వాత భారతదేశం చూసిన ఉత్పత్తి పెరుగుదల వాస్తవానికి ఎరువులు, నీటిపారుదల వంటి ప్రధాన ఇన్‌పుట్‌ల పెరుగుదల కారణంగా జరిగిందే.

పురుగుమందుల వాడకం విషయానికొస్తే, 2002–2013 మధ్య పత్తిపై పురుగుమందుల వాడకం 93 శాతం పెరిగింది. ఎరువుల వినియోగం 2004–2016 మధ్య 58 శాతం పెరిగింది. జన్యుమార్పిడి పత్తి సాగును చేపట్టిన 24 సంవత్సరాల తర్వాత భారత్, దిగుబడి పనితీరుకు సంబంధించి 70 దేశాలలో 36వ స్థానంలో ఉంది. బీటీ పత్తి సాగు వల్ల అధిక దిగుబడి వస్తుందనే అపోహను బద్దలు కొట్టే విషయం ఏమిటంటే, భారత్ కంటే ముందున్న చాలా దేశాలు వాస్తవానికి జన్యుమార్పిడి రకాలను పండించడం లేదు.

పత్తి సాగును మార్చడానికి విధాన నిర్ణేతలకు ఇది గుణపాఠం కాదా? ఆ విషయానికి వస్తే, ఇప్పటికే సాగులో ఉన్న రకాలతో పోలిస్తే తక్కువ దిగుబడిని ఇస్తున్నప్పటికీ జీఎం ఆవాలు అధిక దిగుబడిని ఇస్తున్నాయంటున్న వాదనలను కూడా వారు చూడకూడదా? తద్వారా, దీర్ఘకాలిక ఆరోగ్యం, పర్యావరణ ప్రభావాలను (పంటల ఉత్పాదకతలో ఎలాంటి తగ్గుదల లేకుండా) పట్టించుకుంటూ, వాతావరణాన్ని తట్టుకోగల వ్యవసాయ పద్ధతులకు మారడం వైపు దృష్టి కేంద్రీకరించవద్దా?

బీటీ పత్తితో దుర్భరమైన అనుభవం వ్యవసాయ రోడ్‌మ్యాప్‌ను మళ్లీ గీయవలసిన అవసరాన్ని చూపుతుంది. స్థిరమైన ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఇటీవల అగ్రిబిజినెస్ దిగ్గజం బేయర్‌తో పరిశోధనా సహకారం నెలకొల్పుకున్న ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐకార్) వాస్తవాలను చూడటానికి నిరాకరించింది.

జంట వ్యూహం

అభివృద్ధి చెందుతున్న దేశాల్లోకి జీఎం పంటలను నెట్టడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. ఈ విషయంలో మెక్సికో ప్రతిఘటించిన తర్వాత నెమ్మదిగా పెద్ద మార్కెట్ అయిన భారత్ వైపు దృష్టి పెట్టింది. ఆహార భద్రతను పెంపొందించడానికి అమెరికా జన్యుమార్పిడి పంటల దిగుబడిపై దృష్టి సారించింది (వాణిజ్యపరంగా ప్రవేశపెట్టిన జన్యుమార్పిడి పంటల నుండి దిగుబడి పెరిగినట్లు ప్రపంచవ్యాప్తంగా ఎటువంటి ఆధారాలు లేవు). ఇథనాల్ ఉత్పత్తిలో వాడేందుకు జీఎం మొక్కజొన్న, ఇంకా జీఎం సోయా, ఎండుగడ్డి పశుగ్రాసం కోసం జీఎం అల్ఫాల్ఫా లాంటి కొన్ని పైలట్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయడానికి కూడా ప్రయత్నిస్తోంది. జీఎం అల్ఫాల్ఫా లాంటిది వెంటనే ఆహార గొలుసులోకి వెళ్లదు కాబట్టి ప్రజల ఆమోదం పొందుతుంది. జన్యుమార్పిడి మొక్కల లోకి చొచ్చుకుపోవడానికి కూడా కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. నెమ్మదిగా ఈ పైలట్ ప్రాజెక్ట్ ప్రతిపాదనలు జన్యుమార్పిడి ఆహార పంటల తుది ప్రవేశానికి తలుపులు తెరుస్తాయి.

అయితే వీటిని విమర్శించేవారి వాదనలను కొట్టిపారేసేందుకూ, జీఎం పంటలు, రసాయనాల ప్రమాదాలను తక్కువచేసి చూపేందుకూ పెద్ద ప్రయత్నాలే జరుగుతున్నాయని ఇంటర్నేషనల్ మీడియా కలెక్టివ్ పరిశోధన చెబుతోంది. ఆఖరికి సహజ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయాల సంభావ్యతను తగ్గించేందుకు కూడా దీన్ని పొడిగిస్తున్నారు. ఉదాహరణకు హార్వర్డ్ పబ్లిక్ హెల్త్ స్కూల్‌లోని ఒక ప్రొఫెసర్‌కు చక్కెర పరిశ్రమ భారీ సొమ్మిచ్చి, సుక్రోజుకూ, గుండె వ్యాధికీ సంబంధం లేదని చెప్పించినట్టు! వంగడానికి సిద్ధంగా ఉండే అధికార వ్యవస్థ(శాస్త్రీయ సంస్థలతో సహా) ద్వారా జీఎం పంటలను చొప్పించడం, విమర్శకులను తీవ్రంగా ఎదుర్కోవడం అనే జంట వ్యూహం రాబోయే రోజుల్లో మరింత పదునెక్కనుంది. జాగ్రత్త!

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బాధ ఉన్నదా?



ఇండియా 1997లో బార్బడోస్ టెస్ట్‌లో (వెస్టిండీస్ చేతిలో) 38 పరుగులతో ఓడినప్పుడు సచిన్ రాత్రి భోజనం చేయలేదు. ఆ ఘోరమైన రాత్రి నేను ఆయనతోనే ఉన్నాను. నెల తర్వాత సెయింట్ విన్సెంట్‌లో వన్డేలో 18 పరుగులతో మళ్లీ ఓడినప్పుడూ అలాగే చేశాడు. ఓటమి బాధిస్తుంది. మరి 3–0 దారుణ ఓటమి (కివీస్‌తో టెస్ట్ సిరీస్) ఇప్పటి భారత జట్టును బాధిస్తున్నదా?

– విజయ్ లోకపల్లి, జర్నలిస్ట్

మహిళలదే ఎంపిక



మహిళలు, బాలికలను హిజాబ్ తొలగించాలని భారత ప్రభుత్వం ఆదేశిస్తే నేను దాన్ని నిరసిస్తాను. మహిళలు, బాలికలు తప్పనిసరిగా హిజాబ్ ధరించాలని ఇరాన్ ప్రభుత్వం ఆదేశిస్తే నేను దాన్ని నిరసిస్తాను. మహిళల గర్భస్రావ హక్కులకు వ్యతిరేకంగా యూఎస్ పోతే దాన్నీ నిరసిస్తాను. మా శరీరం, మా ఎంపిక. మరో మాటే లేదు!

– కె. స్వాతి, న్యాయవాది

గెలుపు ట్రంప్‌దే?



నా అంచనా ఏమిటంటే, యూఎస్ అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ గెలుస్తారు. సురక్షితమైన తేడాతో పాపులర్ ఓటు (మొత్తంగా వచ్చే ఓట్లసంఖ్య), భారీ మెజారిటీతో ఎలక్టోరల్ ఓటు (గెలుచుకునే స్థానాల సంఖ్య : 538లో కనీసం 270 రావాలి) – రెండింటా విజయం సాధిస్తారు.

– రాబర్ట్ మలోని, శాస్త్రవేత్త

వాదనలు చాలా?



ఢిల్లీ వాయు కాలుష్య సంక్షోభానికి శాశ్వత పరిష్కారంపై చర్చకు సైంటిస్ట్‌లు, యాక్టివిస్టులను కాకుండా రాజకీయ నేతల్ని టీవీ ఛానల్స్ ఎందుకు పిలుస్తున్నాయో?!

– లిసీప్రియా కంగుజం, క్లైమేట్ యాక్టివిస్ట్

హింస కూడదు!



బ్రాంప్టన్‌లోని హిందూ సభా మందిర్‌లోని భక్తులను లక్ష్యంగా చేసుకుని జరిగిన హింస ఎంతమాత్రమూ అంగీకారం కాదు. కెనడియన్లు అందరికీ తమ విశ్వాసాలను శాంతియుతంగా ఆచరించే స్వేచ్ఛ ఉండాలి.

– పియరీ పొయ్‌లీయెరీ, కెనడా ప్రధాని అభ్యర్థి

ఇన్ బాక్స్

తెలంగాణ చైతన్య కేతనం

ఆయన పేరు వినగానే స్ఫురణకు వచ్చే 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' వాక్యం... జన్మభూమి కీర్తిని ఎలుగెత్తిన స్వరం. ఆయన పోరుబాట నడిచిన కవి. 'నా పేరు ప్రజా కోటి నా ఊరు ప్రజా వాటి' అని చాటి ప్రజలతో మమేకమైన అభ్యుదయ భావ శరధి. ఆయనే దాశరథి కృష్ణమాచార్యులు. ప్రజల గుండెల 'రుద్రవీణ'ను మీటి బాధలపై తిరగబడి 'అగ్నిధార'ల కురిపించిన ధీశాలి. గడీల నెదిరించి బేడీలను స్వాగతించిన కవితా సైనికుడు. అభ్యుదయ 'కవితామృతాభిషేకం'తో ప్రజలను మేల్కొలిపి సమాజాన్ని కమ్మేసిన 'తిమిరంతో సమరం' చేసినవాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ పట్ల అభిమానం పెంచుకుని సభ్యత్వం తీసుకుని, ద్వితీయ ప్రపంచ సంగ్రామ సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక బయటకు వచ్చి హైదరాబాదు సంస్థానంలో నిజాం వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్న యువకుడు.



దాశరథి కృష్ణమాచార్యులు

దాశరథి కృష్ణమాచార్యులు 1925 జూలై 22న నాటి వరంగల్ జిల్లా చిన్న గూడూరులో (ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా) జన్మించారు. 1953లో 'తెలంగాణ రచయితల సంఘా'న్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్య విత్తనం నాటారు. దాశరథి సాహితీ కృషి సినిమా పాటలు, కవితలు... ఇలా అనేక ప్రక్రియల్లో సాగింది. ఆంధ్ర మహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వంలో జైలుశిక్ష అనుభవించారు. నిజామాబాద్ ఇందూరు కోట జైలులో ఉన్నప్పుడు... పళ్ళు తోముకోవడానిరి ఇచ్చిన బొగ్గుతో జైలు గోడల మీద నిజాంకు వ్యతిరేకంగా పద్యాలు రాసి దెబ్బలు తిన్నారు.

'చెంపపై నిశ్శబ్దంగా జారే కన్నీటి చుక్కను తుడవడానికి మరో హృదయం పడే తపనే ప్రేమ. అదే చుక్కను రానివ్వకుండా ఆరాటపడే హృదయమే స్నేహం' అనేది ఆయన తత్వం. 1961లో 'ఇద్దరు మిత్రులు' సినిమాలో పాటలు రాయడంతో ఆయన సినీరంగ ప్రవేశం చేసి, ఇంచుమించు కొన్ని వందల పాటలతో తెలుగు సినీ సాహిత్య సేవ చేశారు. 62వ యేట 1987 నవంబర్ 5న కోటి రతనాల వీణ తంత్రులు తెగిపోయాయి. వేటూరి మాటల్లో దాశరథి వ్యక్తిత్వం: 'అతను బుడుగైనా ఆర్తి పొడుగు. మూర్తి చిన్నదైనా కీర్తి దొడ్డది'. అతను నాటు తెలుగు గూటిలో గుట్టుగా దాగి ఒక్క పెట్టున గుక్కపట్టి గొంతువిప్పిన కవితల గిజిగాడు. రాక్షసత్వపు రజాకారులకు మానవత్వపు ప్రజాకారుడై తిరగబడ్డ తెలుగుబిడ్డ. కవిగా పుట్టి కవిగా ఎదిగి కవిగా కన్నుమూసిన తెలుగుజాతి వైతాళికుడు.

– నందిరాజు రాధాకృష్ణ । వెటరన్ జర్నలిస్ట్ । 98481 28215

(నేడు కృష్ణమాచార్యులు వర్ధంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఎందరికో అది కూడూ గూడూ గుడ్డ!

అభిప్రాయం



డా॥ బూర నర్సయ్య గౌడ్

ప్రపంచ దేశాల్లో కోట్లాదిమందికి కూడూ, గూడూ, గుడ్డను అందిస్తున్న రంగాల్లో రియల్ ఎస్టేట్ రంగం ఒకటి. ఆ రంగంలో కొందరు చేసే అక్రమాలను దృష్టిలో పెట్టుకుని దాన్ని బహిష్కృత రంగంగా భావించడం తగదు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వ వ్యవహార శైలి వల్ల ఈ రంగం కుదేలైపోయింది.

భారత్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపార నిడివి ఒకసారి పరిశీలిస్తే... 2021లో రియల్ ఎస్టేట్ వ్యాపారం 200 బిలియన్ డాలర్స్ (16.8 లక్షల కోట్ల రూపాయలు). ఇది భారత జీడీపీలో 7.3%. 2047 (అమృత్ కాల్) నాటికి భారత జీడీపీలో 15.5% వరకు చేరే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధితో అనేక ఇతర రంగాల అభివృద్ధి ముడివడి ఉంది. ప్రభుత్వానికి రాయల్టీ, జీఎస్టీ, రిజిస్ట్రేషన్ రుసుము, ఆదాయం పన్ను, కాపిటల్ గెయిన్స్ టాక్స్, ప్రొఫెషనల్ టాక్స్ వంటి రూపాల్లో ఆదాయం సమకూరుతుంది.

కేవలం ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే దాదాపు పదీ పదిహేను లక్షల కుటుంబాలు రియల్ ఎస్టేట్ మీద ఆధారపడి ఉపాధి పొందుతున్నాయి. హైదరాబాద్ ప్రపంచంలోనే అతి వేగంగా, అత్యధిక రాబడిని ఇచ్చే నగరంగా పేరు తెచ్చుకుంది. ఆ బ్రాండ్ ఇమేజ్‌ను, బ్రాడ్ మైండెడ్ బిజినెస్ వ్యాపారతత్వాన్నీ కాపాడి తెలంగాణను ఒక రియల్ ఎస్టేట్ లైట్ హౌస్‌గా మార్చవలసిన అవసరం ఉంది. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకోవాలి.

రియల్ ఎస్టేట్ వ్యాపారం లక్షల నుండి వేల కోట్ల రూపాయల్లో ఉంటుంది. ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ వ్యవస్థలు కేవలం ఫెసిలిటేటర్లుగా ఉండాలి. 'జబ్బు కంటే చికిత్స ప్రమాదం కారాదు' అనే సూత్రాన్ని ప్రభుత్వం ఆలోచించాలి. మంచి చేయకున్నా పర్వాలేదు కానీ చెడు చేయకూడదు. ఒక పాలసీ తెచ్చేముందు ఆచితూచి వ్యవహరించాలి. అంతరాత్మ సాక్షిగా అందులో వ్యక్తిగత స్వార్థం ఉండకూడదు. ఆశయంతో పాటు ఆచరణ కూడా చూడాలి. కొండ నాలికకు మందు వేస్తే ఉన్న నాలిక ఊడినట్లు ఉండకూడదు. పాలసీ ద్వారా పరిపాలన వికేంద్రీకరణ జరగాలి కానీ, కేంద్రీకృతం కావొద్దు.

'ధరణి' లక్షల సమస్యలకు పరిష్కారం, కోటి సమస్యలకు పునాది అయ్యింది. వేలల్లో ఉన్న అవినీతి లక్షల రూపాయల్లోకి పెరిగింది. లక్షల్లో ఉండే అవినీతి



కోట్ల రూపాయలకు ఎగబాకింది. సమస్యల పరిష్కారానికి నిర్దిష్టమైన సమయాన్ని నిర్ణయించాలి. అన్ని అనుమతులనూ నాన్చకుండా నిర్దిష్ట సమయంలో వచ్చేటట్లు ఒక వ్యవస్థ ఏర్పాటుచేయాలి. 'మూసీ పునర్జీవం' పథకం ఆశయం మంచిదైనా, అది ప్రజల్లో భయాందోళన కల్గించడం వలన రియల్ ఎస్టేట్ మీద మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు అయ్యింది. దీన్ని ఒక దీర్ఘకాలిక ప్రణాళికగా ముందుకు తీసుకొని వెళితే మంచిది. గత ప్రభుత్వ తొందరపాటు నిర్ణయం వలన దాదాపు 25 లక్షల ప్లాట్లు నిర్వీర్యం అయ్యి రియల్ ఎస్టేట్ దెబ్బతింది. ప్రభుత్వం వెంటనే బేషరతుగా ఇచ్చిన వాగ్దానం ప్రకారం రిజిస్ట్రేషన్‌ను అనుమతిస్తే, రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చినట్లు అవుతుంది. రివర్ బెడ్, చెరువులు, కుంటలు తప్ప మిగతా చట్టబద్ధంగా అనుమతులతో నిర్మించిన కట్టడాలను తొందరపడి కూల్చకుండా ఇతర మార్గాలు అన్వేషిస్తే మంచిది. చాలా సందర్భాల్లో అధికారం అడ్డం పెట్టుకొని పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను శాసిస్తూ గతంలో ఉన్న లే అవుట్‌లను చెరిపివేసి, దౌర్జన్యంగా కబ్జా చేయడం, గతంలో అమ్మిన భూములకు పాస్ బుక్స్ సాధించి లిటిగేషన్స్ సృష్టించడం లాంటివి చేసే వారికి ఒక భయం కల్గించవలసిన అవసరం ఉంది. ప్రొఫెషనల్ ల్యాండ్ లిటిగ్యాంట్స్ జాబితా తయారు చేసి వారిని కట్టడి చేయవలసిన అవసరం ఉంది.

హైదరాబాద్‌లో అభివృద్ధి కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలకూ విస్తరించాలి. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' ఉపయోగించుకొని, తెలంగాణ లోని ప్రజలకు సొంత ఇంటి కల నిజం చేయాలి. భూ సేకరణలో రైతులకు నష్టం కలుగకుండా చూడాలి. ముఖ్యంగా సర్వం కోల్పోయే చిన్న, సన్న కారు రైతులకు అండగా ఉండాలి. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించినట్లు, రిజిస్ట్రేషన్ల ఆఫీసులను ఒక కార్పొరేట్ ఆఫీసుగా మార్చి, ఒక నూతన ఒరవడికి పునాది వేయాలి.

లండన్, పారిస్, డల్లాస్ నగరాల లాగ హైదరాబాద్‌ను తయారు చేయడం కాదు; హైదరాబాద్‌ను ఒక ప్రపంచ నగరం లాగ తీర్చిదిద్దాలి. దీనికి ప్రథమంగా రాజనీతిజ్ఞత కావాలి. ముఖ్యంగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మీద శ్రద్ధ పెట్టాలి. అదేవిధంగా విద్యుత్, నీరు, డ్రైనేజీ వ్యవస్థల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. లా అండ్ ఆర్డర్ కూడా ముఖ్యం. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. మాదకద్రవ్యాల కట్టడిలో తరతమ భేదాలు మరచి వ్యవహరించాలి.

దూరపు కొండలు నునుపు అనకుండా, స్థానిక పారిశ్రామిక సంస్థలు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలుగా ఎదగటానికి దోహద పడాలి. డిస్నీ లాంటి పార్కులు, ఎకో పార్కులు, వాటర్ స్పోర్ట్స్, మ్యూజియాలను ప్రజల భాగస్వామ్యంతో నిర్మించాలి. మెడికల్ – ఎడ్యుకేషనల్ హబ్బులను సృష్టించాలి. ఇవి చాలా అవసరం. వీటి వలన అన్ని రంగాలకు మేలు జరుగు తుంది. తక్కువ రెంటు హౌసింగ్ కాంప్లెక్సులు ఏర్పాటు చేయాలి. వివిధ ప్రదేశాల నుండి వచ్చే వారి కొరకు ఇంటి రెంట్లు అందుబాటులో ఉండేవిధంగా కేంద్ర ప్రభుత్వ 'ఎఫర్డబుల్ హౌసింగ్ స్కీమ్'ను వాడుకుంటే మంచిది. అలాగే ఫైనాన్స్ హబ్‌నూ ఏర్పాటు చేయాలి. ఇతర రాష్ట్రాల, దేశాల పెట్టుబడులు ఆకర్షించడానికి ఇది అవసరం. ప్రస్తుతం ముంబై ఫైనాన్స్ హబ్‌గా ఉంది. ఒక వినూత్న విధానంతో విదేశీ ఫైనాన్స్ సంస్థలైన జేపీ మోర్గాన్, సిటీ గ్రూప్, బ్లాక్ రాక్, గోల్డ్‌మన్ సాచ్స్, జపాన్ రిటైర్మెంట్ ఫండ్ ఇన్‌స్టిట్యూట్ వంటి వాటినీ; భారత్‌లో ఉన్న టాటా ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, ఎల్ అండ్ టీ ఫైనాన్స్ లాంటి కంపెనీలనూ ఆకర్షించడానికి ఒక ఫైనాన్షియల్ హబ్ మనకి అవసరం.

హైదరాబాద్ లేదా ఇతర పట్టణాల అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియ. కేవలం ఒక టర్మ్‌లో అభివృద్ధి చేయడం అసాధ్యం. అందుకే దీర్ఘకాలిక ప్లానింగ్ చేసే ముందు అన్ని రాజకీయ పార్టీలనూ భాగస్వాములను చేయడం అవసరం. ఈ ప్రణాళికలను తదుపరి వచ్చే ప్రభుత్వం కొనసాగించేలా ఉండాలి. ప్రతి నాయకుడూ 'నా మార్క్ ఉండాలి' అంటే చివరకు కేవలం శిలా ఫలకాలే మిగులుతాయి. అందుకే అందరికీ అన్నం పెట్టే రియల్ ఎస్టేట్ అక్షయ పాత్రను కాపాడుకోవాలి.

వ్యాసకర్త భువనగిరి మాజీ ఎంపీ,
బీజేపీ నేషనల్ కౌన్సిల్ మెంబర్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.చవితి రా.9.32 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** జ్యేష్ఠ ఉ.8.21 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** సా.4.38 నుండి 6.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.21 నుండి 9.09 వరకు తదుపరి రా.10.31 నుండి 11.19 వరకు, **అమృతఘడియలు:** రా.2.31 నుండి 4.10 వరకు, నాగుల చవితి ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.03, **సూర్యాస్తమయం:** 5.25.

క్లుప్తంగా...

ఏపీ ఐఏఎస్ అధికారికి తప్పిన ప్రమాదం

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు.. సూర్యాపేట జిల్లాలో ఘటన


వాణిప్రసాద్

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల గ్రామ శివారులో కారు అదుపు తప్పిన ఘటనలో ఏపీకి చెందిన ఉన్నతాధికారికి స్వల్ప గాయాలయ్యాయి. ఏపీ కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ సోమవారం హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు కారులో వెళుతుండగా మార్గమధ్యలో ఆకుపాముల వద్దకు రాగానే డ్రైవర్ ముందు ఉన్న మరో కారును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వాణిప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వాణిప్రసాద్‌ను కోదాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించి.. విజయవాడకు పంపించారు. కాగా, ఈ ప్రమాదంపై ఫిర్యాదు ఏమీ అందలేదని మునగాల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఏనుగుల దాడిలో నాయబ్ సుబేదార్ మృతి

- అస్సాంలో ఘటన..
- మృతుడు భద్రాద్రి వాసి సాయిచంద్రారావు



భద్రాచలం అర్బన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఆర్మీ నాయబ్ సుబేదార్ కొంగా సాయిచంద్రారావు ఆదివారం అస్సాంలో జరిగిన ఏనుగుల దాడిలో మృతి చెందారు. వివరాలివి. భద్రాచలంలోని అశోక్‌నగర్ కొత్తకాలనీకి చెందిన మాజీ హోంగార్డు కొంగా రాజారామ్, దేవి దంపతుల కుమారుడు సాయిచంద్రారావు 2002లో ఆర్మీలో చేరి, ప్రస్తుతం అస్సాం రాష్ట్రం సోనిత్‌పూర్ జిల్లా రంగాపారా ప్రాంతంలోని ఠాకూర్‌భారీ ఆర్మీ యూనిట్‌లో నాయబ్ సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆర్మీ సిబ్బంది అగ్నిబారిలో వాకింగ్ చేస్తుండగా.. వారిపై ఏనుగులు దాడికి ప్రయత్నించాయి. తప్పించుకుని పారిపోయే క్రమంలో సాయిచంద్రారావు కిందపడిపోయారు. ఒక ఏనుగు చంద్రారావును బలంగా తొక్కడంతో.. ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయాన్ని ఆర్మీ అధికారులు ధ్రువీకరించారు. కాగా సాయిచంద్రారావు మృతదేహాన్ని సోమవారం రాత్రి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి నుంచి మంగళవారం భద్రాచలం తరలించనున్నారు. సాయిచంద్రారావుకు భార్య స్రవంతి, పాప, బాబు ఉన్నారు.

నారాయణ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య


వైష్ణవి

జిన్నారం (పటాన్‌చెరు): నారాయణ కళాశాలలో ఓ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా ఐనవోలు గ్రామానికి చెందిన బాలబోయిన పరుశురాం చిన్న కూతురు వైష్ణవి (16) జిన్నారం మండలం ఖాజీపల్లి శివారులోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ చదువుతోంది. సోమవారం హాస్టల్‌లోని 315 నంబరు గదిలో చున్నీతో ఫ్యానుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. మృతదేహాన్ని బాచుపల్లి ఎల్ఎస్‌జీ ఆస్పత్రికి తరలించారు. వైష్ణవి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అదే కళాశాలలో మృతురాలి అక్క ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యువతిపై ప్రేమోన్మాది దాడి

- మెదక్ జిల్లాలో ఘటన

మెదక్ మున్సిపాలిటీ: ప్రేమించేందుకు నిరాకరించిందన్న కారణంతో యువతిపై ప్రేమోన్మాది కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద చోటు చేసుకుంది. మెదక్ పట్టణ శివారులోని అవుసులపల్లికి చెందిన యువతి తల్లిదండ్రులతో కలిసి కొంత కాలం హైదరాబాద్‌లో ఉంది. అనంతరం కొద్దిరోజుల క్రితం తల్లీకూతురు కలిసి సొంత ఊరికి వచ్చారు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు చేతన్ అనే యువకుడు యువతిని ప్రేమ పేరుతో వేధించాడు. మెదక్‌కు వచ్చిన తర్వాత కూడా వేధింపులు ఆగలేదు. ప్రస్తుతం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ యువతి ఓపెన్ డిగ్రీ పరీక్షలు రాస్తోంది. పరీక్షలు రాసేందుకు యువతి వస్తుందన్న సమాచారం తెలుసుకున్న చేతన్ పక్కా పథకంతో వచ్చాడు. కళాశాల వద్దకు ఆమె రాగానే ఎప్పటిలాగే ప్రేమించాలని కోరాడు. అందుకు నిరాకరించడంతో గట్టిగా అరుస్తూ తన వెంట తెచ్చుకున్న కత్తితో యువతిని పొడిచే ప్రయత్నం చేయగా, ఆమె చేతులు అడ్డుపెట్టడంతో గాయాలయ్యాయి. కొందరు యువకులు అక్కడికి రావడంతో చేతన్ పారిపోయాడు. గాయాలైన యువతిని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ నాగరాజు కేసు నమోదు చేశారు.

సన్న ధాన్యంపై వ్యాపారుల కన్ను

పొలాల్లో పచ్చి వడ్లనే కొనుగోలు చేస్తున్న వైనం

- ఫైన్ వెరైటీ రకాన్ని బట్టి రూ.2,000 నుంచి రూ.2,600 వరకు చెల్లింపు
- మార్కెట్‌లో సన్న బియ్యానికి ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునే యత్నం
- కొనుగోలు కేంద్రాల్లో మాదిరి తాలు, తరుగు, తేమ లొల్లి లేకపోవడంతో వ్యాపారుల వైపే రైతుల మొగ్గు
- నిజామాబాద్, నల్లగొండల్లోని కొన్ని మండలాల్లో ఇప్పటికే సన్న ధాన్యం అమ్మకాలు పూర్తి
- సంక్రాంతి నుంచి రేషన్‌షాపులకు ఇచ్చే సన్న బియ్యంపై ప్రైవేటు అమ్మకాల ప్రభావం!

నిజామాబాద్ జిల్లాలోని వర్ని, బోధన్, మోస్రా, చందూర్ తదితర కొన్ని మండలాల్లో వరి కోతలు 100 శాతం పూర్తయ్యాయి. ఈ మండలాల్లో రైతులు పండించే హెచ్ఎంటీ, జై శ్రీరాం, బీపీటీ లాంటి మంచి రకం (ఫైన్ వెరైటీ) సన్న ధాన్యాన్ని ఇప్పటికే దళారులు, వ్యాపారులు పొలాల నుంచే కొనుగోలు చేశారు. తరుగు, తాలు, తేమ శాతంతో సంబంధం లేకుండా పచ్చి వడ్లను కొన్నారు. నెలరోజుల క్రితం ఇక్కడ కోతలు షురూ కాగా, మొదట్లో క్వింటాలుకు మద్దతు ధర రూ.2,320కి మించి రూ.2,600 వరకు చెల్లించిన వ్యాపారులు, ప్రస్తుతం రూ.2,100 నుంచి రూ.2,300 వరకు చెల్లిస్తున్నారు. పైగా తాలు, తరుగు, తేమ శాతాన్ని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ధాన్యం కొని, డబ్బులు చెల్లిస్తుండడంతో.. రైతులు కూడా వారికే విక్రయిస్తున్నారు. ఫైన్ వెరైటీ సన్న ధాన్యం అధికంగా పండించే నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

సాక్షి, హైదరాబాద్: బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యానికి ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు రాష్ట్రంలో వ్యాపారులు, మిల్లర్లు పల్లెలపై దృష్టి పెట్టారు. ప్రభుత్వం సన్నాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడంతో రాష్ట్రంలో పెరిగిన సన్నాల సాగును తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. తెల్ల బియ్యం ఎగుమతులపై ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసిన నేపథ్యంలో సన్న ధాన్యాన్ని పెద్ద ఎత్తున సేకరిస్తున్నారు. కోతలు ప్రారంభమైన వెంటనే కల్లాల నుంచే ధాన్యాన్ని ఏకమొత్తంగా కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారు. నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో సెప్టెంబర్ చివరి వారం నుంచే వరికోతలు మొదలై అక్టోబర్‌లో పెద్ద ఎత్తున సాగుతాయి. మిగతా జిల్లాల్లో అక్టోబర్ చివరి వారం, నవంబర్ మొదటి వారం నుంచి మొదలై జనవరి దాకా సాగుతాయి.

సన్న ధాన్యానికి డిమాండ్

రాష్ట్రంలో కురిసిన అధిక వర్షాల నేపథ్యంలో ఈసారి ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంది. దీంతో ధాన్యాన్ని 17 శాతం తేమ వచ్చేంత వరకు ఆరబెట్టి, తరుగు, తాలు లేకుండా తూర్పారబట్టి కొనుగోలు కేంద్రానికి తెస్తేనే సేకరిస్తామని మిల్లర్లు చెబుతుండటం.. ఆ బాధలేవీ లేకుండా వ్యాపారులు పచ్చి వడ్లనే కొంటుండడం, డబ్బులు వెంటనే చేతికి వస్తుండడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వరకు వెళ్లడం లేదు. తమ వద్దకే వచ్చే వ్యాపారులకు ధాన్యం అమ్మేసుకుంటున్నారు. ప్రస్తుతం కోతలు సాగుతున్న కరీంనగర్, వరంగల్,


ఫైల్

ఖమ్మం, మెదక్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లో సన్న ధాన్యాన్ని వ్యాపారులు కొంటున్నారు. ఫైన్ రకాలైన జైశ్రీరాం, సాంబ మసూరి (బీపీటీ 5204), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), హెచ్ఎంటీ సోనా రకాలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉండడంతో ఈ రకాలకు క్వింటాలుకు రూ.2,600 వరకు చెల్లిస్తున్నారు. మిగిలిన సన్న రకాలకు రూ.2,000 వరకు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యంలో కిలో సన్న ధాన్యం కూడా లేకపోవడం గమనార్హం. కాగా రాష్ట్రంలో సన్న ధాన్యం కోసం

వ్యవసాయ శాఖ గుర్తించిన సన్న ధాన్యం రకాలు ఇవే..

సిద్ధి (వరంగల్ 44), కంపాసాగర్ వరి-1 (కేపీఎస్ 2874), సాంబ మసూరి (బీపీటీ 5204), జగిత్యాల వరి-3 (జేజీఎల్ 27356), జగిత్యాల వరి-2 (జేజీఎల్ 28545), వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్ 14), వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్ 32100), జగిత్యాల్ మసూరి (జేజీఎల్ 11470), పొలాస ప్రభ (జేజీఎల్ 384), కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458), మానేరు సోనా (జేజీఎల్ 3828), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048), వరంగల్ వరి-1119, కునారం వరి-2 (కేఎన్ఎం 1638), వరంగల్ వరి-2 (డబ్ల్యూజీఎల్ 962), రాజేంద్రనగర్ వరి-4 (ఆర్ఎన్ఆర్ 21278), కునారం వరి-1 (కేఎన్ఎం 733), జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798), జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844), కరీంనగర్ సాంబ (జేజీఎల్ 3855), అంజన (జేజీఎల్ 11118), నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34 449), ప్రద్యుమ్న (జేజీఎల్ 17004), సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465), శోభిని (ఆర్ఎన్ఆర్ 2354), సోమనాథ్ (డబ్ల్యూజీఎల్ 34 7), ఆర్ఎన్ఆర్ 31479 (పీఆర్‌సీ), కేపీఎస్ 6251 (పీఆర్‌సీ), జేజీఎల్ 33124 (పీఆర్‌సీ), హెచ్ఎంటీ సోనా, మారుటేరు సాంబ (ఎంటీయూ 1224), మారుటేరు మసూరి (ఎంటీయూ 1262), ఎంటీయూ 1271.

కేటాయించిన కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాకపోవడంతో వెలవెలబోతున్నాయి. రాష్ట్రంలో 33 వరి రకాలను వ్యవసాయ శాఖ సన్నాలుగా గుర్తించింది. వీటికే రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్‌గా చెల్లిస్తుంది.

సర్కారు అంచనా సాధ్యమయ్యేనా?

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే సంక్రాంతి నుంచి రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని సుమారు 90 లక్షల కార్డుదారులకే కాకుండా ఇప్పటికే సన్నబియ్యం ఇస్తున్న స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీలు, గురుకుల పాఠశాలలకు కలిపి ఏటా 24 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) సన్న బియ్యం అవసరం. 24 ఎల్ఎంటీల సన్న బియ్యం కావాలంటే 36 ఎల్ఎంటీల సన్నవడ్లు కావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో 50 ఎల్ఎంటీల సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు లేవని పౌరసరఫరాల శాఖ అధికారులే చెపుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరగాలి

▶ మొదటి పేజీ తరువాయి

అప్పగించారు. రైతులు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపట్టాలని, ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలించాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 1న ప్రతి ఉమ్మడి జిల్లాకో ఐఏఎస్‌ను ప్రత్యేక అధికారిగా నియమించిన విషయం తెలిసిందే.

జిల్లాల ప్రత్యేకాధికారులు వీరే:

- ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల: కృష్ణ ఆదిత్య
- కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల: ఆర్వీ కర్ణన్
- నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట: అనితా రామచంద్రన్
- నిజామాబాద్, కామారెడ్డి: డాక్టర్ ఎ.శరత్
- రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి: డి.దివ్య
- మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్: ధరావత్ రవి
- వరంగల్, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్: టి.వినయ కృష్ణారెడ్డి
- మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట: హరిచందన దాసరి
- ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం: కె.సురేంద్ర మోహన్

తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌లో తనిఖీలు


మైన్ తనిఖీకి వచ్చిన బృందం సభ్యులు

మల్హర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్‌ను సోమవారం స్టార్ రేటింగ్ తరఫున కోల్ మంత్రిత్వ శాఖ అధికారుల బృందం తనిఖీ చేసింది. తాడిచర్ల కోల్-1 బ్లాక్ మైన్‌లో సేఫ్టీ, ఎన్విరాన్‌మెంట్ ఇతర విభాగాల్లో పాటిస్తున్న పద్ధతులను బృంద సభ్యులు పరిశీలించారు. తనిఖీల్లో డి.వి.సుబ్రహ్మణ్యం (ఓఎస్‌డీ, సీసీడీ) కొత్తగూడెం, అవినాశ్ శుక్లా (సీసీవో) బిలాస్‌పూర్, వరంగల్ ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ అజయ్ పటేల్, జనరల్ మేనేజర్ సేఫ్టీ బీపీఏ, ఎస్‌సీఎల్ కె.రఘుకుమార్, టీజీ జెన్‌కో జనరల్ మేనేజర్ మోహన్‌రావు, ఏజెంట్ జీవకుమార్ పాల్గొన్నారు.

సాగు సవాళ్లకు కొత్త పరిష్కారాలు

- పాత విధానాలతో నేటి సమస్యలు పరిష్కరించలేం
- సుస్థిర వ్యవసాయ కేంద్రం ఈడీ జీవీ రామాంజనేయులు


మాట్లాడుతున్న మంజుల మేనన్. పక్కన రామాంజనేయులు

సాక్షి, హైదరాబాద్: వాతావరణ పరిస్థితులు వేగంగా మారిపోతున్న నేపథ్యంలో వ్యవసాయరంగంలో ఎదురవుతున్న సవాళ్లకు కొత్త పరిష్కారాలను వెదకాల్సిన అవసరం ఉన్నదని సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త, సుస్థిర వ్యవసాయ కేంద్రం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రామాంజనేయులు అన్నారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) మినీ ఆడిటోరియంలో మిల్లెట్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 'క్లైమేట్ చేంజ్, మిల్లెట్స్, ఎకోసిస్టమ్ సర్వీసెస్'అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో ఆయన మాట్లాడారు. రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు 30 ఏళ్ల క్రితం ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన మద్దతు వ్యవస్థలు ఇప్పటి సవాళ్లను ఎదుర్కోవటానికి పనికిరావని తెలిపారు. కొత్త తరహా మద్దతు వ్యవస్థలను అమల్లోకి తెచ్చుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అజీమ్ ప్రేమ్‌జీ వర్సిటీ అధ్యాపకురాలు డాక్టర్ మంజుల మేనన్ మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి మిశ్రమ పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వాలు అండగా నిలవాలని సూచించారు. ఆ రైతులకు ప్రత్యేక చెల్లింపులు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు డాక్టర్ కేవీ కూర్మనాథ్, రైతు స్వరాజ్య వేదిక నేత కన్నెగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి.. ఆర్టీసీ బస్సు బోల్తా

డ్రైవర్ సహా ఆరుగురికి గాయాలు



చౌటుప్పల్ రూరల్: ఆర్టీసీ బస్సు బోల్తాపడటంతో డ్రైవర్‌తోపాటు ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని బొర్రోళ్లగూడెం గ్రామ స్టేజీ వద్ద చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు సోమవారం మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. చౌటుప్పల్ దాటిన తర్వాత నుంచి బస్సులో శబ్దం వస్తుండడాన్ని గమనించిన డ్రైవర్ నిలిపే ప్రయత్నం చేయగా బ్రేకులు పడలేదు. దీంతో బస్సు అదుపు తప్పి జాతీయ రహదారి పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న నార్కట్‌పల్లి మండలం ఔరవాణి గ్రామానికి చెందిన రేషన్ డీలర్ బొప్పని విజయ, శాలిగౌరారం మండలం పెర్కకొండారానికి చెందిన మారుపాక అనిత, నాంపల్లి మండలం వడ్డేపల్లికి చెందిన బుషిపాక అండాలు, నల్లగొండకు చెందిన కె.సుగుణమ్మ స్వల్పంగా గాయపడ్డారు. అలాగే సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ గ్రామానికి చెందిన లావుడ్యా జానకి తలకు తీవ్రంగా గాయమైంది. త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ ఐతగాని జానయ్యకు నడుము, వెన్నుపూసకు బలమైన గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 48 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఆమరణ దీక్ష

సిర్పూర్(టి): విద్యుత్ తీగలతో అడవి పందిని హతమార్చారంటూ.. ఏడుగురిని అదుపులోకి తీసుకుని కళ్లకు గంతలు కట్టి కొట్టిన అటవీశాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని అటవీ రేంజ్ కార్యాలయం ఎదుట సోమవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీపూర్ గ్రామస్తులపై అటవీ అధికారులు కేసు నమోదు చేసి విచక్షణారహితంగా కొట్టారని ఆరోపించారు. అటవీశాఖ పీసీసీఎఫ్ ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. కర్జెల్లి రేంజ్ పరిధిలో ఆరు నెలలుగా వేలాది టేకు చెట్లు నరికి స్మగ్లింగ్ చేశారని, ఇందులో ఉన్నతాధికారుల ప్రమేయం ఉందని ఆరోపించారు. సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం, చీలపెల్లి, లక్ష్మీపూర్ గ్రామాల ప్రజల నుంచి రూ.లక్షలు వసూలు చేశారని ధ్వజమెత్తారు.


అటవీశాఖ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న హరీశ్‌బాబు

12 నుంచి ఐఏఎస్‌ల విచారణ!

- క్రాస్ ఎగ్జామినేషన్‌ను పునరుద్ధరించనున్న పీసీ ఘోష్ కమిషన్
- ఇప్పటికే రెండు విడతల్లో ఇంజనీర్లు, అధికారుల విచారణ
- మూడో విడతలో ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్‌లను ప్రశ్నించాలని నిర్ణయం
- చివరగా వచ్చే నెలలో మాజీ ప్రజాప్రతినిధుల విచారణ!
- డిసెంబర్ నెలాఖరు నాటికి సర్కారుకు నివేదిక సమర్పించే చాన్స్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లపై విచారణ చేస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈ నెల 12 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పునరుద్ధరించనున్నట్టు తెలిసింది. ఈ నెల 11న జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే నిర్వహించిన రెండు విడతల క్రాస్ ఎగ్జామినేషన్‌లో నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఈఎన్సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, బి.నాగేంద్రరావుతోపాటు పలువురు చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఇంజనీర్లను కమిషన్ ప్రశ్నించింది. మూడో విడతలో ప్రధానంగా ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను ప్రశ్నించాలని నిర్ణయించినట్టు తెలిసింది. నీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు ఎస్‌కే జోషి, రజత్‌కుమార్, ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరించిన సోమేశ్‌కుమార్, వికాస్‌రాజ్, గత ప్రభుత్వంలో సీఎం కార్యదర్శిగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పర్యవేక్షించిన స్మితా సబర్వాల్ తదితరులను కమిషన్ ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఓసారి కమిషన్ వీరికి సమన్లు జారీ చేసి విచారించింది. అఫిడవిట్ రూపంలో సమాధానాలను తీసుకుంది. ఆ అఫిడవిట్ల ఆధారంగానే క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తోంది. మొత్తానికి ఈ నెలాఖరులోగా అధికారులు, మాజీ అధికారుల విచారణను కమిషన్ ముగించే అవకాశాలు ఉన్నాయి.

డిసెంబర్ చివరి నాటికి నివేదిక!

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కీలక నిర్ణయాలు తీసుకున్న గత ప్రభుత్వ పెద్దలను పీసీ ఘోష్ కమిషన్ వచ్చే నెలలో విచారించే అవకాశాలు ఉన్నాయి. మాజీ సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావుతోపాటు ఇతర ప్రజాప్రతినిధులను విచారించవచ్చని అధికార వర్గాలు చెప్తున్నాయి. ఇంజనీర్లు, అధికారుల నుంచి క్రాస్ ఎగ్జామినేషన్‌లో సేకరించే అంశాల ఆధారంగా కేసీఆర్, హరీశ్‌రావులను విచారించాలని కమిషన్ భావిస్తున్నట్టు తెలిసింది. వచ్చే నెలలో వారికి కమిషన్ నుంచి నోటీసులు అందే అవకాశం ఉందని సమాచారం. మొత్తంగా కమిషన్ డిసెంబర్ నెలాఖరులోగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్టు తెలిసింది. మరోవైపు గత ప్రభుత్వంలో జరిగిన ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాలపై ఏర్పాటు చేసిన జస్టిస్ మదన్ బి లోకూర్ కమిషన్ గత నెలాఖరులోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.

ఇంకా గడువు పొడిగించని సర్కారు!

వాస్తవానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువు గత నెలాఖరుతోనే ముగిసింది. మరో రెండు నెలలు పొడిగించాలని ప్రతిపాదిస్తూ సీఎం కార్యాలయానికి ఫైల్ వెళ్లినా.. ఇంకా నిర్ణయం వెలువడలేదు. గడువు పొడిగింపుపై ఉత్తర్వులు వస్తే ఈ నెల 11న హైదరాబాద్‌కు వస్తానని జస్టిస్ పీసీ ఘోష్ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

ధాన్యం కొనుగోలుకు రూ. 20 వేల కోట్లు

- 7,500 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేట టౌన్: రాష్ట్రంలో ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. రైతుల నుంచి బియ్యం సేకరణకు రూ.20 వేల కోట్లను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం డీఎస్పీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. రాష్ట్రంలో 7,500 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అన్ని కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో రూ.2.2 కోట్ల మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు బియ్యం నాణ్యత పెంచామని తెలిపారు. అందరికీ సంక్రాంతి తర్వాత సన్న బియ్యం ఉచితంగా ఇస్తామన్నారు. సన్న రకం వరి సేద్యం చేసేలా రైతులకు రూ.500 బోనస్ ప్రకటించామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా ధాన్యం సేకరణకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించామని ఉత్తమ్ వెల్లడించారు.

బాధ్యతలేని కొడుక్కి గుణపాఠం

భూమి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ రద్దు ● తండ్రికి భూమి పాస్‌బుక్ అందజేత

ఎల్కతుర్తి: ఆస్తి తీసుకుని కన్నతండ్రి బాగోగులు పట్టించుకోని ఒక కొడుక్కి రెవెన్యూ అధికారులు సరైన గుణపాఠం నేర్పారు. తండ్రి ఫిర్యాదుతో కొడుక్కి చేసిన భూమి గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్ గ్రామానికి చెందిన మద్దెల రాజకొమురయ్య తనకున్న 4.12 ఎకరాల భూమిని 2018 సంవత్సరంలో కొడుకు రవికి గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే.. కొడుకు రవి పట్టించుకోకుండా తనను వదిలేయడంతో.. రాజకొమురయ్య ఫిర్యాదు మేరకు సీనియర్ సిటిజన్ యాక్టు కింద పిటిషన్ ఫైల్ చేశామని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి.. తిరిగి తండ్రికి భూమి పాస్‌బుక్ అందజేసినట్టు ఆయన వివరించారు.



కమల వికాసమా!

అమెరికాలో పోలింగ్ నేడే

ట్రంప్‌కే పట్టమా!



ఫలితాలపై సర్వత్రా అంతులేని ఉత్కంఠ ● హోరాహోరీగా తలపడ్డ హారిస్, ట్రంప్

భారత మూలాలున్న కమలా హారిస్ కొత్త చరిత్ర లిఖిస్తారా? అమెరికా అధ్యక్ష పీఠమెక్కిన తొలి మహిళగా రికార్డు సృష్టిస్తారా? లేక ఆమెతో హోరాహోరీ పోరులో పైచేయి సాధించి డొనాల్డ్ ట్రంపే రెండోసారి గద్దెనెక్కుతారా? ఈ ప్రశ్నలకు మరికొద్ది గంటల్లో సమాధానం లభించనుంది. అగ్ర రాజ్యంలో అధ్యక్ష ఎన్నికల పోరు అతి కీలక ఘట్టానికి చేరింది. మంగళవారం దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. అమెరికాకు 47వ ప్రెసిడెంట్ ఎవరన్నది రాత్రికల్లా తేలిపోయే అవకాశముంది. 60 ఏళ్ల హారిస్, 78 ఏళ్ల ట్రంప్ కొద్ది నెలలుగా నువ్వా, నేనా అన్నట్టుగా పోటీపడ్డారు. దాంతో ఇవి గత కొన్ని దశాబ్దాల్లో అత్యంత పోటాపోటీగా సాగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల పోరుగా ఇప్పటికే చరిత్ర సృష్టించాయి. ఇప్పటిదాకా వెలువడ్డ అన్ని ముందస్తు పోల్స్‌లోనూ వారిద్దరూ సమవుజ్జీలుగా ఉంటూ వచ్చారు. అయితే పోలింగ్‌కు ఒక్క రోజు ముందు సోమవారం అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఫలితాలను నిర్దేశించే కీలకమైన ఏడు స్వింగ్ రాష్ట్రాల్లో ఇప్పటిదాకా అభ్యర్థులిద్దరి మధ్యా హోరాహోరీ ఉండగా తాజాగా వాటన్నింట్లోనూ ట్రంపే ముందంజ వేసినట్టు పలు పోల్స్ తేల్చాయి. అదే సమయంలో రిపబ్లికన్ల కంచుకోటైన అయోవాలో హారిస్ పైచేయి సాధించినట్టు మరో పోల్‌లో వెల్లడవడం విశేషం. అంశాలవారీగా చూస్తే అమెరికన్లను ప్రధాన సమస్యలుగా భావిస్తున్న ఎకానమీతో పాటు అక్రమ వలసలు తదితరాల్లో తొలినుంచీ ట్రంప్‌కే స్పష్టమైన మొగ్గు కనిపిస్తోంది. అంతేగాక ప్రపంచవ్యాప్తంగా కల్లోల పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఆయనైతేనే దేశానికి గట్టి నాయకత్వం అందించగలరన్న అభిప్రాయమూ అమెరికన్లలో నెలకొంది. మరోవైపు హారిస్‌కేమో భారత, నల్లజాతి మూలాలు బాగా కలిసొచ్చేలా కనిపిస్తున్నాయి. ఆ నేపథ్యమున్న ఓటర్లంతా ఆమెకే ఓటేయడం ఖాయమంటున్నారు. దీనికి తోడు ఈసారి స్వింగ్ స్టేట్లను తోసిరాజని అధ్యక్షున్ని తేల్చడంలో నిర్ణాయకంగా మారగలదని భావిస్తున్న మహిళా ఓటర్ల మద్దతూ హారిస్‌కే ఉండటం అతి పెద్ద సానుకూలాంశం. అబార్షన్ల వంటి పలు కీలకాంశాల్లో కూడా హారిస్‌దే పైచేయిగా ఉంది. ఈ నేపథ్యంలో ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. తటస్థ ఓటర్లే ఫలితాన్ని నిర్దేశించేలా ఉన్నారు...

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఓటేసిన కమల

అధ్యక్షుడు జో బైడెన్ బాటలో హారిస్ కూడా ఈసారి ముందస్తుగా ఓటేశారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఆమె ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆదివారం డెట్రాయిట్‌లో ఈ మేరకు విలేకరులకు వెల్లడించారు. ''నేనిప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశాను. అది త్వరలో కాలిఫోర్నియా చేరనుంది. పోస్టల్ బ్యాలెట్ వ్యవస్థపై నాకు పూర్తి నమ్మకముంది'' అని తెలిపారు. మెయిల్ ఓటింగ్ వ్యవస్థను ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బైడెన్ ఇటీవలే తన స్వస్థలం డెలావెర్‌లో ముందస్తు ఓటు వేయడం తెలిసిందే.

స్వింగ్ స్టేట్లలో చివరి ప్రయత్నాలు

హారిస్, ట్రంప్ ఇద్దరూ కొద్ది రోజులుగా స్వింగ్ స్టేట్లపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. ఆది, సోమవారాల్లో ట్రంప్ పెన్సిల్వేనియా, నార్త్ కరోలినా, జార్జియాల్లో వరుస ర్యాలీల్లో పాల్గొన్నారు. ఆదివారం మిషిగన్‌లో కలియదిరిగిన హారిస్ సోమవారం పెన్సిల్వేనియాలో ర్యాలీల్లో ప్రసంగించారు.

ప్రచార నినాదాలు

హారిస్

- అమెరికన్ల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పరిరక్షణ
- రాజ్యాంగ విలువలు, మహిళల హక్కులకు రక్షణ

ట్రంప్

- దేశ ఆర్థిక పునర్నిర్మాణం
- అక్రమ వలసలకు పూర్తి అడ్డుకట్ట

పోలింగ్ వేళలు

స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 7–9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా (భారత కాలమానం ప్రకారం రాష్ట్రాలవారీగా మంగళవారం సాయంత్రం 4.30 నుంచి 9.30 మధ్య పోలింగ్ మొదలవుతుంది. బుధవారం ఉదయం దాకా కొనసాగుతుంది)

2020లో పోలింగ్ 66 శాతమే

అమెరికాలో 24 కోట్ల పై చిలుకు అర్హులైన ఓటర్లున్నారు. కానీ ఓటర్లుగా నమోదు చేసుకున్న వారు మాత్రం 16.14 కోట్ల మందే. ఇది 2020 కంటే కూడా తక్కువ. 2020లో 16.8 కోట్ల మంది నమోదైన ఓటర్లుండగా వారిలో ఆ ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో ఓటేసింది 15.9 కోట్ల మంది మాత్రమే. అంటే కేవలం 66 శాతం ఓటింగ్ నమోదైంది.

అమెరికా జనాభా	34.6 కోట్లు
అర్హులైన ఓటర్లు	23.5 కోట్ల పై చిలుకు
నమోదైన ఓటర్లు	16,14,22,000
ఇప్పటికే ఓటేసింది	7.7 కోట్ల పై చిలుకు
తొలిసారి ఓటేస్తున్నది	1.9 కోట్ల పై చిలుకు

అసలు ఎన్నిక డిసెంబర్ 16న!

విజేతను తేల్చేది ఎలక్టోరల్ ఓట్లే

అమెరికాలో అధ్యక్షున్ని ఎన్నుకునేది ఆ దేశ ఓటర్లు కాదు. ఎలక్టోరల్ కాలేజీ. అందులో 538 ఓట్లుంటాయి. వాటిలో కనీసం 270 సాధించిన వారే అధ్యక్షుడవుతారు. ఓటర్లు మంగళవారం నేరుగా ఎన్నుకునేది ఈ ఎలక్టోరల్ కాలేజీ సభ్యులనే. వారిని ఎలక్టర్లుగా పిలుస్తారు. పోలింగ్ ముగిశాక నెల పాటు వారి ఎన్నిక ప్రక్రియ సాగుతుంది. వారంతా డిసెంబర్ 16న సమావేశమై అధ్యక్షునికి, ఉపాధ్యక్షునికి ఓటేస్తారు.

జనవరి 6న ఫలితం

జనవరి 6న అమెరికా కాంగ్రెస్ సంయుక్త సమావేశం జరుగుతుంది. ఎలక్టోరల్ ఓట్లను లెక్కించి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎవరో తేలేస్తారు. సెనేట్ అధ్యక్షుని హోదాలో ఉపాధ్యక్షుడు వారి పేర్లను ప్రకటిస్తారు. జనవరి 20న (ఆ రోజు ఆదివారమైతే మర్నాడు) ప్రమాణస్వీకారం జరుగుతుంది. ఇలా ఓటింగ్ తర్వాతా ఎన్నిక ప్రక్రియ మరో రెండు నెలలు సాగుతుంది!

టై అయితే?

ట్రంప్, హారిస్ ఇద్దరిలో ఎవరికీ మెజారిటీ, అంటే కనీసం 270 ఎలక్టోరల్ ఓట్లు రాని పక్షంలో ఏం జరుగుతుందన్నది ఆసక్తికరం. అందుకు ఆస్కారం అతి తక్కువగా కనిపిస్తున్నా, ఇద్దరికీ చెరో 269 ఓట్లు వచ్చే అవకాశం లేకపోలేదు. అదే జరిగితే అధ్యక్షున్ని ఎన్నుకునే బాధ్యత అమెరికా కాంగ్రెస్‌పై పడుతుంది. దిగువ సభ అయిన ప్రతినిధుల సభ అధ్యక్షుడిని ఎన్నుకుంటుంది. ఇందుకోసం జనవరి 6న సమావేశమవుతుంది. ఒక్కో రాష్ట్రానికి ఒకటి చొప్పున 50 ఓట్లు కేటాయిస్తారు. 26, అంతకంటే ఎక్కువ ఓట్లు సాధించే వారే అధ్యక్షుడవుతారు. ఉపాధ్యక్ష ఎన్నికలో ఫలితం తేలని పక్షంలో ఎగువ సభ అయిన సెనేట్ ఉపాధ్యక్షున్ని ఎన్నుకుంటుంది. 100 సెనేట్ ఓట్లలో కనీసం 51 లేదా అంతకంటే ఎక్కువ సాధించేవారు విజేత అవుతారు. చివరిసారిగా రెండు శతాబ్దాల కింద, అంటే 1800లో ఇలాంటి పరిస్థితి తలెత్తింది. థామస్ జెఫర్సన్, ఆరన్ బ్లర్ ఇద్దరికీ సమానంగా ఓట్లు వచ్చాయి. దాంతో ప్రతినిధుల సభ ఓటింగ్‌లో జెఫర్సన్ విజేతగా నిలిచారు.

అత్యధిక ఓట్లొచ్చినా గ్యారెంటీ లేదు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో దేశవ్యాప్తంగా అత్యధిక ఓట్లు (పాపులర్ ఓట్) సాధించే అభ్యర్థి గెలుస్తారన్న గ్యారెంటీ లేదు. 2016లో డెమొక్రాట్ల అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌కు ప్రత్యర్థి ట్రంప్ కంటే 28 లక్షల పై చిలుకు ఓట్లు ఎక్కువగా వచ్చాయి. అయినా ఆమె 74 ఎలక్టోరల్ ఓట్ల తేడాతో ఓడారు. 2000లో అల్ గోర్ (డెమొక్రాట్) కూడా జార్జి డబ్ల్యు.బుష్ కంటే 5.5 లక్షల ఎక్కువ ఓట్లు సాధించినా ఓడారు. మెయిన్, నెబ్రాస్కా మినహా 48 రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విన్నర్ టేక్స్ ఆల్ విధానమే ఇందుకు కారణం. దాని ప్రకారం మెజారిటీ ఓట్లు వచ్చిన పార్టీకే ఆ రాష్ట్రంలోని ఎలక్టోరల్ ఓట్లన్నీ దక్కుతాయి.

న్యూయార్క్‌లో బెంగాలీ బ్యాలెట్లు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో న్యూయార్క్‌లో బ్యాలెట్ పేపర్లపై బెంగాలీ భాష చోటుచేసుకోవడం విశేషం. అధికారక భాషగా ఇంగ్లిష్ కాకుండా బెంగాలీతో పాటు చైనీస్, స్పానిష్, కొరియన్ భాషలకు బ్యాలెట్ పేపర్లపై చోటుదక్కింది. న్యూయార్క్‌లో బెంగాలీలతో పాటు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారి సంఖ్య అధికం. న్యూయార్క్‌లో ఏకంగా 200కు పైగా భాషలు మాట్లాడేవాళ్లు నివసిస్తుండటం విశేషం.

హారిస్ సానుకూలతలు

1. ట్రంప్ పట్ల భయాందోళనలు

అమెరికన్లలో జాతి తదితర ప్రాతిపదికలపై విభజన తెచ్చిన అధ్యక్షునిగా ట్రంప్ అప్రతిష్టపాలయ్యారు. అందరినీ కలుపుకుపోయే నేతగా పేరుండటం హారిస్‌కు కలిసొచ్చే అంశం. అందుకే ట్రంప్‌ను ఫాసిస్టుగా, ప్రజాస్వామ్యానికే ప్రమాదకారిగా హారిస్ తన ప్రచారంలో పదేపదే అభివర్ణించారు. ఆయన గెలిస్తే అమెరికన్లను మరోసారి విడదీస్తారని హెచ్చరించారు.

2. బైడెన్‌కు సమర్థ ప్రత్యామ్నాయం

డెమొక్రాట్ల అభ్యర్థిగా ఒక దశలో అధ్యక్షుడు బైడెన్ పేరు దాదాపుగా ఖరారైంది. వయోభారం, మతిమరుపు తదితర సమస్యలతో సతమతమవుతున్న ఆయన పట్ల ఓటర్లంతా పెదవి విరుస్తున్నట్టు అన్ని పోల్స్‌లోనూ స్పష్టమైంది. దాంతో ఒక దశలో డెమొక్రాట్లు గెలుపుపైనే ఆశలు వదిలేసుకున్నారు. అయితే సమయం మించిపోకుండా ఆయన్ను తప్పించి హారిస్‌ను తెరపైకి తీసుకురావడంతో పోరు ఒక్కసారిగా రసవత్తరంగా మారింది.

3. మహిళల హక్కుల యోధురాలు

మహిళల హక్కుల పరిరక్షణ విషయంలో ట్రంప్‌తో పోలిస్తే హారిస్ ఎంతో ఎత్తున నిలిచారు. ముఖ్యంగా కీలకమైన అబార్షన్ అంశంపై హారిస్‌కు మహిళల్లో ఆదరణ నానాటికీ విపరీతంగా పెరుగుతోంది. దాంతో ట్రంప్ కూడా అబార్షన్ల హక్కును వ్యతిరేకించే విషయంలో వెనక్కు తగ్గాల్సి వచ్చింది. 10 రాష్ట్రాల్లో అధ్యక్ష ఎన్నికతో పాటే అబార్షన్ హక్కులపైనా ఓటింగ్ జరుగుతోంది. ఇది హారిస్‌కు మరింత కలిసొస్తుందని చెబుతున్నారు.

4. ఓటింగ్ శాతం

ట్రంప్ అభిమానులు ఎక్కువగా గ్రామీణులు, పట్టణ శివారు ప్రాంతాల ప్రజలే. హారిస్ మద్దతుదారుల్లో జాబితాలో వృద్ధులు, విద్యాధికుల సంఖ్య ఎక్కువ. గ్రామీణులు, శివారు ప్రజలతో పోలిస్తే ప్రతి ఎన్నికలోనూ వారే అధిక సంఖ్యలో ఓటేస్తూ వస్తున్నారు. ఈ ట్రెండు హారిస్‌కు బాగా సానుకూలంగా మారేలా కనిపిస్తోంది.

5. ముమ్మర ప్రచారం, వ్యయం

అమెరికా ఎన్నికలు అత్యంత ఖర్చుతో కూడిన వ్యవహారం. ట్రంప్‌తో పోలిస్తే హారిస్ భారీగా ఎన్నికల విరాళాలు సేకరించడమే గాక ప్రచారంపై ఎక్కువ వ్యయం చేశారు. ఆలస్యంగా జూలైలో రేసులోకి వచ్చిన ఆమె, జనవరి నుంచి 11 నెలల వ్యవధిలో ట్రంప్ సేకరించిన దానికన్నా ఎక్కువ మొత్తం సేకరించడం విశేషం. ముఖ్యంగా కీలకమైన ఏడు స్వింగ్ రాష్ట్రాల్లో విరాళాల సేకరణలో హారిసే ముందున్నారు.

ట్రంప్ సానుకూలతలు

1. ప్రభుత్వ వ్యతిరేకత

అమెరికా ఓటర్లలో అత్యధికులకు ఈసారి ఎకానమీయే అతి పెద్ద సమస్యగా మారింది. నిరుద్యోగం కూడా వారిని బాగా కలవరపెడుతున్న మరో అంశం. ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దాంతో బైడెన్ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొని ఉన్న తీవ్ర వ్యతిరేకత ట్రంప్‌కు బాగా కలిసి రానుంది. ఉపాధ్యక్షురాలు హారిస్‌కు ఇది బాగా ప్రతికూలంగా మారవచ్చు. తమ ఆర్థిక స్థితిగతులు అధ్వానంగా మారాయని ఏకంగా 62 శాతం మంది అమెరికన్లు చెబుతుండటం విశేషం. 79 శాతం మంది దేశం తిరోగమన బాటలో ఉందని భావిస్తున్నారు.

2. తగ్గని ప్రజాదరణ

2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను అంగీకరించకుండా క్యాపిటల్ హిల్‌పైకి దాడులకు మద్దతుదారులను ఉసిగొల్పినా, క్రిమినల్ కేసుల్లో అభియోగాలు ఎదుర్కొన్న తొలి మాజీ అధ్యక్షుడన్న చెత్త రికార్డును మూటగట్టుకున్నా ట్రంప్‌కు జనాదరణ ఏమాత్రం తగ్గడం లేదు. ఈ ఏడాది పొడవునా కనీసం 40 శాతం, అంతకంటే ఎక్కువ మంది అమెరికన్లు ఆయనకు మద్దతు పలకడం విశేషం.

3. అక్రమ వలసలు

రెండోసారి అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టగానే అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతానన్న ట్రంప్ ప్రకటన అమెరికన్లను ఎంతగానో ఆకట్టుకుంది. ఏకంగా 10 లక్షల మందిని స్వదేశాలకు పంపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అబార్షన్లపై హారిస్ వైఖరిపైనే డెమొక్రాట్లు ఆశలు పెట్టుకోగా ట్రంప్ ప్రధానంగా అక్రమ వలసల అంశమే తనను గట్టెక్కిస్తుందని నమ్మకం పెట్టుకున్నారు.

4. సామాన్యుల దన్ను

గ్రామీణులు, డిగ్రీ కంటే తక్కువ విద్యార్హతలున్న వారు ట్రంప్‌ను మొదట్నుంచీ అభిమానిస్తూ వస్తున్నారు. వారిలో ఆయనకు ఆదరణ ఈసారి మరింత పెరిగింది. దీనికి తోడు డెమొక్రాట్ల మద్దతిచ్చే కార్మిక సంఘాలు కూడా ఈసారి ట్రంప్‌కు జై కొడుతున్నాయి. గ్రామీణ ఓటర్లు, స్వింగ్ స్టేట్లలోని పట్టణ శివారు ప్రాంత ఓటర్లు భారీగా ఓటేసేలా చూడగలిగితే ట్రంప్ విజయావకాశాలు భారీగా పెరుగుతాయి.

5. గట్టి నేతగా పేరు

అంతర్జాతీయంగా నెలకొన్న కల్లోల పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ పెద్దన్నగా అమెరికా ఆధిపత్యాన్ని పరిరక్షించగల సామర్థ్యం ట్రంప్‌కే ఉందని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. ఆయన అధ్యక్షునిగా ఉండగా ప్రపంచంలో ఎక్కడా యుద్ధాలు జరగని విషయాన్ని అభిమానులు గుర్తు చేస్తున్నారు.



రిపబ్లికన్లకు 'ఉడుత సాయం'!

న్యూయార్క్: నేడు మొదలవుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇప్పటిదాకా ట్యాక్సులు, అబార్షన్ హక్కులు, అక్రమ వలసలు ప్రధాన అంశాలుకాగా చిట్టచివర్లో ఒక ఉడుత చొరబడింది! రేబిస్ అనుమానంతో దాన్ని అధికారులు చంపేయడం చర్చనీయంగా మారింది. రిపబ్లికన్లు దీన్ని తమ ప్రచారాంశంగా మార్చుకున్నారు. బుల్లి టోపీలు, గమ్మత్తైన ట్రిక్కులతో మిఠాయిలపై గెంతుతూ ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారిన ఈ ఉడుతకు 'పీనట్' అని పేరు. న్యూయార్క్‌లో మార్క్ లాంగో అనే వ్యక్తి ఏడేళ్లుగా పెంచుతున్నాడు. దీంతోపాటు నక్కలా చిన్నగా ఉండే రఖూన్ అనే జీవినీ పెంచుతున్నాడు. ఈ వన్య ప్రాణుల పెంపకానికి అనుమతి, లైసెన్స్ తప్పనిసరి. అవి లేకపోవడంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఉడుత ఇటీవల ఒకరిని కరిచిందట. దాంతో ప్రాణాంతకర రేబిస్ వ్యాధి ప్రబలే ఆస్కారముందంటూ పీనట్, రఖూన్ రెండింటినీ గత వారం విషమిచ్చి చంపేశారు. దీన్ని రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి ట్రంప్ రన్నింగ్ మేట్ వాన్స్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్రంగా తప్పుబట్టారు. ''బైడెన్ సర్కారు నిరంకుశ పాలనకు ఇది నిదర్శనం. ప్రభుత్వం మతిలేని, దయలేని యంత్రంగా మారింది. అనాథ ఉడుతను నిర్దయగా చంపేసింది. ఇలాంటి ఉడుతలను సైతం ట్రంప్ కాపాడగలరు'' అంటూ మస్క్ పోస్ట్ చేశారు. ''6 లక్షల మంది నేరస్తులు, 13 వేల మంది హంతకులు, 16 వేల మంది రేపిస్టులు స్వేచ్ఛగా అమెరికాలోకి అడుగు పెట్టేలా చేసిన డెమొక్రటిక్ ప్రభుత్వం ఒక పెంపుడు ఉడుతను మాత్రం బతకనీయలేదు'' అంటూ వాన్స్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

ట్రంప్ వైపే కీలక స్వింగ్!

ఏడు రాష్ట్రాల్లో ఆరింట మొగ్గు

- అట్లాస్ ఇంటెల్ తాజా పోల్ వెల్లడి
- ఎన్‌వై పోల్‌లోనూ పుంజుకున్న ట్రంప్
- నాలుగింట హారిస్, ఒక్కచోట ట్రంప్
- పెన్సిల్వేనియా, మిషిగన్‌లో పోటాపోటీ

వాషింగ్టన్: ఫలితాలను తేల్చే కీలక స్వింగ్ స్టేట్స్ అయిన పెన్సిల్వేనియా, మిషిగన్, జార్జియా, నార్త్ కరోలినా, నెవడా, అరిజోనా, విస్కాన్సిన్ అనూహ్యంగా ట్రంప్ వైపు మొగ్గుతున్నాయి. మొత్తం ఏడు రాష్ట్రాల్లోనూ ఆయనే ఆధిక్యంలోకి వచ్చినట్టు అట్లాస్ ఇంటెల్ తాజా పోల్‌లో తేలడం విశేషం. నవంబర్ 1, 2 తేదీల్లో జరిగిన ఈ పోల్‌లో ట్రంప్‌కు ఓటేస్తామని 49 శాతం చెప్పారు. హారిస్‌కు జైకొట్టిన వాళ్లకంటే ఇది ఏకంగా 1.8 శాతం అధికం! అరిజోనాలోనైతే ట్రంప్ ఏకంగా 6.5 శాతం ఆధిక్యంలోకి దూసుకెళ్లారు. ఆయనకు 52.3, హారిస్ 45.8 శాతం మంది జైకొట్టారు. నెవడాలో కూడా ట్రంప్ 5.2 శాతం ఆధిక్యంలో ఉన్నారు. ఆయన నార్త్ కరోలినాలో 3.2, జార్జియాలో 2.5, పెన్సిల్వేనియాలో 1.9, మిషిగన్‌లో 1.5, విస్కాన్సిన్‌లో 1.1 శాతం ఆధిక్యంలో ఉన్నట్టు సర్వే తేల్చింది. మరో సర్వే సైతం ఏడు స్వింగ్ స్టేట్స్‌లోనూ ట్రంపే గెలిచే అవకాశముందని తెలిపింది.

అక్టోబర్ 24– నవంబర్ 2 మధ్య జరిగిన న్యూయార్క్ టైమ్స్/ సియానా కాలేజ్ పోల్ సర్వే స్వింగ్ స్టేట్స్‌లో హోరాహోరీయే సాగుతోందని పేర్కొంది. అయితే వాటిలో ఇప్పటిదాకా న్యూయార్క్ టైమ్స్ జరిపిన అన్ని పోల్స్‌లోనూ హారిస్ కనీసం 4 శాతం, అంతకుమించి స్పష్టమైన ఆధిక్యంలో ఉండగా తాజా సర్వేలో ట్రంప్ మెరుగవడం విశేషం. హారిస్ 49 శాతం ఓట్లతో ట్రంప్ కంటే కేవలం ఒక పాయింట్ ఆధిక్యంలో ఉన్నట్టు సర్వే తేల్చింది. నార్త్ కరోలినా, విస్కాన్సిన్, నెవడాల్లో హారిస్‌కు ఆధిక్యం కనబడగా అరిజోనాలో ట్రంప్ స్పష్టంగా ముందంజలో ఉన్నారు. హారిస్ నెవడాలో 3 శాతం, విస్కాన్సిన్, నార్త్ కరోలినాల్లో 2 శాతం, జార్జియాలో ఒక శాతం ఆధిక్యంలో ఉన్నారు. ఇద్దరికీ పెన్సిల్వేనియాలో 48 శాతం, మిషిగాన్‌లో 47 శాతం చొప్పున వచ్చాయి. అరిజోనాలో మాత్రం ట్రంప్ ఏకంగా 4 శాతం ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఎన్‌బీసీ న్యూస్ తాజా సర్వేలో ట్రంప్, హారిస్ ఇద్దరూ చెరో 49 శాతం ఓట్లు సాధించారు. ఎవరికి ఓటేయాలో ఇంకా తేల్చుకోలేదని సర్వేలో పాల్గొన్న వారిలో 2 శాతం మంది చెప్పారు. పోల్ ఆఫ్ పోల్స్‌లో ట్రంప్ 0.1 శాతం అతి స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు.

ఓటేసిన వారిలో హారిస్‌కు 8 శాతం ఆధిక్యం

ఏడు స్వింగ్ స్టేట్లలో ఇప్పటికే 40 శాతం మంది ఓటేశారు. వారిలో హారిస్ 8 శాతం ఆధిక్యంలో ఉన్నట్టు న్యూయార్క్ టైమ్స్ సర్వే తెలిపింది. కాకపోతే ఓటేయాల్సి ఉన్న వారిలో మాత్రం ట్రంప్ ముందంజలో ఉన్నట్టు వెల్లడించింది. పెన్సిల్వేనియాలో గట్టి పోటీ నెలకొంది. అమెరికాలో ఏడు స్వింగ్ స్టేట్స్‌ను మినహాయిస్తే మిగతావన్నీ సేఫ్ స్టేట్లే. వాటిలో ఏదో ఒక పార్టీయే నిలకడగా గెలుస్తూ వస్తోంది. వాటిని రెడ్ (రిపబ్లికన్), బ్లూ (డెమొక్రటిక్) రాష్ట్రాలుగా పేర్కొంటారు. రెడ్ స్టేట్స్ 1980 నుంచి రిపబ్లికన్లకు, బ్లూ స్టేట్స్ 1992 నుంచి డెమొక్రాట్లకు జై కొడుతూ వస్తున్నాయి. దాంతో ఏడు స్వింగ్ రాష్ట్రాల్లో పై చేయి సాధించే వారే గద్దెనెక్కడం పరిపాటి. వాటిలో రిపబ్లికన్లు, డెమొక్రాట్లు హోరాహోరీగా తలపడుతుంటారు. ఈ రాష్ట్రాల్లో సాధారణంగా గెలుపోటముల మధ్య తేడా స్వల్పంగానే ఉంటుంది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ అరిజోనాలో కేవలం 10,000 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారు.

హారిస్‌వైపు అయోవా!

పోలింగ్ తేదీ ముంచుకొచ్చిన వేళ రిపబ్లికన్లకు అనూహ్య షాక్ తగిలింది. వారికి అత్యంత సేఫ్ స్టేట్స్‌లో ఒకటైన అయోవా అనూహ్యంగా హారిస్‌వైపు మొగ్గుతున్నట్టు తాజా సర్వే ఒకటి తేల్చింది. అందులో హారిస్‌కు 47 శాతం ఓట్లు రాగా ట్రంప్‌కు 44 శాతమే దక్కాయి. మహిళలతో పాటు తటస్థ ఓటర్లు భారీగా ఆమె వైపు మొగ్గడమే ఇందుకు కారణమని డెస్ మొయినెస్ రిజిస్టర్ వార్తా పత్రిక కోసం ఈ సర్వేను నిర్వహించిన సెల్జర్ పోల్ సంస్థ వివరించింది. అమెరికాలో పోల్స్ నిర్వహణలో అత్యధిక రేటింగులున్నది ఈ సంస్థకే కావడం విశేషం. అమెరికావ్యాప్తంగా మహిళల్లో ఇదే ధోరణి ప్రతిఫలిస్తే హారిస్ భారీ మెజారిటీతో నెగ్గినా ఆశ్చర్యం లేదంటున్నారు. సెప్టెంబర్ పోల్‌లో అయోవాలో ట్రంప్ 4 శాతం ఆధిక్యంలో ఉన్నారు. జూన్‌లో బైడెన్‌పై 18 పాయింట్ల ఆధిక్యం కనబరిచారు. అయోవా పోల్ తాజా ఫలితాలను తప్పుడువంటూ ట్రంప్ కొట్టిపారేశారు.

స్వేచ్ఛకే అమెరికన్ల ఓటు

ట్రంప్ విద్వేషానికి ఓటమే: హారిస్

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ నమ్ముకున్న విద్వేషాన్ని, విభజనవాదాన్ని అమెరికన్లు ఓడించడం ఖాయమని కమలా హారిస్ ధీమా వెలిబుచ్చారు. ''స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పరిరక్షణకే ఓటేయాలని దేశమంతా పట్టుదలగా ఉంది. నెలల తరబడి దేశవ్యాప్తంగా జరిపిన ప్రచారం భాగంగా నాకిది కొట్టొచ్చినట్టు కన్పించింది'' అని చెప్పారు. కీలక స్వింగ్ రాష్ట్రాల్లో ఒకటైన మిషిగన్‌లోని డెట్రాయిట్‌లో ఎన్నికల ర్యాలీలో ఆమె ఈ మేరకు పేర్కొన్నారు. ''ఈసారి రెడ్ (రిపబ్లికన్లకు ఓటేసేవి) స్టేట్స్, బ్లూ (డెమొక్రాట్లకు ఓటేసేవి) స్టేట్స్ అంటూ విడిగా లేవు. అన్ని రాష్ట్రాలూ కలిసి చరిత్రాత్మక తీర్పు ఇవ్వనున్నాయి. మార్పు కోసం అమెరికా యువత ఈసారి భారీ సంఖ్యలో కదం తొక్కుతున్నారు. దేశ మౌలిక విలువల పరిరక్షణకు ముందుకొస్తున్నారు'' అని స్పష్టం చేశారు.

అత్యంత అవినీతిపరురాలు

హారిస్‌పై ట్రంప్ ఆరోపణలు

వాషింగ్టన్: 2020 ఎన్నికల్లో ఓటమి తర్వాత తాను వైట్‌హౌస్‌ను వీడకుండా ఉండాల్సిందని మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. డెమొక్రాట్లు తనను మోసగించి గెలిచారని ఆరోపించారు. హోరాహోరీ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా ఆది, సోమవారాల్లో ఆయన కీలక స్వింగ్ రాష్ట్రాల్లో పర్యటించారు. పెన్సిల్వేనియా, నార్త్ కరోలినా, జార్జియాల్లో పలు ర్యాలీల్లో మాట్లాడారు. '2020 ఎన్నికల్లో మనమేంటో చూపించాం. విజయం అంచుకు చేరాం. ఆ తర్వాతి పరిణామాలను ఎదుర్కోవాల్సింది. వైట్‌హౌస్‌ను వీడి ఉండాల్సింది కాదు'' అన్నారు. ''డెమొక్రాటిక్ పార్టీ ఓ రాక్షస పార్టీ. అతి పెద్ద అవినీతి యంత్రం. ఇక హారిస్ అత్యంత అవినీతిపరురాలు'' అంటూ దుయ్యబట్టారు.

కెనడాలో హిందువులపై ఖలిస్తానీల దాడి
బస్సు లోయలో పడి 36 మంది మృతి
ఇండోనేసియాలో అగ్నిపర్వతం బద్దలు
\- సాక్షి ఫ్లస్‌లో...

సాక్షి హైదరాబాద్

మంగళవారం ׀ 5 ׀ నవంబర్ ׀ 2024



డీడీ పరీక్షలకు 13 ఏళ్లు!

నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ప్రారంభమై 13 ఏళ్లు పూర్తయింది. ఇప్పటి వరకు 32 లక్షలకు పైగా వాహన చోదకులపై కేసులు నమోదయ్యాయి. -8లో



కేక్ మిక్సింగ్ షురూ..

పండుగల సీజన్‌కు స్వాగతం పలుకుతూ నగరం వేదికగా ఈ ఏడాది కేక్ మిక్సింగ్ సందడి ఘనంగా ప్రారంభమైంది. గోల్కొండ హోటల్‌లో సోమవారం సంప్రదాయ కేక్ మిక్సింగ్ వేడుకలు నిర్వహించారు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం 31.0/21.0

వాతావరణం

నగరంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. సాయంత్రం, రాత్రి వేళ చలి పెరుగుతుంది.





కార్తీక వెలుగులు

భోలక్‌పూర్ భవానీ శంకర ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా భారీ శివలింగం, త్రిశూలం రూపంలో భక్తులు దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయంలో పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - సాక్షి, సిటీబ్యూరో

హెల్మెట్ మస్ట్!

రాంగ్ సైడ్ డ్రైవింగ్ పైనా నజర్

- నేటి నుంచి సిటీలో స్పెషల్ డ్రైవ్స్
- ట్రాఫిక్ చీఫ్ పి.విశ్వప్రసాద్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో గడిచిన మూడు రోజుల్లో హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతూ ముగ్గురు వాహనచోదకులు ప్రాణాలు కోల్పోయారని సిటీ ట్రాఫిక్ చీఫ్ పి.విశ్వప్రసాద్ సోమవారం పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మంగళవారం నుంచి నగర వ్యాప్తంగా హెల్మెట్, రాంగ్ సైడ్/రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 215 మంది అశువులుబాశారన్న ఆయన...వీరిలో 100 మంది ద్విచక్ర వాహన చోదకులే అని పేర్కొన్నారు. వీరిలో 46 మంది హెల్మెట్ ధరించని కారణంగానే చనిపోయారని, హెల్మెట్ ధరిస్తే క్షతగాత్రులుగా మారే ప్రమాదం 70 శాతం, మృత్యువాతపడే ముప్పు 40 శాతం తగ్గుతుందని విశ్వప్రసాద్ వివరించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే చోదకులకు రిస్క్ మూడు రెట్లు ఎక్కువ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే నగరంలోని ద్విచక్ర వాహనచోదకులు 100 శాతం హెల్మెట్ ధరించేలా చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్న ఆయన మంగళవారం నుంచి దీంతో పాటు రాంగ్ సైడ్ డ్రైవింగ్ పైనా దృష్టి పెడుతున్నామని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించని వారికి రూ.200, రాంగ్ సైడ్/రాంగ్ రూట్ డ్రైవింగ్‌కి రూ.2 వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. నగరవాసులు సైతం తమ దృష్టికి వచ్చిన ఉల్లంఘనల్ని ట్రాఫిక్ పోలీసు అధికారిక ఫేస్‌బుక్, ఎక్స్ ఖాతాలతో పాటు హెల్ప్‌లైన్ నెం.9010203626 ద్వారా అధికారుల దృష్టికి తేవాలని కోరారు.

డిసెంబర్ 19 నుండి హైదరాబాద్ బుక్ ఫెయిర్

పంజగుట్ట: కంప్యూటర్లు వచ్చినా, ఈ బుక్స్, ఆన్‌లైన్ పరిధి ఎంత పెరిగినా పుస్తకం పేజీల వాసన చూసుకుంటూ చదివే వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉందని ఎమ్మెల్సీ, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ సొసైటీ సలహాదారు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ పోస్టర్‌ను ఫెయిర్ సలహాదారు రామచంద్రమూర్తి, ఆచార్య రమా మెల్కోటె, ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..డిసెంబర్ 19 నుండి 29 వరకు ఎన్టీఆర్ స్టేడియం గ్రౌండ్స్, కళాభారతిలో బుక్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 12 నుండి రాత్రి 9 గంటలవరకు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. పాఠకులకు వారికి నచ్చిన పుస్తకాన్ని ఎంపికచేసుకోవడమే కాకుండా రచయితలను కలుసుకోవడం, వారితో చర్చించడం చేస్తారని తెలిపారు. గతంలో 15 నుండి 20 రోజులముందు స్టాల్స్‌కు దరఖాస్తులు చేసుకునేవారని ఈ సారి అన్నిభాషల రచయితలకు, పబ్లిషర్స్‌కు, రెండు నెలల ముందుగానే లేఖలు, ఈమెయిల్స్ చేశామని తెలిపారు. 350 స్టాల్స్‌కు అన్నింటికీ సమానంగా వ్యాపారం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కేవలం ప్రింట్ మీడియా వారికే స్టాల్స్ కేటాయించేవారని ఇప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు స్టాల్స్ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, జర్నలిస్టులు, ఇతర ప్రముఖులకు వారి ఐడెంటిటీ కార్డు చూపిస్తే ఉచిత ప్రవేశం కల్పిస్తామన్నారు. బుక్‌ఫెయిర్‌లో స్టాల్స్ ఏర్పాటుకు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఫేస్‌బుక్ లైవ్‌లో డ్రాలు తీసి స్టాల్స్ కేటాయిస్తామని తెలిపారు. సమావేశంలో కోశాధికారి నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కె.బాల్‌రెడ్డి, శోభన్ బాబు, జాయింట్ సెక్రటరీలు కె.సురేష్, ఎం.సూరిబాబు, ఈసీ సభ్యులు జనార్దన్ గుప్త, విజయరావు, మధుకర్, కోటేశ్వరరావు, శ్రీకాంత్, శ్రీనివాసరావు, సాంబశివరావు, స్వరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 'మీ సేవ' నిర్వాహకులకు కమీషన్ పెంచుతాం: మంత్రి శ్రీధర్‌బాబు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తున్న 'మీ సేవ' కేంద్రాల నిర్వాహకులకు శాస్త్రీయ బద్ధంగా త్వరలో కమీషన్‌ను పెంచుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం ఆర్టీసీ కల్యాణ మండపంలో తెలంగాణ మీ సేవ ఫెడరేషన్ 14వ వార్షికోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కొత్త సర్వీసులను మీ సేవలకు అదనంగా చేర్చుతామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అవినీతి లేకుండా త్వరితగతిన పౌర సేవలు అందించడానికి 'మీ సేవ' ను ప్రారంభించామని అన్నారు. త్వరలో మీ సేవా వెల్ఫేర్ బోర్డును కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య భద్రతకు సంబంధించిన అంశాన్ని కూడా పరిశీలిస్తామని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిర్వాహకుల ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తామని అన్నారు. పౌరులకు ఇబ్బంది కలగకుండా సేవలను సులభంగా అందించాలని సూచించారు. సాంకేతిక లోపం వల్ల కొంత మందికి రుణమాఫీ చేయలేకపోయామని, దాన్ని సవరించి మిగతావారికి కూడా రుణమాఫీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీఎస్ చైర్మన్ మన్నె సతీష్ కుమార్, ఈఎస్‌డీ (మీ సేవా) తెలంగాణ ప్రభుత్వం కమిషనర్ రవికిరణ్, డిప్యూటీ డైరెక్టర్లు టి.విజయ భాస్కర్ గౌడ్, జి.వరలక్ష్మి, తెలంగాణ మీసేవా ఫెడరేషన్ అధ్యక్షుడు బైర శంకర్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ మోహిద్, కోశాధికారి కె.శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారు రాయల ఉదయ్‌కుమార్, కర్రా శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

రేపటి నుంచి ఇంటింటి సర్వే

రంగంలోకి 18 వేల మంది ఎన్యూమరేటర్లు

- పొరపాట్లకు తావులేకుండా శిక్షణ కార్యక్రమాలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ మహానగరంలో పదేళ్ల తర్వాత సమగ్ర కుటుంబ సర్వేకు జీహెచ్ఎంసీ దాదాపుగా ఏర్పాట్లు పూర్తిచేసింది. బుధవారం (6వ తేదీ) నుంచి ప్రారంభం కానున్న ఈ సర్వేలో భాగంగా ప్రతి ఇంటిలోని సభ్యులందరి వివరాలు సేకరించనున్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి వంటి వివరాలతోపాటు కుటుంబీకులెవరైనా రాజకీయాల్లో ఉంటే ఆవివరాలు సైతం ప్రత్యేకంగా సేకరించనున్నారు. కులం, మతం వివరాలను సైతం సేకరించనున్నారు. ఇలా ప్రతి కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించేందుకు దాదాపు 18 వేల మంది ఎన్యూమరేటర్లు పనిచేయనున్నారు. ఒక్కో ఎన్యూమరేటర్ దాదాపు 150 ఇళ్లను సర్వే చేయాల్సి ఉంటుంది. ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించి ఎన్యూమరేటర్లకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. తమ బ్లాక్‌లోని కుటుంబాలను గుర్తించి ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తారు. వీరికి పైస్థాయిలో దాదాపు 1800 మంది సూపర్‌వైజర్లుగా బాధ్యతలు నిర్వహించనున్నారు. తమ పరిధిలోని ఎన్యూమరేటర్లకు అవసరమైన సూచనలివ్వడంతో పాటు ఎక్కడైనా ఏవైనా ఇబ్బందులెదురైతే పరిష్కరిస్తారు. వీరు సైతం దాదాపు 10 శాతం కుటుంబాలను ర్యాండమ్‌గా తనిఖీ చేసి.. సర్వే సవ్యంగా జరిగిందీ లేనిదీ పరిశీలిస్తారు. ఇప్పటికే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు సర్కిళ్ల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్‌సైతం ఒక సర్కిల్‌లో శిక్షణసందర్భంగా తగిన సలహాలిచ్చారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తగిన రిహార్సల్స్‌తో సర్వే చేయాలన్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికీ సర్వే జరిగినట్లుగా స్టిక్కర్లు అంటిస్తారు.

కోటి మందికి పైగా..

సర్వేలో భాగంగా గ్రేటర్ నగరంలో ఉన్న దాదాపు కోటిమందికి పైగా ప్రజల వివరాలు సేకరించనున్నారు. 2014లో నిర్వహించిన సర్వేలో 20 లక్షలకు పైగా కుటుంబాలున్నట్లు లెక్క తేలింది. ప్రస్తుతం ఇవి దాదాపు 25 లక్షలకు చేరి ఉంటాయని అంచనా. అందుకనుగుణంగా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరాన్ని బట్టి ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లను పెంచుతారు. సర్వే ద్వారా ప్రజల సామాజిక, ఆర్థిక వివరాలు తెలిసి.. ప్రభుత్వం తగిన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశముంటుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సర్వే కోసం ఎన్నో వివరాలు..

సర్వేలో భాగంగా కుటుంబ యజమానితో పాటు సభ్యులందరి వివరాలు..యజమానితో వారికున్న సంబంధం..సభ్యులందరి విద్యార్హతలు, ఉద్యోగం లేదా ఉపాధి వివరాలు, మాతృభాష ఏది ? ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఏవైనా సంక్షేమ ఫలాలు పొందారా.. అద్దె ఇల్లా, సొంతిల్లా, ఉంటున్న ఇంటికి ఉచిత విద్యుత్ సదుపాయం పొందుతున్నారా ? వంటి వివరాలు సైతం సేకరించనున్నారు. ఇక స్థిరాస్తిలో భాగంగా భూములు, ఇళ్ల వంటి వివరాలతోపాటు చరాస్తి వివరాల్లో భాగంగా ద్విచక్రవాహనాలతో పాటు కంప్యూటర్లు వాడుతుంటే ఆ వివరాలు సైతం సేకరించనున్నట్లు సమాచారం.

హైడ్రాకు అన్ని శాఖల

సహకారం అవసరం

అప్పుడు మాత్రమే అనుకున్న లక్ష్యాలు సాధ్యం

- అభిప్రాయపడిన పర్యావరణవేత్త పురుషోత్తం రెడ్డి
- హైడ్రా కార్యాలయంలో ఏవీ రంగనాథ్‌తో భేటీ



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని జలవనరుల పరిరక్షణ, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ కోసం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) చేస్తున్న కృషిని ప్రముఖ పర్యావరణవేత్త కె.పురుషోత్తంరెడ్డి కొనియాడారు. అయితే ఈ విభాగం అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే అన్ని శాఖల సహకారం అవసరమని పేర్కొన్నారు. సోమవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో గొలుసుకట్టు చెరువులు, కాలువల పరిరక్షణ, పునరుద్ధరణకు తక్కువ ఖర్చుతో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పీసీబీ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ సహా ప్రభుత్వ శాఖలన్నీ సహకరించినప్పుడు హైడ్రా లక్ష్యాలు చేరుకోవడం సులభం అవుతుందని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా హైడ్రా వచ్చిన తర్వాత చెరువులు, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్, క్యాచ్‌మెంట్ ఏరియా తదితర అంశాలను సామాన్యులు సైతం తెలుసుకుంటున్నారని, ఓ స్థలాన్నో, ఇంటినో ఖరీదు చేసే ముందు ఇవన్నీ సరిచూసుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అర్బనైజేషన్ వేగంగా అవుతోందని, ఈ తరుణంలో పట్టణాలు ఎలా ఉండాలి? పర్యావరణాన్ని కాపాడడం ఎలా? పీసీబీ ఎలా పని చేయాలి? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పట్టణీకరణ విధానాన్ని రూపొందించాల్సిన ఆవశ్యకత ఉందని పురుషోత్తంరెడ్డి స్పష్టం చేశారు. ఇలాంటి స్పష్టమైన విధానాలు, చట్టాల అమలు జరిగినప్పుడే భవిష్యత్ తరాలకు మెరుగైన జీవనప్రమాణాలను అందింగలమని స్పష్టం చేశారు. హైడ్రా కేవలం చెరువుల పరిరక్షణే కాకుండా కాలుష్య కారణాల పైనా దృష్టి పెట్టాలని పురుషోత్తం రెడ్డి అన్నారు. చెరువుకు నీరు ఎలా వస్తోంది? ఆ చెరువు నిండిన తర్వాత నీరు ఎటు వెళ్లాలి అనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటే నగరంలో వర్షాకాలం వరదలు, ఎండాకాలం భూగర్భ జలాలు అడుగంటడం వంటి సమస్యలు ఉండవని స్పష్టం చేశారు. జహీరాబాద్‌లోని కోహిర్ మండలం గొట్టిగారిపల్లెలో చెరువులను పరిరక్షించుకునే ఉత్తమ విధానాలు అవలంబించారన్న పురుషోత్తంరెడ్డి... ఒకప్పుడు ఎలాంటి నీటి వనరులు లేని ఆ గ్రామంలో ఇప్పుడు మూడు పంటలు పండుతున్నాయని, అక్కడ చెరువుల పరిరక్షణ తీరును పరిశీలించాలని రంగనాథ్‌కు సూచించారు. ప్రభుత్వ విభాగాలతో పాటు పర్యావరణ ప్రేమికులు, నగర అభివృద్ధిని ఆకాంక్షించే యువతతో సమావేశాలు ఏర్పాటు చేసి హైడ్రా లక్ష్య సాధనలో వారందరినీ భాగస్వాముల్ని చేయాలని సూచించారు.

ఎయిర్‌టెక్‌కు జీపీఎస్!

యంత్రాల వినియోగంలో అవినీతికి అడ్డుకట్ట

- జలమండలి దిద్దుబాటు చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, సిటీబ్యూరో: ఎయిర్ టెక్ యంత్రాల పనితీరుపై పూర్తి స్థాయి పర్యవేక్షణ కోసం సరికొత్త టెక్నాలజీతో జీపీఎస్ ట్రాకింగ్‌కు జలమండలి సిద్ధమైంది. సోమవారం సాక్షిలో 'ఎయిర్‌టెక్.. అవినీతి హైటెక్' అనే శీర్షికతో వచ్చిన కథనానికి జలమండలి స్పందించింది. అక్రమ తంతును తీవ్రంగా పరిగణించి కట్టడి చర్యలు చేపట్టింది. జెట్టింగ్, ఎయిర్‌టెక్ వాహనాలకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్)తో ట్రాకింగ్‌తో పాటు యంత్రం పనితీరు (సీవరేజీ పైప్‌లైన్‌లో ఎన్ని మీటర్లు పనిచేసిన వివరాలు)సైతం గుర్తించే విధంగా తక్షణమే టెండర్లు ఆహ్వానించి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షకులు కస్టమర్ కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులకు కాకుండా ఇతర ప్రైవేటు కాల్స్‌కు హాజరైతే చర్యల తప్పవని హెచ్చరించారు. తాజాగా సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన జీపీఎస్ ట్రాకింగ్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఎయిర్ టెక్ మిషన్ల అక్రమతంతు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడనుంది. నిబంధనల ప్రకారం ప్రతి ఎయిర్ టెక్ యంత్రం రోజూ 500 మీటర్లు శుభ్రం చేయాలి. అయితే క్షేత్ర స్థాయిలో అధికారులు, కాంట్రాక్టర్లు మిలాఖత్ కారణంగా పూడికతీత లెక్కింపు కూడా అశాస్త్రీయంగా జరుగుతోంది. ఒక మ్యాన్‌హోల్‌లో పేరుకున్న పూడిక తీస్తే.. దానిని మ్యాన్‌హోల్ నుంచి మ్యాన్‌హోల్ వరకు క్లీనింగ్ చేసినట్లు లాగ్ పుస్తకాల్లో తప్పుడు సమాచారం నమోదు చేయడం సర్వసాధారణమైంది. జలమండలి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఒక కారణమైతే.. కొందరు వారితో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని తప్పుడు లెక్కలతో జలమండలి ఖజానాకు గండి కొడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన జలమండలి పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు సిద్ధమైంది.

అన్ని ఆలయాల్లో దీపోత్సవం


- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- కీసరగుట్టలో ప్రత్యేక పూజలు




కీసర: అతి పవిత్రమైన కార్తీక మాసం సందర్భంగా తెలంగాణలోని అన్ని దేవాలయాల్లో సామూహిక దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కార్తీక మాసం మొదటి సోమవారం పురస్కరించుకొని కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి సన్నిధిలో నిర్వహించిన మహాలింగదీపోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శైలజ రామయ్యర్, పీఠాధిపతులు మాధవానంద సరస్వతి స్వామితో కలిసి మహాలింగ దీపోత్సవం వెలిగించారు. భక్తులకు మట్టి ప్రమిదలు నూనె, వత్తులు, పసుపు, కుంకుమ కిట్టును ఉచితంగా అందజేశారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆలయాలపై శ్రద్ధ పెట్టలేదని, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యాదగిరిగుట్టతో పాటు తెలంగాణలోని అన్ని దేవాలయాల అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కీసరగుట్ట అభివృద్ధి కోసం కుడా ప్రత్యేక దృష్టి సారించామని, అభివృద్ధి పనుల కోసం డీపీఆర్‌ను కుడా సిద్ధం చేస్తున్నామన్నారు. కీసరగుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. కేంద్రం నుండి వచ్చే ప్రతి రూపాయిని సద్వినియోగం చేసుకోనున్నట్లు స్పష్టం చేశారు. అంతకుముందు గర్భాలయంలో కొలువైన మూలవిరాట్ (శివలింగం) శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామికి నిర్వహించిన మహాన్యాస పూర్వక రుద్రాభిషేకంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం ఆమెకు పట్టువస్త్రాలు, ప్రసాదాలు, వేదపండితుల ఆశీర్వాదాలు అందచేశారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కీసర ఆర్డీవో సైదులు, టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యో అజయ్!

- పాఠశాలలో గేటు మీదపడి ఆరేళ్ల బాలుడి దుర్మరణం
- హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఘటన



అజయ్ మృతదేహం



విరిగిన పడిన పాఠశాల గేటు

లింగోజిగూడ: పాఠశాల ముగియడంతో ఆడుతూ పాడుతూ ఇంటికి వెళ్దామని బయలుదేరిన ఓ చిన్నారిని..ఆ పాఠశాల గేటు కబళించింది. ఇనుప గేటు మీద పడడంతో ఆ చిన్నారి తీవ్రంగా గాయపడి మృత్యువాత పడ్డాడు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలో నివాసం ఉండే అలకంటి చందు కుమారుడు అజయ్ (6) హయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. సోమవారం పాఠశాల ముగిసిన అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి వెళ్లే ముందు..సరదాగా ఉన్నత పాఠశాల ప్రధాన గేటు ఎక్కి స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా ఒక్కసారిగా గేటు విరిగి అజయ్‌పై పడింది. దీంతో అజయ్ తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే పలు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. అయినా ఫలితం లేకపోవడంతో చివరకు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అజయ్ సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో మృతి చెందాడు. అజయ్ తండ్రి చందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



స్తంభించిన మెట్రో సేవలు

సాంకేతిక సమస్యలతో నిలిచిన సర్వీసులు

- నాగోల్–రాయదుర్గం మధ్య రాకపోకలకు అంతరాయం
- తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సోమవారం పలు మెట్రో సర్వీసులు స్తంభించాయి. అనూహ్యంగా తలెత్తిన సాంకేతిక సమస్యల వల్ల ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 11 గంటల మధ్య నాగోల్–రాయదుర్గం రూట్‌లో క్లాంప్స్ ట్రిప్ కావడంతో మెట్రో సర్వీసులు నిలిచిపోయాయి.

దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ రూట్‌లో నెలకొన్న సాంకేతిక సమస్య ప్రభావం వల్ల ఎల్‌బీ నగర్–మియాపూర్ కారిడార్‌లోనూ రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఇటు ఎల్‌బీనగర్ నుంచి అటు నాగోల్ నుంచి అమీర్‌పేట్‌కు చేరుకొనేందుకు ప్రయాణికులు పడిగాపులు కాయవలసి వచ్చింది. ఉదయం ఆఫీసులకు వెళ్లవలసిన ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, వివిధ రంగాల్లో పనిచేసే ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు అమీర్‌పేట్, బేగంపేట్, రాయదుర్గం, హైటెక్ సిటీ, తదితర స్టేషన్‌లలో చిక్కుకుపోయారు. విద్యార్థులు కూడా సకాలంలో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లలేకపోయారు. 11 గంటల సమయంలో క్లాంప్స్‌ను పునరుద్ధరించారు. అనంతరం మూడు కారిడార్‌లలో మెట్రో సేవలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. మరోవైపు తరచుగా ఇలా ఎక్కడో సాంకేతిక సమస్యలు తలెత్తి రైళ్లు నిలిచిపోవడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా ఉండగా, కేవలం 15 నిమిషాల్లో సాంకేతిక సమస్యలను పరిష్కరించి రైళ్లను పునరుద్ధరించినట్లు మెట్రో అధికారులు తెలిపారు.

నూతన విద్యా విధానంలో మాతృభాషకు ప్రాధాన్యం

- వృత్తి విద్యను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంలో మాతృభాషలకు ప్రాధాన్యం ఇస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం సీతాఫల్‌మండీ, జామై ఉస్మానియా ప్రభుత్వ పాఠశాలకు అటల్ బిహారీ వాజ్‌పాయ్ (ఏబీవీ) ఆధ్వర్యంలో భారత్ డైనమిక్ లిమిటెడ్ (బీడీఎల్) సంస్థ తరఫున సీఎస్ఆర్‌లో భాగంగా విద్యార్థులకు టేబుళ్లు, మరుగుదొడ్లను శుభ్రరిచే యంత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 33 ఏళ్ల అనంతరం ప్రవేశ పెట్టిన నూతన విద్యావిధానంలో భాగంగా వివిధ కోర్సుల్లోని అంశాలను విద్యార్థులు క్షుణంగా అర్థం చేసుకునేందుకు ఆయా రాష్ట్రాలకు చెందిన మాతృభాషల్లో బోధనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మరాఠీ, గుజరాతీ, ఒరియ, మలయాళం తదితర భాషల్లో ఉన్నత విద్యాబోధన, పరిశోధనలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వస్తే హై స్కూల్ స్థాయి నుంచి వృత్తి కోర్సులను ప్రవేశ పెట్టేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. నిరుద్యోగ సమస్యకు వృత్తివిద్య కోర్సులే శాశ్వత పరిష్కారమని ఆయన పేర్కొన్నారు.

నేనూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివా...!

దేశంలో అత్యధిక శాతం మంది ప్రభుత్వ పాఠశాల్లోనే చదవుతున్నారని తాను కూడా ప్రభుత్వ పాఠశాల విద్యార్థినేనని కిషన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశానికి పట్టుకొమ్మలని రాబోయే తరాల కోసం వాటిని పటిష్టం చేయాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హత గల టీచర్లు ఉంటారని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత వారి పై ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హాక్-2024 పోస్టర్ ఆవిష్కరణ

- రేపు ది పార్క్ హోటల్‌లో సదస్సు..



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్సీ), నగర పోలీసు విభాగం సంయుక్తంగా నిర్వహిస్తున్న సైబర్ సెక్యూరిటీ వార్షిక సమ్మిట్ (హాక్)-2024 పోస్టర్‌ను నగర కొత్వాల్ సీవీ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు. బుధవారం జరుగనున్న ఈ సదస్సుకు సోమాజిగూడలోని ది పార్క్ హోటల్ వేదిక కానుంది. ఇందులో వివిధ పరిశ్రమ నిపుణులు, ప్రభుత్వ అధికారులతో పాటు మేధావులు, నేతలు సైతం పాల్గొనున్నారు. సైబర్ భద్రత అనేది పోలీసుల ఒక్కరి బాధ్యత మాత్రమే కాదన్న ఆనంద్.. ఈ శిఖరాగ్ర సమావేశం ద్వారా ప్రతి పౌరుడు డిజిటల్ భద్రతకు సంరక్షకుడిగా మారడానికి దోహదపడుతుందన్నారు. ఈ సదస్సులో సైబర్ భద్రతలో ఏఐ పాత్రపై ప్యానెల్ చర్చ, డిజిటల్ భద్రతపై ప్రముఖులు, నాయకులతో చర్చలు, సైబర్ సెక్యూరిటీ సాధనాల ప్రదర్శనలు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, ఆ పరిశ్రమల ప్రముఖులు, ప్రభుత్వ అధికారులతో నెట్‌వర్కింగ్ అవకాశాలపై చర్చలు ఉంటాయని ఆనంద్ వివరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు హాజరుకానున్నట్లు తెలిపారు.

డీడీ పరీక్షలకు 13 ఏళ్లు!

నగరంలో 2011 నుంచి డ్రంకన్ డ్రైవింగ్‌పై ఉక్కుపాదం

- ఆ ఏడాది నవంబర్ 4న మొదలైన స్పెషల్ డ్రైవ్స్
- ఆర్ఎస్-10 ప్రాజెక్టు కింద అందిన ఉపకరణాలతో మరూ
- ఇప్పటి వరకు 32 లక్షల వాహన చోదకులపై కేసులు నమోదు
- మందుబాబులు చెల్లించిన జరిమానా మొత్తం రూ.67.36 కోట్లు



సాక్షి, సిటీబ్యూరో: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలకు సంబంధించిన డ్రంక్ డ్రైవింగ్ తనిఖీలు హైదరాబాద్‌లో ప్రారంభమై 13 ఏళ్లు పూర్తయింది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌ఓ) చేపట్టిన రోడ్ సేఫ్టీ ఇన్ టెన్ కంట్రీస్ (ఆర్ఎస్-10) ప్రాజెక్టుతో లభించిన ఉపకరణాలతో 2011 నవంబర్ 4న నగరంలో ఈ స్పెషల్ డ్రైవ్స్ మొదలయ్యాయి. ఇప్పటి వరకు 32 లక్షలకు పైగా వాహనచోదకులపై కేసులు నమోదు కాగా... వారు జరిమానా రూపంలో చెల్లించిన మొత్తం రూ.67.36 కోట్లుగా ఉంది. నగరంలో 'డీడీ స్పెషల్ డ్రైవ్స్' ప్రారంభానికి ఆద్యుడు నాటి ట్రాఫిక్ చీఫ్, నేటి సిటీ పోలీసు చీఫ్ సీవీ ఆనంద్ కావడం గమనార్హం.

వైద్యుడి సర్టిఫికెట్ అవసరం లేకుండా...

ట్రాఫిక్ పోలీసులు ఈ డ్రైవ్‌ను మోటారు వెహికల్ యాక్ట్‌లోని సెక్షన్ల ప్రకారం నిర్వహిస్తారు. మద్యం తాగి చిక్కిన వారిని కోర్టుకు తీసుకెళ్లాలంటే సెక్షన్ 185 ప్రకారం బుక్ చేసి, ఆధారాలతో వెళ్లడం అవసరం. చట్ట ప్రకారం ప్రతి 100 మిల్లీలీటర్ల రక్తంలో 30 మిల్లీగ్రాములు, అంతకంటే ఎక్కువ మద్యం ఉంటేనే చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీనిని బీఏసీ కౌంట్ అంటారు. అప్పటి వరకు అందుబాటులో ఉన్న బ్రెత్ ఎనలైజర్లు కేవలం మద్యం తాగి ఉన్నాడా? లేదా? అనేదే చెప్పగలిగేవి. అయితే ఎంత ప్రమాణం అని నిర్ధారించలేకపోయేవి. దానికోసం వైద్య పరీక్షలు, డాక్టర్ సర్టిఫికెట్ తదితరాలు అవసరమయ్యేవి. అంత సమయం, సిబ్బంది లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు 'నిషా' చరులను సైతం ర్యాష్ డ్రైవింగ్ (సెక్షన్ 184 బి) కిందే నమోదు చేసి ఫైన్‌తో సరిపెట్టే వారు.

డబ్ల్యూహెచ్‌ఓ ఆర్ఎస్-10 ప్రాజెక్టు...

ఏటా రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండటాన్ని సీరియస్‌గా తీసుకున్న డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ రోడ్ సేఫ్టీ పార్ట్‌నర్‌షిప్ (జీఆర్ఎస్పీ) పేరిట అధ్యయనం చేపట్టింది. అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న 10 దేశాలను గుర్తించడంతో పాటు వాటి నివారణకు ఆర్ఎస్-10 పేరుతో ప్రాజెక్టు చేపట్టింది. ఆయా దేశాల్లో కొన్ని నగరాలను ఎంపిక చేసుకుని ప్రమాదాల నివారణకు అసరమైన ఉపకరణాలు అందించడంతో పాటు సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలు ఇచ్చింది.

సీవీ ఆనంద్ చొరవతో సిటీలో...

ఈ ప్రాజెక్టులో భాగంగా తొలుత పంజాబ్‌లోని జలంధర్ నగరాన్ని డబ్ల్యూహెచ్‌ఓ ఎంపిక చేసుకుంది. అప్పట్లో నగర అదనపు సీపీగా (ట్రాఫిక్) పని చేస్తున్న సీవీ ఆనంద్ రోడ్డు ప్రమాదాల నిరోధం, ట్రాఫిక్ ఇక్కట్లు తప్పించడానికి అనేక ప్రయోగాలు చేశారు. వీటివల్ల వచ్చిన ఫలితాలు ప్రపంచ ఆరోగ్య సంస్థను ఆకర్షించాయి. దీంతో ఆర్ఎస్-10 ప్రాజెక్టును హైదరాబాద్‌లోనూ ప్రారంభించాలని డబ్ల్యూహెచ్‌ఓ నిర్ణయించింది. ఆ ప్రాజెక్టు కింద లభించిన ఉపకరణాలు, డబ్ల్యూహెచ్‌ఓ ఎన్‌ఫోర్స్‌మెంట్ ట్రైనర్ డెస్ మయర్స్ ఇచ్చిన శిక్షణతో 2011 నవంబర్ 4 నుంచి డ్రంక్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్స్ మొదలు కావడంతో పాటు 'నిషా' చరుల్ని కోర్టుకు తరలించడం సాధ్యమైంది. జలంధర్‌లో డీడీ స్పెషల్ డ్రైవ్స్ కేవలం మూడు నెలలే సాగాయి. అయితే ఆనంద్ రూపొందించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ) కారణంగా ఇక్కడ 13 ఏళ్లుగా నిరాటంకంగా సాగుతున్నాయి.



అవి కోర్టుకు ఆధారాలయ్యాయి...

ఆర్ఎస్-10 ప్రాజెక్టు కింద వచ్చిన బ్రీత్ ఎనలైజర్లు, ఆ తర్వాత ఖరీదు చేసినవి బీఏసీ కౌంట్‌ను ప్రింట్ అవుట్ రూపంలో ఇస్తున్నాయి. ఇవి కోర్టులో ఆధారంగా పని చేస్తున్నాయి. దీంతో డ్రైవ్‌లో మద్యం తాగి వాహనం నడుపుతూ చిక్కిన వారి వాహనాన్ని అప్పటికప్పుడే సీజ్ చేస్తున్నారు. చోదకుడిని మాత్రం మరుసటి రోజు కౌన్సెలింగ్ ఇచ్చి, కోర్టులో హాజరుపరుస్తున్నారు. వీటి ఆధారంగా న్యాయస్థానం రూ.2100 జరిమానా విధించడం మొదలుపెట్టింది. వాహనచోదకుడు తాగిన మద్యం మోతాదు, నడిపిన వాహనం తదితరాలను పరిగణలోకి తీసుకున్న కోర్టులు జైలు శిక్షలు వేయడం మొదలెట్టాయి. నగరంలో తొలిసారిగా 2012 మే 4న ఓ వ్యక్తిని మూడు రోజుల జైలు శిక్ష పడింది. పదేపదే మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కిన వారి డ్రైవింగ్ లైసెన్సులు సస్పెండ్, క్యాన్సిల్ కూడా అవుతున్నాయి.

రూ.1.22 కోట్లు లాస్... రూ.1.05 కోట్లు రీఫండ్!

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో రూ.1.22 కోట్లు నష్టపోయి సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. తక్షణం స్పందించిన అధికారులు నేరగాళ్ల ఖాతాల నుంచి రూ.1.05 కోట్లు వెనక్కు రప్పించారు. కోర్టు అనుమతితో సోమవారం ఆ మొత్తం బాధితుడి ఖాతాలోకి చేరింది. సైబర్ నేరగాళ్ల బారినపడి ట్రేడింగ్‌లో భారీ లాభాలు వస్తాయనంటూ నమ్మిన బాధితుడు రూ.1,22,26,205 విడతల వారీగా సైబర్ నేరగాళ్లకు చెల్లించాడు. అప్పటి వరకు భారీ లాభాలు చూపిస్తూ వచ్చిన నేరగాళ్లు ఆపై హఠాత్తుగా స్పందించడం మానేశారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ ఠాణాను ఆశ్రయించాడు. ఏసీపీ చాంద్ బాషా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ కె.మధుసూదన్ తక్షణం స్పందించి నేరగాళ్ల ఖాతాలను గుర్తించారు. వాటిని ఫ్రీజ్ చేయాల్సిందిగా బ్యాంకు అధికారులకు లేఖలు రాశారు. అప్పటికే నేరగాళ్లు రూ.17,26,205 డ్రా చేసుకోగా... మిగిలిన రూ.1,05,00,000 ఫ్రీజ్ అయ్యాయి. ఈ విషయం కోర్టు దృష్టికి తీసుకువెళ్లిన పోలీసులు ఆ మొత్తం బాధితుడికి అందించడానికి అనుమతి పొందారు. ఈ ఉత్తర్వుల్ని బ్యాంకు అధికారులకు పంపించడం ద్వారా ఆ మొత్తం బాధితుడి ఖాతాలోకి బదిలీ చేయించారు. ఇదిలా ఉండగా... సోమవారం సైబర్ క్రైమ్ ఠాణాను మరో బాధితుడు ఆశ్రయించాడు. రిటైర్డ్ ఉద్యోగి అయిన ఈయన ట్రేడింగ్‌లోనే రూ.50 లక్షలు నష్టపోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

మెహిదీపట్నం డిప్యూటీ కమిషనర్‌గా సురేందర్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మెహిదీపట్నం నూతన డిప్యూటీ కమిషనర్‌గా సురేందర్ రెడ్డి, మూసాపేట డిప్యూటీ కమిషనర్‌గా వంశీకృష్ణను నియమిస్తున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా వారి పోస్టింగులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను సోమవారం జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (పరిపాలన) జారీ చేశారు.

పదేళ్లలో మైనారిటీ కార్పొరేషన్ నిర్వీర్యం..!

ఈసారి బడ్జెట్‌లో మైనారిటీ సంక్షేమానికి పెద్దపీట

- స్కిల్ డెవలప్‌మెంట్ కింద యువతకు శిక్షణ
- కుట్టుశిక్షణ కేంద్రాలకు గురుకుల యూనిఫాం ఆర్డర్లు
- మూసీ నిర్వాసితులకు ఆర్థిక సహాయం
- త్వరలో మైనారిటీ మహిళలకు 10 వేల కుట్టు మిషన్ల పంపిణీ
- మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్


తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైందని ఆ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఒబెదుల్లా కొత్వాల్ అన్నారు. కేవలం అసెంబ్లీ ఎన్నికల ముందు తాయిలాలుగా రూ. లక్ష సబ్సిడీ రుణాలు అందించి చేతులు దులుపుకుందన్నారు. సోమవారం హైదరాబాద్ హజ్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ఏటా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు ఘనంగా జరిగినా.. విడుదల మాత్రం పదేళ్లలో రూ.334 కోట్లు మించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రూ. 3000 కోట్లు కేటాయించిందని, కార్పొరేషన్ కోటా కింద రూ.432. కోట్లు వాటా దక్కనుందన్నారు. ఇప్పటికే రెండు విడతల కోటా విడుదయ్యిందన్నారు. మొత్తం కోటాలో సుమారు రూ.250 కోట్లు సబ్సిడీ రుణాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కింద ఐటీ సెక్టార్‌లో యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

కుట్టుశిక్షణ కేంద్రాలకు గురుకులాల యూనిఫాం ఆర్డర్లు

వచ్చే విద్యా సంవత్సరం నుంచి మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలల విద్యార్థుల యూనిఫాం ఆర్డర్లను కుట్టు కేంద్రాలకు అప్పగించనున్నట్లు ఒబెదుల్లా కొత్వాల్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీ కార్పొరేషన్ సహకారంతో 13 కుట్టుశిక్షణ కేంద్రాలు కొనసాగుతున్నాయని, మరిన్ని కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో కేంద్రాలకు కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ, ఓవర్ లాక్ మెషీన్‌లను అందించడంతోపాటు ఒక్కో యూనిఫాం రేటును రూ.75ల నుండి రూ.100కు పెంచుతున్నామన్నారు. కుట్టు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు ఎన్జీఓలను కూడా ఆహ్వానిస్తున్నామని, అయితే ప్రతి బ్యాచ్‌లో 80 శాతం ఉపాధి కల్పిస్తేనే నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో నిరుపేద మహిళలకు 10 వేల కుట్టుశిక్షణ మిషన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

మూసీ నిర్వాసితులకు ఆర్థిక చేయూత

మూసీ పరివాహక నిర్వాసితులకు ఉపాధి కోసం ఆర్థిక చేయూత అందించే విధంగా ప్రణాళిక రూపొందించామని ఒబెదుల్లా వెల్లడించారు. అంతకు ముందుకు తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ 7వ వార్షిక సర్వసభ్య సమావేశం చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశంలో కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కాంతి వెస్లీ, ఆర్థిక శాఖ ఆదనపు కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

నాలెడ్జి సిటీలో బైక్ రేస్

53 బైక్‌లు స్వాధీనం

గచ్చిబౌలి: ఐటీ కారిడార్‌లోని నాలెడ్జి సిటీలోని టీ-హబ్ సమీపంలో బైక్ రేస్‌ల పరంపర కొనసాగుతోంది. కేసులు నమోదు చేస్తున్నా పట్టించుకోకుండా యువకులు బైక్‌పై ప్రమాదకర స్థాయిలో స్టంట్‌లు చేయడం ఆందోళన కల్గిస్తోంది. శనివారం రాత్రి బైక్‌పై స్టంట్‌లు చేస్తున్నట్లు సమాచారం అందడంతో రాయదుర్గం పోలీసులు టీ-హబ్ పరిసరాలను దిగ్బంధం చేశారు. పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు 53 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 125 ప్రకారం కేసులు నమోదు చేశారు. గత మూడు రోజులుగా 89 బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. ఇప్పటి వరకు 203 బైక్‌లు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు.

8న దిశ సమావేశం

సాక్షి, సిటీబ్యూరో: జిల్లా డెవలప్‌మెంట్ కో ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశం ఈ నెల 8న బేగంపేట్ హోటల్ ది ప్లాజా (తెలంగాణ టూరిజం) గ్రీన్ ల్యాండ్స్ లో జరుగనుంది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సమావేశానికి అధికారులు తమ విభాగాల సమగ్ర నివేదికలతో హాజరుకావాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు

కులగణన సమగ్ర సర్వేకు టీచర్ల సేవలు!

- 6 నుంచి మూడురోజుల పాటు ఇంటింటికీ స్టిక్కర్లు
- మధ్యాహ్నం ఒంటి గంట వరకే ప్రైమరీ పాఠశాలలు
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 800 బ్లాక్‌లుగా విభజన
- ఒక్కో ఎన్యుమరేటర్ 175 ఇళ్లను కవర్ చేసేలా ప్రణాళికలు

ఖైరతాబాద్‌లో 165 మంది టీచర్లకు శిక్షణ



ఖైరతాబాద్ నియోజకవర్గం ప్రైమరీ టీచర్లకు కుల గణనపై శిక్షణ ఇస్తున్న సర్కిల్-17 డీసీ రజనీకాంత్‌రెడ్డి



శిక్షణలో టీచర్ ఎన్యుమరేటర్లు

బంజారాహిల్స్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కులగణన ఇంటింటి సమగ్ర సర్వేకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న సామాజిక, విద్య, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని సోమాజీగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలో 800 మంది సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఇందులో ప్రధానంగా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రైమరీ స్కూల్ టీచర్లు, హెడ్‌మాస్టర్లు ఉండబోతున్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 800 మంది ఎన్యుమరేటర్లకు గాను 165 మంది టీచర్లు ఎన్యుమరేటర్లుగా సర్వేలో పాల్గొననున్నారు. వీరందరికీ సోమవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-3లోని సుల్తాన్ ఉల్ ఉలుమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆడిటోరియంలో శిక్షణ ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్-17 డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్యుమరేటర్లకు కులగణన ఇంటింటి సమగ్ర సర్వే ప్రశ్నావళిని ఎలా భర్తీ చేయాలో శిక్షణ ఇచ్చారు. సర్వేలో పాల్గొనే టీచర్లకు ఇప్పటికే విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6 నుంచి మూడువారాల పాటు కులగణన సమగ్ర సర్వే నిర్వహించనున్నారు. సర్వేలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు ఎంఆర్‌ఎసీ సిబ్బంది, ఎయిడెడ్ నాన్ టీచింగ్ సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నారు. దీంతోపాటు అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది, రీసోర్స్ పర్సన్స్ కూడా సర్వేలో పాల్గొంటారు. పాఠశాలల్లో బోధనకు ఇబ్బంది కలగకుండా ప్రణాళికలు రూపొందించారు.

మధ్యాహ్నం వరకే స్కూళ్లు..

ఇంటింటి సర్వేలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొననుండడంతో అందుకు తగినట్లుగా స్కూల్ టైమింగ్స్ మార్చారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే కొనసాగనున్నాయి. పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించి ఇంటికి పంపించనున్నారు. ఆ తర్వాత ఎంపి ఎస్‌జీటీలను ఈ సర్వే నుంచి మినహాయించారు.

ఇంటింటికీ స్టిక్కర్లు..

సమగ్ర సర్వేలో భాగంగా ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో ఇళ్ల లెక్కలు తీస్తున్నారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజులపాటు మొదటి దశలో ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఇంటి యజమాని పేరు రాసుకుని ఆ ఇంటి నెంబర్‌ను నమోదు చేసుకుంటారు. ఆ తర్వాత ఆ ఇంటికి వెళ్లినట్లుగా స్టిక్కర్ కూడా అంటిస్తారు. రెండో దశలో 75 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళి ఫారంతో ప్రతి ఇంటికి వెళ్లి కుల గణన వివరాలను సేకరిస్తారు. ఈ నెల 9 నుంచి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ప్రశ్నావళిని పూరిస్తారు. ఒక్కో ఎన్యుమరేటర్‌గా సుమారు 175 ఇళ్లను కవర్ చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఇందు కోసం 800 బ్లాక్‌లను రూపొందించి ఒక్కో బ్లాక్‌లో 175 ఇళ్లు వచ్చేవిధంగా ప్రణాళిక రూపొందించి ఆ మేరకు ఒక్కో బ్లాక్‌కు ఒక్కో ఎన్యుమరేటర్‌ను నియమించారు. వీరిపై పర్యవేక్షకులుగా 35 మంది సూపర్‌వైజర్ ఆఫీసర్లను నియమించారు. ఒక్కో సూపర్‌వైజర్ ఆఫీసర్ కింద 10 నుంచి 12 మంది ఎన్యుమరేటర్లు ఉండేవిధంగా టైంటేబుల్ రూపొందించామని డీసీ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. సర్వేలో అడగాల్సిన ప్రశ్నలు, చేయాల్సిన తీరు, ఇంటి నెంబర్లు ఎలా నమోదు చేసుకోవాలి తదితర వివరాలన్నీ శిక్షణలో తెలియజేశామని తెలిపారు.

కులగణనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సహకరించాలి

బాబా ఫసియుద్దీన్



రహమత్‌నగర్ (బోరబండ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న కులగణన కార్యక్రమంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పాల్గొని, అధికారులకు సహాయ సహకారాలు అందించాలని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఇచ్చిన వాగ్దానం మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో కులగణన చేపడుతున్నారని గుర్తుచేశారు. ఇందులో భాగంగా ఈ నెల 6 నుంచి బస్తీలకు వచ్చే అధికారులు, సిబ్బందికి ఆయా బస్తీలకు చెందిన కాంగ్రెస్ నాయకులు తమ పూర్తి సహాయ సహకారాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ నాయకుడు తన బాధ్యతగా భావించాలని కోరారు. బోరబండ డివిజన్‌లో జరిగే కులగణన కార్యక్రమంలో తాను సైతం పాల్గొని సిబ్బందికి సహకరి స్తానని హామీ ఇచ్చారు. కులగణన వల్ల జనాభా ప్రాతిపదికన రావాల్సిన ప్రతిఫలాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. కులగణన వల్ల ప్రజలకు ఏలాంటి వ్యక్తిగత నష్టం వాటిల్లదని స్పష్టం చేశారు. కొంతమంది ప్రతిపక్ష పార్టీల నాయకులు కార్యక్రమంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వాటిని ప్రజలు పట్టించుకోవద్దని సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన బీసీ నేతలు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బీసీ నేతలు

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై బీసీ సంఘాల నేతలు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర సచివాలయంలో కలిసి అభినందించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు విషయంలో ప్రభుత్వ ఆలోచన పట్ల ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం



రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్‌లోని సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు బర్మవత్ రమేశ్ నాయక్, రాజునాయక్‌లు మాట్లాడుతూ ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని భక్తుల సహకారంతో ఆలయంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని వివరించారు. ఇప్పటికే ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. తాజాగా ఆవరణలో బండలు వేయించి సుందరంగా తీర్చదిద్దనున్నట్లు వారు తెలిపారు. ఈ ప్రాంతంలో అతిపెద్ద దేవాలయంగా గుర్తింపు పొందిన ఈ దేవాలయ అభివృద్ధికి ప్రతి భక్తుడు సహకరించాలని వారు కోరారు.

ట్రాఫిక్ విధుల్లో హైడ్రా సిబ్బంది

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలు



బంజారాహిల్స్: ట్రాఫిక్ నియంత్రణలో హైడ్రా సేవలను వినియోగించుకుంటున్నారు. రెండు రోజులనుంచి ట్రాఫిక్ వెస్ట్‌జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో హైడ్రా సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో పాల్గొంటున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలోని ప్రధాన కూడళ్లు అయిన మైత్రీవనం, పంజగుట్ట, ఖైరతాబాద్, విరించి హాస్పిటల్, అగ్రసేన్ చౌరస్తా, జూబ్లీహిల్స్ చౌరస్తా, సాగర్ సొసైటీ చౌరస్తా, శ్రీనగర్ కాలనీ టీ-జంక్షన్, కేబీఆర్ పార్కు చౌరస్తా, సీవీఆర్ చౌరస్తా, జర్నలిస్టు కాలనీ చౌరస్తాల్లో వీరిని ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా ట్రాఫిక్ విధుల్లో తీసుకుంటున్నారు. వెస్ట్‌జోన్‌కు 18 మంది హైడ్రా సిబ్బందిని ట్రాఫిక్ నియంత్రణ కోసం కేటాయించారు. వీరు అన్ని చౌరస్తాల్లో స్టాప్‌లైన్లు దాటకుండా వాహనదారులను అప్రమత్తం చేస్తారు. అదేవిధంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తే వారికి అవగాహన కూడా కలిగిస్తారు. మొదటి దశలో ఆ చౌరస్తాల్లో ఉండే ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ విధులు, నిబంధనల ఉల్లంఘనలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. చౌరస్తాల్లో యూటర్న్‌లు బ్లాక్ కాకుండా వీరు చూస్తుంటారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించడం చేస్తారని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంగళరావునగర్ : అమీర్‌పేట, బంజారానగర్ 11 కేవీ ఫీడర్లు, మైత్రీవనం, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మతుల వల్ల మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వ రకు ఆర్‌ఎస్ బ్రదర్స్, కాకతీయ మెస్, అమీర్‌పేట, దుర్గానగర్, బంజారానగర్, ఎస్‌ఆర్‌టీనగర్, వినాయకనగర్, శివాజీనగర్, ఆర్‌కెనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ సోమవారం తెలిపారు. అదేవిధంగా ఆనంద్‌బాగ్, రామారావునగర్ 11 కెవీ ఫీడర్లు, మైత్రీవనం, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల అంతరాయం ఉంటుందని తెలిపారు

ముమ్మరంగా వ్యర్థాల తొలగింపు

ఫిలింనగర్: 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మురుగు నీటి కాల్వల శుద్ధి కార్యక్రమాన్ని జలమండలి అధికారులు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ప్రతి సెక్షన్‌లోని బస్తీలు, కాలనీలు అన్ని తేడా లేకుండా ప్రతి రోజూ ఎంపిక చేసిన మురుగునీటి పైపులైన్‌ల్లో పూర్తిగా వ్యర్థాలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. మురుగునీటి కాల్వల నుంచి తొలగించిన వ్యర్థాలను వెంటనే సిల్ట్ క్యాటరింగ్ వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు జలమండలి జీఎం హరిశంకర్ తెలిపారు. యంత్ర పరికరాలు, జెట్టింగ్ మిషన్లతో లోతైన మ్యాన్‌హోళ్లలో సైతం వ్యర్థాల తొలగింపు జరుగుతుందని ఆయన తెలిపారు.



వ్యర్థాలు తొలగిస్తున్న జలమండలి సిబ్బంది

కాంగ్రెస్ నేతల ప్రత్యేక సమావేశం



మట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపడుతున్న నేపథ్యంలో అన్ని కులాల ప్రతినిధులు, నేతలు, విద్యార్థులు, మేధావులతో కలిసి వాస్తవాలను తెలుసుకోవడానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విచ్చేయనున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రముఖులు సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో జరిగే కార్యక్రమానికి రాహుల్‌గాంధీ రానున్న దృష్ట్యా ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంటా మల్లేష్‌కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న మల్లేష్ తదితరులు

శ్రీనగర్‌కాలనీ: మోతీనగర్‌కు చెందిన ప్రముఖ సోషల్ వర్కర్ గంటా మల్లేష్‌కు హానరరీ డాక్టరేట్ సోషల్ సర్వీస్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఎక్సలెన్స్ అవార్డులు లభించాయి. గాడ్సన్ హోలీ స్పిరిట్ మినిస్ట్రీస్, గాడ్సన్ హోలీ థియోలాజికల్ అకాడమీ సంయుక్తంగా డే స్ప్రింగ్ థియలాజికల్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో సోమవారం అబిడ్స్‌లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి ఈ సంస్థలు అవార్డులను అందించాయి. ఇందులో భాగంగా గంటా మల్లేష్‌కు అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సినీ యాక్టర్లు బాబూమోహన్, ఆర్.దొరస్వామి, ఆర్చ్ బిషప్ ఎం.వీ. ప్రసాద్, అబ్దుల్ రెహమాన్, స్టీఫెన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

హాష్ ఆయిల్ విక్రయదారుల అరెస్ట్

వెంగళరావునగర్: హాష్ ఆయిల్‌ను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం .. ఎస్‌ఆర్‌నగర్ మెట్రోస్టేషన్ సమీపంలో కొంతమంది హాష్ ఆయిల్ విక్రయిస్తున్నట్టుగా మధురానగర్ పీఎస్‌కు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతాలో పోలీసులు నిఘా ఉంచి అక్కడ అనుమానితులుగా ఉన్న అతుల్, సాయిరామ్, సచిన్‌గౌడ్‌లను అదుపులోకి తీసుకోగా వారి వద్ద 20 హాష్ ఆయిల్ బాటిళ్లు లభించాయి. దీంతో బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియామకం



వర్ధమాన్ మోహనచారి

బంజారాహిల్స్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కమిటీలో ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ బస్తీకి చెందిన ఉద్యమకారులకు సమున్నత స్థానం కల్పించారు. ఫోరం గ్రేటర్ హైదరాబాద్ సెక్రటరీగా ఎంజీనగర్ బస్తీకి చెందిన వర్ధమాన్ మోహన్‌చారి, జూబ్లీహిల్స్ కో-కన్వీనర్‌గా జి.హనుమంతుగౌడ్‌ను నియమించారు. ఈ మేరకు ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్ వీరిద్దరికి నియామక పత్రాలు అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం ఈ ఫోరం పనిచేస్తుంది. తెలంగాణ ఉద్యమంలో తమ సేవలను గుర్తించి పదవులు ఇచ్చినందుకు వీరిద్దరూ ఆనందం వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎంపిక



మాట్లాడుతున్న వల్లకాటి రాజ్‌కుమార్ తదితరులు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నేతలు బుర్ర మల్లేశం, వేముల బాలరాజ్, అప్పం శ్రీనివాస్, రుద్ర శ్రీనివాస్‌లతో కలిసి ఆయన నూతన కార్యవర్గ వివరాలను వెల్లడించారు. అధ్యక్షులుగా వల్లకాటి రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా బుర్ర మల్లేశం, వేముల బాలరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్స్‌గా మచ్చ సుధాకర్, వేముల వెంకన్న, అసోసియేట్ ప్రెసిడెంట్స్‌గా స్వర్గం లక్ష్మీనర్సయ్య, చంద మల్లేష్, రుద్ర శ్రీనివాస్, దూస శివ శంకర్, సీతావైద్యం కిషోర్, ప్రధాన కార్యదర్శిగా అప్పం శ్రీనివాస్, అడ్వయిజర్‌లుగా గోశికే యాదగిరి, మ్యాడం బాబురావుతోపాటు పలువురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరితో పాటు మరో 14 మంది ఉపాధ్యక్షులు, ఒక ఆఫీస్ జనరల్ సెక్రెటరీని, 4 జాయింట్ జనరల్ సెక్రెటరీలను, ఒక కోశాధికారిని, 14 మంది కార్యదర్శులు, ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, 4 మీడియా కార్యదర్శులు, 7మంది కార్యనిర్వాహక కార్యదర్శులు, ముగ్గురు కార్యవర్గ సభ్యులతోపాటు ఐదుగురు బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కమిటీ ప్రతినిధులుగా నియమించామని పేర్కొన్నారు.

కారు కండీషన్‌పై లేఖ రాయనున్న పోలీసులు



బంజారాహిల్స్: భార్యతో గొడవపడి అర్ధరాత్రి ఖరీదైన పోర్షే కారులో చక్కర్లు కొడుతూ మితిమీరిన వేగంతో దూసుకెళ్ళి రోడ్డు ప్రమాదానికి కారకుడైన వ్యాపారి, స్టాండప్ కమేడీయన్ ఉత్సవ్ దీక్షిత్‌ను ఇప్పటికే బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేయగా ప్రమాదానికి కారణమైన పోర్షేకారు కండీషన్ తెలియజేయాల్సిందిగా జర్మనీ కంపెనీకి బంజారాహిల్స్ పోలీసులు లేఖ రాయనున్నారు. ఇప్పటికే లేఖను సిద్ధం చేసిన పోలీసులు నేడో, రేపో ఈ కారు కండీషన్ తెలియజేయాల్సిందిగా కోరనున్నారు. ఈ కారు మరమ్మతులకు వచ్చిందని మూడునెలల క్రితమే సర్వీస్‌కు తేవాలని చెప్పామని రోడ్లపైకి తీసుకెళ్ళవద్దని హెచ్చరించడం కూడా జరిగిందని షోరూం ప్రతినిధులు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదేదీ పట్టని ఉత్సవ్ దీక్షిత్ మూడునెలల నుంచి కారును నడిపిస్తూనే ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వేగంతో కారును నడపడంతో మూల మలుపు వద్ద కారు స్టీరింగ్‌కు లాక్ పడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు కూడా ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో కారు కండీషన్‌లో ఉందా లేదా తేల్చాల్సిందిగా పోర్షే కంపెనీకి లేఖ రాయాలని నిర్ణయించారు. సంబంధిత కంపెనీ నుంచి నిపుణులు వచ్చి కారు కండీషన్‌పై నివేదిక ఇచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయించారు.

ఫోన్ తీసుకొని పారిపోయే యత్నం

దొంగను పట్టించిన యువకుడు

వెంగళరావునగర్: ఫోన్ మాట్లాడాలని తీసుకుని పారిపోతున్న దొంగను ఓ యువకుడు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన మధురానగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఓ యువకుడు సోమవారం తెల్లవారుజామున మైత్రీవనం వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలో ఇరువురు యువకులు అక్కడకు వచ్చి అతనిని ఫోన్ చేసుకోవాలని మొబైల్ అడిగారు. వెంటనే ఆ ఫోన్‌తో ద్విచక్ర వాహనంపై పారిపోవాలని ప్రయత్నించగా వెంటనే స్పందించిన యువకుడు ఆ దొంగను పట్టుకుని మధురానగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగను విచారణ చేయగా ఒకరి పేరు నవీన్, మరో యువకుడి పేరు రోహన్ అని చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిటకిటలాడిన శివాలయాలు











బంజారాహిల్స్: కార్తీక మాసంలో తొలి సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తజనంతో కిక్కిరిసిపోయాయి. కార్తీక మాసం అంటేనే మహా శివుడికి అభిషేకంతో పాటు దీపారాధన చేస్తారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు శివాలయాలకు దీపారాధన చేసేందుకు పెద్దఎత్తున విచ్చేశారు. ఫిలింనగర్ దైవసన్నిధానం, శ్రీనగర్‌కాలనీ శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయాల్లో స్వామివారికి విశేష అభిషేకంతో పాటు సాయంత్రం నిర్వహించిన ఆకాశ దీపోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

యువకుడిపై పోక్సో కేసు నమోదు

కాచిగూడ: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికకు మాయ మాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజ్‌గిరి ప్రాంతానికి చెందిన పవన్ (22) చికెన్ సెంటర్‌లో పనిచేస్తుంటాడు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన డిగ్రీ చదువుతున్న బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి వారంరోజుల క్రితం తనతో తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పవన్‌పై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు పవన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మైనర్ బాలికను భరోసా సెంటర్‌కు తరలించారు. డీఎస్‌ఐ వెంకటేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సదర్ ఉత్సవాల్లో 22 సెల్‌ఫోన్లు చోరీ

కాచిగూడ: నారాయణగూడ చౌరస్తాలో జరిగిన సదర్ వేడుకల్లో 22 సెల్‌ఫోన్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. సదర్ ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన ప్రజలు దున్నరాజుల విన్యాసాలను మైమరచి చూస్తుండగా ఇదే అదనుగా భావించిన దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించి సెల్‌ఫోన్లను దొంగిలించారు. బాధితులు ఆదివారం, సోమవారం నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఐ నాగార్జున, డీఎస్‌ఐ వెంకటేష్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

రికార్డు స్థాయిలో టర్నోవర్



చెక్కు అందజేస్తున్న ఈసీఐఎల్ సీఎండీ అనురాగ్‌కుమార్

కుషాయిగూడ: నగరంలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.3,100 కోట్ల రికార్డు స్థాయి టర్నోవర్ సాధించింది. ఈ మేరకు 2023–24కు డిపార్టుమెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ చెల్లించాల్సిన డివిడెండ్ రూ.157.51 కోట్ల చెక్కును ఈసీఐఎల్ సీఎండీ అనురాగ్ కుమార్, డీఏఈ సెక్రటరీ, ఏఈసీ చైర్మన్ డాక్టర్ ఏకే.మొహంతికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఈసీఐఎల్ ఉద్యోగులు సాధించిన టర్నోవర్‌పై హర్షం వ్యక్తం చేసి వారిని అభినందించారు. డీఏఈ డైరెక్టర్ అంజలి సిన్హా, ఈడీ జ్యోషి, డైరెక్టర్ ఫైనాన్స్ రాజేంద్రకుమార్ ఫరఖ్ తదితరులు పాల్గొన్నారు.

మిధానిలో ముగిసిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



సంతోష్‌నగర్: మిశ్రా ధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని)లో వారం రోజులుగా నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. గత నెల 28వ తేదీన ప్రారంభమైన ఈ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. మిధాని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఝా పాల్గొని విజిలెన్స్ ఇన్ హౌస్ మ్యాగజైన్ జాగృతిని విడుదల చేశారు. వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ తమ వ్యక్తిగత, వృత్తి జీవితంలో అత్యంత సమగ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.గౌరీ శంకర్, ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ టి.ముత్తు కుమార్, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వరల్డ్ రికార్డుకు సన్నద్ధమవుతున్న శ్రీచైతన్య



శ్రీచైతన్య అకడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన

లక్డీకాపూల్: గణితంలో బాలమేధావుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేసేందుకు సంకల్పించి ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శ్రీచైతన్య విద్యాసంస్థ సన్నద్ధమవుతోందని ఆ సంస్థ అకడమిక్ డైరెక్టర్ సీమ బొప్పన తెలిపారు. యూకేతో కలిసి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించే దిశగా శ్రీచైనత్య ప్రయత్నిస్తోందన్నారు. పది వేల మంది విద్యార్థులు 600 మ్యాథ్స్ ఫార్ములాలు ఏకకాలంలో పఠనం చేయనున్నారని చెప్పారు. ఏఐఈఈఈ, నీట్, ఒలింపియాడ్ వంటి జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో నంబర్–1 ర్యాంకులు సాధిస్తూ విద్యారంగంలో అగ్రగామిగా ప్రపంచ రికార్డులను సైతం సాధించి ఇప్పుడు సరికొత్త ప్రపంచ రికార్డ్‌ను సాధించేందుకు సమాయత్తం అవుతోందన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్య అందిస్తూ అనేక రికార్డులను సాధించి ఎన్నో మైలురాళ్లను అధిగమించిందన్నారు. గతేడాది 2023 మంది విద్యార్థులు 1 నుంచి 100 వరకు గుణకార పట్టికలను వంద నిమిషాల్లో పఠించడం శ్రీచైతన్య వంద రోజుల అంకితభావంతో కూడిన శిక్షణకు నిదర్శనం అన్నారు.

అభయ కేసులో సత్వరమే విచారణ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పశ్చిమబెంగాల్ ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో డాక్టర్ అభయ కేసులో సీబీఐ సత్వరమే విచారణ పూర్తిచేసి దోషులను కఠినంగా శిక్షించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో మహిళా సంఘాల ఐక్యకార్యాచరణ తెలంగాణ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం జరిగింది. పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ పి.సంధ్య, జి.ఝాన్సీ, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, డాక్టర్ ప్రతిభాలక్ష్మి మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్ అభయపై లైంగికదాడి, హత్య జరిగి 85 రోజులు పూర్తయినా విచారణ పూర్తి కాకపోవడం బాధాకరమన్నారు. అభయ పోస్టుమార్టం నివేదిక ఒక్కరి వల్ల జరిగిన విషయం కాదని స్పష్టంగా అర్థమవుతున్నా కోల్‌కత్తా పోలీసులు ఒక వ్యక్తినే బాధ్యుడిని చేశారని విమర్శించారు. సత్వరమే విచారణ పూర్తి చేసి దోషులకు కఠిన శిక్షలు పడేలా చూడాలన్నారు. టీయూసీఐ నాయకులు ఎస్ఎల్ పద్మ, ఐఎఫ్‌టీయూ నాయకులు జి.అనురాధ, పీవోడబ్ల్యూ నగర కార్యదర్శి వరలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ, వివిధ సంఘాల నేతలు జ్యోతి, కొండవీటి సత్యవతి, లక్ష్మీబాయి, శ్రీదేవి, భారతి, నిర్మల పాల్గొన్నారు.



శివలింగాల వద్ద భక్తుల పూజలు



గర్భాలయంలో స్వామివారి పూజలో ఆలయ చైర్మన్ నాగలింగం తదితరులు



స్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరుడికి

కార్తీక పూజలు

కీసర: కార్తీకమాస పూజా కార్యక్రమాల్లో భాగంగా మొదటి సోమవారం కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వర స్వామికి అర్చకులు, విశేష పూజలు నిర్వహించారు. గర్భాలయంలో కొలువుదీరిన స్వామివారికి(శివలింగం) సోమవారం ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం నానావిధ ఫలరసాభిషేకం పూజ నిర్వహించారు. మరో పక్క కార్తీకమాసం సోమవారం రోజున శివుడిని దర్శించుకుంటే మంచి జరుగుతుందన్న నమ్మకంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారు జాము నుంచే బారులుతీరారు. స్వామివారి దర్శనానంతరం యాగశాల మండపం వద్ద కార్తీక దీపాలు వెలిగించడంతో పాటు కీసర గుట్ట ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లోని శివలింగాలకు పాలు, పెరుగు తదితర పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం వరకు సుమారు 150 మంది భక్తులు గర్భాలయంలో అభిషేకాల్లో పాల్గొన్నట్లు ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

డబుల్ ఇళ్ల పట్టాలు సిద్ధం చేయండి

ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సాక్షి, సిటీబ్యూరో: రెండు పడకల గదుల ఇళ్లతో పాటు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ దరఖాస్తులు, రెవెన్యూ అంశాల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రెవెన్యూ డివిజన్ల వారీగా రెవెన్యూ అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడకల ఇళ్లు, కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సికింద్రాబాద్ పరిధిలోని జమునానగర్, తార్నాకలో అర్హులైన పేదలకు ఇళ్లు అందించే దిశగా రెండు పడకల ఇళ్ల పట్టాలను సిద్ధం చేసి అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి నివాస, మరణ ధ్రువీకరణ పత్రాలు సత్వరమే అందించాలని సూచించారు. అధికారులు, సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలాల వారీగా సంబంధిత తహసీల్దార్లతో పెండింగ్ రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్వో వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరామ్, తహసీల్దార్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెయింటెనెన్స్ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలోని వయోవృద్ధులు తమ ఆస్తి, మెయింటెనెన్స్‌కు సంబంధించిన సమస్యలను వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సీనియర్ సిటిజన్స్ తమ ఆస్తి, మెయింటెనెన్స్ సమస్యలకు సంబంధించిన కేసుల నమోదుకు tgseniorcitizens.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

సర్వేలో డోర్ సర్వీసెస్‌ను చేర్చడం హర్షణీయం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ పరిస్థితులపై సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో డోర్ సర్వీసెస్(స్విగ్గీ, జొమాటో డెలివరీ బాయ్స్, కొరియర్), రవాణా రంగం(ఓలా, ఉబెర్ డ్రైవర్లు, క్లీనర్లు, మెకానిక్‌లు, బస్సు, ట్యాక్సీ సర్వీసులు) సిబ్బందిని కూడా చేర్చడంపై తెలంగాణ గిగ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. డిమాండ్లను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభకు వైకల్యం అడ్డు కాదు

- రాష్ట్ర డీజీపీ జితేందర్

అంబర్‌పేట: ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు. సోమవారం ఇన్‌క్రెడిబుల్ ఇండియా ప్రాజెక్ట్ సంస్థ సహకారంతో డెవలప్‌మెంట్ ఆసోసియేషన్ ఆఫ్ బ్లైండ్ తెలంగాణ, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో బ్లైండ్ చాలెంజర్స్ క్రికెట్ టోర్నమెంట్ 2024 అంబర్‌పేట జలమండలి క్రికెట్ స్టేడియంలో నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ జితేందర్ ట్రోఫీలను ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేశారు. కొద్ది సేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌క్రెడిబుల్ ఇండియా ప్రాజెక్ట్ సంస్థ డైరెక్టర్ రాహుల్‌రావు, తెలంగాణ డిసెబిలిటీస్ విభాగం కమిషనర్ డి.శైలజ, శ్రీశైలంతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.



అంధుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డీజీపీ జితేందర్

మూసీ బాధితులకు అండగా ఉంటాం



- అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

పంజగుట్ట: మూసీనది సుందరీకరణ, ప్రక్షాళన పేరుతో మూసీ బాధితులను రోడ్డున పడేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని అఖిలపక్ష పార్టీ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో మూసీ బాధితుల సమస్యలు, పరిష్కారానికి అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశాన్ని సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బీఆర్ఎస్ స్పోక్స్ పర్సన్ దాసోజు శ్రవణ్ కుమార్ హాజరై మాట్లాడారు. మూసీ ప్రాజెక్టు పేరుతో పేదల ఇళ్లు కూలుస్తామంటే సహించేదిలేదని, వారికి శాశ్వత పునరావాసం చూపిన తర్వాతే పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. మూసీ పరివాహిక బాధితులకు తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని, వారి తరఫున పోరాటం చేసేందుకు ముందుంటామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రతినిధి కె.గోవర్ధన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరుతో అందరిలో భయం సృష్టించి, మూసీ సుందరీకరణ పేరుతో 300 మంది నిరుపేదల ఇళ్లు కూల్చి, వేలాది ఇళ్లకు ఎరుపురంగు పూసి మూసీ పరివాహక ప్రాంత ప్రజల్లో భయం నింపిందన్నారు. మూసీనది ప్రక్షాళన, సుందరీకరణకు ఎవరూ వ్యతిరేకం కాదని, కానీ ప్రాజెక్టు చేపట్టేముందు అఖిలపక్ష నేతలు, పర్యావరణ, శాస్త్రవేత్తలు, మేదావులతో చర్చించి విధివిధానాలు ప్రకటించాలని, కానీ ఎవరినీ సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక, ప్రాజెక్టుకు ఎంత ఖర్చు అవుతుంది, ఎక్కడ నుంచి తెస్తారు అన్ని విషయాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, సంఘాల నాయకులు కావ్య, కృష్ణయాదవ్, సయ్యిద్ మతీన్ అహ్మద్, సజయ, శ్రీశైలం, వర్గీస్, బుర్ర రాముగౌడ్, అన్సారి తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ మినిస్టర్స్ కప్‌లో యోగాసన పోటీని చేర్చండి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లాస్థాయిలో త్వరలో నిర్వహించే చీఫ్ మినిస్టర్స్ క్రీడా పోటీల్లో యోగాసన పోటీని కూడా చేర్చాలని తెలంగాణ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యోగాసన భారత్ నేషనల్ జాయింట్ సెక్రెటరీ నందనం కృపాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్‌ను టీవైఎస్ఏ బృందం సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. అన్ని కీడలను ప్రోత్సహిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు. క్రీడలతో ఆరోగ్య అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇది ఎప్పుడూ కొనసాగించాల్సిన ప్రక్రియ అని ఆయన అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన యోగాకు రాష్ట్రస్థాయిలో కూడా ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇచ్చి ఈ పోటీల్లో తప్పనిసరిగా చేర్చాల్సిందిగా వారు కోరారు. రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ యోగా రామిరెడ్డి, సూర్యప్రకాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు ఎవరికి చెప్పుకోవాలి..?

- మ్యారేజ్, బర్త్, డెత్ ధ్రువీకరణ పత్రాలకు తిప్పలు
- ఇంటి నిర్మాణం, నల్లా అనుమతులకూ అంతే..
- ఆయా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు

పురపాలక సంఘాల విలీన గ్రామాల్లో ఇక్కట్లు



సాక్షి, సిటీబ్యూరో: అవుటర్ రింగ్ రోడ్ లోపలి పురపాలక సంఘాల్లో విలీనమైన గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల సర్టిఫికెట్లు(ధ్రువీకరణ పత్రాలు) పొందడానికి ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. బర్త్, డెత్, మ్యారేజ్ సర్టిఫికెట్లతో సహా ఇంటి అనుమతులు, ఇంటి నంబర్లు, మ్యూటేషన్లు, నల్లా అనుమతులు తదితర వాటి కోసం స్థానిక ప్రజలు రెండు నెలలుగా సంబంధిత కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకునే వారే లేరని ఆందోళన చెందుతున్నారు. విలీనమైన పురపాలక సంఘానికి వెళ్తే.. పాత గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులు లాగిన్ కావడం లేదని, సంబంధిత గ్రామ పంచాయతీకి చెందిన సమాచారం తమ వద్ద లేదని సమాధానం ఇస్తున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై గ్రామ పంచాయతీకి చెందిన పాత అధికారుల వద్దకు వెళ్తే గ్రామానికి సంబంధించిన అన్నీ రికార్డులు పురపాలక సంఘం స్వాధీనం చేసుకుందని, ప్రస్తుతం సర్టిఫికెట్ల జారీకి సంబంధించి తాము ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. పైగా గ్రామ పంచాయతీలో పని చేసిన ఉద్యోగులకు ఎలాంటి పనులు అప్పగించకపోవడంతో ఆఫీసుకు వచ్చి ఖాళీగా కూర్చొని వెళ్లాల్సి వస్తోందని పేర్కొంటున్నట్లు ప్రజలు చెబుతున్నారు. దాదాపు రెండు నెలలుగా తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా సర్టిఫికెట్ రాని పరిస్థితి నెలకొనడంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదని ఆందోళన చెందుతున్నారు.

రెండు నెలలుగా ఇదే దుస్థితి

ఓఆర్ఆర్ లోపల ఉన్న నగర శివారులోని 51గ్రామ పంచాయతీలను సెప్టెంబర్ 5న సమీపంలోని 13 పురపాలక సంఘాల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విలీనమైన గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను కూడా నియమించింది. ఈ ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీ పరిధిలోని రికార్డులు స్వాధీనం చేసుకోవడం మినహాయించి, ఇప్పటి వరకు వారు స్వీకరించిన బాధ్యతల్లో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల్లో పర్యటించి, ప్రజాసమస్యలను తెలుసుకున్నది లేదు. విలీన గ్రామ పంచాయతీ ప్రజల సమస్యలను సంబంధిత పురపాలక సంఘం చూసుకుంటుందని వారు పేర్కొంటున్నా.. ఆచరణలో అమలు చేయడం లేదు. తూతూ మంత్రంగా మొదట్లో సంబంధిత మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు ఆయా గ్రామాల్లో మొక్కుబడిగా పర్యటించి, చేతులు దులుపుకున్నారు. దీంతో విలీన గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలతో పాటు పెండింగ్ పనులు ఆగిపోయాయి. స్థానిక ప్రజలకు కూడా తమ సమస్యలు, బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రస్తుతం విలీన గ్రామ పంచాయతీల్లోని ప్రజల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా తయారైంది.

చొరవ చూపాలి..

రోజువారి కార్యక్రమంలో భాగంగా రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బర్త్, డెత్, మ్యారేజ్ సర్టిఫికెట్లు(ధృవీకరణ పత్రాలు)తో సహా ఇంటి అనుమతులు, ఇంటి నంబర్లు, మ్యూటేషన్లు, నల్లా అనుమతులు సత్వరమే ఇప్పించేందుకు ఉన్నత అధికారులతో సహా జిల్లా అధికార యంత్రాంగం, స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక చొరవ చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. వీటి కోసం రెండు నెలలుగా రోజుల తరబడి సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకునే వారే లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు.



సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు

పుట్టిన తేదీ, వివాహ ధ్రువీకరణ పత్రాల కావాలని దరఖాస్తు చేస్తే ఇప్పటి ఇవ్వలేదు. దీంతో సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దాంతోపాటు డెత్, ఇంటి నిర్మాణం, నల్లా అనుమతుల కోసం అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు.

– ఎన్.సబిత, మహిళా సంఘం నాయకురాలు, ఆర్‌జీకే కాలనీ, పోచారం

ఇంటి నిర్మాణం ఆలస్యం

ఇంటి నిర్మాణ అనుమతుల కోసం అవుషాపూర్ గ్రామ పంచాయతీలో దరఖాస్తు చేసుకున్నాం. ఆ సమయంలో ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో అవుషాపూర్‌ను విలీనం చేశారు. మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అడిగితే పంచాయతీ నుంచి పూర్తి రికార్డులు అందలేదు అంటున్నారు. అనుమతి ఇవ్వలేమని చెబుతున్నారు. దీంతో ఇంటి నిర్మాణం ఆలస్యమవుతోంది.



– సాకేత్‌శర్మ, అవుషాపూర్, ఘట్‌కేసర్

స్థానిక సమస్యలపై శ్రద్ధ పెట్టాలని..

రెండు నెలలుగా సమస్యలకు దిక్కులేదని ఆందోళన చెందుతున్న విలీన గ్రామ పంచాయతీల్లోని ప్రజల కష్టాలు, బాధలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని వారు కోరుతున్నారు. పెండింగ్‌లో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూనే కొత్త అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌ । మంగళవారం ।
5 । నవంబర్‌ । 2024

అపురూపాలు.. ఆనవాళ్లు..

చరిత్ర సాక్ష్యాలుగా.. నిలువెత్తు నిదర్శనాలు

- నగర కీర్తిని పెంచుతున్న శిల్పాకృతులు
- స్టాచ్యూ సిటీగా గుర్తింపు పొందనున్న నగరం
- నగరవ్యాప్తంగా కనువిందు చేస్తున్న శిల్పాకృతులు
- త్వరలో కొలువుదీరనున్న తెలంగాణ తల్లి, గాంధీ విగ్రహాలు

నగరంలో పలు కూడళ్లలో స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరుల విగ్రహాలు ఉన్నాయి. ఇక మూడు దశాబ్దాల క్రితమే ట్యాంక్‌ బండ్‌ మీద నెలకొన్న పంచలోహ శిల్పాల గురించి కొత్తగా చెప్పనక్కర్లేదు. వీటన్నింటికీ తోడుగా.. ఇటీవల ఒక్కొక్కటిగా ఆవిష్కృతమవుతున్న ఆకృతులు నగర శిల్ప కళా 'భాగ్యాన్ని' పరిపుష్టం చేస్తున్నాయి. అప్పుడెప్పుడో నీటిపై నిలిచిన బుద్ధ విగ్రహం సందర్శకులకు తప్పనిసరి సందర్శనీయ స్థలం కాగా.. ఇప్పుడు మరికొన్ని దానితో సరితూగుతూ ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో సిటీలోని కొన్ని ఆసక్తికరమైన శిల్పాకృతుల గురించి.. ఓ రౌండప్‌..

ఆ ఆటలో ఒకరు స్టాచ్యూ అంటే మరొకరు అలా విగ్రహంలా నిలుచుండి పోతారు. ఎప్పటిదో అయిన ఈ చిన్నారుల ఆట అందరికీ సుపరిచితమే. సందర్శకుల్ని అలా బొమ్మలా నిలిచి ఉండేలా చేసే అరుదైన అద్భుత చిద్విలాస రూపాలకు నగరం చిరునామాగా మారింది. శిల్పారామం, శిల్పకళావేదిక.. వంటి అపురూప శిల్ప కేంద్రాలు, రాజీవ్‌గాంధీ, మహాత్మా గాంధీలతో పాటు పలువురు ప్రముఖ నేతల విగ్రహాలు అడుగడుగునా దర్శనమిస్తాయి. ఇక 125 అడుగుల అంబేడ్కర్‌ విగ్రహంతో పాటు శివార్లలో ఉన్న సమతామూర్తి, మరికొన్ని రోజుల్లో దర్శనమివ్వనున్న తెలంగాణ తల్లి.. వీటితో నగరం సంపూర్ణ స్టాచ్యూ సిటీగా అవతరించనుంది.


– సాక్షి, సిటీబ్యూరో

'బౌద్ధ'సాగర్‌...

జిబ్రాల్టర్‌ రాక్‌పై హుస్సేన్‌ సాగర్‌ మధ్యలో ఉన్న తెల్లటి గ్రానైట్‌తో రూపొందింది గౌతమ బుద్ధ విగ్రహం.. నగర పర్యాటకులు తప్పక సందర్శించి తీరాల్సిన ప్రదేశాలలో ఒకటి. సందర్శకులు ఫెర్రీ రైడ్‌ ద్వారా అలలపై తేలియాడుతూ ఆ ఎత్తైన విగ్రహం చేరకోవచ్చు. బుద్ధుని అందాన్ని పెంచే లైటింగ్‌ ఆకర్షణీయంగా ఉంటుంది. సూర్యుడు అస్తమించే సమయం సందర్శనకు ఉత్తమ సమయం.. సాగర్‌ ప్రక్కనే ఉన్న ట్యాంక్‌ బండ్‌ మీది విగ్రహ సముదాయం ప్రముఖులు ఎందరినో మనకు పరిచయం చేస్తుంది.



థాట్‌ ఫుల్‌.. ఎంప్టీ..



ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసే స్టాచ్యూ ఆఫ్‌ ఎంప్టీనెస్‌.. కళాఖండం నగర శివార్లలోని ఖాజాగూడ సరస్సు సమీపంలో ఏర్పాటు చేశారు. తల కిందికి వేలాడదీసి మొండెం వద్ద బోలుగా ఉన్న వ్యక్తి విగ్రహం ఇది. ఇది రొమేనియన్‌ కళాకారుడు ఆల్బర్ట్‌ గైర్గీ నుంచి ప్రేరణ పొందిన కపిల్‌ కపూర్చే చేతుల మీదుగా దీని పునఃసృష్టి జరిగింది.

యూనిటీ.. కేరాఫ్‌ సిటీ..



ప్రపంచంలోనే అతిపెద్దదైన సమతా మూర్తి ఆకృతిని ప్రధానమంత్రి ఆవిష్కరించారు. మొత్తంగా 216 అడుగుల ఎత్తైన విగ్రహం, సమానత్వం రూపంగా పేర్కొంటారు. కూర్చున్న భంగిమలో ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన లోహపు విగ్రహం. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త రామానుజాచార్యుల విగ్రహం రంగారెడ్డి జిల్లాలోని ముచ్చింతల్‌లో ఉంది.

భాగ్యనగరాన.. బంగారు తెలంగాణ 'తల్లి'..



సచివాలయం ఎదురుగా అమరవీరుల స్మృతి జ్యోతిలో ఏడున్నర అడుగుల తెలంగాణ తల్లి స్వర్ణ విగ్రహం ఏర్పాటు చేశారు. ఇంత ఎత్తయిన గోల్డెన్‌ స్టాచ్యూ దేశంలో మరెక్కడా లేదు. తెలంగాణ ప్రజలకు మాత్రమే కాకుండా సందర్శకులకు కూడా ఈ విగ్రహ సందర్శన గొప్ప అనుభూతిని అందిస్తుందని శిల్పి రమణారెడ్డి అంటున్నారు. పైన పేర్కొన్నవి కాకుండా, నగరంలో మొజామ్‌జాహి మార్కెట్‌, మైండ్‌స్పేస్‌ ఇతర ప్రాంతాల్లో గుర్తించదగిన ఇతర కళాఖండాలూ ఉన్నాయి.

కెప్టెన్‌కి సలామ్‌..



హబ్సిగూడలో రద్దీగా ఉండే రహదారి మధ్య దివంగత కెప్టెన్‌ రాపోలు వీర రాజా రెడ్డి నిలువెత్తు విగ్రహం మనకు కనిపిస్తుంది. ఆయన 25 సంవత్సరాల వయసులో జమ్మూ కాశ్మీర్‌లోని రాజౌరి జిల్లాలో జరిగిన సైనిక ఆపరేషన్‌లో వీర మరణం పొందారు. నగరానికి చెందిన ఈ అమరవీరుని స్మారక చిహ్నం ఆయన నివసించిన ప్రాంతంలోనే ఏర్పాటు చేశారు.

వీరత్వానికి ప్రతిరూపం..

అరుదైన నేపథ్యం ఉమేష్‌ చంద్ర శిల్పాకృతి సొంతం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సల్స్‌ నిర్మూలనకు కృషి చేసిన ధైర్యసాహసాలు కలిగిన పోలీసు అధికారి చదలవాడ ఉమేష్‌చంద్రను 'కడప టైగర్‌'గా కూడా పిలుస్తారు. ఆయన నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి కూడా. గత 1999 సెప్టెంబరు 4న ఎస్‌ఆర్‌ నగర్‌ జంక్షన్‌లో నక్సలైట్ల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. అదే స్థలంలో ఆయన విగ్రహం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారు.

కళాభిమానులకు కనువిందు..



దేశంలో ఏ నగరానికీ లేనంత గొప్ప చరిత్ర, వారసత్వం మన నగరానికి ఉంది. అదృష్టవశాత్తూ అన్ని ప్రభుత్వాలూ నగర ప్రతిష్ట పెంచడానికి కృషి చేస్తున్నాయి. గతంలో ఎన్టీఆర్‌ ట్యాంక్‌ బండ్‌పై విగ్రహాలను ఏర్పాటు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌, నేటి సీఎం రేవంత్‌రెడ్డిలు మరింత ముందుకెళ్లి, ప్రపంచప్రఖ్యాత అత్యుత్తమ కళాకృతులను ఇక్కడ నెలకొల్పుతున్నారు. మా లాంటి కళాకారులకు ఉత్తేజాన్ని కళాభిమానులకు ఉల్లాసాన్ని అందించేలా ఇవి రూపొందడం సంతోషించదగ్గ విషయం. – వి.రమణారెడ్డి, చిత్ర/శిల్పకారుడు

వ్యక్తిత్వ వికాస 'జ్ఞాన్‌'భూమి..




ఇది భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు నివాళులర్పించేందుకు నిర్మించబడి చక్కటి నిర్వహణలో ఉన్న ఉద్యానవనం ఖైరతాబాద్‌లోని నెక్లెస్‌ రోడ్‌లో ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, వివిధ వ్యక్తిత్వ లక్షణాలను ప్రదర్శించే ఆరు ప్రత్యేకమైన అందమైన శిల్పాలు ఇక్కడ ఉన్నాయి.

వ్రూమ్‌..

వర్చువల్‌ ఫిల్మ్‌ ఫెస్ట్‌ 9 నుంచి..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని జర్మన్‌ కల్చరల్‌ సెంటర్‌ గోతె జంత్రమ్‌ ఆధ్వర్యంలో వినూత్న శైలి చిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని గోతె జంత్రమ్‌ ప్రతినిధి నూరియా తెలిపారు. 'వ్రూమ్‌' పేరుతో నిర్వహించే ఈ చిత్రోత్సవం మునుపెన్నడూ ఎరుగని రీతిలో దీనిని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగం పంచుకోనున్న వర్చువల్‌ రియాల్టీ ఫిల్మ్స్‌ స్టోరీ టెల్లింగ్‌ను సరికొత్తగా నిర్వచిస్తాయని, ఈ నెల 9న ప్రారంభమయ్యే వ్రూమ్‌ 17వ తేదీ వరకూ కొనసాగుతుందని వివరించారు. బంజారాహిల్స్‌లోని జర్నలిస్ట్‌ కాలనీలో ఉన్న గోతె జంత్రమ్‌ ఆవరణలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7గంటల వరకూ ఈ చిత్ర ప్రదర్శన ఉంటుందన్నారు. అత్యాధునిక సాంకేతిక విప్లవానికి అద్దం పట్టే ఈ చిత్రోత్సవానికి ప్రవేశం ఉచితం.



నగర మార్కెట్‌లోకి స్విస్‌ మిలిటరీ..

ట్రావెల్‌ గేర్‌, లైఫ్‌స్టైల్‌ బ్రాండ్‌ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ట్రావెల్‌ గేర్‌ విభాగంలో అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన లైఫ్‌ స్టైల్‌ బ్రాండ్‌ 'స్విస్‌ మిలిటరీ'ని నగరంలో ప్రారంభిస్తున్నట్లు సంస్థ యాజమాన్యం ప్రకటించింది. అధునాతన ఫ్యాషన్‌తో పాటు ట్రావెల్‌గేర్‌లో వినూత్న సేవలందిస్తున్న స్విస్‌ మిలిటరీని దేశవ్యాప్త విస్తరణలో భాగంగా హైదరాబాద్‌ను ఎంచుకున్నామని సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ అనూజ్‌ సాహ్నీ తెలిపారు. భారత్‌తో దాదాపు 26 దేశాల్లో తమ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని వారు పేర్కొన్నారు. అధునాతన ఫ్యాషన్‌ను ఆహ్వానించే భాగ్యనగరం తమ సేవలకు సరైన వేదికని వారు వివరించారు.



ఇండియన్‌ ఓషన్‌.. ప్రదర్శన 10న..



సాక్షి, సిటీబ్యూరో: అమెరికన్‌ ప్రైడ్‌ సోడా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్‌ ఓషన్‌ కన్సర్ట్‌ సిరీస్‌ నగరంలో జరుగనుంది. ఇండీ రాక్‌ సంగీతం ప్రధానంగా సాగే ఈ కార్యక్రమంలో దేశంలో పేరొందిన మ్యూజిక్‌ బ్యాండ్స్‌లో ఒకటైన ఇడియన్‌ ఓషన్‌ బ్యాండ్‌ సందడి చేయనుంది. దాదాపు 2 దశాబ్దాల పైగా తమదైన శైలి వైవిధ్యభరిత సంగీతంతో మ్యూజిక్‌ లవర్స్‌ని రంజింపజేస్తోన్న ఈ బ్యాండ్‌ సభ్యులు భారతీయ సంప్రదాయ సంగీతం, జాజ్‌, ఫోక్‌, రాక్‌.. వంటివన్నీ కలగలిపిన ఫ్యూజన్‌ కన్సర్ట్స్‌ను సమర్పిస్తారు. పీప్లీ లైవ్‌, మసాన్‌ చిత్రాల సంగీతం ద్వారా పాప్యులర్‌ అయ్యిందీ బ్యాండ్‌. అంతేకాదు రోలింగ్‌ స్టోన్‌ మేగ్‌జైన్‌ ముఖచిత్రంగా ప్రచురితమైన తొలి భారతీయ బ్యాండ్‌గా ఘనత సాధించిన ఈ బ్యాండ్‌ కొండాపూర్‌లోని నోవోటెల్‌లో ఉన్న హైదరాబాద్‌ కన్వెన్షన్‌ సెంటర్‌లో ఈ నెల 10న రాత్రి 8గంటల నుంచి తమ ప్రదర్శన నిర్వహిస్తోంది.

కేక్‌ మిక్సింగ్‌ షురూ..



సందడి చేసిన సింగర్‌ ఎస్పీ శైలజ, శుభలేఖ సుధాకర్‌

గోల్కొండ హోటల్‌ వేదికగా సంప్రదాయ కేక్‌ మిక్సింగ్‌ వేడుక





సాక్షి, సిటీబ్యూరో: పండుగల సీజన్‌కు స్వాగతం పలుకుతూ నగరం వేదికగా ఈ ఏడాది కేక్‌ మిక్సింగ్‌ సందడి ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని గోల్కొండ హోటల్‌లో సోమవారం సంప్రదాయ కేక్‌ మిక్సింగ్‌ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ నటుడు శుభలేఖ సుధాకర్‌, ప్రముఖ గాయకురాలు ఎస్పీ శైలజ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శైలజ మాట్లాడుతూ.. కేక్‌ మిక్సింగ్‌లో డ్రై ఫ్రూట్స్‌, నట్స్‌, ఇతర సుగంధ ద్రవ్యాలు తదితర పదార్థాలను ఎలా కలుపుతామో.. అలాగే మనమంతా కలిసి ఉండాలని తెలిపారు. ఈ వేడుకలతో అందరి జీవితాల్లో ఆనందం, శాంతి, ఆరోగ్యం చేకూరాలని ఆశించారు. నూతన సంవత్సరానికి కేక్‌ మిక్సింగ్‌తో నాంది పలుకుతున్నాం, ఇది కూడా సంక్రాంతిలాంటి అతి పెద్ద పండుగని శుభలేఖ సుధాకర్‌ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కేక్‌ మిక్సింగ్‌ కోసం ఎండుద్రాక్ష, ఆప్రికాట్స్‌, చెర్రీస్‌, కాన్‌ బెర్రీస్‌తో పాటు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలను వినియోగించారు. ఈ మిక్సింగ్‌లో భాగంగా రమ్‌, బ్రాందీ కలిపే విధానాన్ని ఎగ్జిక్యూటివ్‌ చీఫ్‌ చెఫ్‌ వెంకట్‌ నేతృత్వంలోని గోల్కొండ హోటల్‌ పాకశాస్త్ర బృందం తెలియజేసింది. ఈ కార్యక్రమంలో గోల్కొండ హోటల్‌ చెఫ్స్‌, సిబ్బంది పాల్గొన్నారు.

సితార ప్లేయర్‌ గురవయ్య, యోగా శిక్షకులు వెంకటేశ్వర్లుకు.. అమెరికా యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌



లాలాపేట: ప్రముఖ బుల్‌ బుల్‌ సితారా ప్లేయర్‌, ఇంటర్నేషనల్‌ వండర్‌ బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌ హోల్డర్‌ సుంచు గురువయ్య, ప్రముఖ యోగా శిక్షకులు ముషిని వెంకటేశ్వర్లు అమెరికా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ అందుకున్నారు. ఈ మేరకు సోమవారం ఆబిడ్స్‌లోని సూర్యలోక్‌ కాంప్లెక్స్‌లో జరిగిన జాతీయ సెమినార్‌లో అమెరికా టెక్సాస్‌కు చెందిన డేస్ప్రింగ్‌ థియాలాజికల్‌ యూనివర్సిటీ (గాడ్‌ సన్‌ హోలీ స్పిరిట్‌ థియాలాజికల్‌ అకాడమీ) ఆర్చ్‌బిషప్‌ వరప్రసాద్‌, డాక్టర్‌ కె.మరియకుమార్‌ ఈ గౌరవ డాక్టరేట్‌ సర్టిఫికేట్‌ను వీరికి అందజేశారు.. కల్చరల్‌ ఆక్టివిటీస్‌, సోషల్‌ సర్వీసు విభాగంలో గురవయ్య (ఏడు గంటలు ఏకధాటిగా సితారా వాయించినందుకు), (ప్రతిరోజు 108 సూర్య నమస్కారాలు చేసి) యోగా విభాగంలో వెంకటేశ్వర్లు ఈ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గౌరవ డాక్టరేట్‌ అందుకోవడం ఆనందంగా ఉందని, దీంతో తమ బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. కళలను మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్‌ కొమ్ము అశోక్‌యాదవ్‌, పలువురు డాక్టరేట్‌ అందుకున్నవారిని అభినందించారు.

- 'క్యూటిస్‌ ఇంటర్నేషనల్‌'ను ప్రారంభించిన డీసీపీ రాహుల్‌ హెగ్డే..
- ముఖ్య అతిథిగా హాజరైన సినీనటుడు శ్రీ తేజా

సిటీలో అధునాతన కాస్మెటిక్‌ సేవలు..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మాదాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన హెయిర్‌ ట్రాన్స్‌ప్లాంట్‌, కాస్మెటిక్‌ ట్రీట్‌మెంట్లను నిర్వహించే యుఏఈ ప్రీమియర్‌ బ్రాండ్‌ 'క్యూటిస్‌ ఇంటర్నేషనల్‌'ను డిప్యూటీ కమిషనర్‌ ఆఫ్‌ పోలీస్‌ రాహుల్‌ హెగ్డే ప్రారంభించారు. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సినీనటుడు శ్రీ తేజా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రూప్‌ వ్యవస్థాపకులు, ఛైర్మన్‌ డా.షాజీర్‌ మాచించేరీ మాట్లాడుతూ.. క్యూటిస్‌ ఇంటర్నేషనల్‌ కాస్మెటిక్‌ క్లినిక్‌ అనేది భారత్‌తో పాటు యునైటెడ్‌ అరబ్‌ ఎమిరేట్స్‌లోని ఉత్తమ హెయిర్‌ ట్రాన్స్‌ప్లాంట్‌, స్కిన్‌ క్లినిక్‌లలో ఒకటని తెలిపారు. జుట్టు, చర్మ సమస్యలతో బాధపడుతున్న వారికి అధునాతన సాంకేతికతతో సేవలందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సంస్థ వైస్‌ ఛైర్మన్‌ కె.జయన్‌, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ గౌరీ శంకర్‌ పాల్గొన్నారు.





రాజకీయ ప్రయోజనాలకు ఇంతగా దిగజారాలా?

దివంగత సీఎం వైఎస్ సతీమణి విజయమ్మ మీడియాకు ప్రకటన



సాక్షి, అమరావతి : గతంలో ఎప్పుడో జరిగిన తన కారు ప్రమాదాన్ని ఇప్పుడు నా కుమారుడికి ముడిపెట్టి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం జుగుప్సాకరమని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. సోషల్ మీడియాలో లేనిపోని అసత్య కథనాలు ప్రచారం చేయడం చూస్తుంటే తనకు తీవ్ర మానసిక వేదన కలుగుతోందన్నారు. ఈ నీచ సంస్కృతిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేదిలేదని.. ఇక ఈ దుష్ప్రచారాలను, వ్యక్తిత్వ హననాన్ని ఆపితే మంచిదని ఆమె సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సూచించారు. నన్ను అడ్డంపెట్టుకుని చేస్తున్న నీచ, నికృష్ట రాజకీయాలను ఖండించకపోతే ప్రజలు నిజమని నమ్మే ప్రమాదమున్నందున తాను ఈ వివరణ ఇస్తున్నానని ఆమె వివరించారు. అమెరికాలో నా మనుమడి దగ్గరికి వెళ్తే దానిని కూడా వక్రీకరించి.. నేను భయపడి విదేశాలకు వెళ్లిపోయినట్లు దుష్ప్రచారం చేయడం అత్యంత నీతిమాలిన చర్యని.. ఇకపై ఇలాంటి లేనిపోని అసత్యాలను ప్రచారంచేస్తే తాను చూస్తూ ఊరుకోదలుచుకోలేదని విజయమ్మ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

ఓటుకు నోటు కేసులో 'నాట్ బిఫోర్ మి' అన్న సుప్రీం జస్టిస్ శర్మ

- గతంలో తెలంగాణ హైకోర్టు సీజేగా పనిచేసినందుకేనని వెల్లడి
- నిందితుడిగా జెరూసలెం మత్తయ్య పేరును హైకోర్టు కొట్టేయడాన్ని సవాల్ చేసిన ఏసీబీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో తాను వాదనలు వినలేనని (నాట్ బిఫోర్ మి) సుప్రీంకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడి (ఏ4)గా ఉన్న జెరూసలేం మత్తయ్య పేరును తెలంగాణ హైకోర్టు 2016లో కొట్టేయడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ ఏసీబీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు రాగా... వాదనలు వినిపించేందుకు తనకు రెండు వారాల గడువు కావాలని మత్తయ్య తరఫు న్యాయవాది ప్రియాంక ధర్మాసనాన్ని కోరారు. దీనిపై జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ స్పందించారు. గతంలో తాను తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశానని.. అందువల్ల ఈ కేసులో వాదనలు వినలేనని పేర్కొన్నారు. ఈ కేసును మరో బెంచ్‌కు బదిలీ చేయాలని ప్రధాన న్యాయమూర్తిని ఈ సందర్భంగా కోరారు. అనంతరం కేసును ఈ నెల 12కు వాయిదా వేస్తూ ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే 2016 నుంచి 2019 సార్వత్రిక ఎన్నికల ముందు వరకు పలుమార్లు సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. తాజాగా సోమవారం మళ్లీ ఈ కేసు సుప్రీంలో విచారణకు వచ్చింది.

కృష్ణా ప్రాజెక్టులపై ఏపీ, తెలంగాణ పిటిషన్ల విచారణ వాయిదా

రెండు పిటిషన్లను కలిపి విచారిస్తామన్న సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణానదిపై నిర్మించిన ప్రాజెక్టుల పరిధిపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్ల విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. కృష్ణా బేసిన్‌పై ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి తెస్తూ 2021లో కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. అయితే కృష్ణా పరీవాహక ప్రాంతంలోని విద్యుత్ కేంద్రాలను కూడా కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం 2021లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే కేంద్రం తెచ్చిన ఈ గెజిట్‌ను రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కాగా ఈ రెండు పిటిషన్లను సోమవారం సుప్రీంకోర్టులోని వేర్వేరు ధర్మసనాలు విచారించాయి. తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విశ్వనాథన్‌ల ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ కేసులో వాదనలు పూర్తిగా వినాల్సి ఉన్నందున, గురువారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణను వాయిదా వేసింది. కాగా కొద్దిసేపటి తర్వాత ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల బెంచ్ విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.... ప్రత్యేక ఆర్డర్ కావాలంటే ఆదేశాల్లో కోరవచ్చని ఏపీ తరఫు న్యాయవాదికి సూచించారు. అయితే ఈ వాదనలపై ఏపీ తరఫు న్యాయవాది పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇదే అంశానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిందని... సోమవారం విచారణ సందర్భంగా వాదనలు జరగలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఏపీ పిటిషన్‌ను తెలంగాణ పిటిషన్ విచారిస్తున్న బెంచ్‌కు బదిలీ చేయాలని జస్టిస్ అభయ్ ఎస్.ఓకా ధర్మాసనం రిజిస్ట్రార్‌ను ఆదేశించింది.

నిజాయితీగా వాస్తవాలు చెప్పండి

మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను ఉద్దేశించి తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యలు • ఉండవల్లికి పెన్‌డ్రైవ్ ఇచ్చే విషయంలో తగిన సమయంలో ఆదేశాలిస్తాం



సాక్షి, అమరావతి/సాక్షి, హైదరాబాద్ : చందాదారుల వివరాలను అందించే విషయంలో నిజాయితీగా ఉండాలని మార్గదర్శి ఫైనాన్సియర్స్‌ను ఉద్దేశించి తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇలాంటి విషయాల్లో పారదర్శకంగా ఉంటే అందరికీ మంచిదని మార్గదర్శికి స్పష్టం చేసింది. ఉండవల్లి అరుణ్ కుమార్ కోరిన విధంగా ఆయనకు పెన్‌డ్రైవ్‌లో చందాదారుల వివరాలను అందచేసే విషయంలో తగిన సమయంలో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపింది. ఈ కేసు గురించి మీడియా ముందు మాట్లాడకుండా అరుణ్ కుమార్‌ను నియంత్రిస్తూ గ్యాగ్ ఆర్డర్ జారీ చేయాలన్న మార్గదర్శి అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. ఎలాంటి విచారణ చేపట్టకుండా ఈ దశలో అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఒకవేళ ఆయన మాట్లాడిన మాటలు పరువు నష్టం కలిగించేవిగా ఉన్నాయనుకుంటే తగిన విధంగా ముందుకెళ్లొచ్చునని మార్గదర్శికి స్పష్టం చేసింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తిరిగి విచారణ మొదలుపెట్టిన హైకోర్టు

చట్ట నిబంధనలకు విరుద్ధంగా ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిన మార్గదర్శి ఫైనాన్సియర్స్, దాని హెచ్‌యూఎఫ్ కర్త రామోజీ రావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ కేసులో అధీకృత అధికారి నాంపల్లి కోర్టులో ఫిర్యాదు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదును కొట్టేస్తూ 2018 డిసెంబర్ 31న ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తేలప్రోలు రజని తీర్పునిచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీళ్లు దాఖలు చేశాయి. హైకోర్టు తీర్పులోని కొంత భాగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రామోజీ, మార్గదర్శి కూడా వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ అప్పీళ్లన్నింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. హైకోర్టు తీర్పును రద్దు చేసింది. ఈ వ్యవహారంపై తిరిగి విచారణ చేపట్టాలని, ఉండవల్లి, ఏపీ సర్కార్ సహా అందరి వాదనలు వినాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. డిపాజిట్ల సేకరణలో వాస్తవాలను నిగ్గు తేల్చాల్సిందేనని స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన జస్టిస్ సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. తాను నగరంలో లేనందున విచారణను గురువారానికి వాయిదా వేయాలని ఆర్‌బీఐ తరఫున సీనియర్ న్యాయవాది లక్ష్మీనారాయణన్ రవిచందర్ ధర్మాసనాన్ని కోరారు. ఇందుకు ఉండవల్లి అరుణ్ కుమార్, మార్గదర్శి తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా కూడా అంగీకరించారు. ఏ రోజైనా ఇబ్బంది లేదని, తన అభ్యర్థన మాత్రం పెన్‌డ్రైవ్ గురించేనని అరుణ్ కుమార్ చెప్పారు. తదుపరి విచారణకన్నా ముందే పెన్‌డ్రైవ్‌ను అందజేస్తే, కోర్టుకు సహకరించడం సులభంగా ఉంటుందని చెప్పారు. దీనిపై వాదనలు వినే సమయంలో తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది. గురువారం అరుణ్ కుమార్‌కు మంచి రోజని లూథ్రా వ్యాఖ్యానించగా.. అవునని, ఆ రోజున తాను స్వయంగా కోర్టు ముందు హాజరవుతానని, మీ ఉపన్యాసం వింటానని ఉండవల్లి చెప్పారు. ఈ సందర్భంగా ధర్మాసనం యూఎస్ సుప్రీంకోర్టు జడ్జి లూయిస్ బ్రాండీస్ వాడిన ప్రఖ్యాత కొటేషన్ 'సన్‌లైట్ ఈజ్ ది బెస్ట్ డిస్ఇన్‌ఫెక్టెడ్'(పారదర్శకంగా, నిజాయితీగా ఉండటం, వాస్తవాలను బహిర్గతం చేయడం)ను మార్గదర్శిని ఉద్దేశించి చెప్పింది.

చందాదారులు ఎవరో ఇప్పటికీ మార్గదర్శి గుర్తించలేకపోయింది

ఈ సమయంలో ఉండవల్లి అరుణ్ కుమార్ స్పందిస్తూ.. చందారులందరికీ డిపాజిట్లు చెల్లించలేదని మార్గదర్శే అంగీకరించిందని తెలిపారు. గత 10–15 సంవత్సరాలుగా ఎస్క్రో ఖాతాలో ఉన్న రూ.5.30 కోట్లు ఇప్పటికీ అలాగే ఉన్నాయన్నారు. ఈ మొత్తాలు ఎవరివో మార్గదర్శి ఇప్పటివరకు గుర్తించలేకపోయిందని తెలిపారు. అందుకే ఈ విషయంలో కోర్టుకు సహకరించదలిచానని, ఓ అవకాశం ఇవ్వాలని కోరారు. ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయంలో ముందుకు రావడంలేదన్నారు. వాదనల సమయంలో అన్ని విషయాలపైనా అవసరాన్ని బట్టి తగిన ఆదేశాలు ఇస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఉండవల్లి పత్రికా ముఖంగా స్టేట్‌మెంట్లు ఇవ్వకుండా సలహా ఇవ్వాలని లూథ్రా కోరారు. గ్యాగ్ ఆర్డర్ కోసం అనుబంధ పిటిషన్ వేస్తామన్నారు. దీనిపై ఉండవల్లి తీవ్రంగా స్పందించారు. అవాస్తవాలతో మీరు (లూథ్రా) కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ఘాటుగా చెప్పారు. ఈరోజు (సోమవారం) మార్గదర్శి కోర్టు ముందుంచిన 240 పేజీల కేసు వివరాల్లో దాదాపు 100 పేజీలు తన గురించే ఉన్నాయన్నారు. తాను మార్గదర్శిపై మాట్లాడిన విషయాలపై పత్రికల్లో వచ్చిన కథనాలను తర్జుమా చేసి కోర్టు ముందుంచారని, ఆ తర్జుమాలు చాలా అధ్వానంగా ఉన్నాయని అన్నారు. పత్రికల్లో ఏదో రాస్తే తనకు ఆపాదిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. గత 90 రోజుల్లో మీడియాతో మాట్లాడినట్లు ఏవైనా కథనాలు ఉంటే కోర్టు ముందుంచాలన్నారు. ఇది సంచలన కేసు అని, మీడియాకు ప్రతిదీ తెలుసునని చెప్పారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. గురువారం వాదనలు వింటామని, ఆ రోజుకి మీ మీ శక్తిని దాచిపెట్టుకోవాలంటూ వ్యాఖ్యానించింది.

అధికారంలోకి వచ్చినా అవే డ్రామాలు!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రశ్నించాలి. లేదంటే మంత్రివర్గంలో తనూ భాగమే కాబట్టి.. ప్రభుత్వ వైఫల్యాలకు బాధ్యత వహించాలి. అయితే అలాంటిదేమీ లేకుండా.. శాంతి భద్రతలను నేరుగా పర్యవేక్షించే ముఖ్యమంత్రిని ప్రశ్నించకుండా.. దళిత మహిళ అయిన హోంమంత్రి అనితపై నెపాన్ని నెట్టేసే విధంగా పవన్ మాట్లాడటాన్ని చూస్తుంటే.. కొత్త డ్రామాను రక్తి కట్టిస్తున్నారని స్పష్టంగా అర్థమవుతోందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. సోమవారం పిఠాపురం పర్యటన సందర్భంగా గొల్లప్రోలు సభలో పవన్‌కళ్యాణ్ మాట్లాడిన మాటలు రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతల పరిస్థితిని స్పష్టం చేస్తున్నాయి. 'రాష్ట్రంలో మహిళలు, చిన్న పిల్లలపై లైంగిక దాడులు, అరాచకాలు మితిమీరిపోయాయి. పోలీసులు శాంతి భద్రతలను గాలికొదిలేసి మీనమేషాలు లెక్కిస్తున్నారు. బయటకెళ్లాలంటే ప్రజలు ఏం ప్రశ్నిస్తారో అని భయమేస్తోంది. మమ్మల్ని తిడుతున్నారు. వారికి సమాధానం చెప్పలేక బయటకు వెళ్లలేకపోతున్నాం. మూడేళ్ల బాలికపై హత్యాచారం జరిగితే పోలీసులు ఏమీ చేయలేకపోయారు. ఆడబిడ్డల మాన, ప్రాణ రక్షణకు తగిన చర్యలు తీసుకోమని ఎన్నిసార్లు చెబుతున్నా స్పందన కనిపించడం లేదు. ఎమ్మెల్యేలు ఇసుకలో లాభాలు చూసుకుంటున్నారేగానీ అరాచకాలను ప్రశ్నించడం లేదు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఆడపిల్లలను ఇబ్బందులు పెడుతుంటే కూటమి ఎమ్మెల్యేలు ఎప్పుడైనా పట్టించుకున్నారా?' అని తాజాగా పవన్ వ్యాఖ్యలు చేశారు. అయితే శాంతి భద్రతల వైఫల్యానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు గానీ, ఉప ముఖ్యమంత్రిగా ఉన్న తనకు గానీ ఏమాత్రం సంబంధం లేదన్నట్లుగా.. హోంమంత్రి అనిత ఇందుకు బాధ్యత వహించాలంటూ పవన్‌కళ్యాణ్ ఆ సభలో డిమాండ్ చేయడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

అందుకు బాధ్యత బాబుదే కదా..!

హోంమంత్రి అనిత అయినప్పటికీ వాస్తవానికి శాంతి భద్రతల విభాగం పూర్తిగా ముఖ్యమంత్రి ఆధీనంలో కొనసాగుతుంది. మూడేళ్ల చిన్నారులపై అత్యాచారాలు జరిగినా, ఆడబిడ్డలపై లైంగిక దాడులు, హత్యాచారాలు చోటు చేసుకున్నా అవన్నీ రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యం కిందకే వస్తాయి. అలాంటప్పుడు ఉప ముఖ్యమంత్రి మాట్లాడిన మాటల ప్రకారమే.. శాంతి భద్రతల శాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబే ఈ వైఫల్యాలకు పూర్తి బాధ్యత వహించాలి. ఇందుకు విరుద్ధంగా మహిళా మంత్రి, పైపెచ్చు దళిత మంత్రి అయిన హోంమంత్రి అనిత వీటికి బాధ్యత తీసుకోవాలని పవన్‌కళ్యాణ్ డిమాండ్ చేయడం విచిత్రంగా ఉందని పలువురు రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. 'హోంశాఖ మంత్రిగా మీరు బాధ్యత వహించండి. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను, హత్యలను పట్టించుకోండి. నేను హోంశాఖను తీసుకుంటే పరిస్థితులు వేరుగా ఉంటాయి. నేను అడగలేక కాదు.. హోంశాఖ తీసుకోలేక కాదు. నేను హోంశాఖ తీసుకున్నానంటే పరిస్థితులు చాలా చాలా వేరుగా ఉంటాయి'అంటూ పవన్ చేసిన వ్యాఖ్యలు తోడుదొంగల డ్రామాను బహిర్గతం చేస్తున్నాయని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

అప్పుడు భీషణ ప్రతిజ్ఞలు.. ఇప్పుడు భయమేస్తోందంటూ!

ఎన్నికల్లో చంద్రబాబుతో కలసి కూటమిగా పోటీ చేసిన పవన్‌కళ్యాణ్ పలు సభల్లో ఆయన తరఫున కూడా తానే హామీలిచ్చేశారు. 'రాష్ట్రంలో కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే ఏ ఆడబిడ్డపైనా అఘాయిత్యం జరగకుండా బలమైన చట్టాలు తెస్తాం..'అని ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా మహిళలపై వరుసగా అఘాయిత్యాలు, చిన్నారులపై అకృత్యాలు జరుగుతున్నా పవన్‌కళ్యాణ్ కనీసం ఖండిస్తూ ప్రకటనలు కూడా ఇవ్వలేదని సర్వత్రా విమర్శలున్నాయి. జరుగుతున్న పరిణామాలపై ప్రజలు తమను తిడుతున్నారని.. జనంలోకి వెళ్లాలంటే భయమేస్తోందని పవన్ స్వయంగా పిఠాపురం సభలో చెప్పారు. ఈ క్రమంలో ప్రజా వ్యతిరేకతను హోంమంత్రి పైకి మళ్లించి వైఫల్యాల నుంచి చంద్రబాబు, తాను బయట పడే వ్యూహాన్ని పవన్‌కళ్యాణ్ ఎంచుకున్నారు. ప్రభుత్వమంటే.. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం మొత్తానిది ఉమ్మడి బాధ్యత అని గుర్తులేదా? పవన్‌కళ్యాణ్ తాజా వ్యాఖ్యలు ప్రకారం రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందంటే.. మంత్రివర్గం మొత్తం వైఫల్యం కిందకే వస్తుందని రాజకీయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

తెలుగు వారిపై నటి కస్తూరి అనుచిత వ్యాఖ్యలు

ఖండించిన పలువురు నేతలు



తమిళ సినిమా: సీనియర్ నటి కస్తూరి తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో తీవ్ర దుమారం చెలరేగింది. ఆమె వ్యాఖ్యలను బీజేపీ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి, ద్రవిడ దేశం అధ్యక్షుడు కృష్ణారావుతో పాటు పలువురు ప్రముఖులు, సంఘాలు నటి కస్తూరి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. వివరాల్లోకి వెళితే.. నటి కస్తూరి సోమవారం చెన్నై–ఎగ్మూర్‌లో బ్రాహ్మణ సమాజం పరిరక్షణ పేరుతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె బ్రాహ్మణులకు తమిళనాడులో రక్షణ లేదని, వారికి జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తామన్నారు. తానూ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన మహిళనేనన్నారు. తమిళనాడులో తమిళ మున్నేట్ర కళగం అని పేరు పెట్టకుండా, ద్రావిడ అనే పదాన్ని తెరపైకి తీసుకొచ్చారన్నారు. తెలుగు వారు రాజుల కాలంలో అంతఃపుర మహిళలకు సేవలు చేయడానికి ఇక్కడికి వచ్చారని, ఇప్పుడేమో తమిళ జాతి తమదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తెలుగు మాట్లాడితే చాలు మంత్రులు అయిపోతున్నారని ఎద్దేవా చేశారు. బ్రాహ్మణులు తమిళులు కాదని చెప్పేందుకు వాళ్లెవరని ప్రశ్నించారు. తమిళనాడులో బ్రాహ్మణులకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని విమర్శలు గుప్పించారన్నారు.

తప్పుగా మాట్లాడలేదు

కాగా.. పలువురు కస్తూరి వ్యాఖ్యలను తప్పుపడుతున్న నేపథ్యంలో నటి కస్తూరి మీడియాతో మాట్లాడుతూ.. తాను తెలుగు ప్రజల గురించి తప్పుగా మాట్లాడలేదని, తెలుగు చానళ్లు తప్పుడు ప్రచారం చేయొద్దని కోరారు. తాను తెలుగింటి కోడలినేనని పేర్కొన్నారు. సనాతన ధర్మం అంటూ బ్రాహ్మణ సమాజానికి ప్రాధాన్యతనిస్తున్నామని ప్రచారం చేసుకునే వారు బ్రాహ్మణులకు రక్షణ కల్పించడం లేదని ఆరోపించారు. ఒక బ్రాహ్మణ మహిళగా తాను వారికి జరుగుతున్న అన్యాయంపై పోరాడతానని కస్తూరి పేర్కొన్నారు. తమిళ ప్రభుత్వంలో బ్రాహ్మణ సమాజానికి చెందిన ఏ ఒక్కరికైనా మంత్రి పదవి ఇచ్చారా? అని ప్రశ్నించారు.

చాకుతో దాడిచేసి.. మత్తు నీళ్లు తాగించి..

- తిరుపతి జిల్లాలో మరో బాలికపై లైంగిక దాడి!
- పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా అటకాయించిన ఇద్దరు దుండగులు
- మత్తు మాత్రలు కలిపిన నీటిని తాగించి.. పొదల్లోకి తీసుకెళ్లిన దుర్మార్గులు



బాధితురాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్, తిరుపతి: తిరుపతిజిల్లాలో మూడున్నరేళ్ల బాలికపై హత్యాచార ఘటనను మరువకముందే.. సోమవారం మరో మైనర్ బాలికపై దారుణం చోటుచేసుకుంది. గాయాల పాలై ముళ్లపొదల్లో అపస్మారక స్థితిలో మూలుగుతున్న బాలికను గుర్తించిన తండ్రి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలిక తండ్రి కథనం ప్రకారం.. తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలం యల్లమంద దళితవాడకు చెందిన 14 ఏళ్ల బాలిక సమీపంలోని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఎప్పటిలా సోమవారం పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం అవుతున్నా.. ఇంటికి రాకపోవటంతో బాలిక తండ్రి కంగారుపడి పాఠశాలకు వెళ్లాడు. బాలిక పాఠశాలలో లేకపోవటంతో వెతకటం ప్రారంభించాడు. గ్రామానికి సమీపంలోని ముళ్లపొదల్లోంచి మూలుగు వినిపించడంతో లోనికి వెళ్లి చూశాడు. బాలిక తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో ఉండటాన్ని చూసి చలించిపోయాడు.

పొట్టపై తన్ని.. చాకుతో దాడి

పాఠశాల ముగిసిన తరువాత బాలిక నడచుకుంటూ ఇంటికి బయలుదేరింది. వెనుకవైపు నుంచి పల్సర్ బైక్‌పై మాస్కులు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు బాలికను అడ్డగించారు. వెంటతెచ్చుకున్న మత్తు మాత్రలను నీళ్లలో కలిపి తాగమని బాలికను బలవంతం చేశారు. అందుకు నిరాకరించడంతో ఇద్దరు దుండగులు కాలితో ఆమె పొట్టపై తన్నారు. ఆపై చాకుతో దాడిచేసి బలవంతంగా మత్తు మందు కలిపిన నీటిని తాగించారు. అనంతరం ఎవరికో వీడియో కాల్‌చేసి.. ఈ అమ్మాయేనా? కాదా? అని అడిగి తెలుసుకున్నారు. తరువాత ముళ్లపొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్టు చెబుతున్నారు. మత్తు మందు తాగించాక గంటకుపైగా బాలిక స్పృహలో లేదు. స్థానికుల సహాయంతో బాలికను ఆమె తండ్రి యల్లమంద పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం బాలికను పోలీసులు జీపులో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కేసులో అనేక సందిగ్ధాలు: ఎస్పీ కార్యాలయం

యర్రావారిపాలెం మండలం యల్లమంద గ్రామంలో బాలికపై అత్యాచారం జరిగినట్టు ప్రచారం ప్రచారం చేస్తున్నారని.. దీనిపై యర్రావారిపాలెం పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారని తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయం సోమవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొంది. విచారణలో అనేక సందిగ్ధాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపింది. అయితే, విచారణ పూర్తికాకముందే కొంతమంది సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

కేటీఆర్ చుట్టూ.. 'ఫార్ములా–ఈ' ఉచ్చు!

▶ మొదటి పేజీ తరువాయి

అర్వింద్ కుమార్‌కు నోటీసులు జారీ చేశారు. ఈ విచారణలో ఆయన వెల్లడించే అంశాలే కీలకంగా మారనున్నాయి.

ఫార్ములా–ఈ రేసులో ఏం జరిగింది?

హైదరాబాద్‌లో నాలుగు సంవత్సరాలపాటు ఫార్ములా–ఈ రేసు నిర్వహణకు సంబంధించి ఎఫ్ఈవో, ఏస్ నెక్స్ట్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి పురపాలక శాఖ 2022 అక్టోబర్ 25న త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నిర్వహించిన మొదటి ఫార్ములా–ఈ కార్ల రేస్ (సెషన్–9)కు దేశవ్యాప్తంగా అభిమానులు వచ్చినా.. ప్రమోటర్ ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థ ఆశించిన మేరకు ఆదాయం సమకూరలేదు. దీనితో ప్రమోటర్ తప్పుకొన్నారు. 2024 ఫిబ్రవరి 10న నిర్వహించాల్సిన రెండో దఫా (సెషన్–10) ఈ–కార్ రేసు నుంచి హైదరాబాద్ పేరును ఎఫ్ఈవో తొలగించింది. కానీ అప్పటి మంత్రి కేటీఆర్ ఫార్ములా–ఈ నిర్వహణ హైదరాబాద్‌కు తలమానికంగా ఉంటుందని.. 2024 ఫిబ్రవరిలో కూడా హైదరాబాద్‌లోనే కార్ రేస్‌ను నిర్వహించాలని కోరారు. ప్రమోటర్ నిర్వహించే బాధ్యతలను నోడల్ ఏజెన్సీగా హెచ్ఎండీఏ చూసుకుంటుందని ఎఫ్ఈవోకు స్పష్టం చేశారు. ఈ మేరకు రెండో దఫా ఈ కార్ రేస్ కోసం 2023 అక్టోబర్‌లో ఎఫ్ఈవోతో పురపాలక సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. రేస్ నిర్వహణకోసం రూ.100 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇందుకోసం హెచ్ఎండీఏ రూ.55 కోట్లను ఎఫ్ఈవోకు చెల్లించింది.

ఉల్లంఘన అంటూ రేసు రద్దు చేసి..

డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్ములా–ఈ రేసుపై ఆరా తీసింది. పురపాలక శాఖ ఒప్పందంలోని అంశాలను ఉల్లంఘించిందంటూ ఎఫ్ఈవో సెషన్–10ను రద్దు చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఆర్థికశాఖ అనుమతి లేకుండా రూ.55 కోట్లను విదేశీ సంస్థకు హెచ్ఎండీఏ ద్వారా చెల్లింపులు చేయడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలో అర్వింద్‌కుమార్‌ను పురపాలక శాఖ నుంచి బదిలీ చేసింది. నిధుల చెల్లింపుల్లో జరిగిన ఉల్లంఘనలపై వివరణ ఇవ్వాలంటూ ఆయనకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మెమో జారీ చేశారు. ఆ మెమోకు అర్వింద్‌కుమార్ వివరణ ఇస్తూ.. తాను ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడలేదని, అప్పటి మంత్రి కేటీఆర్ ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకే చెల్లింపులు చేశామని పేర్కొన్నట్టు తెలిసింది. తర్వాత ప్రభుత్వం అనుమతినిస్తుందని చెప్పడంతోనే ఎఫ్ఈవోకు నిధులు విడుదల చేసినట్టుగా వివరణ ఇచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఏసీబీ విచారణకు ఆదేశించింది. దర్యాప్తు ప్రారంభించిన ఏసీబీ.. పురపాలక శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్‌కు నోటీసులు జారీ చేసింది.

వందే భారత్.. మేడిన్ తెలంగాణ



▶ మొదటి పేజీ తరువాయి

ఉత్పత్తి ప్రారంభించే లక్ష్యంతో పనిచేస్తున్నది.

రోబోటిక్ టెక్నాలజీ వినియోగం..

కాజీపేటలో ఏర్పాటుచేస్తున్న కోచ్ ఫ్యాక్టరీలో అత్యాధునిక రోబోటిక్ యంత్రాలు వాడాలని కేంద్రం నిర్ణయించింది. గతంలో మంజూరు చేసిన వ్యాగన్ తయారీ కేంద్రాన్ని కోచ్ ఫ్యాక్టరీగా మార్చిన నేపథ్యంలో ఆ మేరకు నిర్మాణాల డిజైన్‌లను మార్చింది. వందేభారత్ రైళ్ల బోగీల తయారీకి వీలుగా జపాన్‌కు చెందిన టైకిషా ఇంజనీరింగ్ సంస్థ నుంచి ఆధునిక రోబోటిక్ యంత్రాలను దిగుమతి చేసుకుంటోంది. ఇప్పటికే ఆ సంస్థకు ఆర్డర్ కూడా ఇచ్చింది. ఈ ఫ్యాక్టరీని రూ.521 కోట్లతో ఏర్పాటుచేస్తామని గతంలో కేంద్రప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఆధునిక యంత్రాలు కొనుగోలు చేస్తుండటంతో బడ్జెట్‌ను మరో రూ.150 కోట్ల మేర పెంచుతోంది.

డిమాండ్‌కు అనుగుణంగా..

ఆలస్యానికి బ్రాండ్‌గా మారిన భారతీయ రైల్వేలను పరుగులు పెట్టించే పని మొదలుపెట్టిన కేంద్ర ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా క్రమంగా హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెడుతున్నది. వందేభారత్ రైళ్లు కూడా అందులో భాగమే. రైల్వేశాఖ సంప్రదాయ ఐసీఎఫ్ కోచ్‌ల వినియోగాన్ని కూడా ఆపేసి పూర్తిగా ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లనే వినియోగించటం ప్రారంభించింది. క్రమంగా ఈ ఎల్‌హెచ్‌బీ కోచ్ రైళ్లను కూడా తప్పించి వందేభారత్ రైళ్లనే తిప్పాలని నిర్ణయించింది. అన్ని కేటగిరీల్లో వాటినే వాడాలన్నది కేంద్రం యోచన. వందేభారత్ రైళ్లకు డిమాండ్ కూడా అమాంతం పెరిగింది. రైల్వేకు చెందిన ప్రధాన కోచ్ ఫ్యాక్టరీలైన చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్‌ఫ్యాక్టరీ (ఐసీఎఫ్), కపుర్తలాలోని రైల్ కోచ్‌ఫ్యాక్టరీ (ఆర్‌సీఎఫ్)లలో ప్రస్తుతం సింహభాగం కోచ్‌ల ఉత్పత్తి జరుగుతోంది. త్వరలో లాతూరులోని మరాట్వాడా రైల్ కోచ్ ఫ్యాక్టరీ (ఎంఆర్‌సీఎఫ్)లో ఉత్పత్తి మొదలు కాబోతోంది. వీటితోపాటు కొన్ని ప్రైవేట్ సంస్థలకు కూడా కోచ్‌ల కోసం రైల్వేశాఖ ఆర్డర్ ఇస్తోంది. భవిష్యత్తు డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి జరగాలన్న ఉద్దేశంతో ఇప్పుడు కాజీపేటలో కూడా అత్యాధునిక కోచ్‌ల తయారీని ప్రారంభిస్తున్నది.

క్రమంగా ఉత్పత్తి పెంపు

- పూర్తిస్థాయిలో నిర్మాణ వ్యవస్థ ఏర్పాటయ్యే వరకు కాజీపేటలో తక్కువ పరిమాణంలో అయినా ఉత్పత్తిని ప్రారంభించాలన్నది కేంద్రం యోచన. ఇందులో భాగంగా తొలుత నెలకు 10 ఎల్‌హెచ్‌బీ, వందేభారత్ కోచ్‌లు తయారు చేసేలా ఏర్పాట్లు చేస్తారు.
- తదుపరి ఐదారు నెలల్లో నెలకు 20 చొప్పున కోచ్‌లు తయారు చేసేలా సిద్ధం చేస్తారు. ఆ తర్వాత డిమాండ్ ఆధారంగా సామర్థ్యాన్ని మరింత పెంచుతారు. అందుకు తగ్గట్టు బడ్జెట్‌ను కేటాయిస్తారు.
- యాద్గిర్‌లో తయారయ్యే చక్రాలను ఇక్కడికి పంపుతారు. మరో ప్రాంతంలో తయారైన విడిభాగాలను (కోచ్ దిగువ భాగం) ఇక్కడికి తీసుకొచ్చి పూర్తిస్థాయి బోగీగా రూపొందించి దానిపై షెల్ (కోచ్ బాడీ)ను బిగిస్తారు.
- కోచ్‌లలో కావాల్సిన అమరికలను సిద్ధం చేసేందుకు కాంపోనెంట్ ఎరక్షన్, ఫ్యాబ్రికేషన్ షెడ్‌లను నిర్మిస్తున్నారు.
- తయారైన కోచ్‌లకు రంగులు వేయటం, వాటి పనితీరును తనిఖీ చేసేందుకు పెయింటింగ్ బూత్, టెస్ట్ షాప్‌లను ఏర్పాటుచేస్తున్నారు.
- ఒక వందేభారత్ రైలు రేక్ తయారీకి రూ.125 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఎల్‌హెచ్‌బీ కోచ్‌ల రైలుకు రూ.80 కోట్లవుతుంది.

ఐదు దశాబ్దాల కల

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు డిమాండ్ ఐదు దశాబ్దాలుగా ఉన్నది. 1982లో ఈ కోచ్ ఫ్యాక్టరీ మంజూరు అయింది. నాటి ప్రధాని ఇందిర హత్య, ఆ తర్వాత సిక్కులపై ఊచకోత.. కాంగ్రెస్‌పై సిక్కుల్లో ఆగ్రహం.. వారిని శాంతపరిచే చర్యల్లో భాగంగా ఇక్కడ ఏర్పాటు కావాల్సిన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తలాకు తరలించారు. అప్పటి నుంచి ఫ్యాక్టరీ కోసం తెలంగాణలో నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. 2009లో మమతా బెనర్జీ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు కాజీపేటకు రైలు చక్రాల తయారీ యూనిట్ మంజూరైంది. అది కూడా ఆ తర్వాత రద్దయ్యి, మోదీ ప్రభుత్వం వచ్చాక పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్‌గా మారింది. భూ సమస్య కారణంగా దాని ఏర్పాటు పనులు ఆలస్యంగా మొదలయ్యాయి. చివరకు గత ఏడాది ఫిబ్రవరిలో దాన్ని గూడ్సు రైలు వ్యాగన్ల తయారీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు. ఇప్పుడు దాన్ని కోచ్‌ల తయారీ కేంద్రంగా మళ్లీ అప్‌గ్రేడ్ చేశారు.

మరో 35 ఎకరాల భూ సేకరణ

కాజీపేట ఫ్యాక్టరీ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం 160 ఎకరాల భూమిని మంజూరు చేసింది. అందులో 150 ఎకరాలు ఇప్పటికే రైల్వేకు అప్పగించింది. మిగతా భూమి త్వరలో అందజేయనుంది. మారిన డిజైన్ నేపథ్యంలో తాజాగా మరో 35 ఎకరాలు కూడా రైల్వే తీసుకోనున్నట్టు తెలిసింది. కాజీపేట స్టేషన్‌తో అనుసంధానిస్తూ కోచ్ తయారీ కేంద్రంలోకి ట్రాక్ ఏర్పాటు పనులు వేగంగా సాగుతున్నాయి.

390 మీటర్ల పొడవైన షెడ్లు

కాజీపేట ఫ్యాక్టరీలో తొలుత వ్యాగన్‌లు తయారుచేయాలని నిర్ణయించినందున అందుకు తగ్గట్టుగానే డిజైన్లు రూపొందించారు. తాజాగా ఆ డిజైన్లలో 50 శాతం వరకు మార్చాల్సి వచ్చింది. ప్రస్తుతం 30 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. 2026 మార్చి నాటికి పూర్తిగా యూనిట్ సిద్ధమై ఉత్పత్తి పనులు మొదలుపెట్టాలన్నది లక్ష్యం. ఇక్కడ భారీ షెల్ అసెంబ్లింగ్ షెడ్ నిర్మిస్తున్నారు. ఇందులో కోచ్‌ల బాడీలు సిద్ధమవుతాయి. వందే భారత్ రైలు దాదాపు 390 మీటర్ల పొడవుంటుంది. దానికి సరిపడే రీతిలో దీన్ని నిర్మిస్తున్నారు.



అడ్డు గడులలో నెం. 52

పేపర్‌లో మన ఊరి పేరు కనిపిస్తేనే ఆసక్తిగా చూస్తాం కదా, అలాంటిది ఏకంగా మన పేరే పేపర్‌లో వస్తే? ఊరంతా తిరిగి ఆ సంతోషాన్ని తలా ఇంత పంచి పెడతాం. త్రిష కూడా మొన్న ఆదివారం (3 నవంబర్) అటువంటి సంతోషంలోనే తేలియాడారు. పైగా ఆమె పేరు వచ్చింది ఇంటర్నేషనల్ పేపర్‌లో. అది కూడా ప్రసిద్ధ 'న్యూయార్క్ టైమ్స్' మేగజీన్‌లో! ఫిల్మ్ న్యూస్ కేటగిరీలో ఆమె పేరు వచ్చుంటే.. సినీ స్టార్ కనుక రాసి ఉంటారని అనుకోవచ్చు. కానీ త్రిష పేరు ప్రస్తావనకు వచ్చింది న్యూయార్క్ టైమ్స్ 1942 నుంచీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తూ వస్తున్న 'క్రాస్‌వర్డ్ పజిల్‌'లో! పజిల్‌లో నిలువు గడులు, అడ్డు గడులు ఉంటాయి కదా, అడ్డు గడులలోని 52 వ 'క్లూ'గా 'యాక్ట్రెస్ కృష్ణన్ ఆఫ్ సౌత్ ఇండియన్ సినిమా' ఎవరు అని అడిగారు. ఇంకెవరు? త్రిషనే! ఆమె పూర్తి పేరు త్రిషా కృష్ణన్. ఇకనేం.. 52 అడ్డులోని ఆరు గడులను టి.ఆర్.ఐ.ఎస్.హెచ్.ఎ. అని తన పేరుతో నింపి, ఆ పజిల్ స్క్రీన్ షాట్‌ను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశారు త్రిష. ''నా పేరు న్యూయార్క్ టైమ్స్‌లో వచ్చిందహో''.. అంటూ ''ఒకే బై, షోయింగ్ పూర్తయింది'' అని ఓ సరదా కామెంట్ కూడా ఆ పోస్ట్‌కి జత చేశారు. ఈ సంతోషం అక్కడితో ఆగలేదు. సమంతా కూడా షేర్ చేసుకున్నారు. ''నువ్వు క్వీన్ త్రిషా'' అన్నారు. అందుకు త్రిషా ''ఆ.. సామ్.. మనిద్దరం ఒకటే'' అని రిప్లయ్ ఇచ్చారు. అవును, వీళ్లిద్దరూ ఒకటే. చిన్న చిన్న సంతోషాలకు కేరింతలు కొట్టే చిన్న పిల్లల మనసున్న సెలబ్రిటీలు.

బ్యూటిప్

బ్లాక్‌హెడ్స్ తగ్గాలంటే...

- టీ స్పూన్ నిమ్మరసంలో కొద్దిగా తేనె కలిసి ముక్కుకు ఇరువైపులా రాసి సున్నితంగా రుద్దాలి. పది నిమిషాల తర్వాత ఐస్ ముక్కతో రబ్ చేయాలి. తర్వాత కడిగేయాలి. రాత్రి పడుకునేముందు రోజూ ఇలా చేస్తూ ఉంటే నిమ్మరసం, తేనెలోని ఔషధ గుణాల వల్ల బ్లాక్‌హెడ్స్ తగ్గిపోతాయి.
- టీ స్పూన్ తేనెను టేబుల్ స్పూన్ మీగడలో కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే చర్మకాంతి పెరుగుతుంది.

ఎన్నికలు



ఎవరిపైన అనుగ్రహం

ఎన్నికలంటే ఉపన్యాసాలు, వాదనలు, పందేలు, ప్రగల్భాలు... ఇవి కాకుండా సర్వేలు, జోస్యాలు కూడా ఉంటాయి. మన దేశంలో ఇవి షరా మామూలే అయినా అమెరికాలో కూడా ఉన్నాయంటే కాసింత ఆశ్చర్యమే. చరిత్రలో ఇంతకు మునుపు లేని విధంగా ఒక స్త్రీగా కమలా హ్యారిస్ అధ్యక్ష పదవికి పోటీ పడుతుంటే గ్రహాలన్నీ ఆమెను చల్లగా చూడనున్నాయని అక్కడి జ్యోతిష్యులు అంటున్నారు. అలాగని ట్రంప్ కోసం తారాతీరాన్ని చూస్తున్నవారు తక్కువగా లేరు. ఇంతకీ అక్కడ ఏం చెబుతున్నారు?

ఎన్నికల కాలంలో జ్యోతిషులకు గిరాకీ మన 'సనాతన' దేశంలోనే కాదు, అగ్రరాజ్యమైన అమెరికా లోనూ ఉంది. త్వరలోనే అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడి జ్యోతిషులు రకరకాలుగా జోస్యాలు చెబుతున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్‌ల మధ్య హోరాహోరీగా పోటీ సాగుతోంది.

రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ ఇదివరకు ఒక సారి అమెరికా అధ్యక్షుడిగా పని చేశారు. అయినా ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్‌కే విజయావకాశాలు మెండుగా ఉన్నాయని అమెరికన్ జ్యోతిషురాలు 'లారీ రివర్స్' గత ఏడాది జూన్‌లోనే జోస్యం చెప్పారు. డెమోక్రటిక్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా కమలా హ్యారిస్ పోటీకి దిగుతారని లారీ 2020 ఆగస్టులో చెప్పిన జోస్యం ఫలించడంతో ఈ ఎన్నికల్లో ఆమె జోస్యంపై జనాలు నమ్మకం పెంచుకుంటున్నారు.

ఈ ఎన్నికల్లో కమలా హ్యారిస్ విజయం తథ్యమని మరో జ్యోతిషురాలు 'అమీ ట్రిప్' జోస్యం ప్రకటించారు. 'స్టార్‌హీల్' అనే యూజర్ పేరుతో 'టిక్‌టాక్'లో నిత్యం జోస్యాలు చెప్పే అమీ ట్రిప్‌కు 7.40 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఈ ఏడాది జూలైలో కొత్తగా 'టిక్ టాక్'లోకి ప్రవేశించిన జ్యోతిషుడు జో థియోడర్ కూడా కమలా హ్యారిస్‌కు అనుకూలంగా జోస్యాన్ని ప్రకటించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలపై జోస్యాలు చెబుతున్న వారిలో ఎక్కువ మంది కమలా హ్యారిస్‌కు అనుకూలంగా జోస్యాలు చెబుతున్నారు.

డొనాల్డ్ ట్రంప్ 1946 జూన్ 14న పుట్టారు. కమలా హ్యారిస్ 1964 అక్టోబర్ 20న పుట్టారు. వీరిద్దరూ నిండు పున్నమి తిథిలోనే పుట్టారు. అయితే ట్రంప్ పుట్టిన రోజున సంపూర్ణ చంద్ర గ్రహణం కూడా ఏర్పడింది. 'చాలామంది జ్యోతిషులు ఈ ఎన్నికల్లో కమలా హ్యారిస్ గెలవాలని భావిస్తున్నారు. అందుకే ఆమెకు అనుకూలంగా జోస్యాలు చెబుతున్నారు. అయితే, సంపూర్ణ చంద్ర గ్రహణం రోజున పుట్టిన వారి శక్తిని తక్కువగా అంచనా వేయలేం. ఈ ఎన్నికల్లో ట్రంప్ గెలిచే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి' అని బ్రిటన్‌కు చెందిన జ్యోతిషురాలు ఫ్రాన్సెస్కా ఆడీ చెబుతుండటం విశేషం.

మరోవైపు భారతీయ జ్యోతిష్యులలో ఒకడైన కార్తిక్ గోర్ ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉన్న రాహువు కమలా హ్యారిస్‌కు మాత్రం వరాలు కురిపించనున్నాడని చెప్పారు. మరో జ్యోతిష్యుడు విజయేంద్ర ట్రంప్ జాతకం ప్రకారం ఆయన విషయంలో చంద్రుడు వేదనలో ఉన్నాడని అందువల్ల అతనికి ప్రతికూలత ఎదురుకానుందని అన్నారు.

అయితే చాట్‌జీపిటి ద్వారా కొందరు 16 శతాబ్దపు మహా జ్యోతిష్యుడైన నోస్ట్రాడామస్ ఇప్పుడు ఉంటే అతను అమెరికా ఎన్నికల విషయంలో ఏం జోస్యం చెబుతాడని ఏ.ఐ.ని అడిగితే అది అనూహ్యమైన జవాబు చెప్పింది. 'కమలా హ్యారిస్‌గానీ ట్రంప్‌గానీ ఊహించే అంచనాకు చేరలేకపోవచ్చు' అంది. 'చివరి నిమిషంలో మలుపు తిరిగి రంగంలో లేని వారు పదవిని ఆశించవచ్చు' కూడా అన్యాపదేశంగా సూచించింది. దాంతో ఈ ఎన్నికల్లో వైస్ ప్రెసిడెంట్ బరిలో ఉన్న టిమ్ వాల్జ్, జెడి వాన్స్ వైపు కొంతమంది చూస్తున్నారు. అలాగే ఏ.ఐ ఈ ఎలక్షన్ల తర్వాత అమెరికాలో అల్లర్లు రేగుతాయని, వీధులు మండుతాయని కూడా జోస్యం చెప్పింది.

గతంలో బైడన్ అధ్యక్షుడు అయ్యే ముందు అలాగే జరిగింది కదా.

ఏమైనా ఈ ఎన్నికలు అందరినీ ఉత్కంఠగా ఎదురు చూసేలా చేస్తున్నాయి. గ్రహాలు ఇదంతా లైవ్‌లో చూస్తూ ఫలితాలను ఏమని టెలికాస్ట్ చేస్తాయో త్వరలో తెలియనుంది.

యోగా కాలమ్

బలాన్ని పెంచే ఉత్కటాసనం

రోజులో ఎక్కువ సేపు కూర్చుని పనిచేసేవారిని తక్కువ సమయంలోనే రిలాక్స్ చేస్తుంది కుర్చీ ఆసనం. ఈ కుర్చీ భంగిమను ఉత్కటాసన అంటారు. ఈ ఆసనాన్ని సాధన చేయడానికి ముందుగా శరీరాన్ని నిలుచున్న స్థానంలో సిద్ధ పరచాలి.

సులువైన సాధన

- ముందు నిటారుగా నిల్చోవాలి. పాదాలు రెండూ దగ్గరగా ఉంచి, చేతులను పైకి ఎత్తాలి.
- కుర్చీలో కూర్చున్నట్టుగా మోకాళ్లను ముందుకు వంచాలి. దీంతో హిప్ భాగం వెనక్కి, మోకాళ్లు ముందుకు వచ్చి, చెయిర్ మీద కూర్చున్న భంగిమ వస్తుంది.
- చేతులను నమస్కారం చేసినట్టుగా ఒక దగ్గరగా చేర్చాలి.
- ఈ భంగిమలో పొట్ట భాగం లోపలికి తీసుకుంటూ, వెన్నెముకను నిటారుగా ఉంచాలి.
- దీర్ఘ శ్వాసలు తీసుకుంటూ, వదులుతూ వీలైనంత వరకు ఈ ఆసనంలో ఉండచ్చు.
- 5 నుంచి 6 సార్లు ఈ ఆసనాన్ని ప్రాక్టీస్ చేయడం ద్వారా కండరాలు బలపడతాయి.

మెరుగైన పనితీరు

- కాలు, కాలు వెనుక, భుజం కండరాలను బలోపేతం అవుతాయి.
- రక్తప్రసరణ, గుండెపనితీరు పెరుగుతుంది.

శ్వాసక్రియ మెరుగుపడటం వల్ల ఊపిరితిత్తుల సామర్థ్యమూ పెరుగుతుంది.


జి.అనూష, యోగా గురు



సాగుబడి

విశాఖ కార్తె: నవంబర్ 6 నుంచి

- పశువులు, కోళ్ల వైద్యానికి సంబంధించి సరికొత్త ప్రామాణిక మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్రం
- యాంటీబయాటిక్ తదితర ఔషధాల వినియోగాన్ని తగ్గించటం, దుర్వినియోగాన్ని అరికట్టే ప్రత్యామ్నాయ చికిత్సలపై దృష్టి
- సంప్రదాయ ఆయుర్వేద చికిత్సా పద్ధతుల (ఈవీఎంల)కు పెద్దపీట
- ఈవీఎంలపై ప్రాంతీయ భాషల్లో పుస్తకాలు, వీడియోలు ఉచితంగా అందుబాటులోకి తెచ్చిన ఎన్.డి.డి.బి.

పశువులు, కోళ్ల వైద్యానికి ప్రామాణిక మార్గదర్శకాలు


కలబంద, పసుపు, వెల్లుల్లి వంటి వాటితోనే పొదుగు వాపు వంటి 22 రకాల తీవ్ర పశు వ్యాధులను సైతం 4–5 రోజుల్లోనే పూర్తిగా తగ్గించే అవకాశం వుందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

దేశంలో పశువులు, కోళ్లకు వచ్చే జబ్బులు, ఇన్ఫెక్షన్లకు అందించే ప్రామాణిక చికిత్సా పద్ధతులను నిర్దేశిస్తూ కేంద్ర పశు సంవర్థక, పాడి అభివృద్ధి శాఖ సరికొత్త మార్గదర్శకాలను ఇటీవల విడుదల చేసింది. పాడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తదితర పశువులతో పాటు కోళ్ల చికిత్సకు ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయి. నిర్హేతుకంగా యాంటీబయాటిక్స్ తదితర అల్లోపతి ఔషధాల వినియోగాన్ని కట్టడి చేయటంతో పాటు.. ఆరోగ్యదాయకమైన ప్రత్యామ్నాయ చికిత్సా పద్ధతులను విస్తృతంగా వ్యాప్తిలోకి తెచ్చే లక్ష్యంతో కేంద్రం ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది. ముఖ్యంగా పాడి పశువుల చికిత్సలో చీటికి మాటికి యాంటీబయాటిక్స్‌ను అతిగా వాడటం, దుర్వినియోగం చేయటం వల్ల పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, గుడ్లు తదితర ఆహారోత్పత్తుల్లో వాటి అవశేషాలు మోతాదుకు మించి మిగిలిపోతున్నాయి.

పశువైద్యంలో యాంటీబయాటిక్ మందులను అతిగా వాడటం వల్ల సూక్ష్మజీవులు నిరోధకతను సంతరించుకుంటున్నాయి. ఫలితంగా యాంటీబయాటిక్ ఔషధాలు నిరర్థకంగా మారుతున్నాయి. ఇది ప్రజారోగ్యానికి పైకి కనిపించని పెను ముప్పుగా పరిణమిస్తోంది. ఈ నేపథ్యంలో ఐక్య రాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ), యుఎస్ఎయిడ్ సంస్థల తోడ్పాటుతో కేంద్ర పశుసంవర్థక మంత్రిత్వ శాఖ 6 నెలల పాటు సుమారు 80 మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని నిపుణులతో చర్చించింది. సరికొత్త ప్రామాణిక మార్గదర్శకాలను రూపొందించి ఇటీవలే విడుదల చేసింది. అల్లోపతి ఔషధాలను ఏయే జబ్బులకు ఎంత మోతాదులో వాడాలో మార్గదర్శకాలలో పొందుపరిచారు.

ఈవీఎంలకు పెద్ద పీట

అంతేకాకుండా, సంప్రదాయ ఆయుర్వేద చికిత్సా పద్ధతుల (ఎత్నో వెటరినరీ మెడిసిన్ ప్రాక్టీసెస్ – ఈవీఎంల)ను, హోమియో వంటి ప్రత్యామ్నాయ చికిత్సా పద్ధతులకు కూడా ప్రభుత్వం ఈ మార్గదర్శకాల్లో పెద్ద పీట వేయటం విశేషం. సంప్రదాయ ఆయుర్వేద పద్ధతుల్లో రైతులే స్వయంగా తయారు చేసుకొని వాడేందుకు వీలుగా ఉండే చికిత్సా పద్ధతులను కూడా పొందుపరిచారు. ఈ రంగంలో 20 ఏళ్లు కృషి చేసిన తమిళనాడుకు చెందిన ఎమిరిటస్ ప్రొఫెసర్ ఎస్. పుణ్యస్వామి 22 రకాల పశువ్యాధులకు రూపొందించిన ఈవీఎం పద్ధతులకు చోటు కల్పించారు. దేశంలో పాడిపై ఆధారపడిన చిన్న, సన్నకారు రైతులకు అతితక్కువ ఖర్చుతో సమకూరే ఈవీఎం చికిత్సా పద్ధతులు ఉపయోగపడతాయని కేంద్ర పశుసంవర్థక శాఖ కార్యదర్శి అల్కా ఉపాధ్యాయ ఆశాభావం వ్యక్తం చేశారు.

అయితే, హోమియో గురించి ప్రస్తావించినప్పటికీ ఈ చికిత్స పద్ధతుల గురించి మార్గదర్శకాల్లో వివరించలేదు. దేశంలోని నలుమూలల్లోని పశువైద్యులు, వైద్య సిబ్బంది, సంప్రదాయ వైద్యులు, పశుపోషకుల అనుభవాలు, సూచనలతో ప్రతి 2–3 ఏళ్లకో సారి ఈ మార్గదర్శకాలను పరిపుష్టం చేయనుండటం మరో విశేషం.

సంప్రదాయ ఆయుర్వేద చికిత్సా పద్ధతులు

తమిళనాడుకు చెందిన తంజావూరులోని వెటరినరీ యూనివర్సిటీ పరిశోధనా కేంద్రంలో 'ఎత్నో–వెటరినరీ హెర్బల్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ యూనిట్' అధిపతిగా పనిచేసిన ఎమిరిటస్ ప్రొఫెసర్ డా. ఎస్. పుణ్యస్వామి, టిడియు ఎమిరిటస్ ప్రొఫెసర్ ఎం.ఎన్. బాలకృష్ణన్ నాయర్ పశువ్యాధులకు సంప్రదాయ ఆయుర్వేద చికిత్సా పద్ధతుల (ఎత్నో వెటరినరీ మెడిసిన్ ప్రాక్టీసెస్– ఈవీఎంల)పై సుదీర్ఘంగా పరిశోధన చేసి ప్రమాణీకరించారు. ముఖ్యమైన 22 రకాల జబ్బులకు (అల్లోపతి మందులు, యాంటీబయాటిక్స్ వాడవసరం లేకుండా) రైతుల ఇళ్లలో పోపు డబ్బాల్లో ఉండే మసాలా దినుసులు, పెరట్లో ఉండే మొక్కలతో ఆయుర్వేద మందుల్ని రైతులే స్వయంగా తయారు చేసుకొని వాడుకోగలిగే పద్ధతులను పొందుపరచిన ఒక చిరు పుస్తకాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం తాజా మార్గదర్శకాలతో పాటు అందుబాటులోకి తెచ్చింది. ఆంగ్లం, హిందీ, తెలుగుతో పాటు 12 భాషల్లో ఈ చిరుపుస్తకాల పీడీఎఫ్‌లను అందుబాటులోకి తెచ్చింది.

పశువులకు, ముఖ్యంగా పాడి ఆవులు, గేదెలకు వచ్చే జబ్బులకు ఆయుర్వేద మందులను రైతులు ఇంటి దగ్గరే ఎలా తయారు చేసుకోవాలి? ఎలా వాడాలి? అనేది తెలుగు సహా ప్రాంతీయ భాషల్లో రూపొందించిన వీడియోలను జాతీయ పాడి అభివృద్ధి సంస్థ (ఎన్.డి.డి.బి.) యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉంచారు. ఈ చిరు పుస్తకాల పిడిఎఫ్‌లను, ఆయుర్వేద మందుల తయారీ, వాడే పద్ధతులు తెలిపే వీడియోలను ఉచితంగానే చూడొచ్చు.. డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాంటీబయాటిక్స్, రసాయనిక ఔషధాల అవశేషాల్లేని ఆరోగ్యదాయకమైన పాలు, మాంసం ఉత్పత్తికి దోహదం చేసే మార్గం ఇది.



మేయని ఆవుకు హోమియో చికిత్స



ఈ ఆవు కడపలోని ఒక హోటల్ యజమానిది. ఆ యజమాని ప్రతి రోజూ పోషక విలువలు గల మేతతో పాటు కూరగాయలు, దాణా కూడా మేపే వారు. అయితే, ఒక రోజు ఆవు మేత తినటం మానేసింది. నీళ్లు కూడా తక్కువగా తాగుతున్నదని పశువుల ఆసుపత్రికి తోలుకొచ్చారు. మేం రోగ నిర్ధారణ పరీక్షలు చేశాం. లోపల పెద్దపొట్ట ఎన్నిసార్లు తిరుగుతున్నది? పొట్టలోని ద్రావణం పి.హెచ్. ఏ స్థాయిలో ఉంది? పొట్టలో సూక్ష్మజీవులు ఉత్తేజిత స్థాయిలో ఉన్నాయా లేవా? ఈ పరీక్షలు చేశాం. పొట్ట కదలికలు, పిహెచ్, సూక్ష్మజీవులు అన్నీ సాధారణంగానే ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. దాంతో కాలేయ సంబంధిత టానిక్‌లు, ఇంజెక్షన్లు, ఆయుర్వేదిక్ పొడులతో పొట్టకు సంబంధించిన అన్ని రకాల చికిత్సలు చేశాం.

పది రోజులైనా మార్పులేదు. ఆ పది రోజులు కేవలం నార్మల్ సెలైన్ బాటిల్‌తోనే బతికిందని చెప్పవచ్చు. అల్లోపతి, ఆయుర్వేదిక్ చికిత్సలు చేసినా మార్పు లేదు కదా.. హోమియోపతి మందులు ఇస్తే ఎలా ఉంటుందో చూద్దాం అని ఆలోచన వచ్చింది. నక్స్ వామికా 200, రూస్‌టాక్స్ 200 గుళికల మందులు రోజుకు 3 సార్లు చొప్పున మూడు రోజులు ఇచ్చాం.

వీటిని దాణాలో కలిపి పెట్టొచ్చు లేదా నేరుగా పశువు పెదానికి, దంతాలకు మధ్యలో హోమియో గుళికలు వేస్తే చాలు. ఈ మందులు వేసిన రెండో రోజే ఆవు మేత మేయటం మొదలు పెట్టిందని ఆవు యజమాని ఆశ్చర్యపడుతూ ఆసుపత్రికి వచ్చి మాతో చెప్పారు. పది రోజులు దాదాపుగా రూ. 2 వేలు ఖర్చు చేసినా రాని ఫలితం రూ. 30ల హోమియోపతి మందులతో రావటం సంతృప్తిని కలిగించింది.

పశువైద్యంలో అల్లోపతి, ఆయుర్వేదిక్ ఔషధాలను తక్కువ చేయడం నా ఉద్దేశం కాదు. తక్కువ ఖర్చుతో పశువులకు మంచి చికిత్స, ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా, అందించవచ్చని మాకు అనుభవపూర్వకంగా అర్థమైంది. పాడి రైతులకు తెలియజేస్తున్న విషయమేమిటంటే ప్రథమ చికిత్సగా తక్కువ ఖర్చుతో కూడిన ఆయుర్వేద, హోమియోపతి చికిత్సలు చేయటం నేర్చుకోవటం అవసరం. అత్యవసర పరిస్థితుల్లో తప్పనిసరిగా పశువైద్యులను సంప్రదించి అల్లోపతి చికిత్సలు తీసుకోవచ్చు.



– డాక్టర్. జి.రాంబాబు (94945 88885), పశువైద్యాధికారి, కడప

తెలంగాణ సోనా.. ఎకరానికి 34 బస్తాలు!

మేం ఇద్దరం విశ్రాంత ఉపాధ్యాయులం. వ్యవసాయ కుటుంబాల్లో పుట్టాం. ఉద్యోగ విరమణానంతరం వ్యవసాయం చేస్తున్నాం. 'సాక్షి' దినపత్రికలో 'సాగుబడి' పేజీలో ప్రచురితమయ్యే కథనాలు ప్రకృతి వ్యవసాయం ప్రారంభించటానికి మాకు ప్రేరణనిచ్చాయి. రెండున్నర ఎకరాల్లో వరి పండిస్తున్నాం. ఈ సంవత్సరం మా పొలంలో తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048) ధాన్యం ఎకరాకు 34 బస్తాల (70 కిలోలవి) దిగుబడి వచ్చిందని తెలియజేయడానికి ఆనందిస్తున్నాం. మీరు నిరంతరాయంగా ప్రచురిస్తున్న ప్రకృతి వ్యవసాయ కథనాల ఫలితమే ఇది. ప్రతి మంగళవారం 'సాగుబడి' ప్రచురిస్తున్న మీకూ, విషయ సేకరణ చేస్తున్న పంతంగి రాంబాబు గారికి మా కుటుంబం తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు. ఇటీవల కొద్దికాలంగా మీరు ప్రతీ బుధవారం ఈపేపర్‌లో ప్రత్యేకంగా 'సాగుబడి ప్లస్' పేజీని అదనంగా ప్రచురించడం హర్షణీయమైన విషయం. ఈ పేజీలను నిరంతరం కొనసాగించాలని కోరుతూ, మరో సారి మీకూ, మీ బృందానికి ధన్యవాదాలు.



– రావిచెట్టు రాజేశ్వర రావు, సుజాతా దేవి, విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు, తీగళతాండా, చిలపూరు మండలం, జనగామ జిల్లా

8 నుంచి 'సిరిధాన్యాలతో జీవన సిరి' శిబిరం

'చిరు(సిరి)ధాన్యాలతో జీవన సిరి' అంశంపై డా. సరళా ఖాదర్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతు శిక్షణా కేంద్రంలో ఈ నెల 8, 9, 10 తేదీలలో ప్రత్యేక ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు తెలిపారు. పాల్గొనదలచినవారు 97053 83666, 70939 73999 నంబర్లకు ఫోన్ చేసి ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

'ఎకరంలో నెలకు రూ.1 లక్ష'పై ఉచిత శిక్షణ



ఎకరం భూమిలో కూరగాయలు, ఆకుకూరల సేంద్రియ సాగు ద్వారా ప్రతి నెలా రూ. లక్ష సంపాదించే పద్ధతులపై క్షేత్రస్థాయిలో ఆచరణాత్మక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్గానిక్ మాండ్య సంస్థ తెలిపింది. రంగారెడ్డి జిల్లా కేశంపేటలోని శివ ఫాం ల్యాండ్ (హైదరాబాద్ నుంచి 60 కి.మీ. దూరం)లో నవంబర్ 16 (శనివారం)న ఉ. 9.30 నుంచి సా. 3.30 వరకు ప్రత్యేక ఉచిత వర్క్‌షాప్ జరగనుంది. వ్యవసాయ విధానాలను మార్చుకొని ప్రాక్టికల్ పద్ధతుల ద్వారా ఎకరానికి రూ.1 లక్ష సంపాదించే మార్గాలపై సేంద్రియ రైతుగా మారిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, ఆర్గానిక్ మాండ్య వ్యవస్థాపకులు మధు చందన్ శిక్షణ ఇస్తారు. లాభదాయకమైన సేంద్రియ సేద్య ప్రణాళిక, మార్కెటింగ్ పద్ధతులను నేర్చుకోదలచిన వారికి ఇదొక అవకాశం. శిక్షణ, భోజనం ఉచితం. మరింత సమాచారం కోసం స్నేహను 89044 14317 సంప్రదించవచ్చు.

సాక్షి
స్పోర్ట్స్
మంగళవారం
5-11-2024



మనిక బత్రాకు నిరాశ

వరల్డ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్స్ ఫ్రాంక్‌ఫర్ట్ టోర్నీలో భారత స్టార్ మనిక బత్రా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. జర్మనీలో సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో ప్రపంచ 26వ ర్యాంకర్ మనిక 6-11, 11-13, 6-11తో వరల్డ్ నంబర్ ర్యాంకర్ షిన్ యుబిన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. 22 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మనిక తన సర్వీస్‌లో 14 పాయింట్లు గెల్చుకుంది. మనికకు 4,250 డాలర్ల (రూ. 3 లక్షల 57 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 15 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

సుమిత్.. మళ్లీ తొలి రౌండ్‌లోనే...

మోజెల్లి ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ కథ తొలి రౌండ్‌లోనే ముగిసింది. ప్రపంచ 66వ ర్యాంకర్ కొరెన్‌టిన్ ముటెట్ (ఫ్రాన్స్)తో ఫ్రాన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తొలి సెట్‌ను 5-7తో కోల్పోయి, రెండో సెట్‌లో 0-4తో వెనుకబడ్డాడు. ఈ దశలో సుమిత్‌కు గాయం కావడంతో మ్యాచ్ నుంచి వైదొలిగాడు. సుమిత్‌కు 6,215 యూరోలు (రూ. 5 లక్షల 70 వేలు) ప్రైజ్‌మనీగా దక్కాయి. సుమిత్ ఆడిన గత పది టోర్నీలలో కేవలం ఒక్క మ్యాచ్‌లోనే గెలుపొందడం గమనార్హం.







హర్మీత్ 'డబుల్' ధమాకా

- పురుషుల సింగిల్స్ టైటిల్ సొంతం
- భార్య కృత్వికతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలోనూ విజేతగా నిలిచిన భారత టీటీ స్టార్

కరాకస్ (వెనిజులా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ కరాకస్ టోర్నీలో భారత స్టార్ ప్లేయర్ హర్మీత్ దేశాయ్ రెండు టైటిల్స్‌తో అదరగొట్టాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో టైటిల్ నెగ్గడంతో పాటు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తన భార్య కృత్విక రాయ్‌తో కలిసి విజేతగా నిలిచాడు. ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 90వ స్థానంలో ఉన్న హర్మీత్ ఫైనల్లో 11-7, 11-8, 11-6తో జో సీఫ్రయిడ్ (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. 22 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో హర్మీత్ తన సర్వీస్‌లో 14 పాయింట్లు, ప్రత్యర్థి సర్వీస్‌లో 19 పాయింట్లు సంపాదించాడు. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో హర్మీత్-కృత్విక రాయ్ ద్వయం 8-11, 11-9, 11-8, 9-11, 11-5తో జార్జి కాంపోస్-డానియెలా ఫాన్సెకా కరాజానా (క్యూబా) జోడీపై గెలుపొందింది.

రియాద్‌లో ఐపీఎల్ మెగా వేలం

ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే అవకాశం



న్యూఢిల్లీ: సుప్రసిద్ధ ఫ్రాంచైజీ లీగ్ ఐపీఎల్‌కు సంబంధించిన ఆటగాళ్ల వేలాన్ని సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఏర్పాట్లు చేస్తోంది. 'ఐపీఎల్ ఆటగాళ్ల మెగా వేలాన్ని రియాద్‌లో నిర్వహిస్తాం. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఫ్రాంచైజీలకు చేరవేశాం. నవంబర్ 24, 25 తేదీల్లో వేలం పాట నిర్వహించే అవకాశాలున్నాయి. త్వరలోనే తేదీలను ఖరారు చేస్తాం' అని బోర్డు విశ్వసనీయ వర్గాలు ఓ వార్తా సంస్థతో పేర్కొన్నాయి. పలువురు భారత స్టార్ క్రికెటర్లను ఆయా ఫ్రాంచైజీలు విడుదల చేయడంతో వేలంపై క్రికెట్ అభిమానుల ఆసక్తి కూడా పెరిగింది. పునరాగమనం తర్వాత టెస్టుల్లోనూ దంచేస్తున్న వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్ తదితరులు వేలంలోకి వచ్చారు. దీంతో ఎవరికెన్ని కోట్లు దక్కుతాయనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. మొత్తం 10 ఫ్రాంచైజీలు కలిపి 46 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకొన్నాయి. ఇందుకోసం రూ. 558.50 కోట్లు వెచ్చించాయి. ఇంకా 204 మంది ఆటగాళ్లను కొనుక్కునేందుకు ఆ ఫ్రాంచైజీల వద్ద రూ.641.50 కోట్లు మిగిలున్నాయి. ఈ 204 మందిలో 70 మంది విదేశీ ప్లేయర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా... ఈసారి జరగబోయే వేలంలో హాట్‌కేక్ రిషభ్ పంతేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఫ్రాంచైజీలన్నీ అతనిపై కన్నేస్తాయని... కాబట్టి ఈ 'వేలం'వెర్రిలో అతనిపై కనీసం రూ.25 కోట్లయిన కురిపించేందుకు యాజమాన్యాలు సిద్ధంగా ఉంటాయి. ఆ తర్వాత కేఎల్ రాహుల్‌కు కూడా దాదాపు రూ. 20 కోట్లు పలికే అవకాశం ఉందని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

సఫారీ గడ్డపై భారత జట్టు

దక్షిణాఫ్రికా చేరుకున్న టి20 టీమ్



డర్బన్: సొంతగడ్డపై టెస్టు సిరీస్ ముగిసిన ఐదు రోజుల్లోపే భారత జట్టు టి20 సమరానికి సన్నద్ధమవుతోంది. అయితే టెస్టు జట్టులో సభ్యులు కాని ఆటగాళ్లతో కూడిన ఈ బృందం విదేశీ వేదికపై సత్తా చాటాలని పట్టుదలగా ఉంది. ఈ నెల 8 నుంచి దక్షిణాఫ్రికాతో జరిగే నాలుగు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనేందుకు టీమిండియా క్రికెటర్లంతా సఫారీ గడ్డపైకి అడుగు పెట్టారు. సూర్య కుమార్ యాదవ్ నాయకత్వంలోని ఈ 15 మంది సభ్యుల బృందానికి డర్బన్‌లో ఘన స్వాగతం లభించింది. టి20 వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత భారత్, దక్షిణాఫ్రికా జట్టుతో తొలిసారి టి20ల్లో తలపడనుండటం విశేషం. వరల్డ్ కప్ విజేతగా నిలిచిన జట్టులో సభ్యులైన సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, అర్ష్‌దీప్ సింగ్, సంజూ సామ్సన్, అక్షర్ పటేల్ ఈ సిరీస్‌లో బరిలోకి దిగబోతున్నారు. డర్బన్ చేరుకున్న తర్వాత భారత ఆటగాళ్లు ఆటకు ముందు సరదాగా గడిపారు. అక్కడి సంస్కృతి, చరిత్ర గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తూ పరస్పరం ప్రశ్నలతో తమ పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఈ నెల 8, 10, 13, 15 తేదీల్లో డర్బన్, పోర్ట్ ఎలిజబెత్, సెంచూరియన్, జొహన్నెస్‌బర్గ్ వేదికలుగా నాలుగు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో రమణ్‌దీప్ సింగ్, విజయ్‌కుమార్ వైశాక్ తొలిసారి ఎంపికయ్యారు.

భారత జట్టు వివరాలు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు సామ్సన్, రింకూ సింగ్, జితేశ్ శర్మ, రమణ్‌దీప్ సింగ్, అభిషేక్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, తిలక్ వర్మ, అర్ష్‌దీప్ సింగ్, రవి బిష్ణోయ్, విజయ్‌కుమార్ వైశాక్, అవేశ్ ఖాన్, వరుణ్ చక్రవర్తి, యశ్ దయాళ్.

'నిన్ను చూసి గర్విస్తున్నా'

రచిన్‌కు తండ్రి మెసేజ్



ముంబై: భారత్‌తో టెస్టు సిరీస్ విజయంలో న్యూజిలాండ్ బ్యాటర్ రచిన్ రవీంద్ర కూడా ప్రధాన పాత్ర పోషించాడు. తన తల్లిదండ్రులు పుట్టి పెరిగిన బెంగళూరులో అద్భుత సెంచరీ సాధించి జట్టును తొలి టెస్టులో గెలిపించిన అతను సిరీస్ విజయానికి పునాది వేశాడు. అయితే ఇన్నేళ్లలో ఎన్నడూ లేనిది సిరీస్ విజయం తర్వాత తన తండ్రి అభినందిస్తూ మెసేజ్ పంపించడం తన ఆనందాన్ని రెట్టింపు చేసిందని రచిన్ చెప్పాడు. చిన్నస్వామి స్టేడియంలో ప్రేక్షకుల మధ్య ఉన్న తండ్రి రవి కృష్ణమూర్తి సమక్షంలోనే రచిన్ శతకంతో సత్తా చాటాడు. 'నేను వంద శాతం న్యూజిలాండ్‌వాడినే. అక్కడే పుట్టి పెరిగాను. కానీ మా అమ్మా నాన్న సొంత ఊరిలో నేను బాగా ఆడటం మరచిపోలేని క్షణం. అది ఎప్పటికీ గుర్తుకు వస్తూనే ఉంటుంది. అయితే ఇన్నేళ్లలో ఆయన నన్ను వ్యక్తిగతంగా అభినందించడం ఎప్పుడూ చూడలేదు. కానీ ముంబై టెస్టు తర్వాత నిన్ను చూసి గర్విస్తున్నా అని నాన్న మెసేజ్ పంపించారు. అందుకే ఈ సిరీస్ విజయానందం రెట్టింపైంది. గెలిచాక మైదానంలో కూడా మా పరిస్థితి అంతా కొత్తగా, నమ్మశక్యం కాని విధంగా ఉంది. ఎజాజ్ చివరి వికెట్ తీయగానే ప్రతీ ఒక్కరూ ఆనందంతో సహచరుల వైపు పరుగెడుతున్నారు. ఇలాంటి అనుభవం ఎప్పుడూ ఎదురు కాలేదు. అందరం ఒక్కచోట చేరి ఆనందం పంచుకున్న అనుభూతిని నిజంగా మాటల్లో వర్ణించలేను. కానీ ఎంతో ప్రత్యేకం అని మాత్రం చెప్పగలను' అని రచిన్ వివరించాడు.

'రిజర్వ్' నుంచి 'హీరో'గా మారి...

భారత్‌తో టెస్టు సిరీస్‌లో సత్తా చాటిన విల్ యంగ్



ముంబై: న్యూజిలాండ్ బ్యాటర్ విల్ యంగ్ 2020 డిసెంబర్‌లో టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అయితే భారత్‌తో సిరీస్‌కు ముందు వరకు ఈ నాలుగేళ్లలో అతను 16 టెస్టులు మాత్రమే ఆడగలిగాడు. ప్రతీసారి రిజర్వ్ ఆటగాడిగానే ఎంపిక కావడం... విరామంలో సహచరులకు డ్రింక్స్ అందించడం మినహా అతనికి చెప్పుకోదగ్గ అవకాశాలే రాలేదు! జట్టులో ఎవరైనా గాయపడితే తప్ప యంగ్ పేరును టీమ్ మేనేజ్‌మెంట్ పరిగణనలోకి తీసుకోలేదు. ఈసారి కూడా అదే పరిస్థితి. గాయం నుంచి కేన్ విలియమ్సన్ కోలుకోకపోవడంతో ముందుగా తొలి టెస్టులో చాన్స్ లభించింది. ఆ తర్వాత విలియమ్సన్ తర్వాతి మ్యాచ్‌లూ ఆడలేడని ఖాయం కావడంతో యంగ్ చోటుకు ఢోకా లేకుండా పోయింది. చివరకు సిరీస్‌లో మొత్తం 244 పరుగులు సాధించి కివీస్ చారిత్రాత్మక విజయంలో కీలకపాత్ర పోషించిన అతను 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా కూడా నిలిచాడు. డ్రింక్స్ అందించడమే తనకు అలవాటుగా మారిపోయిందని... ఇప్పుడు టీమ్‌ను గెలిపించడం తనకు గర్వంగా అనిపిస్తోందని విల్ యంగ్ వ్యాఖ్యానించాడు. 'నాలుగేళ్లలో వేర్వేరు కారణాలతో నేను మైదానంలో కంటే బయటే ఎక్కువగా ఉన్నాను. ఎప్పుడూ రిజర్వ్ బ్యాటర్‌గానే నా పేరు ఉండేది. జట్టు సభ్యులకు డ్రింక్స్ అందించడమే ఒక అనుభవంగా మారిపోయింది. అయితే ఎప్పుడు అవకాశం వచ్చినా నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నించా. విలియమ్సన్ స్థానంలో వచ్చి నా అతడిని అనుకరించకుండా నా సొంత ఆటనే ఆడాను. ఇప్పుడు నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం సంతోషంగా ఉంది' అని యంగ్ అన్నాడు. భారత్‌ను స్పిన్ పిచ్‌లపైనే చిత్తు చేయడం గొప్పగా అనిపించిందని యంగ్ చెప్పాడు.

ఆసీస్‌దే తొలి వన్డే

- రాణించిన కమిన్స్, స్టార్క్
- రెండు వికెట్ల తేడాతో ఓడిన పాక్



మెల్‌బోర్న్: పాకిస్తాన్‌తో మొదలైన మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌లో ఆస్ట్రేలియా కష్టపడి శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తొలి వన్డేలో ఆసీస్ రెండు వికెట్ల తేడాతో పాక్‌పై గెలిచి 1-0తో సిరీస్‌లో ముందంజ వేసింది. అయితే ఈ మ్యాచ్‌లో ఓడినప్పటికీ పాకిస్తాన్ తక్కువ స్కోరును కాపాడుకునేందుకు చక్కని పోరాటం చేసి ఆకట్టుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 46.4 ఓవర్లలో 203 పరుగుల వద్ద ఆలౌటైంది. కెప్టెన్ రిజ్వాన్ (71 బంతుల్లో 44; 2 ఫోర్లు, 1 సిక్స్), బాబర్ ఆజమ్ (44 బంతుల్లో 37; 4 ఫోర్లు), తొమ్మిదో వరుస బ్యాటర్ నసీమ్ షా (39 బంతుల్లో 40; 1 ఫోర్, 4 సిక్స్‌లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిచెల్ స్టార్క్ 3 వికెట్లు తీయగా... కెప్టెన్ కమిన్స్, లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత ఆస్ట్రేలియా తక్కువ లక్ష్యమే అయినా ఛేదించేందుకు ఆపసోపాలు పడింది. స్టీవ్ స్మిత్ (46 బంతుల్లో 44; 6 ఫోర్లు), జోష్ ఇంగ్లిస్ (42 బంతుల్లో 49; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. జూన్‌లో జరిగిన టి20 ప్రపంచకప్ తర్వాత పునరాగమనం చేసిన కెప్టెన్ కమిన్స్ (31 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు) బ్యాటింగ్‌లోనూ కుదురుగా ఆడటం వల్లే ఆసీస్ గట్టెక్కింది. లేదంటే 155 పరుగులకే 7 వికెట్లను కోల్పోయిన ఆతిథ్య జట్టు ఓటమికి చేరువైంది. 54వ వన్డే ఆడిన స్టార్క్ సొంతగడ్డపై 100 వికెట్లను పడగొట్టిన రికార్డును బ్రేక్ చేశాడు. మాజీ స్పీడ్‌స్టర్ బ్రెట్ లీ 55 వన్డేల్లో 100 వికెట్లు తీస్తే ఓ మ్యాచ్ ముందే ఈ మైలురాయిని చేరుకున్నాడు. ఇరుజట్ల మధ్య అడిలైడ్ వేదికపై 8న రెండో వన్డే జరుగుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా



● రామ్‌చరణ్
● ఎన్టీఆర్

ఆర్‌ఆర్‌ఆర్‌కు అరుదైన గౌరవం

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాకు అరుదైన గౌరవం లభించింది. దాదాపు 150 సంవత్సరాల చరిత్ర కలిగిన లండన్‌లోని ఐకానిక్ రాయల్ ఆల్బర్ట్ సినిమా హాల్‌లో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం ప్రదర్శితం కానుంది. వచ్చే ఏడాది మే 11న ఈ మూవీ స్క్రీనింగ్ ఉంటుందని 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్ ప్రకటించింది. అలాగే ఈ కార్యక్రమంలో రాయల్ ఫిల్ హార్మోనిక్ ఆర్కెస్ట్రాతో 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్ర సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి లైవ్ కన్సర్ట్ ఇవ్వనున్నారు. కాగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా 2022 మార్చి 25న విడుదలై బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో (నాటు నాటు పాటకు గాను) ఎమ్ఎమ్ కీరవాణి, లిరిక్ రైటర్ చంద్రబోస్ ఆస్కార్ అవార్డులు అందుకున్న సంగతి తెలిసిందే. పలు అంతర్జాతీయ, జాతీయ అవార్డులు కూడా లభించాయి. కాగా ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వం వహించిన 'బాహుబలి: ది కన్‌క్లూజన్' సినిమా ఐకానిక్ రాయల్ ఆల్బర్ట్ హాల్‌లో 2019లో ప్రదర్శితమైన విషయం తెలిసిందే.



● వరుణ్ ధావన్

నేను ఇప్పుడే వచ్చాను!



వరుణ్ ధావన్ హీరోగా నటించిన తాజా హిందీ చిత్రం 'బేబీ జాన్'. కాలీస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కీర్తీ సురేష్, వామికా గబ్బి హీరోయిన్లుగా నటించారు. తమిళ దర్శకుడు అట్లీ, సినీ1 స్టూడియోస్, ఏ ఫర్ యాపిల్ పతాకాలపై జ్యోతీ దేశ్‌పాండే, మురాద్ ఖేతనీ, ప్రియా అట్లీ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 25న రిలీజ్ కానుంది. తాజాగా 'బేబీ జాన్' టీజర్ కట్ పేరుతో ఈ సినిమా కొత్త వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. 'బేబీ వాళ్లకు అర్థమయ్యే భాషలోనే చెప్పొచ్చుగా..', 'నాలాంటివాళ్లు గతంలో చాలామంది వచ్చి ఉండొచ్చు.. కానీ నేను తొలిసారిగా ఇప్పుడే వచ్చాను' వంటి డైలాగ్స్‌తో పాటు 'హో.. బేబీజాన్' సాంగ్ వీడియోలో ఉంది.

శివరాత్రికి తమ్ముడు



● నితిన్

నితిన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తమ్ముడు' వచ్చే శివరాత్రికి విడుదల కానుంది. శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నటి లయ ఓ లీడ్ రోల్ పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా 'తమ్ముడు' మూవీని వచ్చే ఏడాది మహాశివరాత్రి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్లు సోమవారం చిత్రయూనిట్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసింది. ఈ మూవీకి సంగీతం: అజనీష్ లోకనాథ్, కెమెరా: కేవీ గుహన్.

అది లక్కీ భాస్కర్‌తో నెరవేరింది



\- దుల్కర్ సల్మాన్

"నేను ఎప్పటి నుంచో వాస్తవానికి దగ్గరగా ఉండే ఒక మధ్యతరగతి తండ్రి పాత్ర చేయాలనుకుంటున్నాను. అది 'లక్కీ భాస్కర్' సినిమాతో నెరవేరింది. డైరెక్టర్ వెంకీ బ్యాంకింగ్ నేపథ్యంలో మధ్యతరగతి కుటుంబ కథ చెప్పడం కొత్తగా అనిపించింది. సినిమాలో హర్షద్ మెహతా లాంటివాడు భారీ స్కాం చేస్తుంటే, చిన్న బ్యాంక్ ఉద్యోగి అయిన భాస్కర్ తన పరిధిలో స్కాం చేయడం కొత్తగా అనిపించింది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అని హీరో దుల్కర్ సల్మాన్ అన్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జంటగా నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 31న విడుదలైంది. ఈ నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో దుల్కర్ సల్మాన్ విలేకరులతో పంచుకున్న విశేషాలు...

- నేను తెలుగులో నటించిన 'మహానటి, సీతా రామం, లక్కీ భాస్కర్' సినిమాలు హ్యాట్రిక్ విజయాలు సాధించడంతో కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని సంతోషంగా ఉంది. నటుడిగా అన్ని రకాల పాత్రలు చేయాలి. షారుఖ్ ఖాన్ లాంటివారు కూడా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు చేశారు. మనలోని నటుణ్ణి బయటకు తీసుకురావాలంటే ఇలాంటి విభిన్న పాత్రలు చేయాలి. 'లక్కీ భాస్కర్' చిత్రంలోని భాస్కర్ పాత్రలో నెగటివ్ షేడ్స్‌తో పాటు ఎన్నో భావోద్వేగాలున్నాయి. నటుడిగా ఇలాంటి పాత్రలు సంతృప్తిని ఇస్తాయి. ఈ సినిమా షూటింగ్‌ని ప్రతిరోజూ చాలా ఎంజాయ్ చేశాను. నాకు ఎంతో సంతృప్తి ఇచ్చిన చిత్రమిది.
- నేను నటుడు మమ్ముట్టిగారి కొడుకుని అయినప్పటికీ సాధారణ యువకుల్లాగానే ఆలోచిస్తాను. లాటరీ తగిలితే సొంతంగా నాకు నచ్చినవన్నీ కొనుక్కోవచ్చు అని చిన్నప్పుడు కలలు కనేవాడిని. 'లక్కీ భాస్కర్' చూసిన నాన్నగారు నాతో ఏం చెప్పలేదు. కానీ, వెంకీతో మాట్లాడి యూనిట్‌ని ప్రత్యేకంగా అభినందించారు. నాకు బాగా నచ్చిన కథల గురించి నాన్నకి చెబుతుంటాను. 'లక్కీ భాస్కర్' కథకి తగ్గట్టుగా, ప్రతి భావోద్వేగాన్ని ప్రేక్షకులు అనుభూతి చెందేలా జీవీ ప్రకాష్ సంగీతం అందించారు. సినిమాకి వస్తున్న స్పందన చూసి నిర్మాతలు నాగవంశీ, సాయి సౌజన్యగార్లు చాలా సంతోషంగా ఉన్నారు. ప్రస్తుతం తెలుగులో 'ఆకాశంలో ఒక తార' సినిమా చేస్తున్నాను.

యాక్షన్ డ్రామా



● బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమాకు 'భైరవం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గడ సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ ఈ నియో నోయర్ యాక్షన్ డ్రామా చిత్రం నిర్మిస్తున్నారు. తాజాగా 'భైరవం' సినిమాలో శీను పాత్రలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ నటిస్తున్నట్లు వెల్లడించి, ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు చిత్రయూనిట్. ఈ సినిమాకు సంగీతం: శ్రీ చరణ్ పాకాల, కెమెరా: హరి కె. వేదాంతం.

మనసుకు మందే పెట్టావయ్యా..!



● మాధవ్, సిమ్రాన్ శర్మ

హీరో రవితేజ తమ్ముడు రఘు తనయుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. గౌరి రోణంకి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్. యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ రవిచంద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని 'కావాలయ్యా..' పాట లిరికల్ వీడియోను సంగీత దర్శకుడు తమన్ రిలీజ్ చేశారు. 'కళ్లల్లోకి కళ్లు పెట్టి అదోలా చూశావయ్యా.. మాటలతోనే మనసుకు మందే పెట్టావయ్యా.. తస్సాదియ్యా..' అంటూ ఈ పాట సాగుతుంది. భాస్కరభట్ల లిరిక్స్ అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ఈ సినిమాకు అనూప్ రూబెన్స్ సంగీతం అందించారు.

ధూం ధాం ఆకట్టుకుంటుంది

\- హెబ్బా పటేల్

"కుటుంబ భావోద్వేగాలు, ప్రేమ, వినోదం వంటి అన్ని వాణిజ్య అంశాలతో రూపొందిన చిత్రం 'ధూం ధాం'. ఈ సినిమాలో బాగా డబ్బున్న సుహానా అనే బబ్లీ గర్ల్ పాత్ర చేశా. వెకేషన్‌లో భాగంగా హీరోని కలుస్తుంది సుహానా. అక్కడి నుంచి వారి స్నేహం, ప్రేమ మొదలవుతాయి. మంచి ఫీల్ గుడ్ చిత్రమిది. అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అని హెబ్బా పటేల్ అన్నారు. చేతన్ కష్ణ, హెబ్బా పటేల్ జోడీగా సాయి కిషోర్ మచ్చా దర్శకత్వం వహించిన చిత్రం 'ధూం ధాం'. గోపీ మోహన్ స్టోరీ, స్క్రీన్ ప్లే అందించారు. ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్‌పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హెబ్బా పటేల్ మాట్లాడుతూ– '' డైరెక్టర్ సాయి రాజేశ్‌గారు ఫోన్ చేసి 'ధూం ధాం' ప్రాజెక్ట్ గురించి చెప్పారు. కథ వినగానే నాకు బాగా నచ్చడంతో వెంటనే ఓకే చెప్పాను. సాయి కిషోర్‌గారు సరదాగా ఉంటారు. ఆయనతో పనిచేయడం సంతోషంగా అనిపించింది. చేతన్ మంచి సహ నటుడు. ఈ మూవీ రిలీజ్ తర్వాత మంచి ప్యాషనేట్ ప్రొడ్యూసర్‌గా రామ్ కుమార్‌గారికి పేరు వస్తుంది. గోపీ సుందర్‌గారి పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది'' అని తెలిపారు.

వాస్తవ ఘటనల జాతర



● సతీష్ బాబు

"చిత్తూరు జిల్లా మదనపల్లె పరిసర గ్రామంలో గంగమ్మ అమ్మవారి గుడి ఉంది. చుట్టుపక్కల 18 ఊళ్ల ప్రజలు ఈ గుడికి వచ్చి అమ్మవారిని కొలుస్తారు. ఆ అమ్మవారి గురించి తీసిన చిత్రమే 'జాతర'. వాస్తవ ఘటనలకు ఫిక్షన్ యాడ్ చేసి ఈ చిత్రాన్ని రూపొందించాను. అమ్మవారి పట్ల రాక్షసుడిగా వ్యవహరిస్తున్న వ్యక్తిని హీరో ఎలా సంహరించాడు? అనేది మా చిత్రంలో చూపిస్తున్నాం'' అని సతీష్ బాబు రాటకొండ చెప్పారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'జాతర'. గల్లా మంజునాథ్ సమర్పణలో రాధాకృష్ణా రెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న రిలీజ్ కానుంది. సతీష్ బాబు రాటకొండ మాట్లాడుతూ– ''ఈ సినిమా ఓ పెద్ద హీరోతో చేయాల్సింది. కుదరక నేనే హీరోగా చేశా. ఇందులో ప్రేమ కథ ఉంటుంది. మా నిర్మాతలు ఎంతో సపోర్ట్ చేశారు'' అన్నారు.

పల్లెటూరి నేపథ్యంలో...



● విప్లవ్, అశ్విని

విప్లవ్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఈసారైనా'. అశ్విని హీరోయిన్‌గా నటించారు. ఈ సినిమా ఈ నెల 8న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో విప్లవ్ మాట్లాడుతూ–''అందమైన పల్లెటూరి నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఈసారైనా'. ఒక నిరుద్యోగ యువకుడు ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతూ అతని ప్రేమను వెతుక్కునే దిశగా ఎలా ముందుకు సాగుతాడు? అనే కథ ఆసక్తిగా ఉంటుంది. సంకీర్త్‌గారి వల్లే మా సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది''అని చెప్పారు. ''మా 'ఈసారైనా' ప్రేక్షకులకు మంచి అనుభూతిని పంచుతుంది'' అని చిత్ర సహ నిర్మాత సంకీర్త్, అశ్విని అన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
5-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	942	78,782
నిఫ్టీ ▽	309	23,995

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,227	▽	13
డోజోన్స్	41,871	▽	181
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,184	△	7
డాక్స్	19,148	▽	107
షాంఘై	3,310	△	38
నికాయ్ (శుక్రవారం ముగింపు)	38,054	▽	1,028

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	78,518
బంగారం (99.5 స్వచ్ఛత)	78,204
వెండి (కిలో)	94,482

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	107.61	110.46
€	యూరో	ఒకటి	89.62	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.27	55.71
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.22	56.41
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.55	66.32
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.51	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.04	23.81
¥	చైనా యువాన్	ఒకటి	10.89	12.65

ఎన్‌ఎస్‌ఈ లాభం హైజంప్

క్యూ2లో రూ. 3,137 కోట్లు



న్యూఢిల్లీ: నేషనల్ స్టాక్ ఎక్స్చేంజీ (ఎన్‌ఎస్‌ఈ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 57% జంప్‌చేసి రూ. 3,137 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం సైతం 25% ఎగసి రూ. 5,023 కోట్లకు చేరింది. ట్రేడింగ్ ఆదాయంకాకుండా క్లియరింగ్ సర్వీసులు, డేటా సెంటర్, కనెక్టివిటీ చార్జీలు, లిస్టింగ్ సర్వీసులు, ఇండెక్స్ సర్వీసులు, డేటా సర్వీసులు తదితర ఇతర ఆదాయం ఇందుకు సహకరించినట్లు పేర్కొంది. వాటాదారులకు 4:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేసిన తదుపరి క్యూ2 షేరువారీ ఆర్జన (ఈపీఎస్) రూ.8.08 నుంచి రూ. 12.68కు మెరుగుపడినట్లు ఎన్‌ఎస్‌ఈ వెల్లడించింది. కాగా.. ఈ ఏడాది తొలి 6 నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) ఆదాయం రూ. 9,974 కోట్లకు చేరగా.. రూ. 5,704 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఈ కాలంలో ఎస్‌టీటీ, సీటీటీ ద్వారా రూ. 24,755 కోట్లుసహా.. స్టాంప్‌డ్యూటీ, సెబీ ఫీజు, ఆదాయపన్ను, సర్వీస్ ట్యాక్సులు కలిపి ప్రభుత్వానికి మొత్తం రూ. 30,130 కోట్లు అందించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

ఎయిర్ ప్యూరిఫయర్లకు భారీ డిమాండ్	పసిడి వెనకడుగు.. రూ. 1,300 మైనస్

బేర్ ఎటాక్..!

మూడు నెలల కనిష్టానికి సూచీలు
- అమెరికా ఎన్నికలు, ఫెడ్ రిజర్వ్ సమావేశాలకు ముందు అప్రమత్తత
- అధిక వెయిటేజీ రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్ల పతనం ప్రభావం
- సెన్సెక్స్ 942 పాయింట్లు క్రాష్.. 24 వేల దిగువకు నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో సోమవారం అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. బెంచ్ మార్క్ ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీ ఒక శాతానికి పైగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 942 పాయింట్లు క్షీణించి 78,782 వద్ద స్థిరపడగా... నిఫ్టీ 309 పాయింట్లు నష్టపోయి 24 వేల దిగువన 23,995 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు మూడు నెలల కనిష్టం కావడం గమనార్హం. ఉదయం స్తబ్దుగా మొదలైన సూచీలు అంతర్జాతీయ మార్కెట్లోని ప్రతికూల సంకేతాలతో నష్టాల బాటపట్టాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపడంతో ట్రేడింగ్ గడిచే కొద్ది నష్టాల తీవ్రత మరింత పెరిగింది. ఒక దశలో సెన్సెక్స్ 1,492 పాయింట్లు క్షీణించి 78,233 వద్ద, నిఫ్టీ 488 పాయింట్లు పతనమై 23,816 వద్ద కనిష్టాలు తాకాయి. ట్రేడింగ్ చివర్లో కనిష్ఠ స్థాయిల వద్ద పలు షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కొంతమేర నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. కొన్ని రియల్టీ రంగ షేర్లు 5–6 శాతం వరకూ పతనం కాగా... ప్రైవేటు రంగ బ్యాంకు, ఆయిల్‌అండ్‌గ్యాస్ రంగాల షేర్లు 3–6 శాతం నష్టపోయాయి.

అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాలే

ఇంట్రాడేలో అన్ని రంగాల షేర్లలోనూ విక్రయాలు వెల్లువెత్తాయి. అత్యధికంగా రియల్టీ ఇండెక్స్ 3% క్షీణించింది. ఆయిల్‌అండ్‌గ్యాస్, ఇంధన సూచీలు 2.50% పడ్డాయి. టెలికమ్యూనికేషన్, విద్యుత్, కమోడిటీ షేర్లు 1.50% నష్టపోయాయి. వాస్తవానికి చిన్న, మధ్య తరహా షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ ఏకంగా 2% పతనమైంది. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.50% నష్టపోయింది.

- ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు మినహా అన్ని దేశాల ఇండెక్సులు నష్టపోయాయి. 1% నుంచి అరశాతం నుంచి పతనమయ్యాయి. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ సూచీలు పావుశాతం నష్టపోయాయి. అమెరికా సూచీలు బలహీనంగా ట్రేడవుతున్నాయి.
- సెన్సెక్స్ 942 పాయింట్ల పతనంతో ఇన్వెస్టర్ల సంపద గురువారం ఒక్కరోజే రూ. 5.99 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్‌ఈ మార్కెట్ విలువ రూ.421 లక్షల కోట్లకు దిగివచ్చింది. రిలయన్స్ 3%, అదానీ పోర్ట్స్ 3%, సన్‌ఫార్మా 2.60%, ఎన్‌టీపీసీ 2.50%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.45%, యాక్సిస్ బ్యాంకు 2.40 నష్టపోయాయి.
- అక్టోబర్ వాహన అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండడంతో బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్ షేర్లు 3–4% చొప్పున నష్టపోయాయి.

ఎదురీదిన ఆఫ్కాన్స్ ఇన్ఫ్రా షేరు

ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రా షేరు ఎదురీదింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.463)తో పోలిస్తే 7% డిస్కౌంటుతో రూ.430 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 9% క్షీణించి రూ.420 వద్ద కనిష్టాన్ని తాకింది. అయితే ట్రేడింగ్ చివర్లో రికవరీతో 2.50% లాభపడి రూ.475 వద్ద స్థిరపడింది.



నష్టాలు ఎందుకంటే..?

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికలు, **ఫెడరల్ రిజర్వ్ బ్యాంకు** ద్రవ్య పరపతి సమావేశాల**(6–7 తేదీల్లో) నేప**థ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి **వ్యవహరించారు. బీజింగ్**లో జరుగుతున్న **నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్** సందర్భంగా చైనా మరో **ఆర్థిక ప్యాకేజీ ప్రకటిం**చవచ్చనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. చమురు ఉత్పత్తి పెంచాలనే నిర్ణయాన్ని ఓపెక్ వాయిదా వేసుకోవడంతో క్రూడాయిల్ ధరలు 2% పెరిగాయి. సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపరిచేలా ఉండటంతో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాల పరంపర కొనసాగుతోంది.

ఐపీవో కార్నర్..

ఇష్యూకు 2 కంపెనీలు రెడీ

బుధవారం ఆక్మే సోలార్.. గురువారం నివా బూపా షురూ



ధర శ్రేణి: రూ. 275-289
రిటైల్ ఇన్వెస్టర్లకు కనీస లాట్: 51 షేర్లు
లిస్టింగ్: 13న

న్యూఢిల్లీ: రెనెవబుల్ ఎనర్జీ కంపెనీ ఏసీఎంఈ (ఆక్మే) సోలార్ హోల్డింగ్స్ పబ్లిక్ ఇష్యూ రేపు(6న) ప్రారంభంకానుంది. 8న ముగియనున్న ఇష్యూకి రూ. 275–289 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 2,395 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 505 కోట్ల విలువైన షేర్లను ఆక్మే క్లీన్‌టెక్ సొల్యూషన్స్ విక్రయానికి ఉంచనుంది. వెరసి ఐపీవో ద్వారా రూ. 2,900 కోట్లు సమీకరించనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు నేడు(5న) షేర్లను కేటాయించనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 1,795 కోట్లు రుణ చెల్లింపులకు వినియోగించనుంది. సోలార్ పవర్ ప్రాజెక్టుల కంపెనీ సమీకృత పునరుత్పాదక ఇంధన సంస్థగా ఆవిర్భవించింది. 2024 జూన్‌కల్లా నిర్వహణలోని 28 ప్రాజెక్టులను కలిగి ఉంది. వీటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్తాన్‌లలోనే 18 ప్రాజెక్టులున్నాయి. ప్రస్తుత సామర్థ్యం 1,320 మెగావాట్లుకాగా.. 1,650 మెగావాట్లు నిర్మాణంలో ఉన్నాయి. గతేడాది రూ. 1,319 కోట్ల ఆదాయం, రూ. 698 కోట్ల నికర లాభం సాధించింది.

నివా బూపా



ధర శ్రేణి: రూ. 70-74
రిటైల్ ఇన్వెస్టర్లకు కనీస లాట్: 200 షేర్లు
లిస్టింగ్: 14న

ఆరోగ్య బీమా రంగ కంపెనీ నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ పబ్లిక్ ఇష్యూ గురువారం(7న) ప్రారంభంకానుంది. 11న ముగియనున్న ఇష్యూకి రూ. 70–74 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 1,400 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా రూ. 2,200 కోట్లు సమీకరించనుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు రేపు(6న) షేర్లను కేటాయించనుంది. కంపెనీ ప్రమోటర్లలో 62.19 శాతం వాటాగల బూపా సింగపూర్ హోల్డింగ్స్ రూ. 350 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ చేయనుంది. 26.8 శాతం వాటా కలిగిన ఫెటల్ టోన్ ఎల్ఎల్‌పీ రూ. 1,050 కోట్ల విలువైన వాటాను విక్రయించనుంది. ఈక్విటీ జారీ నిధులను మూలధన పటిష్టతకు వినియోగించనుంది. దేశీ మార్కెట్లో స్టార్ హెల్త్ తదుపరి స్టాండెలోన్ కంపెనీగా లిస్టకానుంది. గతేడాది మొత్తం ప్రీమియం ఆదాయం 38 శాతం జంప్‌చేసి రూ. 5,608 కోట్లకు చేరింది. రూ. 82 కోట్ల నికర లాభం ఆర్జించింది.

ఐపీవో బాటలో కార్‌దేఖో

ఆటో క్లాసిఫైడ్స్ పోర్టల్ కార్‌దేఖో పబ్లిక్ ఇష్యూ సన్నాహాలు ప్రారంభించింది. సంస్థ సహవ్యవస్థాపకుడు అమిత్ జైన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్‌లను నియమించేందుకు చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీవో ద్వారా రూ. 4,000 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికల్లో ఉంది. దీంతో 2021 ఆగస్ట్‌లో వెలువడిన కార్‌ట్రేడ్ టెక్ లిమిటెడ్ ఐపీవో తదుపరి రెండో ఆటో క్లాసిఫైడ్ లిస్టెడ్ సంస్థగా కార్‌దేఖో నిలవనుంది.

మార్కెట్లోకి నిప్పో స్వ్యాపర్ లిక్విడ్ రిపెల్లెంట్

హైదరాబాద్: ఇండో నేషనల్ లిమిటెడ్ 'నిప్పో స్వ్యాపర్' పేరుతో మస్కిటో రిపెల్లెంట్‌ను విడుదల చేసింది. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, జికా వంటి విషజ్వరాలకు కారణమయ్యే దోమలను ఈ ప్రొడక్ట్ సమర్థవంతంగా తరిమికొడుతుందని కంపెనీ తెలిపింది. ఇందులో వినియోగించే 'జపనీస్ మెటోఫ్లుత్రిన్' ఫార్ములా అధునాతనమైందని, దీంతో ఎలాంటి సైడ్ ఎఫెక్టులు ఉండవని పేర్కొంది. దేశంలోని ప్రజల ఆరోగ్యం వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా 'నిప్పో స్వ్యాపర్'ను మార్కెట్లోకి తీసుకొచ్చినట్లు సీఓఓ పవన్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన టెలివిజన్ వాణిజ్య చిత్రాన్ని (టీవీసీ) దర్శకుడు నోబిన్ దత్తా చిత్రీకరించారు.



అక్టోబర్‌లో 'తయారీ' పురోగమనం

హెచ్ఎస్‌బీసీ ఇండియా పీఎంఐ 57.5కు అప్

న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం అక్టోబర్‌లో పుంజుకుందని హెచ్ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) సూచించింది. సెప్టెంబర్‌లో ఎనిమిది నెలల కనిష్టం 56.5 స్థాయికి పడిపోయిన సూచీ, అక్టోబర్‌లో కొంత పుంజుకుని 57.5కు ఎగసింది. కొత్త ఆర్డర్లు అలాగే అంతర్జాతీయ విక్రయాల్లో సానుకూలతలు దీనికి కారణమని నెలవారీ సర్వే పేర్కొంది. కాగా, పీఎంఐ 50లోపునకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. సూచీ 50 పైన కొనసాగితే దానిని వృద్ధి ధోరణిగా పేర్కొంటారు. తాజా సూచీ పురోగమనం ఎకానమీకి సానుకూల సంకేతమని, తయారీ రంగంలో డిమాండ్ పరిస్థితులను సూచిస్తోందని హెచ్ఎస్‌బీసీ చీఫ్ ఎకనమిస్ట్ (ఇండియా) ప్రంజుల్ భండారి పేర్కొన్నారు.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 592 పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న బీవోబీ శాఖల్లోని వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 592.
» పోస్టుల వివరాలు: రిలేషన్‌షిప్ మేనేజర్, జోనల్ లీడ్ మేనేజర్, బిజినెస్ మేనేజర్, డేటా ఇంజనీర్స్, టెస్టింగ్ స్పెషలిస్ట్, ప్రాజెక్ట్ మేనేజర్, జోనల్ రిసీవబుల్స్ మేనేజర్, రీజనల్ రిసీవబుల్స్ మేనేజర్, ఏరియా రిసీవబుల్స్ మేనేజర్, ఫ్లోర్ మేనేజర్, సీనియర్ క్లౌడ్ ఇంజనీర్, ప్రొడక్ట్ మేనేజర్ తదితరాలు.
» విభాగాలు: ఫైనాన్స్, ఎంఎస్ఎంఈ, డిజిటల్ గ్రూప్,రిసీవబుల్స్ డిపార్ట్‌మెంట్,ఐటీ,సీ-ఐసీ.
» అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, సీఏ/సీఎంఏ/సీఎఫ్ఏ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 19.11.2024
» వెబ్‌సైట్: www.bankofbaroda.in

మద్రాస్ హైకోర్టులో 30 రీసెర్చ్ లా అసిస్టెంట్ పోస్టులు

మద్రాస్ హైకోర్టు ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ లా అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 30.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(లా), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» దరఖాస్తు విధానం:ఈమెయిల్/ఆఫ్‌లైన్ ద్వారా
» ఈమెయిల్: mhclawclerkrec@gmail.com.
» ఎంపిక విధానం: వైవా, స్క్రీనింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్ జనరల్, మద్రాస్ హైకోర్టు, మద్రాస్ చిరునామాకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 22.11.2024.
» వెబ్‌సైట్: https://tshc.gov.in

ఐటీబీపీలో 20 గ్రూప్–సి పోస్టులు

ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) తాత్కాలిక ప్రాతిపదికన గ్రూప్–సి(నాన్–గెజిటెడ్–నాన్ మినిస్టీరియల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 20.
» పోస్టుల వివరాలు: అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్–12, హెడ్ కానిస్టేబుల్–1, కానిస్టేబుల్–7.
» విభాగాలు: ల్యాబొరేటరీ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్,ఓటీ టెక్నీషియన్,ఫిజియోథెరపిస్ట్, సెంట్రల్ స్టెరిలైజేషన్ రూమ్ అసిస్టెంట్, టెలిఫోన్ ఆపరేటర్ కమ్ రిసెప్షనిస్ట్,డ్రెస్సర్, లెనిన్ కీపర్.
» అర్హత: ఇంటర్మీడియట్ (ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ) ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా (మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 25 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» వేతనం: నెలకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు రూ.29,000 నుంచి రూ.92,300, హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100, కానిస్టేబుల్ పోస్టులకు రూ.21,700 నుంచి రూ.69,100.
» ఎంపిక విధానం:ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్,ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.11.2024
» వెబ్‌సైట్: https://itbpolice.nic.in

ఎస్‌పీఏ, న్యూఢిల్లీలో 31 నాన్ టీచింగ్ పోస్టులు

న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా) రెగ్యులర్ /డిప్యుటేషన్/ఒప్పంద ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 31.
» పోస్టుల వివరాలు:
» గ్రూప్–ఏ పోస్టులు:రిజిస్ట్రార్–1,అసిస్టెంట్ రిజిస్ట్రార్–1,లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్–1.
» గ్రూప్–బి పోస్టులు:సెక్షన్ ఆఫీసర్–1, సీనియర్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–2, టెక్నికల్ అసిస్టెంట్–1, సీనియర్ అసిస్టెంట్–1, పర్సనల్ అసిస్టెంట్–3, హిందీ ట్రాన్స్‌లేటర్–1.
» గ్రూప్–సి పోస్టులు: అసిస్టెంట్–5, ఎస్టేట్ సూపర్‌వైజర్–1, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–1, జూనియర్ అసిస్టెంట్–4, జూనియర్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–3, హిందీ టైపిస్ట్–1, కేర్‌టేకర్–3, డ్రైవర్–1.
» అర్హత: ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీంతో పాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం:రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.11.2024
» వెబ్‌సైట్: www.spa.ac.in

గ్రూప్–3.. గురి తప్పకుండా!

» నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్–3 పరీక్షలు
» మొత్తం మూడు పేపర్లలో పరీక్ష నిర్వహణ
» 1,363 పోస్ట్‌లకు అయిదు లక్షలకుపైగా పోటీ!
» రివిజన్, ప్రాక్టీస్‌తోనే సక్సెస్ అంటున్న నిపుణులు

గ్రూప్–3 సర్వీసెస్ ఎగ్జామినేషన్.. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు అయిదు లక్షల మందికి పైగా అభ్యర్థులు పోటీ పడుతున్న పరీక్ష! ప్రొఫెషనల్ కోర్సులు మొదలు సంప్రదాయ డిగ్రీ అభ్యర్థుల వరకు.. ఈ పరీక్షలో విజయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పరిస్థితి! ఈ నెల 17, 18 తేదీల్లో గ్రూప్ 3 పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో.. పరీక్షకు పది రోజుల ముందు ప్రిపరేషన్ ప్లాన్, పరీక్ష రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..



టీజీపీఎస్సీ గ్రూప్–3 పోస్ట్‌లకు పోటీ ఎక్కువగానే ఉంది. మొత్తం 1,363 పోస్ట్‌లకు 5.36 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు ఈ పోటీని చూసి ఆందోళన చెందకుండా ఆత్మవిశ్వాసంతో ప్రిపరేషన్ సాగించాలి. ఇప్పటి వరకు సాగించిన ప్రిపరేషన్ శైలికి భిన్నంగా.. ఇకపై వేగంగా పలుమార్లు రివిజన్ చేయడంపై దృష్టిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

రివిజన్.. రివిజన్

గ్రూప్–3 పరీక్షలు నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించనున్నారు. అంటే 12 రోజుల సమయం మాత్రమే అందుబాటులో ఉంది. ఈ సమయంలో పూర్తిగా రివిజన్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటి వరకు తాము అధ్యయనం చేసిన అంశాలనే పదే పదే చదవాలి. అందుకోసం ఆయా పేపర్ల వారీగా నిర్దిష్టంగా సమయ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ప్రస్తుతం కొత్త పుస్తకాలు, కొత్త టాపిక్స్ జోలికి వెళ్లకుండా.. ఇంతకాలం చదివిన పుస్తకాలనే చదవడం మేలు. సాధ్యమైనన్ని ఎక్కువసార్లు పునశ్చరణ చేయడంపై దృష్టిపెట్టాలి.

ఉమ్మడి అంశాలు

మూడు పేపర్లలో జరిగే గ్రూప్ 3 పరీక్షలో.. ఉమ్మడి అంశాలను గుర్తించాలి. వాటిని ఒకే సమయంలో చదివేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. తద్వారా ఎంతో విలువైన సమయం ఆదా అవుతుంది. ముఖ్యంగా ఆయా సబ్జెక్ట్‌లలోని ఉమ్మడి అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, భారత రాజ్యాంగం విధానం, పరిపాలన, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్.. ఇలా అనేక అంశాలను అనుసంధానం చేసుకుంటూ చదివే వీలుంది.ప్రతి రోజు సగటున 8 నుంచి 10 గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించేలా టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి.

కరెంట్ అఫైర్స్‌తో సమన్వయం

అభ్యర్థులు ఆయా అంశాలను చదివేటప్పుడు బేసిక్స్(నిర్వచనం,సిద్ధాంతం,ఫార్ములా)మొదలు.. తాజా పరిణామాల వరకూ సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలి. ప్రధానంగా కరెంట్ అఫైర్స్‌తో అనుసంధానం చేసుకుంటూ చదవాలి. కొత్త స్కీమ్స్, కొత్త గణాంకాలు విడుదలైతే వాటిని అప్‌డేట్ చేసుకోవాలి. ఉదాహరణకు నూతన నియామకాలు, ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదిక వంటివి.

తెలంగాణపై ఫోకస్

ప్రస్తుత సమయంలో తెలంగాణ ప్రాంతానికి సంబంధించి తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలి ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ చరిత్రలో.. తెలంగాణ సామాజిక ముఖచిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం, వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటు తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు, నూతన ప్రభుత్వం తెచ్చిన స్కీమ్స్, లబ్ధిదారులు.. ఇలా అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి.

సొంత నోట్స్

అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభం నుంచే ఆయా సబ్జెక్ట్‌లలోని ముఖ్యమైన అంశాలతో సొంత నోట్స్ రాసుకుంటారు. ప్రస్తుత సమయంలో ఈ నోట్స్‌ను తమ ప్రిపరేషన్‌కు ఉపయోగించుకోవాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన అంశాలు, పాయింట్లతో రాసుకున్న నోట్సును చదువుతూ ముందుకు సాగాలి. అన్ని సబ్జెక్టుల్లోనూ అలాగే చేయాలి. ఇలా చదువుతూ అన్ని అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. మతాలు, సామాజిక వర్గాలు, గిరిజన సమస్యలు, ప్రాంతీయ సమస్యలు వంటి స్థానిక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా ఒక అంశాన్ని చదివేటప్పుడు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సామాజిక వర్గాలనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆ వర్గాల నిర్వచనానికే పరిమితం కాకుండా.. వాటి ఆవిర్భావ చరిత్ర, విస్తరణ, తాజా పరిస్థితులు.. ఇలా అన్నింటినీ చదవాలి. అప్పుడే ఒక అంశంపై సంపూర్ణ అవగాహన ఏర్పడుతుంది.

తాజా విధానాలపై ప్రశ్నలు

పరీక్షలో ప్రభుత్వ విధానాలపై కనీసం 15 నుంచి 20 ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో సామాజిక సమస్యలు, వాటిపై ప్రభుత్వాలు చేసిన విధానాలపై దృష్టి పెట్టాలి. ఇందుకోసం అధికారిక డాక్యుమెంట్లను పరిశీలించాలి. ఇందులో మహిళా సాధికారత వంటివి ముఖ్యమైనవి. మహిళల సాధికారత కోసం జాతీయ స్థాయిలో పలు పథకాలు తెచ్చారు. ఎస్సీలు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, గిరిజనుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నారు. వీటికి సంబంధించిన ముఖ్యాంశాలను మననం చేసుకోవాలి.

ప్రాక్టీస్ టెస్ట్‌లు

ప్రస్తుతం సమయంలో గ్రూప్–3 అభ్యర్థులు ప్రాక్టీస్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరవడం మేలు చేస్తుంది. దీనివల్ల ఆయా సబ్జెక్ట్‌లలో తమకు ఇప్పటి వరకు లభించిన పరిజ్ఞాన స్థాయిపై అవగాహన వస్తుంది. ఇంకా చదవాల్సిన అంశాలపై స్పష్టత లభిస్తుంది. అదే విధంగా తాము చేస్తున్న పొరపాట్లను విశ్లేషించుకుని వాటిని సరిదిద్దుకునే వీలుంటుంది.

పరీక్ష రోజు ఇలా

ఎన్ని సంవత్సరాలు కష్ట పడినా.. ఎన్ని పుస్తకాలు అధ్యయనం చేసినా.. పరీక్ష రోజున చూపే ప్రతిభే విజయాన్ని నిర్దేశిస్తుందని గుర్తించాలి. అభ్యర్థులు పరీక్ష హాల్లో ప్రత్యేక వ్యూహాలను అనుసరించాలి. ప్రశ్న పత్రాన్ని పూర్తిగా చదివేందుకు కొంత సమయం కేటాయించాలి. కనీసం పది నిమిషాల పాటు ప్రశ్న పత్రం పరిశీలించాలి. ఫలితంగా ప్రశ్న పత్రం క్లిష్టత స్థాయిపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. ఆ తర్వాత సులభంగా భావించిన ప్రశ్నలకు ముందుగా సమాధానం ఇవ్వాలి. అనంతరం ఓ మోస్తరు క్లిష్టత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. చివరగా అత్యంత క్లిష్టంగా భావించిన ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. దీనికి భిన్నంగా ముందు తమకు అవగాహన లేని ప్రశ్నలకు సమాధానాలిచ్చేందుకు ఉపక్రమిస్తే.. సమయం వృధా కావడమే కాకుండా.. సమాధానాలు స్ఫురించక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. పర్యవసానంగా తమకు తెలిసిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని గుర్తించాలి.

పేపర్ల వారీగా ముఖ్యమైన అంశాలు

పేపర్–1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్

- జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ ముఖ్య పరిణామాలు, సంఘటనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అంతర్జాతీయ పరిణామాలకు సంబంధించి భారతదేశ ప్రమేయం, అదే విధంగా భారత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్న అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.
- చరిత్రలో ముఖ్యమైన యుద్ధాలు, ఆయా రాజవంశాల పాలన, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు, కళలు, వాస్తు, నిర్మాణాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. దీంతోపాటు భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోని ముఖ్య ఉద్యమాల గురించి తెలుసుకోవాలి.
- పాలిటీకి సంబంధించి రాజ్యాంగం, రాజ్యాంగ ప్రవేశిక, ముఖ్యమైన ఆర్టికల్స్, రాజ్యాంగ సవరణలను అధ్యయనం చేయాలి. ఎకానమీ కోసం బేసిక్ ఎకనామిక్స్‌తో పాటు ఇటీవల కాలంలో ఆర్థిక విధానాలు, అభివృద్ధి పథకాలు, సంక్షేమ పథకాలు, పథకాల లక్ష్యం వంటి అంశాలను అధ్యయనం చేయాలి.
- సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి బేసిక్ సైన్స్ అంశాలతోపాటు నిజ జీవితంలో సైన్స్ అండ్ టెక్నాలజీ పాత్ర, ఇటీవల కాలంలో ఈ రంగంలో తాజా పరిణామాలు, వాటి వల్ల ప్రయోజనాలు వంటి అంశాలపై పట్టు సాధించాలి. జాగ్రఫీ విషయంలో భౌగోళికంగా ప్రాధాన్యం సంతరించుకున్న ప్రాంతాలు, ఖనిజ వనరులు, సహజ వనరులు, నదీ తీర ప్రాంతాలు, అడవులు–రకాలు, పంటలు–అవి ఎక్కువగా పండే ప్రాంతాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. జనరల్ ఎబిలిటీలో రాణించేందుకు దత్తాంశాల విశ్లేషణ, టేబుల్స్, గ్రాఫ్స్‌ను పరిశీలించి.. వాటిలోని ముఖ్యాంశాలను గుర్తించే విధంగా అధ్యయనం చేయాలి.

పేపర్–2

- హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ పేరిట ఉన్న పేపర్–2 కోసం ప్రత్యేకంగా చదవాలి. ముఖ్యంగా తెలంగాణ హిస్టరీ కోసం తెలంగాణ సంస్కృతి, కవులు,కళలు,మధ్యయుగ చరిత్ర,కాకతీయులు, శాతవాహనులు,కుతుబ్ షాహీలు,అసఫ్ జాహీల పాలన తదితర అంశాలను క్షుణ్నంగా చదవాలి.
- పాలిటీ విభాగానికి సంబంధించి భారత రాజ్యాంగం ప్రధాన చట్టాలపై పట్టు సాధించాలి. ముఖ్యమైన ఆర్టికల్స్, సవరణల గురించి పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి.
అదే విధంగా ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి. వీటితోపాటు రాజ్యాంగ పరమైన సంస్థలు, వాటి విధుల గురించి తెలుసుకోవాలి.

పేపర్–3 కోసం

ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పేరిట ఉండే పేపర్–3 కోసం దేశ, రాష్ట్ర ఆర్థిక విధానాలపై అవగాహన పెంచుకోవాలి. జాతీయ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కోర్ ఎకానమీ అంశాలు మొదలు తాజా ఆర్థిక విధానాల వరకు.. ముఖ్యాంశాలను మననం చేసుకోవాలి. తెలంగాణ ఆర్థిక విధానాలపై పట్టు సాధించాలి. రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన పథకాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ గణాంకాలు, ఆర్థిక సర్వే గణాంకాలపై పట్టు సాధించాలి.

క్లుప్తంగా...

ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యం లేదు

వ్యవసాయ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జానయ్య



ఏజీవర్సిటీ: వ్యవసాయ కోర్సుల నిర్వహణలో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఏ ప్రైవేటు సంస్థతో అనుబంధంగానీ భాగస్వామ్యంగానీ లేదని వీసీ జానయ్య తెలిపారు. 2022 జూలైలో వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కొన్ని ప్రైవేటు సంస్థలు చేసుకున్న అవగాహన ఒప్పందాలు విశ్వవిద్యాలయం ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా ఉన్నందున వాటిని రద్దు చేశామని వెల్లడించారు. ఆయా ప్రైవేటు సంస్థలకు విశ్వవిద్యాలయంతో ఎలాంటి సంబంధం లేదని, ఈ విషయాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు తమ వర్సిటీ పేరును వాడుకుని సీట్లు ఇప్పిస్తామని ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి విషయాలను నమ్మవద్దని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

10న ల్యాబ్ టెక్నీషియన్ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 10న ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2 రిక్రూట్‌మెంట్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష జరుగుతుందని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్య కార్యదర్శి గోపీకాంతరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4:20 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్ష హాల్లోకి మధ్యాహ్నం ఒకటిన్నర నుంచే అనుమతిస్తామని.. మధ్యాహ్నం 2:45 తర్వాత గేటు మూసేస్తామని స్పష్టం చేశారు. గడువు ముగిశాక నిమిషం ఆలస్యంగా వచ్చినా అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని తేల్చిచెప్పారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా అభ్యర్థుల బయోమెట్రిక్ సమాచారాన్ని సేకరిస్తామని.. కాబట్టి అభ్యర్థులు చేతులపై మెహందీ, ఇంక్, మొదలైన పదార్థాలను అంటించుకోరాదని ఆయన సూచించారు.

తెలుగు వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నిర్వహించే వివిధ కోర్సులకు 2024–2025వ విద్యా సంవత్సరానికి ప్రవేశ ప్రక్రియను చేపడుతున్నట్లు తెలుగు వర్సిటీ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో కొన్ని సీట్లు మిగిలి ఉన్నందున వీటి భర్తీ నిమిత్తం నవంబర్ 6, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తెలుగు వర్సిటీ బాచుపల్లి క్యాంపస్‌లో స్పాట్ అడ్మిషన్స్ ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కోర్సులు, ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో లేదా 8520866582 ఫోన్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి వార్షిక పరీక్షలు..

విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కోర్సులకు నవంబర్ 6 నుంచి 12 వరకు వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు. ఆయా కోర్సులకు సంబంధించి రెగ్యులర్, బ్యాక్‌లాగ్ విద్యార్థులకు 2024వ సంవత్సర వార్షిక పరీక్షలను నాంపల్లి ప్రాంగణంలో నిర్వహిస్తామని వెల్లడించారు.

త్వరలో మరికొందరు టీజీఎస్పీ సిబ్బందిపై వేటు?

- ఇప్పటికే పదిమంది డిస్మిస్.. 29 మంది సస్పెన్షన్
- మరో 21 మందికి షోకాజ్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్

నిబంధనలకు విరుద్ధంగా ఆందోళనలకు దిగిన టీజీఎస్పీ (తెలంగాణ స్పెషల్ పోలీస్) సిబ్బందిలో మరికొందరిపై కూడా క్రమశిక్షణా రాహిత్యం కింద చర్యలు తీసుకునేందుకు పోలీస్ ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని టీజీఎస్పీ బెటాలియన్లలో సిబ్బంది, వారి కుటుంబసభ్యులు పలు దఫాలుగా ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. తొలుత సెలవుల మార్పు ఉత్తర్వులతో మొదలైన ఈ ఆందోళనలు ఏక్ పోలీస్ సహా పలు డిమాండ్లతో ఊపందుకున్నాయి. దీంతో ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నారని గుర్తించిన 39 మంది టీజీఎస్పీ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ముందుగా ఉత్తర్వులు జారీ చేశారు. అయినా టీజీఎస్పీ సిబ్బందిలో కొందరు పోలీస్ మాన్యువల్‌కు విరుద్ధంగా ఆందోళనలు చేయడంతో 10 మంది టీజీఎస్పీ సిబ్బందిని ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేశారు. గత నెల 29న హైదరాబాద్ ఇందిరాపార్క్ దగ్గర ఆందోళనలకు దిగి, అరెస్టు అయిన 21 మంది టీజీఎస్పీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే పోలీస్ విధుల్లో మజిల్ పవర్‌గా (శాంతిభద్రతలు, ఆందోళన సమయంలో వాడే ఫోర్స్‌గా) ఉండే టీజీఎస్పీ సిబ్బంది ఆందోళనకు దిగడం సరికాదని, క్రమశిక్షణ లేని వారిని ఫోర్స్‌లో కొనసాగించడం కష్టమని పోలీస్ అధికార వర్గాల నుంచి తెలుస్తోంది. గత నెలలో జరిగిన ఆందోళనలకు సంబంధించి, క్రమశిక్షణ ఉల్లంఘించిన మరికొందరిపైనా చర్యలు తీసుకునే అంశాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నట్టు సమాచారం. దీంతో మరికొందరు టీజీఎస్పీ సిబ్బందిపైనా వేటు తప్పదని తెలుస్తోంది.

కాకి పగ పదిహేడేళ్లు

పాములు పగబడతాయన్న మాట అప్పుడప్పుడూ వింటుంటాం. పాత సినిమాల్లో అయితే పగబట్టి వెంటాడే పాముల సీన్లూ చూసి ఉంటాం. మరి అవి అలా నిజంగా ఎగబడతాయా? ఏమో చెప్పలేం. కానీ కాకులు మాత్రం పగబడతాయట. అదీ నెలో, ఏడాదో కాదు.. ఏకంగా 17 ఏళ్ల పాటు మర్చిపోకుండా గుర్తుపెట్టుకుని మరీ పగ తీర్చుకునేందుకు ప్రయత్నిస్తాయట. వాషింగ్టన్ యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలో ఈ విషయం వెల్లడైంది. ఆ వివరాలేంటో చూద్దామా..



కొన్ని కాకులను బంధించి..

పక్షుల్లో కాకులను బాగా తెలివైనవిగా భావిస్తారు. తమకు ఆహారం వేసే మనుషులను గుర్తించగలవని కూడా ఇంతకుముందే తేల్చారు. అదే సమయంలో తమకు కీడు చేయడానికి ప్రయత్నించిన, భయపెట్టినవారిపై పగబడతాయని తాజాగా తేల్చారు. దీనిపై వాషింగ్టన్ యూనివర్సిటీ పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జాన్ మార్జలఫ్ నేతృత్వంలోని పరిశోధకులు సుదీర్ఘ ప్రయోగం చేశారు. 2006లో దెయ్యం లాంటి ఓ మాస్కు పెట్టుకుని.. యూనివర్సిటీ క్యాంపస్‌లో కొన్ని కాకులను పట్టి బంధించారు. వాటిని కాసేపు భయపెట్టినట్టుగా చేశారు. తర్వాత వాటి కాళ్లకు ఐడెంటిఫికేషన్ రింగులను వేసి వదిలేశారు.

మాస్కుతో వెళితే వెంటాడుతూ..

శాస్త్రవేత్తలు ఆ తర్వాతి నుంచి క్యాంపస్‌లో ఆ దెయ్యం మాస్కు వేసుకుని కొన్నిసార్లు, వేసుకోకుండా మరికొన్నిసార్లు, వేరే ఇతర మాస్కులు పెట్టుకుని ఇంకొన్నిసార్లు తిరుగుతూ కాకులకు ఆహారం పెట్టడం మొదలుపెట్టారు. ఈ సమయంలో వాటి స్పందనను రికార్డు చేస్తూ వచ్చారు. శాస్త్రవేత్తలు దెయ్యం మాస్కు వేసుకుని వెళ్లినప్పుడు కాకులు.. తీవ్రంగా అరుస్తూ, వెంటాడుతూ రావడాన్ని.. మాస్క్ లేనప్పుడు, వేరే మాస్కులు వేసుకున్నప్పుడు అవి మామూలుగానే ఉండటాన్ని రికార్డు చేశారు. అయితే క్రమంగా ఇలా వెంటాడటం తగ్గిందని, సుమారు 17 ఏళ్ల తర్వాత అవి వెంటాడటం ఆగిపోయిందని ప్రొఫెసర్ జాన్ మార్జలఫ్ చెప్తున్నారు.

పక్కాగా గుర్తించి మరీ వెంటాడాయి..

''కొందరు వలంటీర్లకు వేర్వేరు మోడళ్లలోని మాస్కులు ఇచ్చి, యూనివర్సిటీ, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరగాలని చెప్పాం. అందులో మేం కాకులను పట్టుకుని, భయపెట్టినప్పటి మాస్కులు వేసుకున్నవారిని మాత్రమే కాకులు టార్గెట్ చేశాయి. గట్టిగా అరవడం, వేగంగా వచ్చి కాళ్లతో తన్నడం వంటివి చేశాయి. మేం బంధించిన కాకులు మాత్రమేకాకుండా వేరే కాకులు కూడా ఇలా చేశాయి. అవి ప్రమాదకరమని భావించిన వాటిపై సమాచారం ఇచ్చిపుచ్చుకోవడమే దీనికి కారణం'' అని ప్రొఫెసర్ వెల్లడించడం గమనార్హం.

..: సాక్షి సెంట్రల్ డెస్క్ :..

‘సీతారామ’పై ఈఎన్‌సీ, సీఈకి షోకాజ్ నోటీసులు

మంత్రుల సమక్షంలో ఇటీవలి సమీక్షలో అధికారుల వాగ్వాదంపై సర్కారు సీరియస్

- దుష్ప్రవర్తన, క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడినందుకు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశం
- ‘సాక్షి’కథనంపై వివరణ ఇచ్చిన కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్

సాక్షి, హైదరాబాద్



పరిపాలనా అనుమతులు లేకుండానే సీతారామ ఎత్తిపోతల పథకం డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు టెండర్లను ఆహ్వానించిన అంశంపై మంత్రుల సమక్షంలో వాగ్వాదానికి దిగినందుకు నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ (సీఈ) శ్రీనివాస్‌రెడ్డికి ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దుష్ప్రవర్తన, క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడినందుకు సంజాయిషీ ఇవ్వాలని వారిని ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గత శనివారం సీతారామ ప్రాజెక్టుపై నిర్వహించిన సమీక్షలో పాలనా అనుమతుల్లేకుండానే అధికారులు టెండర్లను ఆహ్వానించిన అంశం చర్చకు రావడం తెలిసిందే. ప్రాజెక్టు నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న కొత్తగూడెం సీఈ ఎ.శ్రీనివాస్‌రెడ్డే అనుమతుల్లేకుండా టెండర్లు ఆహ్వానించారని అనిల్‌కుమార్ అభ్యంతరం తెలిపినట్టు.. అనుమతుల విషయంలో అనిల్‌కుమారే సహకరించట్లేదని శ్రీనివాస్‌రెడ్డి మంత్రుల సమక్షంలో వాదించినట్లు తెలిసింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి ఉత్తమ్ వారిద్దరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను అదే రోజు ఆదేశించారు. మంత్రులను తప్పుదోవ పట్టించినందుకు సస్పెండ్ చేయిస్తానని సీఈపై ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు చర్చ జరుగుతోంది. మరోవైపు ఈ వ్యవహారం గురించి సాక్షి ప్రధాన సంచికలో ‘అనుమతి లేకున్నా రూ. వెయ్యి కోట్ల సీతారామ టెండర్లు’శీర్షికతో వచ్చిన వార్తా కథనంపై కొత్తగూడెం సీఈ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం వివరణ ఇచ్చారు. సీఎం, మంత్రులు ఆదేశించడంతోనే డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు టెండర్లను ఆహ్వానించినట్టు ఖమ్మం జిల్లా కలెక్టర్‌తోపాటు నీటిపారుదల శాఖ కార్యదర్శి, ఈఎన్‌సీ (జనరల్)కు రాసిన లేఖలో స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూటరీల పనులకు తక్షణమే టెండర్లను ఆహ్వానించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న సీతారామ ప్రాజెక్టు రెండో పంప్‌హౌస్ వద్ద నిర్వహించిన సమీక్షలో ఆదేశించారని గుర్తుచేశారు. అలాగే సెప్టెంబర్ 27న నిర్వహించిన సమీక్షలో డిస్ట్రిబ్యూటరీలు, ఇతర పనులకు టెండర్లు పిలవాలని మంత్రులు ఉత్తమ్, పొంగులేటి ఆదేశించారని పేర్కొన్నారు. రూ.13,057.98 కోట్ల సవరణ అంచనాలతో గతంలో ఇచ్చిన పరిపాలనా అనుమతుల్లో డిస్ట్రిబ్యూటరీల పనులు సైతం ఉన్నందున టెండర్ల విషయంలో ముందుకు వెళ్లాలని ఆ సమీక్షలో నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ సూచించారన్నారు. ఆ సమావేశం మినట్స్‌లో ఈ విషయాలన్నీ ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రాజెక్టు వ్యయ అంచనాల సవరణకు పరిపాలనా అనుమతులు వస్తాయన్న నమ్మకంతోనే డిస్ట్రిబ్యూటరీల పనులకు తాజాగా టెండర్లను ఆహ్వానించినట్టు లేఖలో పేర్కొన్నారు.

సగం సీట్లు ‘ఇతరులకే’..!

పీజీ మెడికల్ సీట్లలో రాష్ట్ర విద్యార్థులకు అన్యాయం

- ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 1,200 పీజీ సీట్లు.. అందులో 600 వరకు నేషనల్ పూల్ కింద భర్తీ
- ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకే 300 వరకు సీట్లు.. ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు మనోళ్ల అనాసక్తి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఉన్న పీజీ మెడికల్ సీట్లలో సగం వరకు జాతీయ కోటా కింద ఇతర రాష్ట్రాల విద్యార్థులే దక్కించుకొంటుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ కోటా కౌన్సెలింగ్ ద్వారా 50 శాతం సీట్లను నింపుతుండటంపై రాష్ట్ర విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పీజీ మెడికల్ సీట్ల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వ సీట్లలో సగం వరకు జాతీయ కోటా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎంబీబీఎస్‌లో నేషనల్ పూల్ కింద ప్రభుత్వ సీట్లలో 15 శాతం జాతీయ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తుండగా, పీజీ మెడికల్ సీట్లలో ఏకంగా సగం కేటాయిస్తున్నారు. దీంతో తమకు అన్యాయం జరుగుతున్నదని తెలంగాణ విద్యార్థులు వాపోతున్నారు.

ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు మనోళ్ల అనాసక్తి

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో కలిపి దాదాపు 2,800 పీజీ సీట్లున్నాయి. అందులో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో దాదాపు 1,200 మెడికల్ పీజీ సీట్లున్నాయి. వాటిల్లో 600 వరకు (50 శాతం) జాతీయ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు. మిగిలిన వాటిని రాష్ట్ర కౌన్సెలింగ్‌లో నింపుతారు. ఇదే ఇప్పుడు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ విధానం మెడికల్ కాలేజీలు తక్కువ ఉన్న రాష్ట్రాల విద్యార్థులకు మేలు చేస్తుండగా, తెలంగాణలాంటి రాష్ట్రాల విద్యార్థులకు మాత్రం నష్టం కలిగిస్తున్నదని కాళోజీ వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఉత్తరాదికి చెందిన చాలామంది విద్యార్థులు మన రాష్ట్రంలోని సీట్లపై ఆసక్తి చూపుతారు. కానీ మన రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లో చేరేందుకు ఆసక్తి చూపడంలేదు. దీంతో జాతీయ కోటాలో నింపే మన రాష్ట్ర 600 సీట్లలో దాదాపు 300 మంది ఇతర రాష్ట్రాల వారే దక్కించుకుంటున్నారని కాళోజీ వర్సిటీ అధికారులు తెలిపారు. దీంతో మన రాష్ట్ర విద్యార్థులు నష్టపోతున్నారని చెబుతున్నారు.

ఆరుషిని ఆదుకోండి..

- చిన్నారికి మళ్లీమళ్లీ ఏర్పడుతున్న కణితి
- చికిత్స కోసం సాయం కోరుతున్న తల్లిదండ్రులు



తల్లిదండ్రులతో ఆరుషి

లక్డీకాపూల్ (హైదరాబాద్): వెన్నుపాముపై మళ్లీమళ్లీ ఏర్పడుతున్న కణితితో సతమతమవుతున్న తమ బిడ్డను ఆదుకోవాలంటూ 23 నెలల ఆరుషి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని అరెటే ఆస్పత్రిలో చికిత్స పొందున్న చిన్నారి, దాతల సహాయం కోసం ఎదురు చూస్తోంది. హస్తినాపురంలో ఉంటున్న నల్లగొండ జిల్లా వాసి అయితగోని రవి, మమత దంపతుల కుమార్తె ఆరుషికి వెన్నుపాముపై కణితి ఏర్పడింది. ఈ ఏడాది ఏప్రిల్ 27న మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ఆ కణితిని తొలగించారు. తిరిగి మళ్లీ అదే ప్రాంతంలో కణితి ఏర్పడటంతో చిన్నారి తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. వైద్యులను సంప్రదించగా మళ్లీ శస్త్రచికిత్స చేసి తొలగించాలని సూచించారు. ఆగస్టు 20న వైద్యులు సుమారు 6 గంటల పాటు శ్రమించి కణితిని తొలగించారు. అయితే శస్త్రచికిత్స తరువాత మళ్లీ అటువంటి సమస్య రాకుండా ఉండేందుకు కీమో థెరపీ చేయాలని వైద్యులు చెప్పారు. మొత్తం 8 విడతలుగా ఇది చేయాల్సి ఉంటుందని.. ఒక్కో విడతకు సుమారు రూ.2 లక్షల చొప్పున ఖర్చవుతుందని తెలిపారు. ఇందుకు మొత్తం రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండుసార్లు జరిగిన శస్త్రచికిత్సలకు రూ.8 లక్షలు ఖర్చు చేశామని, మళ్లీ అంత మొత్తం వెచ్చించే స్తోమత లేదని వారు వాపోతున్నారు. ఆరుషిని ఆదుకునేందుకు ముందుకు వచ్చే దాతలు 6300355536 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

జనవరి 1 నుంచి టెట్

నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఏడాదిలో రెండుసార్లు టెట్ నిర్వహిస్తామన్న సర్కార్

మేలో నిర్వహించిన పరీక్షలకు 2.35 లక్షల మంది హాజరు



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్) 2025 జనవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ జరగనుంది. పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి సోమవారం ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది టెట్ నోటిఫికేషన్ ఇవ్వడం ఇది రెండోసారి. జాబ్ క్యాలెండర్‌లో ఏడాదికి రెండుసార్లు టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. కాగా ఈ ఏడాది మే 20 నుంచి జూన్ 2 వరకూ టెట్ నిర్వహించారు. ఈ పరీక్షలకు 2.35 లక్షల మంది హాజరయ్యారు. వీరిలో 1.09 లక్షల మంది అర్హత సాధించారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నేపథ్యంలోనూ బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారికి టెట్ రాసే అవకాశం కల్పించారు. తాజా టెట్‌కు సంబంధించిన విధివిధానాలు, సిలబస్‌తో కూడిన సమాచార బులిటెన్ మంగళవారం https:// schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నట్టు అధికారులు తెలిపారు. అయితే ఇటీవలే 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేయడం, టెట్ నిర్వహించడంతో.. జనవరిలో నిర్వహించే టెట్‌కు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకోకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. టెట్‌లో ఒకసారి అర్హత సాధిస్తే జీవితకాలం పాటు చెల్లుబాటు అవుతుంది.

పేపర్–2లో తక్కువ ఉత్తీర్ణత

రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016 నుంచి టెట్ నిర్వహిస్తున్నారు. డీఈడీ అర్హత గల వారు పేపర్–1, బీఈడీ అర్హులు పేపర్–2తో పాటు పేపర్–1 రాసేందుకు కూడా అవకాశం కల్పించారు. పేపర్–1 ఉత్తీర్ణులు ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే అర్హత సాధిస్తారు. పేపర్–2 అర్హులు ఉన్నత పాఠశాలల వరకూ బోధించే వీలుంది. అయితే పేపర్–2లో ఉత్తీర్ణులు గత 8 ఏళ్ళుగా తక్కువగా ఉంటున్నారు. గరిష్ఠంగా 30 శాతం దాటకపోవడం, జనరల్ కేటగిరీలో ఉత్తీర్ణత శాతం మరీ తక్కువగా ఉండటం కన్పిస్తోంది. ఇందుకు బీఈడీలో నాణ్యత లోపమే కారణమనే విమర్శలున్నాయి.

2016 నుంచి 2024 వరకూ జరిగిన టెట్‌లో పరీక్ష రాసిన విద్యార్థులు, ఉత్తీర్ణుల వివరాలు

పేపర్	అభ్యర్థులు	ఉత్తీర్ణులు	శాతం
2016లో			
పేపర్–1	88,661	48,278	54.45
పేపర్–2	2,51,906	63,079	25.04
2017లో			
పేపర్–1	98,848	56,708	57.37
పేపర్–2 (సైన్స్)	1,11,018	20,233	18.22
పేపర్–2(సోషల్)	1,19,914	24,732	20.62
2022లో			
పేపర్–1	3,18,506	1,01,922	32.68
పేపర్–2	2,51,070	1,04,078	49.64
2023లో			
పేపర్–1	2,23,582	82,489	36.89
పేపర్–2	1,90,047	29,073	15.30
2024లో			
పేపర్–1	85,996	57,725	67.13
పేపర్–2	1,50,491	51,443	34.18

నాలుగు తలల ఈత చెట్టు



కురవి: ఎక్కడైనా ఈత చెట్టుకు ఒక తల ఉండడం చూస్తూ ఉంటాం.. కానీ ఒక ఈత చెట్టుకు ఏకంగా నాలుగు తలలున్నాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని వద్దుల లోకేందర్‌రెడ్డి ఇంటి ఆవరణలో కొన్ని ఈత చెట్లు ఉన్నాయి. చెట్ల చుట్టూ పెరిగిన బతానీ తీగను కాలనీకి చెందిన కొందరు సోమవారం కోసివేశారు. అప్పుడు ఈత చెట్లలో ఒకదానికి నాలుగు తలలు ఉండడాన్ని గుర్తించి ఆశ్చర్యపోయారు. ఇలాంటివి ఎప్పుడూ చూడలేదని గ్రామస్తులు గోరు రాజన్నగౌడ్, గోరు వీరయ్య గౌడ్ తదితరులు పేర్కొన్నారు.

సార్ ప్రజెంట్.. స్టూడెంట్ ఆబ్సెంట్




బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం జగ్నాతండా ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు టీచర్లున్నారు. ఒకటి నుంచి ఐదవ తరగతుల వరకు నలుగురు విద్యార్థులు హాజరవుతున్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే ఆ నలుగురిలో నాలుగో తరగతి విద్యార్థిని కావ్యశ్రీ తప్ప మిగతా ముగ్గురు పాఠశాలకు రావడం లేదని స్థానికులు చెప్పారు. సోమవారం ఒక ఉపాధ్యాయురాలు సెలవు పెట్టగా హెచ్ఎం శ్రీనివాస్ విధులకు హాజరయ్యారు. రోజూవచ్చే విద్యార్థిని కావ్యశ్రీ కూడా రాకపోవడంతో హెచ్ఎం ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. ఈ పాఠశాలలో మూడేళ్ల క్రితం 15 మంది, గత ఏడాది 11 మంది ఉండగా, ఈ ఏడాది జూన్‌లో పాఠశాల ప్రారంభంలో ఆరుగురు విద్యార్థులు చేరారు. వీరిలో ఇద్దరు గురుకులాల్లో సీట్లు రావడంతో వెళ్లిపోయారు. మరో ముగ్గురు విద్యార్థుల కుటుంబాలు వలస పోతున్న నేపథ్యంలో పిల్లలు వారితో వెళ్లి పోతారు. పాఠశాలలో మాత్రం ఎన్‌రోల్‌మెంట్ చూపిస్తున్నారు. గ్రామంలో 300 జనాభా ఉంటుంది. కొందరు పిల్లలు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో చదువుతుండగా.. మరికొందరు రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్నారు.


బడి కళకళ.. టీచరు లేక వెలవెల..



బడి ఉన్నచోట పిల్లలుండరు.. పిల్లలు ఉన్నచోట బడి బాగుండదు.. పెద్దపల్లి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల దుస్థితి కూడా ఇలాగే ఉంది. కొన్నిచోట్ల సొంత భవనాలు లేవు. అద్దె కొంపల్లో అరకొర సౌకర్యాల మధ్య నెట్టుకు వస్తున్నారు. మరికొన్నిచోట్ల టీచర్ల కొరత ఉంది. ఇంకొన్ని చోట్ల ఆయాలు లేరు. మొత్తంగా చిన్నారులకు చదువులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. కానీ, సుల్తానాబాద్ మండలం కొదురుపాకలో ఆధునిక హంగులతో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించారు. అయితే అంగన్‌వాడీ టీచర్, ఆయాను నియమించలేదు. దీంతో పిల్లలు లేక కేంద్రం వెలవెల బోతోంది. అధికారులు స్పందిస్తే తమ పిల్లలకు చదువు వస్తుందని గ్రామస్తులు కోరుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

‘ఫల’ప్రదం కావాలని..





సిరిసిల్ల కల్చరల్/సిరిసిల్ల టౌన్: పిల్లల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు సిరిసిల్లకు చెందిన బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణిప్రసాద్ కళాఖండాలను సృష్టించారు. తాజా పండ్లు, డ్రైఫ్రూట్స్‌ను ఉపయోగించి విభిన్న కళాకృతుల్లో ఆరోగ్య‘ఫల’చిత్రాలను రూపొందించారు. వీటిని పిల్లలు, తల్లులకు చూపిస్తూ పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. అంజీర్, చెర్రీ, బాదం, కాజు, కిస్మిస్, పిస్తా, చియాసీడ్స్, యాపిల్, అరటి, బత్తాయి, కమలం, అవకాడో, జుకిని, కివీ, డ్రాగన్ వంటి పండ్లను ఉపయోగించి బొమ్మలను తయారు చేశారు. వాటిని సిరిసిల్లలోని సృజన్ పిల్లల ఆస్పత్రి ఆవరణలో ప్రదర్శిస్తున్నారు. గతంలో రంగు గోలీలు, పాడేసిన మందు సీసాల మూతలతో అద్భుత కళారూపాలను ఆవిష్కరించిన డాక్టర్ రాణిప్రసాద్ మరోసారి తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించడంపై స్థానికులు, కళాకారులు, సాహితీవేత్తలు అభినందిస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

మూడు జాముల కొదురుపా..క

'క' సినిమాతో మరోసారి వార్తల్లోకి..


మధ్యాహ్నం 3 గంటలకే చీకటి • సాయంత్రాల్లేని గ్రామం



సాయంత్రం 4 గంటలకే చీకటి అలుముకున్న కొదురుపాక

ఈ ఊరేంటి చాలా విచిత్రంగా ఉంది.. మధ్యాహ్నం మూడు గంటలకే చీకటి పడిపోతోంది'.. అని హీరో ప్రశ్నిస్తాడు.. 'మా ఊరు చుట్టూతా ఎత్తయిన కొండలున్నాయి.. కొండల మధ్య మా ఊరు ఉంది.. మధ్యాహ్నం మూడు అయ్యేసరికి సూర్యుడు కొండల వెనక్కి వెళ్లిపోయి ఆ నీడ మా ఊరి మీద పడి.. మూడింటికల్లా చీకటి పడిపోతుంది అబ్బాయి..'ఒక పెద్దాయన సమాధానమిస్తాడు. ఈ సంభాషణ 'క'సినిమాలోనిదని మీకీ పాటికే అర్థమై ఉంటుంది. దీంతో అలాంటి ఊరు ఎక్కడుందంటూ సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఆ ఊరే పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కొదురపాక గ్రామం. రీల్స్, వీడియోలతో ఇప్పుడా ఊరు నెట్టింట సందడి చేస్తోంది.

– సాక్షి, పెద్దపల్లి



మధ్యాహ్నం 3 గంటలకు కొదురుపాక

నాలుగు గుట్టల మధ్య..

శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ గ్రామం నాలుగు గుట్టల మధ్య.. హుస్సేనిమియా వాగు చెంత.. పచ్చని ప్రకృతి నిలయంగా ఉంటుంది. ఈ గ్రామానికి తూర్పున గొల్లగుట్ట, పడమరన రంగనాయకులు గుట్ట, ఉత్తరాన నంబులాద్రి గుట్ట, దక్షిణాన పాంబండ గుట్టలున్నాయి. ఇక్కడి వైవిధ్య భౌగోళిక పరిస్థితులను గమనించిన శాతవాహనులు ఈ ఊరు వెలుపల నంబులాద్రీశ్వరస్వామి, రాజరాజేశ్వరస్వామి ఆలయాలు నిర్మించారు. గ్రామ ప్రత్యేకతను శిలాఫలకంపై చెక్కించారు.

ఆలస్యంగా ఉదయం.. తొందరగా సాయంత్రం..

సాధారణంగా 3 గంటలకు ఒక్కజాము చొప్పున రోజులో మొత్తం 8 జాములుంటాయి. పగటిపూట నాలుగు, రాత్రిపూట నాలుగు జాములుగా లెక్కిస్తారు. తూర్పున ఉన్న గొల్లగుట్ట ఈ గ్రామానికి అడ్డుగా ఉండటంతో ఇక్కడ ఆలస్యంగా సూర్యోదయం అవుతుంది. ఇక సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సూర్యుడు గ్రామ పడమర దిక్కునున్న రంగనాయకులు గుట్ట వెనక్కి వెళ్తాడు. దీంతో కొండల నీడతో ఈ గ్రామాన్ని చీకటి తొందరగానే అలుముకుంటుంది. ఇలా ఉదయం, సాయంత్రం రాత్రితో కలిసిపోతుండటంతో పగటి సమయం తగ్గిపోతోంది. దీంతో ఈ గ్రామాన్ని మూడు జాముల కొదురుపాకగా పిలుస్తున్నారు. ఆ ఊరికి సాయంత్రం జాము లేకపోవడంతో.. సాయంత్రం 4 గంటలకే ఇళ్లలో దీపాలు, వీధి దీపాలు వెలిగించాల్సి వస్తోంది.

దేవుడు లేని ఆలయం

ఈ గ్రామానికి మరో ప్రత్యేకత ఉంది. రంగనాయకులు గుట్టకు దిగువన నిర్మించిన ఆలయంలో దేవుడి విగ్రహం ఉండదు. దీంతో ప్రతీ దసరాకు పక్కనే ఉన్న దేవునిపల్లి గ్రామం నుంచి నంబులాద్రి నరసింహస్వామిని రథయాత్రతో తీసుకొచ్చి.. ఈ ఆలయంలో ఒకరోజు ఉత్సవాలు జరుపుతారు. ఆ తర్వాత తిరిగి దేవునిపల్లికి తీసుకెళ్తారు. దీంతో ఏడాదిలో ఆ ఒక్కరోజే ఆ గుడిలో వేడుకలు నిర్వహిస్తారు.



పర్యాటకంగా అభివృద్ధి చేయాలి

మా గ్రామాన్ని చూడటానికి ఎంతో మంది ఎక్కడినుంచో వచ్చి పోతున్నారు. వచ్చిపోయే వారికి గ్రామంలో సౌకర్యాలు కల్పించి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

– బాలాజీరావు, స్థానికుడు



నలుదిక్కులా గుట్టలు

మా ఊరుకు నలుదిక్కులా గుట్టలు ఉండటంతో ఉదయం ఆలస్యంగా సూర్యుడు వస్తాడు. తొందరగానే సూర్యుడు అస్తమిస్తాడు. దీంతో సాయంత్రం 4 గంటలు దాటిందంటే ప్రతీ ఇంట దీపం వెలిగించుకోవలసిందే.

– రాజగౌడ్, స్థానికుడు

'సర్పంచుల ఈ దుస్థితికి బీఆర్‌ఎస్సే కారణం'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సర్పంచులను ఈ దుస్థితిలోకి నెట్టింది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర చైర్మన్ రాచమళ్ల సిద్దేశ్వర్ విమర్శించారు. కేంద్రం ఇచ్చిన నిధులను కూడా సర్పంచులకు ఇవ్వకుండా రాత్రికి రాత్రి డిజిటల్ కీతో వందల కోట్ల రూపాయలను మింగింది ఆ పార్టీ నేతలు కాదా అని ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సర్పంచులకు విలువ లేకుండా చేసి పంచాయతీరాజ్ వ్యవస్థను చెరబట్టింది బీఆర్ఎస్ పార్టీనేనన్నారు. ఇప్పుడు హరీశ్‌రావు చెపుతున్న పెండింగ్ బిల్లులన్నీ వాళ్ల హయాంలోనివేనని, అయినా సిగ్గులేకుండా పెండింగ్ బిల్లులంటూ మాట్లాడుతున్నారని విమర్శించారు. సర్పంచులను ఆత్మహత్యలపాలు చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు వారి గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుందని సిద్దేశ్వర్ మండిపడ్డారు.

పట్టు పరిశ్రమ పునరుజ్జీవానికి చర్యలు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: పట్టు పరిశ్రమ పునరుజ్జీవానికి చర్యలు చేపడతామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సోమవారం ఆయన పట్టు పరిశ్రమశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ రాష్ట్రంలో నేలలు, వాతావరణం పట్టు పరిశ్రమకు అనుకూలమని, రైతులను మరింత ప్రోత్సహించే దిశగా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు రెండు ఎకరాల్లో మల్బరీ మొక్కలను నాటి ఐదుగురికి ఉపాధి కల్పించడమే కాకుండా, ఏడాదికి సగటున రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల స్థిరమైన ఆదాయం పొందే అవకాశముందన్నారు. పట్టు పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాయితీలు ప్రకటిస్తున్నందున.. రైతులు పంట మార్పిడిలో భాగంగా మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం చేపడితే గ్రామీణ పేదలు జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. సమగ్ర సిల్క్ పథకం నిధులను సద్వినియోగం చేసుకొని అన్ని జిల్లాల్లో పట్టు పరిశ్రమ విస్తరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల, నారాయణపేట చీరలకు అవసరమైన ముడి సరుకులను తెలంగాణలోనే ఉత్పత్తి చేయడానికి అవసరమైన రీలింగ్ పరిశ్రమ ప్రోత్సాహానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విత్తన క్షేత్రాల్లో నాణ్యమైన మల్బరీ మొక్కలను ఉత్పత్తి చేసి, రైతులకు సరఫరా చేయాలని చెప్పారు. దసలి పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. దసలి పట్టు దారం ఉత్పత్తిలో కొత్తరకం యంత్ర పరికరాలను అందించి నాణ్యత కలిగిన టస్సార్ బట్టను ఉత్పత్తి చేసి ఈ పరిశ్రమపై ఆధారపడే నేత కార్మికులకు సహకరించాలని సూచించారు.

15 నుంచి మతసామరస్యంపై సదస్సులు

వామపక్ష పార్టీల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు మతం పేరిట ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని వామపక్షాలు ధ్వజమెత్తాయి. ప్రజల్లో భయాందోళనలను తగ్గించి, మత సామరస్యాన్ని కాపాడాలన్న లక్ష్యంతో ఈ నెల 15 నుంచి డిసెంబర్ 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సంఘాలు, అభ్యుదయ వాదులతో కలసి సదస్సులు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆ పార్టీలు నిర్ణయించాయి. ఈ మేరకు రాష్ట్రంలోని పది వామపక్ష పార్టీలు సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీభవన్‌లో సమావేశమయ్యాయి. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు జేవీ చలపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలమల్లేశ్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమ, కేజీ రాంచందర్, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, ఎస్‌యూసీఐ రాష్ట్ర నాయకుడు తేజ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజా, ఆర్‌ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రకటన జారీచేశారు. రాష్ట్రంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్‌లు మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, మైనార్టీలపై దాడులను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. ఈ దుశ్చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో విధించిన నిషేధాజ్ఞలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కమీషన్ల కోసం ప్రజాధనం మళ్లింపు

• మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



సాక్షి, హైదరాబాద్: కమీషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దారి మళ్లిస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, మరోవైపు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కంపెనీలకు పెండింగ్ బిల్లులు చెల్లించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ నాయకులు రఘురామ్, రాఘవతో కలిసి క్రాంతికిరణ్ సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గాల్లో ప్రత్యేక అభివృద్ధి నిధులను రద్దు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ కార్యకర్తలకు ఖజానాను ధారాదత్తం చేసిందని మండిపడ్డారు. ఆందోల్ నియోజకవర్గంలో మంత్రి దామోదర రాజనర్సింహ అభివృద్ధికి అడ్డు పడుతున్నారని క్రాంతికిరణ్ విమర్శించారు.

ఎమ్మెల్సీ బరిలో విశ్రాంత డీఎస్పీ

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలబడాలని నిర్ణయించుకున్నట్టు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ డీఎస్పీ ఎం.గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉంటానని ఆయన వెల్లడించారు.






సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బీజేపీ ఎంపీ లక్ష్మణ్, బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి

ఆ పేరుతో సర్టిఫికెట్ మార్చి ఇస్తాం

• హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి.. విచారణ ముగించిన న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: పేరు మార్చుకున్నప్పటికీ ప్రభుత్వం తన విద్యా సర్టిఫికెట్లలో ఆ మేరకు మార్పు చేయట్లేదంటూ హైకోర్టును ఆశ్రయించిన ఓ వ్యక్తికి చివరకు న్యాయం లభించింది. రెండు వారాల్లోగా పిటిషనర్‌కు ఎస్‌ఎస్‌సీ బోర్డు కొత్త సర్టిఫికెట్ జారీ చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వెల్లడించింది. పిటిషనర్ విజ్ఞప్తిని సర్కార్ అంగీకరించినందున విచారణ ముగిస్తున్నట్లు న్యాయస్థానం తెలిపింది.

ఇదీ నేపథ్యం..

తన పేరు మార్చుకున్నట్లు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయినప్పటికీ ఎస్‌ఎస్‌సీ, ఇంటర్ బోర్డు, ఉస్మానియా యూనివర్సిటీ ఆ మేరకు సర్టిఫికెట్లలో మార్పులు చేయట్లేదంటూ రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన వి. మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ చర్య 1961 నాటి జీవో 1263 ప్రకారం చట్టవిరుద్ధమన్నారు. ఇది వ్యక్తుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని పేర్కొన్నారు. దీంతో ఆ విద్యార్థికి చెందిన సర్టిఫికెట్లలో పేరు మార్చడానికి వచ్చిన ఇబ్బందేమిటని ప్రభుత్వాన్ని హైకోర్టు గత విచారణ సందర్భంగా ప్రశ్నించింది. ఈ పిటిషన్‌పై మరోసారి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది కె.అరవింద్, ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ ఎస్.రాహుల్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్ కోరినట్లు మారిన పేరుపై రెండు వారాల్లో సర్టిఫికెట్ జారీ చేస్తామని ఎస్‌జీపీ బదులిచ్చారు. దీంతో ధర్మాసనం.. పిటిషన్‌లో విచారణను ముగించింది.

పత్తి తీతకు పట్నం కూలీలు



చౌటుప్పల్ బస్టాండ్ నుంచి చిట్యాల మండలం పిట్టంపల్లికి వెళ్తున్న కూలీలు

రామన్నపేట: ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా పత్తితీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. చౌటుప్పల్, చిట్యాల మండలాల్లోని జాతీయ రహదారి వెంటగల గ్రామాల్లో పత్తి తీయడానికి కూలీలు హైదరాబాద్‌లోని హయత్‌నగర్ నుంచి వస్తున్నారు. సోమవారం చద్దిమూటలు పట్టుకొని చౌటుప్పల్ బస్టాండ్‌లో బస్సు దిగిన కూలీలను 'సాక్షి'పలకరించగా.. పత్తి తీయడానికి వచ్చామని చెప్పారు. కిలోకు రూ.16 చొప్పున రైతులు కూలీ చెల్లిస్తున్నారని, రోజుకు 50 నుంచి 80 కిలోల వరకు పత్తి తీయడం ద్వారా రూ.800 నుంచి రూ.1,200 వరకు గిట్టుబాటవుతుందని వారు తెలిపారు. బస్టాండ్ నుంచి పత్తి చేను వరకు రైతులే ఆటోలలో తీసుకువెళ్లి తిరిగి తీసుకొస్తున్నారని వారు తెలిపారు.



పత్తి తీతకు హయత్‌నగర్ నుంచి చౌటుప్పల్ బస్టాండ్ వద్దకు వచ్చిన కూలీలు

రుద్రాక్షలతో శివలింగం



విజయనగరం జిల్లా కేంద్రంలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం మొదటి రోజు కావడంతో రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన శివలింగం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది.

– డి.సత్యనారాయణమూర్తి, ఫోటోగ్రాఫర్, విజయనగరం

కపిల తీర్థానికి కార్తీక శోభ



కార్తీక సోమవారం మొదటి రోజు కావడంతో ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తిరుపతిలోని కపిలతీర్థానికి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. భక్తుల రాకతో కపిలతీర్థం కార్తీకశోభను సంతరించుకుంది.

– మోహనకృష్ణ కేతారి, సాక్షి ఫోటోగ్రాఫర్, తిరుపతి

భారం కాదు..భరోసా



ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని కోరుతూ విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం నగర వీధుల్లో ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ఇలా అవగాహన ర్యాలీ చేపట్టారు.

– పీఎల్ మోహన్, సాక్షి ఫోటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

ప్రభుత్వానిది హిందుత్వ, ఆర్ఎస్ఎస్ ఎజెండా

సీపీఎం కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ప్రభుత్వం హిందుత్వ, ఆర్ఎస్ఎస్ ఎజెండాతో పనిచేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. ఢిల్లీలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా నవంబర్ 14న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆయన తెలిపారు.

52 మంది ఒకేషనల్ కోఆర్డినేటర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పీఎంశ్రీ స్కూళ్లతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో వృత్తివిద్యా కోర్సుల తీరుతెన్నులను పరిశీలించేందుకు పాఠశాల విద్యాశాఖ ఒకేషనల్ కోఆర్డినేటర్లను నియమించింది. జిల్లాకు ఇద్దరు చొప్పున 52 మందిని ఈ విధులకు కేటాయించింది.

ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ ఎండీగా హిమాన్షు శుక్లాకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్, టీవీ, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎఫ్‌టీవీటీడీసీ) ఎండీగా హిమాన్షు శుక్లాకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులిచ్చారు.

పవర్ ప్రాజెక్టు ఎత్తేయడం దుర్మార్గం

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టును పథకం ప్రకారం నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం విమర్శించారు. ఆయన సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించేస్తున్నారంటూ నాడు యాగీ చేసిన చంద్రబాబు బృందం... ఇప్పుడు ప్రాజెక్టు వద్ద 960 మె.వా పవర్ ప్రాజెక్టును పూర్తిగా పక్కన పెట్టేయడం దుర్మార్గమన్నారు.

కేంద్ర సర్వీసుకు సింఘాల్

సాక్షి, అమరావతి: రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్ సింఘాల్ కేంద్ర పాఠశాల విద్య, అక్షరాస్యత విద్యా మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శిగా నియమితులయ్యారు. దీంతో సింఘాల్‌ను రాష్ట్ర సర్వీసు నుంచి సీఎస్ రిలీవ్ చేశారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక సీఎస్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అదే శాఖ అధికారి అనంతరాముకు అప్పగించారు.

నాపై కేసులు కొట్టేయండి

హైకోర్టులో కాకాణి పిటిషన్లు

సాక్షి, అమరావతి: శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా, ముత్తుకూరు పోలీసులు తనపై నమోదు చేసిన రెండు కేసులను కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలు తేలేంత వరకు తనపై నమోదు చేసిన కేసుల్లో తదుపరి చర్యలన్నీ నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోర్టును కోరారు. ఈ వ్యాజ్యాలపై న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ మంగళవారం విచారణ జరపనున్నారు.

'స్వర్ణాంధ్ర సాధనలో కేంద్ర పథకాలు అనుసంధానం'

సాక్షి, అమరావతి: స్వర్ణాంధ్ర సాధనలో కేంద్ర ప్రాయోజిక పథకాలను అనుసంధానం చేస్తూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్‌పర్సన్ లంకా దినకర్ తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలైన జల్ జీవన్ మిషన్, ఉపాధి హామీ, పీఎం ఆవాస్ యోజన, జాతీయ ఆహార భద్రత, నేషనల్ గోకుల్ మిషన్ వంటి పలు పథకాలను ఏపీలో అమలు పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే నీతిఆయోగ్ 17 స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాల సాధన దిశగా 20 సూత్రాల కార్యక్రమం అమలుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

కిస్తీ కోసం కుస్తీ!

ప్రభుత్వ సాయం దక్కక వరద బాధితులకు తీవ్ర ఆర్థిక కష్టాలు

- నీటమునిగిన ఆటోకు రూ.10వేలు, బైక్‌కు రూ.3వేలు ఒట్టిమాటే..
- ఈఎంఐలు కట్టేందుకు మారటోరియం ఇస్తామన్న సీఎం చంద్రబాబు హామీ గాలికి..
- కిస్తీలు కట్టాల్సిందేనంటూ ఫోన్లలో బాధితులను వేధిస్తున్న ఫైనాన్స్ కంపెనీలు
- స్నేహితుల నుంచి అప్పు చేస్తే ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతా నుంచి లాగేసుకుంటున్న ఫైనాన్స్, బ్యాంకర్లు
- ఎన్యుమరేషన్‌లో బైక్‌లు, ఆటోలను వదిలేసే కుట్రలో ప్రభుత్వం

'భార్యా భర్తలతో పాటు ఇంటిల్లిపాదీ కాయకష్టం చేసుకుని, సంవత్సరాల తరబడి కిస్తీలు కట్టుకుంటూ ఇంటిలో ఒక్కొక్కటిగా సమకూర్చుకున్న వస్తువులన్నీ వరద పాలయ్యాయి. నష్ట పరిహారం ఇస్తామంటూ రెండుసార్లు వచ్చి రాసుకుని వెళ్లినా.. ఇంతవరకు సాయమందలేదు. అందుకోసం ఇప్పుడు నేను కూలి వదిలేసుకుని ప్రభుత్వం ఇచ్చే పరిహారం కోసం సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా. కిస్తీ కట్టలేదని ఫైనాన్స్ వాళ్లు నా బైక్ తీసుకెళ్లిపోయారు. మా అకౌంట్‌లో ఉన్న కాస్త డబ్బులను కూడా ఫైనాన్స్ వాళ్లు లాగేసుకుంటున్నారు. ఇక మా బిడ్డలకు మంచి భవిష్యత్తు ఎలా ఇవ్వగలం* అంటూ వాంబే కాలనీకి చెందిన తాపీ కార్మికుడు ఆకుల గణేష్ ఆవేదన వ్యక్తం చేశాడు.

'వరదల్లో మునిగిన ఆటోకు రూ.10వేలు సాయం చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చే వరకు ఫైనాన్స్ కంపెనీలు ఊరుకోవు కదా. ఉదయం లేచిన దగ్గర నుంచి ఫోన్లు చేసి డబ్బులు కట్టమని వేదిస్తున్నారు. కిస్తీ కట్టకుంటే బండి తీసుకెళ్లిపోతారు. అలా జరిగితే నేను ఇప్పటి వరకు కట్టిన 22 కిస్తీలు, డౌన్ పేమెంట్ మొత్తం పోయినట్టే. ఇన్నాళ్లూ బండి నడవకున్నా అప్పు చేసి కిస్తీ కట్టాను. మరో రూ.15వేలు అప్పులు తీసుకుని రిపేర్ చేయించాను. మా ఇళ్లు నీట మునిగిపోయినా.. నా ఆటో పాడైనా ప్రభుత్వ జాబితాలో పేరు లేదంటున్నారు. ఎక్కడికి వెళ్లి ఎవరిని అడగాలో తెలియడం లేదు' అంటూ వాంబే కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ కె.రమేష్ వాపోయాడు.



విజయవాడ సింగ్‌నగర్‌లో వరద నీటిలో మునిగిన బైక్‌లు, కారు(ఫైల్)

సాక్షి, అమరావతి: విజయవాడను బుడమేరు వరద విడిచిపెట్టినా.. ప్రభుత్వ నిర్లక్ష్యం మాత్రం పట్టిపీడుస్తోంది. వరదల్లో సర్వం కోల్పోయి రోడ్డున పడిన జీవితాలకు భరోసా కల్పించడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. 'తాంబూలాలు ఇచ్చేశాం.. తన్నుకు చావండి' అన్న చందాన వరద బాధితులకు ఆర్థిక సాయం ప్రకటించి.. దానిని పంపిణీ చేయడంలో పూర్తిగా విఫలమైంది. సోమవారం విజయవాడలోని వాంబేకాలనీ, వడ్డెర కాలనీ, శాంతిప్రశాంతి నగర్‌లో సాక్షి క్షేత్ర స్థాయిలో పర్యటించగా.. వరద బాధితులు తీవ్ర ఆర్థిక కష్టాల్లో ఉక్కిరిబిక్కిరవుతూ కనిపించారు. నెలవారీ కిస్తీలు కట్టలేక దిక్కులు చూస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మారటోరియం ఇస్తారంటూ చేసిన ప్రకటనలు ఎక్కడా క్షేత్రస్థాయిలో కనిపించడంలేదు. ఫైనాన్స్ కంపెనీలు, బ్యాంకర్లతో సమావేశం పెట్టి ఈఎంఐలు కట్టుకోవడానికి సమయం ఇచ్చేలా ఒప్పించామంటూ చేసిన హడావుడితో ఒనగూరిందేమీ లేదని తేలిపోయింది. రోజు ఉదయాన్నే ఫైనాన్స్ కంపెనీలు బాధితులకు ఫోన్లు చేసి వాయిదాలు కట్టాల్సిందేనని వేదిస్తుండం పరిపాటిగా మారింది. నష్ట పరిహారం అందకపోవడంతో బంధువులు, స్నేహితుల నుంచి అప్పులు చేస్తున్నారు. తీరా ఆ మొత్తం బ్యాంకు ఖాతాల్లో పడిన వెంటనే కిస్తీల రూపంలో సదరు ఫైనాన్స్ కంపెనీలు, బ్యాంకులు లాగేసుకుంటున్నాయి.

జీరో అకౌంట్‌కు 15 రోజులా?

సాధారణంగా బ్యాంకులో కొత్తగా ఖాతా తీసుకోవాలంటే ఒక్క రోజులోనే పూర్తవుతుంది. కానీ, వరద ముంపు నుంచి బయటపడిన ప్రాంతాల్లో సుమారు 15 రోజులు పడుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న బ్యాంకు ఖాతాలు ఏదో ఒక ఈఎంఐకు లింక్ పెట్టి ఉండడంతో.. ఒకవేళ ప్రభుత్వ సాయం అందితే.. ఆ మొత్తం పాత ఖాతాలో పడితే ఎక్కడ బ్యాంకర్లు, ఫైనాన్స్ కంపెనీలు లాగేసుకుంటాయోనని బాధితులు నానా అగచాట్లు పడుతున్నారు. జీరో అకౌంట్ల కోసం బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆధార్‌కు, బ్యాంకు ఖాతాలకు, ఫోన్ నంబర్లు ఒకదానికొకటి లింక్ కాపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఎన్యుమరేషన్‌లో బైక్‌లు వదిలేసి..

వరద బాధితులకు నష్ట పరిహారం అందించే క్రమంలో వీలైనంత వరకు ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం కుట్ర పన్నింది. ఎన్యుమరేషన్ ప్రక్రియలో చాలా కుటుంబాలకు చెందిన ద్విచక్ర వాహనాలు, ఆటోలను కావాలనే విస్మరించింది. దీంతో వాహనాలు దెబ్బతిన్న బాధితులు నష్టపోయారు. తీరా అకౌంట్లలో నగదు జమవుతుందని తెలిసి సచివాలయాలకు వెళ్లడంతో ఎన్యుమరేషన్‌లో తమ వాహనాలు నమోదు చేయలేదని తెలుసుకున్నారు. మళ్లీ కొత్తగా దరఖాస్తులు పట్టుకుని సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం చెప్పినట్లు బైక్‌లకు రూ.3వేలు, ఆటోలకు రూ.10 వేలు సాయం ఎంత మందికి ఇచ్చారన్నదే ప్రశ్నార్థకం.

ఎకో టూరిజం పాలసీ రూపకల్పనకు 'వర్కింగ్ గ్రూపు'

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎకో టూరిజం పాలసీని రూపొందించాలని నిర్ణయించిన ప్రభుత్వం అది ఎలా ఉండాలో చెప్పేందుకు ఉన్నతాధికారులతో వర్కింగ్ గ్రూపును నియమించింది. ఈ గ్రూపునకు అటవీ శాఖ అదనపు పీసీసీఎఫ్ శాంతిప్రియ పాండే చైర్‌పర్సన్‌గా నియమించారు. సభ్యులుగా పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ, అటవీ శాఖ మరో అదనపు పీసీసీఎఫ్ రాహుల్ పాండే, పర్యాటక శాఖ డైరెక్టర్, ఉప ముఖ్యమంత్రి పేషీలో పనిచేసే ఏసీఎఫ్ శివప్రసాద్, పంచాయతీరాజ్ శాఖ ఈఎన్‌సీ బాలు నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది.

ఏపీ కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి స్వల్పగాయాలు

- అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల గ్రామ శివారులో కారు అదుపు తప్పిన ఘటనలో ఏపీకి చెందిన ఉన్నతాధికారికి స్వల్పగాయాలయ్యాయి. ఏపీ కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిప్రసాద్ సోమవారం హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు కారులో వెళుతుండగా మార్గమధ్యలో ఆకుపాముల వద్దకు రాగానే డ్రైవర్ ముందు ఉన్న మరో కారును ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వాణిప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. వాణిప్రసాద్‌ను కోదాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేయించి.. విజయవాడకు పంపించారు. కాగా, ఈ ప్రమాదంపై ఫిర్యాదు ఏమీ అందలేదని మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కోడెల విగ్రహం దొంగచాటుగా పెట్టాల్సిన అవసరం లేదు

మంత్రి గొట్టిపాటి రవి కుమార్

సాక్షి, అమరావతి: టీడీపీలో మాజీ మంత్రి కోడెల శివప్రసాద్ కు ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. కోడెల విగ్రహం దొంగచాటుగా అర్ధరాత్రులు పెట్టాల్సిన అవసరం లేదని, అందరి సమక్షంలో ఆవిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. త్వరలోనే కోడెల శివప్రసాద్ విగ్రహాన్ని అన్నీ అనుమతులతో ప్రతిష్టిస్తామని పేర్కొన్నారు.

ఎస్ఆర్ పురంలో మాల్దీవుల బృందం పర్యటన

పెందుర్తి: విశాఖలోని పెందుర్తి మండలం సౌభాగ్యరాయపురం (ఎస్ఆర్ పురం)లో మాల్దీవుల బృందం సోమవారం పర్యటించింది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పాలన, ప్రజలకు అందుతున్న సేవల గురించి తెలుసుకునేందుకు వీరు ఇక్కడ పర్యటించారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఏయే సేవలు అందుతున్నాయి, క్షేత్ర స్థాయిలో అవి ఎలా అమలవుతున్నాయనేది తెలుసుకున్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు.

పెన్నమ్మకు గర్భశోకం

- ఇసుకను తోడేస్తున్న టీడీపీ నాయకులు
- ట్రాక్టర్‌కు గేటు వసూలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు



బిస్మిల్లాబాద్ వద్ద పెన్నానదిలో ఇసుకను తోడేస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల మండల పరిధిలోని హనుమనుగుత్తి గ్రామ పంచాయతీ పరిధిలోని బిస్మిల్లాబాద్ గ్రామం సమీపంలో పెన్నానదిలోని ఇసుకను అక్రమదారులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. పైగా గేటు వసూలు చేస్తున్నారు. క్వారీలో నుంచి అవసరమైనప్పుడు ఇసుకను ఉచితంగా తెచ్చుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. యర్రగుంట్ల మండలం పరిధిలో ఎక్కడా ఇసుక క్వారీ లేదు. దీంతో అక్రమార్కులు ఇసుకను తోడేస్తూ పెన్నామ్మకు గర్భశోకం మిగిలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బిస్మిల్లాబాద్ గ్రామంలోని కొందరు టీడీపీ నాయకులు పెన్నానదిలోని ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు ఒక రేటు పెట్టి గేటును వసూలు చేస్తున్నారు. రోజుకు ఒక్కరు చొప్పును వంతులు వేసుకొని బయట నుంచి ట్రాక్టర్లను రప్పించుకొని అనధికారంగా గేటును పెట్టుకుని వసూళ్లకు తెరలేపారు. రోజుకొకరు చొప్పున ఇసుకను అమ్ముకుంటున్నారు. ప్రొద్దుటూరు, రామేశ్వరం పొట్లదుర్తి గ్రామాల నుంచి ఇసుక కోసం రోజూ ట్రాక్టర్లు వరుసలో నిలబడుతున్నాయి. ఇసుక తరలిపోతుండటం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. వీరి అక్రమాలను మొదట్లో గ్రామస్తులు అడ్డుకున్నారు. తర్వాత గ్రామం కోసం డబ్బు వసూలు చేస్తున్నామంటూ వారికి నచ్చజెప్పారు. పెన్నాలో అక్రమంగా ఇసుకను గేటు పెట్టి వసూళ్లు చేసుకుంటున్నారని గ్రామంలోని కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

'హెచ్ఆర్‌సీ చైర్మన్, సభ్యులను నియమించాలని ఆదేశించండి'



సాక్షి, అమరావతి: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్‌సీ) చైర్మన్, సభ్యులను 4 వారాల్లోపు నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. హెచ్ఆర్‌సీ చైర్మన్, సభ్యుల పదవీకాలం ఈ ఏడాది మార్చిలో ముగిసిందని తెలిపారు. చైర్మన్, సభ్యుల నియామకానికి ప్రభుత్వం మార్చి 15న నోటిఫికేషన్ జారీ చేసిందని వివరించారు. ఆ తర్వాత ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. హెచ్ఆర్‌సీ చైర్మన్, సభ్యులు లేకపోవడం వల్ల ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించే వ్యవస్థ లేదని యోగేష్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని ఆయన కోర్టును కోరారు.

గిరిజన సంక్షేమానికి సర్వే కోసం కమిటీ వేయండి

ఏపీ ఎస్టీ కమిషన్ ప్రతిపాదన

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గిరిజన సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై సమగ్ర సర్వే నిర్వహించేందుకు కమిటీని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగ (ఎస్టీ) కమిషన్ ప్రభుత్వానికి ప్రతిపాదన చేసింది. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో సభ్యులు వడిత్యా శంకర్ నాయక్, జంపరంగి లిల్లీ, కొర్ర రామలక్ష్మి, చిచ్చడా మురళి పాల్గొని గిరిజన సమస్యలను చర్చించారు. గిరిజన ప్రాంతాల్లో పిల్లలకు ఆధార్ కార్డ్ లేకపోవడంతో పిల్లలకు విద్యా సంస్థలలో ప్రవేశానికి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వం స్పందించి గిరిజనులు అందరికీ ఆధార్ కార్డులు ఇచ్చేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతోపాటు ప్రస్తుతం ఆధార్ కార్డు లేకున్నా గిరిజన బిడ్డలకు విద్యా సంస్థల్లో ప్రవేశం కల్పించాలని కోరారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 84,489 మంది స్వామిని దర్శించుకున్నారు. 28,871 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.76 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న వారికి 2 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

పులకించిన క్షీరారామం



పాలకొల్లు సెంట్రల్: పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులోని పంచారామ క్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం సోమవారం వేకువజాము నుంచి భక్తుల శివనామస్మరణతో పులకించింది. కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని మహిళలు వేకువజాము నుంచే కాలువ స్నానాలు చేసి కాలువలో కార్తీక దీపాలు వదిలి అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 30 వేల మంది వరకు భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు అంచనా.

9, 10 తేదీల్లో భగవద్గీత కంఠస్థ పోటీలు



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వారికి భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనుంది. భగవద్గీతలో 6వ అధ్యాయం ఆత్మసంయమ యోగం అంశంగా జూనియర్, సీనియర్ విభాగంలో పోటీలు నిర్వహించనుంది. సంపూర్ణ భగవద్గీత పోటీలు 9వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పున్నమ్మ తోటలోని టీటీడీ కల్యాణమండపంలో, 6,7,8,9 తరగతులు వారికి 10వ తేదీ ఉదయం 10 గంటలకు చుట్టుగుంట సెంటర్‌లోని లయన్స్ క్లబ్ హాల్లో జరగనున్నాయి. వివరాలకు 703 2255 499 నంబర్‌ను సంప్రదించాలి.

చవితికి సర్వం సిద్ధం

మోపిదేవి: నాగులచవితి సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి మంగళవారం వేలాదిగా భక్తులు మోపిదేవికి తరలిరానున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున 2.30 గంటల తర్వాత భక్తులను అనుమతించనున్నారు. పోలీసులు సూచించిన ప్రదేశంలోనే పార్కింగ్ చేసుకోవాలని భక్తులకు ఆలయవర్గాలు సూచించాయి. దేవస్థానం పక్కన జెడ్పీ పాఠశాల ఆవరణలో భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేసింది.

విద్యా సమాచారం

అవినీతి రహిత దేశంగా నిర్మించాలి

తిరుపతి సిటీ: భారతదేశాన్ని అవినీతి రహిత దేశంగా నిర్మించాలని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృత వర్సిటీలో గత వారం రోజులుగా జరుగుతున్న విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉత్తమ, నీతియుక్తమైన సమాజ స్థాపనకు యువత కృషి చేయాలని సూచించారు. అనంతరం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా విద్యార్థులుకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డీన్లు ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ దక్షిణమూర్తి శర్మ, ప్రొఫెసర్ వెంకట్రావు, డాక్టర్ సీతారంశర్మ పాల్గొన్నారు.

దూరవిద్య పరీక్షల్లో ప్రత్యేక పరిశీలక బృందం విస్తృత తనిఖీలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో కర్నూలు జిల్లాలో జరుగుతున్న దూరవిద్య పరీక్ష కేంద్రాలను ప్రత్యేక పరిశీలక బృందం సోమవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. తనిఖీలలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గూడూరు పట్టణంలో ఉన్న శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలలో యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు గుర్తించడం జరిగిందని తెలిపారు. పరీక్ష నిర్వాహకులు పలు అవకతవతలకు పాల్పడినట్లు గుర్తించి, ఈ అంశాన్ని వర్సిటీ దూర విద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ దృష్టికి తీసుకువెళ్లగా, అవకతలకు పాల్పడిన సెంటర్‌ను దగ్గరలో ఉన్న మరొక సెంటర్‌కు మార్చాలని ఆదేశించారు. దీంతో గూడూరు శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. కేంద్రంలో పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కర్నూలు పట్టణంలోని బి.తాండ్రపాడు ఎస్ఎల్ఎస్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు ఆ పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాసే ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎస్వీయూలో సమీక్ష

తిరుపతి సిటీ: ఏపీ ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ ప్రొఫెసర్ రామ్మోహన్ రావు సోమవారం ఎస్వీయూను సందర్శించి అధికారులతో సమీక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు, పరిశోధన రంగంలో వృద్ధి, ప్రపంచ స్థాయి ర్యాంకులు సాధించాలంటే పేటెంట్లు, జర్నల్స్‌లో ప్రచురణలు మెరుగుపరుచుకునేందుకు గల మార్గాలను సూచించారు. విదేశీ విద్యార్థులను చేర్చుకునేందుకు వర్సిటీ చొరవ చూపాలని, పరిశోధనా రంగంలో విదేశీ పరిశోధకుల బృందంతో కలసి పనిచేయాలని సూచించారు. పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలకు వర్సిటీ అధ్వర్యంలోనే ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునేలా అనుమతులివ్వాలి వర్సిటీ అధికారులు ఆయనకు విన్నవించారు.

సాక్షి ఫ్లస్
మంగళవారం ॥ 5-11-2024

ముఖము మొటిమ

హార్మోన్ల అల్లరిది గిల్లకండి!



యువతుల లుక్స్‌ను ప్రభావితం చేసి వారిని బాధపెట్టేవాటిల్లో మొటిమలు ముఖ్యమైనవి. ఆడపిల్లలైనా, మగపిల్లలైనా వారు బాల్యం వీడి కౌమారంలోకి వచ్చే దశలో ఈ మొటిమలు మొదలవుతుంటాయి. ఆ టైమ్‌లో దేహంలో కొన్ని రకాల కొత్త హార్మోన్ల ఉత్పత్తి మొదలవడం, ఆ టైమ్‌లో చర్మం మీద ఉండే గ్రంథుల్లోంచి 'సెబమ్' అనే నూనెవంటి పదార్థం స్రవిస్తుంటుంది. ఆ నూనె వంటి పదార్థం గ్రంథుల చివర్లలో పేరుకుపోవడం వల్ల మృతి చెందిన కణాలను బయటకు రాకుండా ఆపడం... దాంతో నూనె గ్రంథి మూసుకుపోవడం వల్ల మొటిమ వస్తుంది. దీన్ని గిల్లినప్పుడు సీబమ్ బయటకు వచ్చేసి, అక్కడ చిన్న గుంట మిగిలిపోతుంది. అయితే అబ్బాయిల కంటే అమ్మాయిలను అమితంగా బాధించే ఈ మొటిమలూ... అవి వచ్చేందుకు కారణాలూ, వాటి నివారణా, చికిత్స వంటి అనేక విషయాలను తెలిపే కథనమిది.

సాధారణంగా మొటిమలు ముఖం మీదే కనిపిస్తాయని అనుకుంటారు. గానీ అవి ముఖం మీద చెంపలూ, ముక్కు అలాగే భుజాలు, వీపు ఇలా అనేక భాగాల్లో వస్తుంటాయి.

మొటిమలు... లక్షణాలు:

మొటిమల్లో ప్రధానంగా నాలుగు గ్రేడ్స్ ఉంటాయి. అవి...

గ్రేడ్ - 1 : (కొమెడోజెనిక్) : ఈ తరహా మొటిమను వైట్ హెడ్ లేదా బ్లీక్ హెడ్ అని పిలుస్తారు. దీని బయటి చివరి భాగం మూసుకుపోవడం వల్ల అక్కడ ఇది తెల్లరంగులో గడ్డగట్టుకుపోయిన చిన్న బంతి ఆకృతిలో కనిపిస్తుంది. బాల్ పాయింట్ పెన్ చివరి టిప్ సైజ్‌లో ఈ వైట్‌హెడ్ ఉంటుంది. ఒకవేళ మూతి చివరి చర్మకణాలు చనిపోయి నల్లగా మారిపోతే దాన్ని బ్లాక్‌హెడ్‌గా అభివర్ణిస్తారు.

గ్రేడ్ - 2 : (పాపులర్ ఆక్నే) : ఈ దశలో మొటిమలో కొద్దిపాటి వాపు, మంట (ఇన్‌ఫ్లమేషన్) కనిపిస్తుంది. ఇలా ఇన్‌ఫ్లమేషన్ కనిపించే దశను పాపులర్ ఆక్నే అంటారు. ఈ దశలో ఇది చిన్నగా ఎర్రగా మరి ఉబ్బినట్లుగా బయటికి తన్నుకొని వచ్చి కనిపిస్తుంది.

గ్రేడ్ - 3 : (పుస్టులార్ ఆక్నే): ఈ దశలో ఇన్‌ఫ్లమేషన్ చాలా ఎక్కువ. పైగా ఈ దశలో ప్రాపియోనిక్ బ్యాక్టీరియా అనే ఒక తరహా బ్యాక్టీరియా ఆ మొటిమకు తోడవుతుంది. ఈ దశలో మొటిమలో ఇన్‌ఫ్లమేషన్‌కు తోడు చీము చేరుతుంది. దాంతో ఎర్రగా ఉబ్బుకుని వచ్చిన భాగం మీద తెల్లటి చీము కనిపిస్తూ ఉంటుంది.

గ్రేడ్ - 4 : (సిస్టిక్ ఆక్నే) : ఒకవేళ పైన పేర్కొన్న పుస్టులార్ ఆక్నే మరింత తీవ్రమైనప్పుడు అది చిన్న నాడ్యూల్‌గా (నీటి తిత్తిగా) మారిపోయి, బయటకు తన్నుకు వచ్చినట్లుగా కనిపిస్తుంది. ఇందులో ఇన్‌ఫ్లమేషన్‌తో పాటు, చీము, నొప్పి, నీటిగుల్ల... ఇవన్నీ కలిపి ఉన్నందున మొటిమ తీవ్రంగా మారుతుంది.

కొన్ని మొటిమల్లో మొదటి గ్రేడ్ నుంచి నాలుగో గ్రేడ్ వరకూ ఒకే మొటిమలోనే అన్ని దశలూ కనిపించవచ్చు. ఈ తరహా మొటిమలు ముఖం, ఛాతీ, భుజాలు, వీపు... ఇలా అన్ని భాగాల్లో రావచ్చు.

కారణాలు :

1. బాలలు ఒక్కసారిగా యౌవన (కౌమార) దశలోకి ప్రవేశిస్తుంటారు. దీన్నే ప్యూబర్టీ స్పర్ట్‌గా పేర్కొంటారు. టీనేజీ యువతుల్లో అనేక రకాల హార్మోన్లు స్రవిస్తుండటం, వాటి మధ్య సమతౌల్యత లోపించడం మొదలైతే మొటిమలు కనిపిస్తాయి. ముఖ్యంగా 'పాలీసిస్టిక్ ఒవేరియస్ డిజార్డర్' లేదా పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ ఉన్న అమ్మాయిల్లో ముఖాలపై మొటిమలు చాలా ఎక్కువ.

2. ఆహారం : చక్కెర మోతాదులు ఎక్కువగా ఉండే (హై గ్లూకోజ్) ఆహారాన్ని తీసుకునే వారిలో మొటిమల సమస్య చాలా ఎక్కువ. పాల ఉత్పాదనలతో కూడిన స్వీట్లు, చాక్లెట్లు, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారం, నూనె ఎక్కువగా ఉండే పదార్థాల్ని ఎక్కువగా తీసుకునే వారిలో మొటిమలు ఎక్కువగా వస్తాయి. ఈ తరహా ఆహారాన్ని తగ్గించగానే మొటిమలూ తగ్గుముఖం పడతాయి. అయితే అన్ని సందర్భాల్లోనూ ఇలాగే జరగకపోవచ్చు. మొటిమలకూ, ఇన్సులిన్ మెటబాలిజమ్ (ఇన్సులిన్ జీవక్రియల తీరు), స్థూలకాయానికీ సంబంధం ఉందని కొన్ని అధ్యయనాల్లో స్పష్టమైంది.

3. జన్యుసంబంధమైన కారణాలు : కొందరిలో ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా కేవలం జన్యుసంబంధమైన కారణాలతోనూ మొటిమలు రావచ్చు.

4. ఒత్తిడి : తీవ్రమైన ఒత్తిడికి గురయ్యే కొందరిలో మొటిమలు ఎక్కువగా వస్తాయని కొన్ని అధ్యయనాల్లో తేలింది.

5. ఇన్ఫెక్షన్ ఏజెంట్స్ : కొన్ని రకాల బ్యాక్టీరియా అంటే... ప్రోపియోనీ బ్యాక్టీరియా, స్టెఫాలోకోకస్ ఆరియస్, డెమో డెక్స్ ఫాలిక్యులోరమ్ వంటి ఇన్ఫెక్షన్లను కలిగించే బ్యాక్టీరియాతోనూ కొందరిలో మొటిమలు రావచ్చు.

నివారణ / చికిత్సలు :

- ముఖాన్ని మృదువైన (మైల్డ్) సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. ముఖంపై జిడ్డుగా ఉందేలా మేకప్ వేసుకోకూడదు. పొడిగా ఉంచుకోవాలి. రోజుకు కనీసం ఒకటి రెండు సార్లు శుభ్రంగా కడుక్కోవాలి. ముఖాన్ని స్క్రబ్‌తో రుద్దుకోవడం, మాటిమాటికీ కడుక్కోవడం చేయకూడదు. వెంట్రుకలు జిడ్డుగా ఉండేవారు ప్రతిరోజూ షాంపూతో తలస్నానం చేయాలి. మొటిమలను గిల్లడం, నొక్కడం చేయకూడదు. జిడ్డుగా ఉండే కాస్మటిక్స్ వేసుకోకూడదు. ఒకవేళ కాస్మటిక్స్ వాడాలనుకుంటే 'నాన్-కొమిడోజెనిక్' తరహావి మాత్రమే వాడాలి. ఈ చర్యలతో మొటిమలు తగ్గకపోతే అప్పుడు మొటిమలను నివారించే మందులను డాక్టర్ సలహా మేరకే వాడాలి. మందుల షాపుల్లో అమ్మే మొటిమలను తగ్గించే మందుల్ని ఎవరంతట వారే వాడకూడదు. ఎందుకంటే అందులో బెంజోయిల్ పెరాక్సైడ్ / సల్ఫర్ / రిజార్సినాల్ / శాల్సిలిక్ ఆసిడ్ అనే రసాయనాలు ఉండవచ్చు. అవి బ్యాక్టీరియాను చంపి, ముఖాన్ని తేమగా ఉంచే నూనె గ్రంథులను నాశనం చేయవచ్చు లేదా పైపొరను దెబ్బతీయవచ్చు. దాంతో ముఖంపై చర్మం ఎర్రబారిపోవచ్చు.
- **ఆహారపరమైన జాగ్రత్తలు**

టీనేజ్ పిల్లలు తీసుకునే కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండటం వంటివి. అవి...

- **చాక్లెట్లు / కాఫీలు :** మొటిమలను ప్రేరేపించే అంశాల్లో చాక్లెట్లు, కాఫీ లోని కెఫిన్ చాలా ప్రధానమైనవి. వాటిని పరిమితంగా తీసుకుంటూ ఆహారంలో కొవ్వులు, చక్కెర తగ్గించాలి
- ముఖానికి కాస్త లేత ఎండ తగిలేలా జాగ్రత్త తీసుకోవడం అన్నది మొటిమలను చాలావరకు నివారిస్తుంది.

ఈ తరహా నివారణ చర్యల తర్వాత కూడా మొటిమలు తగ్గకపోతే అప్పుడు డర్మటాలజిస్ట్‌ను కలవాలి.

మొటిమలు మరింత తీవ్రంగా వచ్చేదిలా...

1. మురికి సెల్‌ఫోన్లు : టీనేజీ పిల్లల్లో మొటిమలు వస్తున్నప్పుడు వారు మురికిగా ఉండే సెల్‌ఫోన్లు వాడుతున్నప్పుడు ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది. ఈ వయసు పిల్లలు తాము వాడే సెల్‌ఫోన్‌ను, స్క్రీన్‌ను శుభ్రంగా తుడిచి వాడాలి.

2. హెయిర్ స్ప్రే లు వాడటం : టీనేజీ అమ్మాయిలూ, యువతులు హెయిర్ స్ప్రేలు, హెయిర్ స్టిఫెనర్లు, తలకు రంగులు, స్ప్రేలు, జెల్‌లు, క్రీములు వంటి వాటి వాడకం ఎక్కువ. వీటి వల్ల కూడా సమస్య మరింత తీవ్రం కావచ్చు. ఇలా వచ్చే మొటిమలు నుదురు భాగంలో ఎక్కువగా కనిపిస్తుంటాయి.

3. రకరకాల కాస్మటిక్స్ వాడటం : కొందరు తాము వాడే కాస్మటిక్స్‌లో కొమిడొజెనిక్ ఏజెంట్స్ అని పిలిచే లెనోలిన్, వెజిటబుల్ ఆయిల్స్, బ్యూటల్ స్టియరేట్, లారిల్ ఆల్కహాల్, శరీరాన్ని తెల్లబరిచేందుకు ఉపయోగించే కాస్మటిక్స్ వాడుతుంటారు. అవి తీవ్రపరిణామాలతో పాటు మొటిమలకు కారణమవుతుంటాయి. అందుకే కొనేముందు అవి 'నాన్ కొమిడోజెనిక్ కాస్మటిక్స్' అని నిర్ధారణ చేసుకున్న తర్వాతే వాటిని కొనుగోలు చేయడం మేలు.

4. ముఖాన్ని అతిగా కడగటం : ముఖం తేటగా కనిపించాలనే ఉద్దేశంతో మాటిమాటికీ కడగటం, స్క్రబ్బింగ్ చేయడం, ఆవిరిపట్టించడం (స్టీమింగ్), ఫేషియల్స్ అతిగా ఉపయోగించడం వంటి పనుల వల్ల మొటిమలు రావడంతో పాటు ముఖానికి నష్టం జరుగుతుంది.

5. మొటిమలను గిల్లడం, గట్టిగా నొక్కడం వల్ల వాటి తీవ్రత పెరుగుతుంది. ముఖపై చిన్నచిన్న గుంటల్లా పడే అవకాశం ఉంది. ఇన్‌ఫ్లమేషన్ వస్తే ముఖం మరింత అందవికారంగా మారవచ్చు. అందుకే మొటిమలు గిల్లడం వంటివి చేయకూడదు.

స్పాండిలోసిస్ అంటే సంక్షిప్తంగా...

స్పాండిలోసిస్ అనేది వెన్నెముకకు సంబంధించిన సమస్య. వాస్తవానికి ఇది ఒక రకమైన ఆర్థ్రరైటిస్ (అంటే ఎముకల అరుగుదల వల్ల వచ్చే రుగ్మత) అని చెప్పవచ్చు.




ఈ సమస్య మెడ భాగంలో వస్తే దాన్ని సర్వైకల్ స్పాండిలోసిస్ అని, నడుము భాగంలో వస్తే లంబార్ స్పాండిలోసిస్ అంటారు.

స్పాండిలోసిస్‌కు కారణాలు : వెన్నులో కూడా అనేక జాయింట్స్ ఉంటాయి. అవి అరిగాక ఒక ఎముక మరో ఎముకతో రాసుకుపోయే సమయంలో వాటి మధ్యన ఉండే నరాలు నలిగిపోయి నొప్పి రావచ్చు. స్పైన్ దెబ్బతిని కూడా నొప్పి రావచ్చు.

- సర్వైకల్ స్పాండిలోసిస్‌లో మెడనొప్పితో పాటు తలనొప్పి తల అటు-ఇటు తిప్పడం కష్టమవుతుంది. మెడ బిగుసుకుపోయినట్టుగా ఉంటుంది. నొప్పి మెడ నుంచి భుజాలు, చేతుల వరకు పాకుతున్నట్టుగా వస్తుంది
- లంబార్ స్పాండిలోసిస్‌లో నడుమునొప్పి. కొన్నిసార్లు నడుము నొప్పితో పాటు మెడ నొప్పి కూడా ఉంటుంది. నొప్పి నడుము నుంచి ఒక వైపు కాలు, పాదం వరకు వ్యాపిస్తుంది. దీనినే సయాటికా నొప్పిగా చెబుతారు. ఈ సమస్య నివారణ కోసం ఫిజియోథెరపిస్టులను సంప్రదించి వెన్నెముకకు సంబంధించిన వ్యాయామాలు చేయాలి. అలాగే మంచి పోషకాహారం తీసుకోవడం, క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవడం వంటి ఆహారపరమైన జాగ్రత్తలు పాటించాలి. కూర్చోవడం లేదా నిల్చోవడంలో సరైన భంగిమలు (పోష్చర్స్) పాటించాలి. డాక్టర్లను సంప్రదించి అవసరాన్ని బట్టి కొన్ని మందులు వాడాల్సి ఉంటుంది.

కొర్రలతో కొండంత ఆరోగ్యం!



ఇటీవల చిరుధాన్యాల వాడకం పెరిగిపోయిన కాలంలో కొర్రలకు మంచి ప్రాధాన్యం ఏర్పడింది. చాలామంది కొర్రలను పిండిగా కొట్టించి, వాటితో చేసిన ఆహారాలను వాడటం పరిపాటి అయ్యింది. నిజానికి గోధుమ పిండి కంటే కొర్రల పిండి మంచిదంటున్నారు న్యూట్రిషన్ నిపుణులు. కొర్రలలో ఉండే పోషకాలూ, వీటితో సమకూరే ఆరోగ్య ప్రయోజనాలూ లాంటి అనేక విషయాలను తెలుసుకుందాం...

ఒక కప్పు కొర్రపిండిలో ● ప్రోటీన్ 10 గ్రాములు ● డయటరీ ఫైబర్ 7.4 గ్రాములు ● మెగ్నీషియమ్ 83 మిల్లీగ్రాములతో పాటు ఇంకా చాలా రకాల సూక్ష్మపోషకాలు అంటే మైక్రోన్యూట్రియెంట్లూ ఉంటాయి.

కొర్రపిండితో సమకూరే కొన్ని ప్రయోజనాలు...

కొర్రపిండిలో పీచుపదార్థాల పరిమాణం చాలా ఎక్కువ కాబట్టి దీంతో చేసిన ఆహారాలు తీసుకోవడం వల్ల మలబద్ధకం తేలిగ్గా నివారితమవుతుంది. ఒక్క మలబద్ధకాన్ని నివారించుకుంటే ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలూ, అనర్థాలూ దూరమవుతాయన్న సంగతి తెలిసిందే. కొర్రల్లోని ప్రోటీన్లు కండరాల్లోని కణజాలానికి మంచి బలాన్ని ఇస్తాయి. ఈ ప్రోటీన్లే కండరాల్లో తమ రోజువారీ పనుల కారణంగా దెబ్బతినే కండరాలను రిపేర్లు చేస్తుంటాయి. దాంతో దెబ్బలు త్వరగా తగ్గడం, గాయాలు త్వరగా మానడం జరుగుతాయి. బలంగా మారిన ఈ కణజాలాలు మరింత ఎక్కువ ఆక్సిజన్‌ను గ్రహించగలుగుతాయి కాబట్టి మరింత ఆరోగ్యకరంగా ఉంటాయి. అంతేకాదు చాలాసేపు అలసిపోకుండా పనిచేయగలుగుతాయి. ఫలితంగా మనం పనిచేసే సామర్థ్యం, అలసిపోకుండా పని చేయగల సమయం (టైమ్ డ్యూరేషన్) పెరుగుతాయి. ఈ అంశాలన్నీ కలగలసి రోగనిరోధక వ్యవస్థ బలోపేతమవుతుంది.



డయాబెటిస్ నివారణకూ...

కొర్రల్లో చాలా ఎక్కువ పరిమాణంలో ఉండే పీచు దేహంలోని గ్లూకోజ్‌ను చాలా మెల్లగా రక్తంలో కలిసేలా చేస్తుంది. దాంతో డయాబెటిస్ నివారణకు ఇది బాగా తోడ్పడుతుంది. ఈ పీచు పదార్థమూ, ఈ గుణం కారణంగానే టైప్-2 డయాబెటిస్ ఉన్న వారికి ఆరోగ్యకరమైన ఆహారంగా రూపొందాయి. అంతేకాదు కొర్రలు రక్తంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఇందులోని మెగ్నీషియమ్ వల్ల ఎముకలు మరింత పటిష్ఠమవుతాయి. జీవకణాల్లోని ఎంజైములు మరింత సమర్థంగా పనిచేస్తాయి. కొర్రల్లో జింక్ మోతాదులూ ఎక్కువే కావడంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదలకు ఈ అంశం దోహదపడుతుంది. ఈ జింక్ వల్ల జుట్టు ఊడటం కూడా తగ్గుతుంది. థైరాయిడ్ పనితీరు క్రమబద్ధంగా మారుతుంది.

ఒంటికి మంచిదే... మరి పంటికి?

ఇటీవల ఆరోగ్య స్పృహ పెరగడంతో ఆరోగ్యకరమైన జీవనశైలి అనుసరిస్తూ అందులో భాగంగా పండ్లూ, పళ్లరసాలు తీసుకోవడం పెరిగింది. అయితే ఇది ఆరోగ్యానికి మంచేదేమోగానీ పంటికి హానికరంగా పరిణమించవచ్చు. అలా ఒంటికి మంచిదైనా, పంటికి హాని చేసేవేమిటో, ఆ హానిని ఎలా అధిగమించవచ్చో తెలుసుకుందాం.





పండ్లు / పండ్ల రసాలతో...

తాజా పండ్లు, పళ్ల రసాలూ ఆరోగ్యానికి మంచివే. కానీ అవే ఫ్రూట్‌జ్యూసుల వల్ల పంటికి హాని జరగవచ్చు. ఉదాహరణకు పళ్లరసాల్లోని ఎక్కువగా ఉండే చక్కెర మోతాదులు పళ్లను దెబ్బతీయవచ్చు. అలాగే ఒకింత పుల్లగా ఉండే పండ్లలోని యాసిడ్స్ వల్ల కూడా పళ్లు దెబ్బతింటాయి.

ఈ సమస్య అధిగమించడానికి...

పండ్లను జ్యూస్ రూపంలో తాగడం కంటే కొరికి తినడం మేలు. ఉదాహరణకు నారింజ/బత్తాయి పండ్లు కొరికి తిన్నప్పటికి కంటే చక్కెర కలిపి ఆరెంజ్ జ్యూస్ రూపంలో తీసుకున్నప్పుడు పళ్ల పాడయ్యే అవకాశం ఎక్కువ. పళ్ల బలహీనంగా ఉన్నవారు జ్యూస్ తీసుకోవాలనుకున్నప్పుడు అందులో ఎట్టిపరిస్థితుల్లోనూ చక్కెర కలుపుకోవద్దు. జ్యూస్ తాగిన వెంటనే నోరు శుభ్రంగా కడుక్కోవాలి.



దగ్గు మందులతో...

దగ్గు మందు ఔషధమే అయినా అది కూడా ఫ్రూట్ జ్యూస్‌లాంటి ముప్పునే తెచ్చిపెడుతుంది. దగ్గు మందుల్లోని గాఢత చిక్కదనం), అందులో ఉండే చక్కెర మోతాదులు... అచ్చం జ్యూస్‌లాంటి ప్రభావాన్నే చూపుతాయి. దాంతో పళ్ల దెబ్బతినే అవకాశం ఉంది.

ఈ సమస్య అధిగమించడానికి...

దగ్గు మందు తాగిన వెంటనే నోరు శుభ్రంగా కడుక్కోవాలి. వేలితో నోరు శుభ్రమయ్యేలా కడుక్కోవాలి. దగ్గుమందు తాగిన ప్రతిసారీ ఇలా నోరు కడుక్కోవాలి.



గుండెకు మేలు చేసే డార్క్ చాక్లెట్లతో...

పరిమితంగా తీసుకునే డార్క్ చాక్లెట్లు గుండెకు మేలు చేస్తాయి. సాధారణంగా చాక్లెట్లు పళ్లకు చుట్టుకుపోయేలా కాస్త జిగురుగా / జారుడుగా ఉంటాయి. అలా చుట్టుకుపోవడం వల్ల అవి తమలోని చక్కెరను చాలాసేపు పంటిపైనే అంటిపెట్టుకునే ఉంటాయి. దాంతో పళ్ల ఎనామిల్ పొర దెబ్బతినే అవకాశాలతో పాటు, పళ్లలో రంధ్రాలు (క్యావిటీలు) వచ్చే అవకాశాలెక్కువ. ఫలితంగా పిప్పిపళ్లు వస్తాయి. అలా దంతాలు దెబ్బతింటాయి.

ఈ సమస్య అధిగమించడానికి...

చాక్లెట్లు తిన్న తర్వాత ఆ జిగురంతా పోయేలా వేలితో లేదా టూత్ బ్రష్‌తో తేలిగ్గా బ్రష్ చేసుకోవాలి. నోరు పూర్తిగా శుభ్రమయ్యేలా పలుమార్లు నీళ్లతో పుక్కిలించాలి.

నాలుక సూచిక

టంగ్ కంగు తినడానికి కాదు!

ఫేస్ ఈజ్ ఇండెక్స్ ఆఫ్ మైండ్ అంటారు కదా. అలాగే టంగ్ ఈజ్ ద ఇండెక్స్ ఆఫ్ హెల్త్ అనుకోవచ్చు. అంటే... నాలుక అన్నది ఆరోగ్యానికి మంచి సూచిక అని అర్థం. అందుకే డాక్టర్ల దగ్గరికి వెళ్లగానే నాలుక చూపించమని అడుగుతుంటారు. దాన్నిచూసిన వెంటనే డాక్టర్లకు బాధితుల ఆరోగ్య విషయాలు ఎన్నో తెలుస్తుంటాయి. తల్లో నాలుకల వ్యవహరిస్తూ అనేక నములుతున్నప్పుడు రుచి తెలియజేయడం, పంటి కిందికి ఆహారాన్ని తోయడం వంటి అనేక పనులు చేసే నాలుక గురించి మాత్రం మనందరిలోనూ పెద్దగా తెలుసుకున్న దాఖలాలు ఉండవు. నాలుక చేసే కీలకమైన పనులు, దానికి వచ్చే కొన్ని సమస్యలపై అవగాహన కోసం ఈ కథనం.



సాధారణంగా నాలుక పింక్ రంగులో ఉంటే అది ఆరోగ్యానికి ఓ మంచి సూచన. ఒకవేళ అలా లేదంటే అది ఏదైనా అనారోగ్యానికి సూచన కావచ్చు. అందుకే డాక్టర్ల దగ్గరికి వెళ్లినప్పుడు వారు నాలుక చూపించమంటారు. అలా వ్యక్తుల ఆరోగ్యాన్ని గురించి తెలుసుకుంటారు. నాలుక కింది భాగం ఓ కండరంతో నోటిలోని కింది భాగానికి అతుక్కుపోయి... బయటకు అది చాలా చిన్నగా కనిపించినప్పటికీ, దాదాపు పది సెంటీమీటర్ల పొడవుంటుంది. దాదాపు 60 గ్రాముల బరువుంటుంది.

జీర్ణ ప్రక్రియలో తొలి అంకం నాలుక దగ్గర్నుంచే...

ఆహారాన్ని జీర్ణం చేసే పనిలో నాలుక భూమిక ఎంతో కీలకం. ఆహారాన్ని పళ్ల కిందికి తోసేందుకు మనమంతా మనకు తెలియకుండానే నాలుకను వాడుతుంటాం. అలా మనం తీసుకున్న ఆహారం చిన్న చిన్న ముక్కలుగా (పార్టికిల్స్‌గా) మారేందుకు ఉపయోగపడుతుంది. అంటే ఆహారం జీర్ణం కావడంలో తొలి అంకం ఇక్కణ్ణుంచే మొదలవుతుంది. ఆ తర్వాత మింగడం అనే ప్రక్రియ కూడా కేవలం నాలుక వల్లనే సాధ్యమవుతుంది. నాలుక వెనుక భాగం నమిలిన ఆహారాన్ని గొంతు ద్వారా కడుపులోకి నెడుతుంది. నాలుక దిగువన ఉండే చిన్న తీగ వంటి భాగంతోనే అది నోటి అడుగుభాగానికి అతుక్కుపోయి ఉంటుంది. ఈ తీగ పొడవు ఉండాల్సిన దాని కంటే బాగా తక్కువగా ఉంటే, మాట్లాడటంలో సమస్యలు వస్తాయి. నత్తి వంటి చాలా ఇబ్బందులు వస్తాయి. ఒకప్పుడు ఈ తరహా ఇబ్బందులకు పరిష్కారం అంతగా ఉండేది కాదు గానీ... ఇప్పుడు ఇలాంటి సమస్యను శస్త్రచికిత్సతో సరిచేసి, సరిగా మాట్లాడేలా చేసే అవకాశముంది.

రుచితోనూ ఆరోగ్యం గురించి...

అనారోగ్యం కలిగిన కొన్నిసార్లు రుచి తెలియదు. ఉదాహరణకు తీవ్రమైన జ్వరం వచ్చిన సందర్భాల్లోనూ, అలాగే జలుబు చేసినప్పుడు ముక్కుకు వాసనలూ, నాలుకకు రుచులూ తెలియని పరిస్థితి వస్తుంది. తాజాగా కరోనా వైరస్ సోకినప్పుడు కూడా ఇదే ప్రక్రియ వల్ల బాధితులకు రుచి తెలియకుండాపోయి, తమకు కరోనా వచ్చిన సంగతి తెలిసింది.

నాలుకకు వచ్చే కొన్ని అనారోగ్యాలు...

అన్ని అవయవాల లాగే నాలుకకూ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలుంటాయి. నాలుకకు వచ్చే ఇన్ఫెక్షన్‌ను గ్లాసైటిస్ అంటారు. కొన్ని యాంటీబయాటిక్స్ ఉపయోగించడం ద్వారా ఇన్ఫెక్షన్‌ను తేలిగ్గా తగ్గించవచ్చు.

- ఐరన్‌లోపంతో వచ్చే రక్తహీనత (అనీమియా) ఉన్న వారిలో నాలుక ఆరోగ్యకరమైన పింక్ రంగుకు బదులుగా ఎర్రగా ఉండి, ముట్టుకుంటే బాధకలిగించే టెండర్‌గా మారుతుంది
- పచ్చకామెర్లు (జాండీస్) సోకినవారిలో పసుపురంగులోకి మారి కనిపిస్తుంటుంది
- కొన్ని ఫంగస్‌లు సోకినప్పుడు నాలుకపై నల్లని మచ్చలు కనిపిస్తాయి. యాంటీ ఫంగల్ మందులు వాడటం ద్వారా దీన్ని తేలిగ్గా అధిగమించవచ్చు
- జింక్ లోపం వల్ల తలెత్తే 'డిస్‌గ్యూసియా' అనే సమస్య వచ్చిన వారిలో చక్కెర చేదుగానూ, చాక్లెట్ ఉప్పగానూ అనిపించవచ్చు. సాధారణంగా ఫ్లూ వంటి వ్యాధులు సోకిన తర్వాత ఇలాంటి పరిస్థితి తలెత్తుతూ ఉంటుంది. జింక్ పుష్కలంగా ఉండే పోషకాహారం తీసుకుంటే, కొద్ది రోజుల్లోనే నాలుక మళ్లీ సాధారణ స్థితికి వచ్చేస్తుంది
- అరుదుగా వచ్చే 'హైపోగ్యూసియా' అనే సమస్యలో నాలుక రుచులను గుర్తించే సామర్థ్యాన్ని దాదాపుగా కోల్పోతుంది. వారు ఏది తిన్నా రుచీపచీ ఉండదు
- విటమిన్ (చాలావరకు విటమిన్ బి కాంప్లెక్స్) లోపాల వల్ల నాలుక పగుళ్లుబారినట్లు అనిపించడం, నాలుక మీద పొక్కులు రావడం మామూలే. సాధారణంగా 'బి-కాంప్లెక్స్' మందులతో ఈ సమస్యను తేలిగ్గా అధిగమించవచ్చు
- పొగతాగేవారిలో నాలుక మీద ఉండే రుచిమొగ్గలు తమ సామర్థ్యాన్ని కోల్పోతాయి. అందుకే పొగతాగేవారికి రుచులు అంత స్పష్టంగా తెలియవు. అంతేకాదు... పొగతాగడం వల్ల హెడ్ అండ్ నెక్ క్యాన్సర్లతో పాటు నాలుక క్యాన్సర్ కూడా రావచ్చు. ఇది ప్రమాదకరమైన పరిణామం అందుకే పొగతాగడం, ఆల్కహాల్ వంటి అలవాట్లకు దూరంగా ఉండాలి.

బిజినెస్ రీల్

క్రిస్టల్ క్రాప్స్ చేతికి ఐఅండ్‌బీ సీడ్స్



న్యూఢిల్లీ: ఆగ్రోకెమికల్స్ సంస్థ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ తాజాగా బెంగళూరుకు చెందిన ఐఅండ్‌బీ సీడ్స్‌ను కొనుగోలు చేసింది. దేశీయంగా పూలు, కూరగాయల విత్తనాల మార్కెట్లో తమ స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు ఇది ఉపయోగపడుతుందని సంస్థ ఎండీ అంకుర్ అగర్వాల్ తెలిపారు. డీల్ విలువ ఎంతనేది నిర్దిష్టంగా వెల్లడి కాలేదు. కంపెనీ విలీన ప్రక్రియ ఆరు నెలల్లోగా పూర్తి కావచ్చని అంచనా. ఐఅండ్‌బీ సీడ్స్ వార్షికాదాయం రూ. 130 కోట్లుగా ఉంది. విత్తనాల విభాగంలో క్రిస్టల్ క్రాప్‌కి ఇది అయిదో కొనుగోలు కాగా మొత్తం మీద పన్నెండోది అవుతుంది. తమ విత్తనాల వ్యాపార విభాగానికి సంబంధించి 30 శాతం ఆదాయానికి ఈ కొనుగోలు దోహదపడగలదని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం క్రిస్టల్ క్రాప్ విత్తనాల విభాగం ఆదాయం రూ. 400 కోట్ల స్థాయిలో ఉంది. దేశీయంగా పూలు, కూరగాయల విత్తనాల మార్కెట్ పరిమాణం రూ. 600 కోట్లుగా ఉంది.

సోలార్ అలయన్స్ ప్రెసిడెంట్‌గా మరోసారి భారత్

2024–26 కాలానికి తిరిగి ఎన్నిక

న్యూఢిల్లీ: అంతర్జాతీయ సోలార్ కూటమి (ఐఎస్ఏ) ప్రెసిడెంట్‌గా భారత్ మరోసారి ఎన్నికైంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. మరో రెండేళ్లపాటు (2024–26) అధ్యక్ష బాధ్యతలను భారత్ నిర్వహించనుంది. ఐఎస్ఏ వైస్ ప్రెసిడెంట్‌గా ఫ్రాన్స్ తిరిగి ఎన్నికైనట్టు మంత్రి ప్రకటించారు. ఐఎస్ఏ ఏడో జనరల్ అసెంబ్లీ సందర్భంగా ఈ వివరాలను ఢిల్లీలో మీడియాకు మంత్రి వెల్లడించారు. ప్రెసిడెంట్‌గా భారత్ మరోసారి ఎన్నిక కావడం అన్నది ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ చేసిన కృషికి నిదర్శనమని అభివర్ణించారు. ప్రపంచ దేశాలు సోలార్ ఇంధనం వైపు మళ్లేలా చేయడంలో, అంతర్జాతీయ సమాజం మేలుకోసం భారత్ చేసిన కృషిని గుర్తు చేశారు. ఐఎస్ఏ పాలక మండలి ఎనిమిది ఉపాధ్యక్ష దేశాలను సైతం ఎన్నుకుంది. సోలార్ ఇంధన ప్రాజెక్టుల విస్తరణ, తద్వారా తమ దేశ ప్రజల జీవన ప్రమాణాల మెరుగునకు ప్రభుత్వాలు చేపట్టే చర్యలకు ఐఎస్ఏ సహకారం ఉంటుందని మంత్రి జోషి ప్రకటించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-11-2024

విశాఖ	550–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

నేటి బోర్డు సమావేశాలు

డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, టైటాన్, ఆయిల్ ఇండియా, పీబీ ఫిన్‌టెక్, మజగావ్ డాక్, మాక్స్ హెల్త్‌కేర్, జేకే టైర్స్, సీసీఎల్ ప్రొడక్ట్స్, ఎవరెస్ట్ ఇండియా, బర్జర్ పెయింట్స్, ఆల్కెమ్స్ అమైన్స్, గెయిల్, రాణే హోల్డింగ్స్

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,878.00	2.14
TECHM	1,633.40	1.86
CIPLA	1,584.00	1.57
SBIN	830.25	1.1
DRREDDY	1,269.95	0.82

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	4,807.00	-4.25
GRASIM	2,592.10	-3.96
BAJAJ-AUTO	9,534.00	-3.46
ADANIPORTS	1,349.00	-3.26
BPCL	303.45	-3.05

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,144
ఎన్ఎస్ఈ	9,8,172
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,88,448
ఎఫ్ఐఐ	- 4330
డీఐఐ	+ 2936

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.38	$ 69.49
బ్రెంట్	74.94	$ 73.01

గరిష్ట ధర వద్ద లాభాల స్వీకరణ

పసిడి వెనకడుగు

న్యూఢిల్లీ: అటు అంతర్జాతీయంగా, ఇటు దేశీయంగా గరిష్ట ధరల వద్ద లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో బంగారం పరుగు కొంత తగ్గింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర సోమవారం రూ.1,300 తగ్గి రికార్డు స్థాయిల నుంచి రూ.81,100కు దిగివచ్చింది. గత ట్రేడింగ్‌లో రూ.82,400 ఆల్‌టైమ్ రికార్డుకు పసిడి దూసుకుపోయిన సంగతి తెలిసిందే. ఇక వెండి కేజీ ధర ఏకంగా రూ.4,600 తగ్గి రూ.94,900కి చేరింది. ఆభరణ వర్తకులు, రిటైలర్ల నుంచి కూడా డిమాండ్ కొంత మందగించినట్లు ట్రేడర్లు పేర్కొన్నారు. కాగా, 99.5 స్వచ్ఛత పసిడి ధర న్యూఢిల్లీలో రూ.1,300 దిగివచ్చిన రూ.80,700కు చేరింది. ఇదిలావుండగా అంతర్జాతీయ మార్కెట్‌లో చురుగ్గా ట్రేడవుతున్న డిసెంబర్ ఫ్యూచర్స్ ఔన్స్ (31.1గ్రాములు) ధర 2,747 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇక్కడ పసిడి ధర వారంరోజుల క్రితం 2,802 డాలర్ల ఆల్‌టైమ్ రికార్డును తాకిన సంగతి తెలిసిందే.



ఎయిర్ ప్యూరిఫయర్లకు డిమాండ్

- 50 శాతం పెరిగిన అమ్మకాలు
- ఢిల్లీ పరిధిలో పడిపోయిన వాయు నాణ్యత
- అధిక విక్రయాలు కొనసాగుతాయన్న అంచనాలు



న్యూఢిల్లీ: ఎయిర్ ప్యూరిఫయర్లకు (గాలిని శుద్ధి చేసే పరికరాలు) డిమాండ్ పెరుగుతోంది. ఢిల్లీ ఎన్‌సీఆర్ వంటి ప్రాంతాల్లో వాయు నాణ్యత ప్రమాదకర స్థాయిలకు చేరడం ఇందుకు నేపథ్యమని తయారీదారులు చెబుతున్నారు. ప్రస్తుత పండుగల సీజన్‌లో ఎయిర్ ప్యూరిఫయర్ల అమ్మకాలు గతేడాది ఇదే సీజన్‌తో పోల్చినప్పుడు 50 శాతం పెరిగినట్టు కెంట్ ఆర్‌వో సిస్టమ్స్, షావోమీ, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా వెల్లడించాయి. ఎయిర్ ప్యూరిఫయర్ల కోసం గడిచిన 2–3 వారాలుగా విచారణలు పెరిగాయని, గాలి నాణ్యత సూచీ రానున్న రోజుల్లో మరింత ప్రమాదకర స్థాయికి చేరుకోనున్న (శీతాకాలం కావడంతో) దృష్ట్యా వీటి అమ్మకాలు ఇంకా పెరుగుతాయని కంపెనీలు అంచనా వేస్తున్నాయి. ఎయిర్ ప్యూరిఫయర్ల విభాగం పరిమాణం పరంగా చాలా చిన్నది కావడం గమనార్హం. ఏటా అక్టోబర్–నవంబర్ కాలంలో వీటి అమ్మకాలు గరిష్టానికి చేరుతుంటాయి. ఆ సమయంలో ఉత్తర భారత్‌లోని కొన్ని ప్రాంతాలతోపాటు ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో వాయు నాణ్యత దారుణంగా పడిపోతుంటుంది. దీపావళి వేడుకలకుతోడు పంట వ్యర్థాల దహనం ఇందుకు కారణం.

ఒక్కసారిగా డిమాండ్.

''ఢిల్లీ అత్యంత కాలుష్యంతో కూడిన సీజన్‌ను ప్రస్తుతం చూస్తోంది. దీంతో అక్కడ ఉన్నట్టుండి ఎయిర్ ప్యూరిఫయర్లకు డిమాండ్ ఏర్పడింది''అని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ చిట్కార తెలిపారు. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) ప్రమాదకర స్థాయిని దాటిపోతే అప్పుడు కాలుష్య కారకాలు పీఎం 2.5 పార్టికల్స్ కంటే సూక్ష్మంగా ఉంటాయని, వీటిని వడగట్టడం కూడా కష్టమేనన్నారు. శీతాకాలంలో వాయునాణ్యత క్షీణించడం వల్ల ఎయిర్ ప్యూరిఫయర్లు, ఫిల్టర్ల అమ్మకాలు సహజంగానే పెరుగుతుంటాయని కెంట్‌ఆర్‌వో సిస్టమ్స్ సీఎండీ మహేష్ గుప్తా తెలిపారు. ఉత్తరాది ప్రాంతాల్లో ప్రమాదకర స్థాయికి కాలుష్యం చేరడంతో తమ ఆరోగ్యం కాపాడుకోవడం కోసం వినియోగదారులు ఎయిర్ ప్యూరిఫయర్ల కొనుగోలుకు మొగ్గు చూపుతున్నట్టు వివరించారు. ఇప్పటికే అమ్మకాలు 20–25 శాతం మేర అధికంగా నమోదైనట్టు చెప్పారు. సాధారణం కంటే 50 శాతం మేర అధికంగా ఎయిర్ ప్యూరిఫయర్, ఫిల్టర్ల అమ్మకాలు పెరిగినట్టు షావోమీ ఇండియా అధికార ప్రతినిధి సైతం వెల్లడించారు. 2023 నాటికి ఎయిర్ ప్యూరిఫయర్ల మార్కెట్ విలువ రూ.778 కోట్లు ఉన్నట్టు.. 2024 నుంచి 2032 వరకు ఏటా 16 శాతం కంటే ఎక్కువే వృద్ధిని నమోదు చేస్తుందని ఒక అంచనా. ''కాలుష్యం అదే పనిగా పెరిగిపోతుండడంతో హానికారకాల నుంచి తమ కుటుంబ సభ్యులను రక్షించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం ముఖ్యం. అందుకే చాలా మంది కాలుష్యం నుంచి రక్షణగా ఈ కాలంలో బయటకు వెళ్లడానికి బదులు ఇళ్లల్లో ఉండేందుకే ప్రాధాన్యమిస్తుంటారు''అని బ్రిటిష్ కంపెనీ డైసన్ పేర్కొంది. ఈ సంస్థ సైతం ఎయిర్ ప్యూరిఫయర్లను విక్రయిస్తుంటుంది.

మారుతీ సుజుకీ కార్ల ఉత్పత్తి 16% డౌన్



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే ఈ ఏడాది అక్టోబర్‌లో ప్యాసింజర్ కార్ల ఉత్పత్తిని 16 శాతం తగ్గించింది. అయితే, యుటిలిటీ వాహనాల ఉత్పత్తిని 33 శాతం పెంచింది. అక్టోబర్‌లో ప్యాసింజర్ కార్ల ఉత్పత్తి 1,06,190 యూనిట్ల నుంచి 89,174 యూనిట్లకు తగ్గినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలిపింది. మరోవైపు, బ్రెజా, ఎర్టిగా, ఫ్రాంక్స్, జిమ్నీ, ఎక్స్‌ఎల్6 వంటి యుటిలిటీ వాహనాలతో పాటు టయోటా కిర్లోస్కర్ మోటర్స్‌కి సఫరా చేసే వాహనాల ఉత్పత్తిని 54,316 యూనిట్ల నుంచి 72,339 యూనిట్లకు పెంచినట్లు పేర్కొంది. మినీ కార్లు అయిన ఆల్టో, ఎస్–ప్రెసో మొదలైన వాటి ఉత్పత్తి 14,073 యూనిట్ల నుంచి 12,787 యూనిట్లకు తగ్గింది. అటు బాలెనో, సెలీరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, వ్యాగన్‌ఆర్‌తో పాటు టయోటా కిర్లోస్కర్ మోటర్స్‌కి కూడా సరఫరా చేసే కాంపాక్ట్ కార్ల ఉత్పత్తి 90,783 నుంచి 75,007 యూనిట్లకు తగ్గింది.

ఎస్‌ఏఆర్ టెలీవెంచర్ చేతికి తికోణ ఇన్ఫినెట్

డీల్ విలువ రూ. 669 కోట్లు

ముంబై: ఇంటర్నెట్ సేవలు అందించే తికోణ ఇన్ఫినెట్‌ను కొనుగోలు చేయనున్నట్లు నెట్‌వర్క్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఎస్‌ఏఆర్ వెల్లడించింది. ఈ ఒప్పందం విలువ రూ. 669 కోట్లు. నగదు, స్టాక్స్ రూపంలో ఈ డీల్ ఉంటుంది. ఇరు సంస్థలు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం తికోణలో ఎస్‌ఏఆర్ 91 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. 2008లో ఏర్పాటైన తికోణ 300 పైచిలుకు నగరాల్లో రెసిడెన్షియల్, కమర్షియల్ కస్టమర్లకు హై–స్పీడ్ ఇంటర్నెట్, డేటా సర్వీసులు అందిస్తోంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ మొదలైనవి కంపెనీకి క్లయింట్లుగా ఉన్నాయి. తికోణ గత ఆర్థిక సంవత్సరంలో రూ. 193 కోట్ల ఆదాయం ఆర్జించింది. ఎన్ఎస్ఈకి చెందిన ఎస్ఎంఈ ప్లాట్‌ఫాంలో లిస్టయిన ఎస్‌ఏఆర్ సంస్థ.. ఈ డీల్‌తో సమగ్ర టెలికం సేవల కంపెనీగా ఎదగనుంది.

కొత్త వ్యాపారాల్లోకి అలయన్స్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్



న్యూఢిల్లీ: కార్యకలాపాలు మొదలు పెట్టి 21 ఏళ్లు కావడంతో, నూతన వ్యాపారాల్లోకి విస్తరించాలని అలయన్స్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ ఉత్సాహంగా ఉంది. ఆక్వాకల్చర్, పునరుత్పాదక ఇంధనాలు, ఏవియేషన్, కొనుగోళ్లు, విలీనాల పట్ల ఆసక్తిగా ఉన్నట్టు ప్రకటించింది. బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ కంపెనీలతో టైఅప్ అయ్యి.. రుణాలు, ఉత్పత్తుల కొనుగోళ్లపై బీమా రక్షణను ఆఫర్ చేయనున్నట్టు ప్రకటించింది. దేశవ్యాప్తంగా 14 పట్టణాలు, అంతర్జాతీయంగా 14 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు తెలిపింది. ఇప్పటి వరకు 3,000కు పైగా అంతర్జాతీయ క్రీడలకు బీమా రక్షణను అందించినట్టు, టీ20 ప్రంపచకప్, ఫిఫా వరల్డ్‌కప్ సైతం ఇందులో ఉన్నట్టు పేర్కొంది. ముడి, సానబెట్టిన వజ్రాల బీమా మార్కెట్లో 45 శాతం మార్కెట్ వాటా తమకే ఉన్నట్టు తెలిపింది. మీడియా, వినోద పరిశ్రమలో ఇప్పటి వరకు 1,000కి పైగా చిత్రాలకు బీమాను ఆఫర్ చేసినట్టు వెల్లడించింది.

యునెప్ 'ఓజీఎంపీ 2.0'లో చేరిన కెయిర్న్

భారత్ నుంచి తొలి ఆయిల్ గ్యాస్ కంపెనీ

న్యూఢిల్లీ: వేదాంతా గ్రూప్ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ ఐక్యరాజ్యసమితికి చెందిన పర్యావరణ కార్యక్రమం (యునెప్)తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా 'ఆయిల్ అండ్ గ్యాస్ మిథేన్ పార్టనర్‌షిప్ (ఓజీఎంపీ) 2.0'లో చేరినట్టు ప్రకటించింది. ''ఈ అవగాహన ఒప్పందం కింద కెయిర్న్ ఐదేళ్ల పాటు మిథేన్ తగ్గింపు లక్ష్యాన్ని సాధించాలి. దీనిపై పారదర్శకంగా ఓజీఎంపీకి నివేదించాలి. 2030 నాటికి సున్నా కర్బన ఉద్గారాల (నెట్ జీరో) లక్ష్యాన్ని చేరుకునే దిశగా చర్యలను వేగవంతం చేసే విషయంలో కెయిర్న్ తన అంకిత భావాన్ని మరోసారి చాటుతోంది''అని వేదాంత గ్రూప్ ప్రకటించింది. మీథేన్ ఉద్గారాన్ని తగ్గించే దిశగా నాణ్యత, కచ్చితత్వం పెంచుకునేందుకు ఓజీఎంపీ 2.0 కార్యక్రమం ప్రోత్సహిస్తుంటుంది. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి ఈ కార్యక్రమం పరిధిలోకి వస్తోంది.



బాటా ఇండియా మెరుగైన పనితీరు

లాభంలో 53 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: బాటా ఇండియా సెప్టెంబర్ త్రైమాసికంలో బలమైన పనితీరు చూపించింది. లాభం 53 శాతానికి పైగా పెరిగి రూ.52 కోట్లకు చేరింది. ఆదాయం మాత్రం 2 శాతానికి పైగా వృద్ధితో రూ.837 కోట్లుగా నమోదైంది. ఎబిటా లాభం స్థిరంగా ఉండడం నిర్వహణ సామర్థ్యాల బలాన్ని తెలియజేస్తున్నట్టు బాటా ఇండియా ప్రకటించింది. ఉత్పత్తుల ఆవిష్కరణ, కస్టమర్లకు మెరుగైన అనుభవం, టెక్నాలజీ అనుసంధానత, బ్రాండ్ ప్రమియమైజేషన్‌పై తాము చేసిన వ్యూహాత్మక పెట్టుబడులు ఫలితాన్నిచ్చినట్టు తెలిపింది. వినియోగంలో స్తబ్దత ఉన్నప్పటికీ తాము మెరుగైన పనితీరు చూపించినట్టు బాటా ఇండియా ఎండీ, సీఈవో గుంజన్ షా పేర్కొన్నారు. సెప్టెంబర్ చివరికి దేశవ్యాప్తంగా బాటా స్టోర్ల సంఖ్య 1,955కి చేరింది. పవర్ బ్రాండ్‌కు సంబంధించి 4, హష్ పప్పీస్‌కు సంబంధించి 136 బ్రాండెడ్ అవుట్‌లెట్లు, ఫ్లోట్జ్‌కు సంబంధించి 14కియోస్క్‌లను కొత్తగా తెరిచినట్టు బాటా ఇండియా తెలిపింది.

గ్లాండ్ ఫార్మా లాభం 16 శాతం డౌన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా లాభం 16 శాతం క్షీణించింది. రూ. 194 కోట్ల నుంచి రూ. 163 కోట్లకు తగ్గింది. ఆదాయం రూ. 1,373 కోట్ల నుంచి రూ. 1,405 కోట్లకు పెరిగింది. సమీక్షాకాలంలో అమెరికా మార్కెట్లో నాలుగు మాలిక్యూల్స్‌ను ప్రవేశపెట్టినట్టు సంస్థ తెలిపింది. అలాగే, బయోలాజిక్స్ సీడీఎంవో వ్యాపార విభాగానికి సంబంధించి వ్యూహాత్మక భాగస్వామ్యం కోసం డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించింది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు Q2 RESULTS

ఏబీబీ ఇండియా లాభం అప్

క్యూ3లో రూ. 440 కోట్లు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిఫికేషన్, ఆటోమేషన్ దిగ్గజం ఏబీబీ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 21 శాతం జంప్‌చేసి రూ. 440 కోట్లకు చేరింది. ఇతర ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023) ఇదే కాలంలో రూ. 362 కోట్లు మాత్రమే ఆర్జించింది. కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. కాగా.. మొత్తం ఆదాయం సైతం రూ. 2,846 కోట్ల నుంచి రూ. 3,005 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో 11 శాతం అధికంగా రూ. 3,342 కోట్ల విలువైన ఆర్డర్లు అందుకుంది. దీంతో మొత్తం ఆర్డర్ల విలువ రూ. 9,995 కోట్లకు చేరింది. ఇది 25 శాతం వృద్ధి.

ఫలితాల నేపథ్యంలో ఏబీబీ షేరు ఎన్ఎస్ఈలో 1.4 శాతం నీరసించి రూ. 7,330 వద్ద ముగిసింది.

ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ లాభం డౌన్

క్యూ2లో రూ. 299 కోట్లు



న్యూఢిల్లీ: మురుగప్ప గ్రూప్ కంపెనీ ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం క్షీణించి రూ. 299 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 346 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 4,169 కోట్ల నుంచి రూ. 4,783 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 3,868 కోట్ల నుంచి రూ. 4,569 కోట్లకు పెరిగాయి. కాగా.. ఆదాయంలో ఇంజినీరింగ్ విభాగం నుంచి రూ. 1,323 కోట్లు లభించగా.. మెటల్ ఆధారిత ప్రొడక్టుల నుంచి రూ. 404 కోట్లు, మొబిలిటీ బిజినెస్ నుంచి రూ. 168 కోట్లు చొప్పున అందుకుంది.

ఫలితాల నేపథ్యంలో టీఐఇండియా షేరు ఎన్ఎస్ఈలో దాదాపు 4 శాతం పతనమై రూ. 4,312 వద్ద ముగిసింది.

ఐఆర్ఎఫ్‌సీ లాభం ప్లస్

క్యూ2లో రూ. 1,613 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఎన్‌బీఎఫ్‌సీ.. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఆర్ఎఫ్‌సీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 4 శాతం పుంజుకుని రూ. 1,613 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,545 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 6,762 కోట్ల నుంచి రూ. 6,900 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 5,218 కోట్ల నుంచి రూ. 5,288 కోట్లకు స్వల్పంగా పెరిగాయి. మినీరత్న కంపెనీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 2024 సెప్టెంబర్‌కల్లా రూ. 4,62,283 కోట్లకు చేరాయి. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 0.8 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో ఐఆర్ఎఫ్‌సీ షేరు ఎన్ఎస్ఈలో 3.5 శాతం పతనమై రూ. 153 వద్ద ముగిసింది.

ఎక్సైడ్ ఇండస్ట్రీస్ లాభం డీలా

క్యూ2లో రూ. 233 కోట్లు



కోల్‌కతా/న్యూఢిల్లీ: ఆటో, టెలికం రంగ బ్యాటరీల తయారీ దిగ్గజం ఎక్సైడ్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం క్షీణించి రూ. 233 కోట్లకు పరిమితమైంది. అధిక వ్యయాలు, నిల్వలు ప్రభావం చూపాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 270 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 4,372 కోట్ల నుంచి రూ. 4,450 కోట్లకు స్వల్పంగా బలపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 4,044 కోట్ల నుంచి రూ. 4,158 కోట్లకు పెరిగాయి. తయారీ వ్యయాలు, నిల్వల పద్దు రూ. 107 కోట్ల నుంచి రూ. 229 కోట్లకు పెరిగింది. కాగా.. ద్విచక్ర, కార్ల విభాగాలలో రీప్లేస్‌మెంట్ మార్కెట్ నుంచి భారీ డిమాండ్ కనిపిస్తున్నట్లు ఎక్సైడ్ పేర్కొంది. ఇండస్ట్రియల్– యూపీఎస్, సోలార్ విభాగంలోనూ డిమాండ్ నెలకొన్నప్పటికీ హోమ్ యూపీఎస్ విభాగం మందగించినట్లు వెల్లడించింది.


ఫలితాల నేపథ్యంలో ఎక్సైడ్ షేరు ఎన్ఎస్ఈలో 3 శాతం పతనమై రూ. 445 వద్ద ముగిసింది.

జెన్ టెక్నాలజీస్ ఆదాయం రూ. 242 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జెన్ టెక్నాలజీస్ ఆదాయం రూ. 64 కోట్ల నుంచి రూ. 242 కోట్లకు పెరిగింది. లాభం రూ. 17 కోట్ల నుంచి రూ.65 కోట్లకు ఎగిసింది. ప్రథమార్ధానికి సంబంధించి ఆదాయం రూ. 196 కోట్ల నుంచి రూ. 496 కోట్లకు, లాభం రూ. 64 కోట్ల నుంచి రూ. 139 కోట్లకు పెరిగింది. సెప్టెంబర్ 30 నాటికి తమ ఆర్డర్ బుక్ రూ. 957 కోట్ల స్థాయిలో పటిష్టంగా ఉందని సంస్థ సీఎండీ అశోక్ అట్లూరి తెలిపారు.

తాజ్ జీవీకే ఆదాయం రూ. 107 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఆదాయం రూ. 107 కోట్లుగా, లాభం సుమారు రూ. 20 కోట్లుగా (స్టాండెలోన్ ప్రాతిపదికన) నమోదైంది. క్రితం క్యూ2లో ఆదాయం రూ. 90 కోట్లు కాగా, లాభం రూ. 11 కోట్లు. తాజ్ డెక్కన్ హోటల్ పునరుద్ధరణ పనులు పూర్తవడంతో రాబోయే త్రైమాసికాల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించగలమని సంస్థ చైర్మన్ జీవీకే రెడ్డి తెలిపారు. బెంగలూరులోని యెలహంకలో నిర్మిస్తున్న 253 గదుల తాజ్ హోటల్‌ను 2026 ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి ప్రారంభించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

రేమండ్ లాభం 63 శాతం డౌన్



న్యూఢిల్లీ: రేమండ్ లిమిటెడ్ సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.59 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.161 కోట్లతో పోల్చి చూస్తే 63 శాతం తగ్గిపోయింది. మొత్తం ఆదాయం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.512 కోట్ల నుంచి రెట్టింపునకు పైగా పెరిగి రూ.1,101 కోట్లకు చేరింది. రియల్ ఎస్టేట్, ఇంజనీరింగ్ వ్యాపారాల్లో మంచి వృద్ధిని చూసినట్టు సంస్థ చైర్మన్, ఎండీ గౌతమ్ హరి సింఘానియా ప్రకటించారు. థానేలో రిటైల్ స్పేస్ ప్రాజెక్ట్ పార్క్ అవెన్యూని ప్రారంభించినట్టు చెప్పారు.



మంచి రోజులు వస్తున్నాయి...

మహిళల క్రికెట్ భవిష్యత్ పర్యటనల కార్యక్రమంలో మార్పులు

మేటి జట్ల మధ్య క్రమం తప్పకుండా మ్యాచ్‌లు

వచ్చే నాలుగేళ్ల కాలానికి సంబంధించి ఎఫ్‌టీపీని విడుదల చేసిన ఐసీసీ

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా తదితర మేటి జట్లతో సిరీస్‌లు ఆడనున్న భారత్

దుబాయ్: మన మహిళల క్రికెట్‌కు మంచి రోజులు వస్తున్నాయి. గట్టి ప్రత్యర్థులైన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లు ఇకపై క్రమం తప్పకుండా భారత్‌లో పర్యటించనున్నాయి. 2025–29 సైకిల్‌కు సంబంధించిన మహిళల భవిష్యత్ పర్యటనల కార్యక్రమం (ఎఫ్‌టీపీ)లో భాగంగా భారత జట్టు కీలక ద్వైపాక్షిక సిరీస్‌లలో తలపడనుంది. ఈ నాలుగేళ్ల కాలంలో న్యూజిలాండ్, వెస్టిండీస్, ఐర్లాండ్, దక్షిణాఫ్రికాల్లోనూ టీమిండియా పర్యటించనుంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)లోని ప్రతి సభ్య దేశం ఇంటా బయటా నాలుగు సిరీస్‌ల చొప్పున పాల్గొనేలా కొత్త ఎఫ్‌టీపీని రూపొందించారు. భారత్ మేటి ప్రత్యర్థులతో పాటు పొరుగు దేశం బంగ్లాదేశ్, 11వ సభ్య దేశంగా ఉన్న జింబాబ్వేతోనూ తలపడుతుంది. ఎప్పుడో అరకొరగా జరిగే టెస్టులను ఈ నాలుగేళ్ల సైకిల్‌లో పెంచారు. సభ్యదేశాలన్నీ మూడు ఫార్మాట్ల సిరీస్‌లో పాల్గొనేందుకు సమ్మతించాయని ఐసీసీ జనరల్ మేనేజర్ (క్రికెట్) వసీమ్ ఖాన్ తెలిపారు. దీంతో గత ఎఫ్‌టీపీతో పోల్చితే తదుపరి సైకిల్‌లో మహిళల మ్యాచ్‌లు మూడు ఫార్మాట్లలోనూ గణనీయంగా పెరగనున్నాయి.

- కొత్త ఎఫ్‌టీపీ వచ్చే ఏడాది మేలో మొదలై 2029 ఏప్రిల్‌తో ముగుస్తుంది. ప్రతి దేశం పూర్తి స్థాయి సిరీస్ ఆడేందుకు ప్రాధాన్యమిచ్చాయి. దీంతో 2025–29 సైకిల్‌లో 400 పైచిలుకు అంతర్జాతీయ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందులో జరిగే 44 వన్డే సిరీస్‌లలో ఒక్కో సభ్యదేశం మిగతా పది జట్లతో మూడు వన్డేల చొప్పున ఆడుతుంది. అలా 132 వన్డేలు జరుగుతాయి.
- మహిళల ఎఫ్‌టీపీని 2029లో జరిగే వన్డే ప్రపంచకప్‌కు అనుగుణంగా రూపొందించారు. ఇప్పుడున్న 10 జట్లతో పరిమితం కాకుండా ఆ మెగా టోర్నీ 11 జట్లతో జరుగనుంది. 11వ దేశంగా జింబాబ్వే బరిలోకి దిగుతుంది. ఇటీవల జింబాబ్వే మహిళల జట్టుకు శాశ్వత సభ్యదేశం హోదా ఇచ్చారు.
- 2026లో ఇంగ్లండ్‌లో జరగబోయే టి20 ప్రపంచకప్‌కు ముందు భారత్ అక్కడ సన్నాహాల్లో భాగంగా ఇంగ్లండ్, న్యూజిలాండ్‌లతో కలిసి ముక్కోణపు టోర్నీలో ఆడుతుంది.
- ఐర్లాండ్‌లోనూ జరిగే సన్నాహక ముక్కోణపు టోర్నీలో పాకిస్తాన్, వెస్టిండీస్‌లు తలపడతాయి. అలాగే భారత ఉపఖండంలోని శ్రీలంక జట్టు వెస్టిండీస్, మరో జట్టుతో కలిసి ముక్కోణపు సిరీస్‌లో పాల్గొంటుంది.
- ఐసీసీ మహిళల చాంపియన్‌షిప్‌లో భాగమైన జింబాబ్వే... వచ్చే నాలుగేళ్ల పాటు దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, ఐర్లాండ్, శ్రీలంకలతో జరిగే ద్వైపాక్షిక సిరీస్‌లకు ఆతిథ్యమిస్తుంది. దీంతో పాటు భారత్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లలో పర్యటిస్తుంది.
- అందరికంటే ఆస్ట్రేలియా గరిష్టంగా ద్వైపాక్షిక సిరీస్‌లలో భాగమవుతుంది. భారత్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌లాంటి గట్టి ప్రత్యర్థులతో ఇంటా బయటా సిరీస్‌లు ఆడుతుంది.

వృద్ధిమాన్ సాహా ‘గుడ్‌బై’

- ఆటకు రిటైర్మెంట్ ప్రకటించిన వికెట్ కీపర్
- రంజీ ట్రోఫీలో చివరిసారి బరిలోకి



న్యూఢిల్లీ: భారత క్రికెట్ అత్యుత్తమ వికెట్ కీపర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న వృద్ధిమాన్ సాహా త్వరలోనే ఆట నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. ప్రస్తుతం జరుగుతున్న రంజీ ట్రోఫీలో బెంగాల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సాహా... ఈ టోర్నీనే తనకు చివరిదని వెల్లడించాడు. మూడేళ్ల క్రితమే చివరిసారిగా టీమిండియాకు ప్రాతినిధ్యం వహించిన 40 ఏళ్ల సాహా రంజీ తర్వాత దేశవాళీ క్రికెట్‌లోనూ అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ కానున్నట్లు స్పష్టం చేశాడు. ఈ సీజన్ రంజీలో బెంగాల్ ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు ఆడగా...లీగ్ దశలో మరో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఆడిన ఒకే ఒక ఇన్నింగ్స్‌లో అతను డకౌటయ్యాడు. ‘సంతోషకరమైన నా క్రికెట్ ప్రయాణంలో ఇది నా చివరి సీజన్. రిటైర్మెంట్‌లోగా రంజీ ట్రోఫీలో మాత్రమే ఆడతాను. బెంగాల్‌కు చివరిసారి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణంగా భావిస్తున్నా. ఈ సీజన్‌ను మర్చిపోలేనిదిగా మార్చుకుంటాం’ అని సాహా ట్వీట్ చేశాడు. భారత్ తరఫున 40 టెస్టులు ఆడిన సాహా 29.41 సగటుతో 1353 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, 6 అర్ధసెంచరీలు ఉన్నాయి. కీపర్‌గా 92 క్యాచ్‌లు అందుకున్న అతను 12 స్టంపింగ్‌లు చేశాడు. టీమిండియా తరఫున 9 వన్డేలు కూడా ఆడిన సాహాకు అంతర్జాతీయ టి20లు ఆడే అవకాశం మాత్రం రాలేదు. 17 ఏళ్ల ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో అతను 138 మ్యాచ్‌లు ఆడటం విశేషం.

ధోని నీడను దాటి...

వికెట్ కీపర్‌గా సాహా అద్భుత ప్రతిభావంతుడు. గత కాలపు భారత కీపర్లు సయ్యద్ కిర్మాణీ, కిరణ్ మోరె, నయన్ మోంగియా తరహాలో అత్యుత్తమ కీపింగ్ నైపుణ్యంతో పాటు అవసరమైతే కొంత బ్యాటింగ్ చేయగల సమర్థుడిగానే ఎక్కువగా గుర్తింపు పొందాడు. దేశవాళీ క్రికెట్‌లో బెస్ట్ కీపర్‌గా పేరు వచ్చినా... టీమిండియాను శాసిస్తున్న ధోని ఉండటంతో అతను తన చాన్స్ కోసం చాలా కాలం ఎదురు చూడాల్సి వచ్చింది. 2010లో నాగపూర్ టెస్టుకు ముందు రోహిత్ శర్మ అనూహ్యంగా గాయపడటంతో సాహాకు బ్యాటర్‌గా తొలి టెస్టు ఆడే అవకాశం దక్కింది. మరో రెండేళ్ల తర్వాత స్లో ఓవర్‌రేట్ కారణంగా ధోనిపై నిషేధం పడటంతో రెండో టెస్టు దక్కింది. ఎట్టకేలకు 2014–15 ఆసీస్ పర్యటనలో తొలి టెస్టు తర్వాత ధోని అనూహ్యంగా రిటైర్మెంట్ ప్రకటించడంతో సాహా అసలు కెరీర్ మొదలైంది. అక్కడి నుంచి దాదాపు ఐదేళ్ల పాటు ప్రధాన కీపర్‌గా సాహా తన సత్తాను ప్రదర్శిస్తూ ప్రపంచ అత్యుత్తమ కీపర్లలో ఒకడిగా నిలిచాడు. స్వదేశంలో గిర్రున తిరిగే అతి కష్టమైన స్పిన్ బంతులనైనా, విదేశీ గడ్డపై సీమ్ బంతులనైనా స్టంప్‌ల వెనక చురుగ్గా, సమర్థంగా అందుకోవడంలో అతనికి అతనే సాటిగా నిలిచాడు. బ్యాటింగ్‌లో కూడా కొన్ని చక్కటి ప్రదర్శనలతో ఆకట్టుకున్నాడు. అయితే రిషభ్ పంత్ దూసుకొచ్చిన తర్వాత సాహా వెనుకబడిపోయాడు. పంత్ ఉన్నప్పుడు కూడా కొంత కాలం రెండో కీపర్‌గా జట్టులో అవకాశం దక్కినా అది ఎంతో కాలం సాగలేదు. కోచ్ ద్రవిడ్ ‘ఇకపై నీ పేరును పరిశీలించం’ అంటూ సాహాకు నేరుగా చెప్పేయడంతో అతని టెస్టు కెరీర్ ముగిసింది.

ఐపీఎల్‌లోనూ ఆకట్టుకొని...

2008 నుంచి 2024 వరకు ఐపీఎల్ ఆడిన కొద్ది మంది ఆటగాళ్ల జాబితాలో సాహా కూడా ఉన్నాడు. కోల్‌కతా, చెన్నై, పంజాబ్, హైదరాబాద్, గుజరాత్ జట్లకు ప్రాతినిధ్యం వహించిన అతను 170 మ్యాచ్‌లలో 127.57 స్ట్రయిక్‌రేట్‌తో 2934 పరుగులు సాధించాడు. 2014లో ఫైనల్లో పంజాబ్ తరఫున 55 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్స్‌లతో అజేయంగా 115 పరుగులు సాధించిన ప్రదర్శన అతని ఐపీఎల్ కెరీర్‌లో హైలైట్. 2022లో టైటిల్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ జట్టులో అతను సభ్యుడిగా ఉన్నాడు. బెంగాల్ యువ కీపర్ అభిషేక్ పొరేల్‌కు మెంటార్‌గా వ్యవహరించి తన వారసుడిగా అతడిని సాహా తీర్చిదిద్దాడు. బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్)తో విభేదాల కారణంగా రెండేళ్లు త్రిపుర తరఫున ఆడిన సాహా ఈ సీజన్‌లో మళ్లీ తిరిగొచ్చాడు.





వెర్‌స్టాపెన్ అద్భుతం

17వ స్థానం నుంచి రేసును మొదలుపెట్టి అగ్రస్థానం సొంతం

ఎనిమిదో విజయంతో ప్రపంచ టైటిల్‌కు చేరువైన రెడ్‌బుల్ డ్రైవర్

సావోపాలో (బ్రెజిల్): వరుసగా నాలుగో ఏడాది ఫార్ములావన్ ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ సొంతం చేసుకునే దిశగా రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ మరో అడుగు వేశాడు. సీజన్‌లోని 21వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ రేసులో 27 ఏళ్ల వెర్‌స్టాపెన్ ఊహకందని రీతిలో ఫలితాన్ని రాబట్టాడు. ఎక్కడో 17వ స్థానం నుంచి రేసును మొదలుపెట్టిన వెర్‌స్టాపెన్... అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఒక్కో డ్రైవర్‌ను దాటుకుంటూ చివరకు అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో ఎనిమిదో విజయాన్ని నమోదు చేశాడు. నిర్ణీత 69 ల్యాప్‌లను వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 2 గంటల 6 నిమిషాల 54.430 సెకన్లలో పూర్తి చేసి విజేతగా అవతరించాడు. 10 జట్ల నుంచి మొత్తం 20 మంది డ్రైవర్లు పోటీపడగా... ఐదుగురు డ్రైవర్లు రేసును పూర్తి చేయడంలో విఫలమయ్యారు. అలెగ్జాండర్ అల్బోన్ (విలియమ్స్ రేసింగ్), లాన్స్ స్ట్రోల్ (ఆస్టన్ మార్టిన్ అరామ్‌కో) తొలి ల్యాప్‌లోనే వెనుదిరగ్గా... 30వ ల్యాప్‌లో ఫ్రాంకో కొలాపింటో (విలియమ్స్ రేసింగ్), 38వ ల్యాప్‌లో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) రేసు నుంచి తప్పుకున్నారు. మనీగ్రామ్ హాస్ జట్టు డ్రైవర్ నికో హుల్కెన్‌బర్గ్‌పై రేసు నిర్వాహకులు అనర్హత వేటు వేశారు. 27వ ల్యాప్‌లో హుల్కెన్‌బర్గ్ స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోయి ట్రాక్ బయటికి వచ్చాడు. అనంతరం హుల్కెన్‌బర్గ్ మార్షల్ సహకారంతో మళ్లీ ట్రాక్‌పైకి వచ్చాడు. ఇది నిబంధనలకు వ్యతిరేకం కావడంతో హుల్కెన్‌బర్గ్‌ను రేసు నిర్వాహకులు డిస్‌క్వాలిఫై చేశారు. 21 రేసుల అనంతరం డ్రైవర్స్ పాయింట్ల పట్టికలో వెర్‌స్టాపెన్ 393 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ లాండో నోరిస్ 331 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో మరో మూడు రేసులు (లాస్ వేగస్ గ్రాండ్‌ప్రి; నవంబర్ 24న... ఖతర్ గ్రాండ్‌ప్రి; డిసెంబర్ 1న... అబుదాబి గ్రాండ్‌ప్రి; డిసెంబర్ 8న) మిగిలి ఉన్నాయి. ఈ మూడు రేసుల్లో ఒక దాంట్లోనైనా వెర్‌స్టాపెన్ గెలిస్తే వరుసగా నాలుగో ఏడాది అతనికే ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ లభిస్తుంది.

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	పాయింట్లు
1	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	69	2:06:54.430 సెకన్లు	26
2	ఒకాన్	బీడబ్ల్యూటీ అల్పైన్	69	2:07:13.907 సెకన్లు	18
3	పియరీ గాస్లీ	బీడబ్ల్యూటీ అల్పైన్	69	2:07:16.962 సెకన్లు	15
4	జార్జి రసెల్	మెర్సిడెస్	69	2:07:17.695 సెకన్లు	12
5	చార్లెస్ లెక్‌లెర్క్	ఫెరారీ	69	2:07:24.607 సెకన్లు	10
6	లాండో నోరిస్	మెక్‌లారెన్	69	2:07:25.802 సెకన్లు	8
7	యుకీ సునోడా	వీసాక్యాష్ యాప్	69	2:07:36.486 సెకన్లు	6
8	ఆస్కార్ పియాస్ట్రి	మెక్‌లారెన్	69	2:07:39.373 సెకన్లు	4
9	లియామ్ లాసన్	వీసాక్యాష్ యాప్	69	2:07:44.882 సెకన్లు	2
10	హామిల్టన్	మెర్సిడెస్	69	2:07:45.183 సెకన్లు	1

సెమీస్‌లో సబలెంకా



రియాద్: మహిళల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం జరిగిన పర్పుల్ గ్రూప్ రెండో లీగ్ మ్యాచ్‌లో సబలెంకా 6–3, 7–5తో నాలుగో సీడ్ జాస్మిన్ పావోలిని (ఇటలీ)పై గెలిచింది. తద్వారా వరుసగా రెండో విజయంతో సబలెంకాకు సెమీఫైనల్ బెర్త్ ఖరారైంది. ఇదే గ్రూప్‌లోని మరో లీగ్ మ్యాచ్‌లో ఏడో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) 7–6 (7/4), 3–6, 6–1తో ఐదో సీడ్ రిబాకినా (కజకిస్తాన్)ను ఓడించింది. ఫలితం రెండు పరాజయాలతో రిబాకినా సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. జాస్మిన్, కిన్‌వెన్ జెంగ్ మధ్య జరిగే చివరి లీగ్ మ్యాచ్ విజేతకు రెండో సెమీఫైనల్ బెర్త్ లభిస్తుంది.

క్వార్టర్ ఫైనల్లో రిత్విక్ జోడీ

మెట్జ్ (ఫ్రాన్స్): మోజెల్లి ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ రాకెట్ పట్టకుండానే క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. తొలి రౌండ్‌లో రిత్విక్ (భారత్)–ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్) జోడీతో తలపడాల్సిన ఆర్థర్ కజాక్స్–హరోల్డ్ మయోట్ (ఫ్రాన్స్) జంట గాయం కారణంగా బరిలోకి దిగలేదు. దాంతో రిత్విక్–కబ్రాల్ ద్వయానికి తొలి రౌండ్‌లో ‘వాకోవర్’ లభించింది. వాస్తవానికి ఈ టోర్నీలో భారత్‌కే చెందిన అర్జున్ ఖడేతో రిత్విక్ జతగా పోటీపడాల్సింది. అయితే గతవారం బ్రాటిస్లావాలో జరిగిన స్లావాక్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టోర్నీ సందర్భంగా అర్జున్‌కు గాయమైంది. దాంతో అర్జున్ మోజెల్లి ఓపెన్ నుంచి వైదొలగగా... పోర్చుగల్ ప్లేయర్ కబ్రాల్‌తో కలిపి రిత్విక్ పోటీపడుతున్నాడు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో...

స్లావాక్ ఓపెన్‌లో రిత్విక్ సెమీస్‌కు చేరడంతో అతని ఏటీపీ డబుల్స్ ర్యాంక్ కూడా మెరుగైంది. గత వారం 85వ ర్యాంక్‌లో నిలిచిన రిత్విక్ సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి 80వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. రిత్విక్ భాగస్వామి అర్జున్ ఖడే 76వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... శ్రీరామ్ బాలాజీ నాలుగు స్థానాలు పడిపోయి 65వ ర్యాంక్‌లో ఉన్నాడు. యూకీ బాంబ్రీ 48వ ర్యాంక్‌లో మార్పు లేదు.



టాప్–10లో చోటు కోల్పోయిన బోపన్న

గత ఏడాది ఆగస్టు నుంచి టాప్–10లో ఉన్న భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న తాజా ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు పడిపోయాడు. పారిస్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో బోపన్న–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ రెండో రౌండ్‌లో నిష్క్రమించడం బోపన్న ర్యాంక్‌పై ప్రభావం చూపింది. బోపన్న ప్రస్తుతం 12వ ర్యాంక్‌లో ఉన్నాడు. గతవారం సియోల్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టోర్నీలో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని–రామ్‌కుమార్ రామనాథన్ (తమిళనాడు) ర్యాంక్‌లు కూడా మెరుగయ్యాయి. రామ్‌కుమార్ 18 స్థానాలు ఎగబాకి 125వ ర్యాంక్‌లో, సాకేత్ 25 స్థానాలు పురోగతి సాధించి 203వ స్థానంలో నిలిచారు.

పుణేరి పల్టన్ జోరు



సాక్షి, హైదరాబాద్: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్–11)లో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్ జోరు కొనసాగుతోంది. సోమవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తొలి మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 49–30 స్కోరుతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. ఆట మొదలైన ఐదు నిమిషాలకే పుణేరి ఆటగాళ్లు ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేశారు. పల్టన్ రెయిడర్ ఆకాశ్ 11 పాయింట్లు సాధించగా, డిఫెండర్లు అభినేశ్, గౌరవ్ ఖత్రి, అమన్ తలా 5 పాయింట్లతో పుణేరి గెలుపులో కీలకపాత్ర పోషించారు. గుజరాత్ జట్టులో రెయిడర్ గుమన్ సింగ్ (13 పాయింట్లు) ఒంటరి పోరాటం చేశాడు. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 36–32తో తమిళ్ తలైవాస్‌పై చెమటోడ్చి నెగ్గింది. బెంగళూరు తరఫున అజింక్యా పవార్ 6, సురిందర్ దేహల్ 5, కెప్టెన్ నితిన్ రావల్ 4 పాయింట్లు తెచ్చిపెట్టారు. తలైవాస్ జట్టులో నరేందర్ (6), సచిన్ (5), అమీర్ (4), సాహిల్ (4) రాణించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో యూపీ యోధాస్, దబంగ్ ఢిల్లీతో యు ముంబా తలపడతాయి.

తమిళనాడు చేతిలో ఆంధ్రప్రదేశ్ ఓటమి

చెన్నై: జాతీయ సీనియర్ పురుషుల హాకీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తమ తొలి లీగ్ మ్యాచ్‌లో ఓటమి పాలైంది. గ్రూప్ ‘సి’లో భాగంగా ఆతిథ్య తమిళనాడు జట్టు 7–0 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్‌పై గెలిచింది. తమిళనాడు తరఫున కెప్టెన్ కార్తీ రెండు గోల్స్ చేయగా... సెల్వరాజ్, దిలీపన్, జోషువా బెనెడిక్ట్ వెస్లీ, మరీశ్వరన్ శక్తివేల్, మనోజ్ కుమార్ ఒక్కో గోల్ చేశారు.

మన కమల గెలవాలని...



కమలా హారిస్ విజయాన్ని ఆకాంక్షిస్తూ జరిగే పూజల్లో పాల్గొనాలంటూ తమిళనాడులోని ఆమె పూర్వీకుల గ్రామం తులసేంద్రపురంలో పోస్టర్



కమల గెలవాలంటూ భద్రాద్రి జిల్లా పాల్వంచలో ఆమె తల్లి శ్యామలా గోపాలన్ పేరిట ఉన్న ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో పూజలు



కమల విజయం కోసం తమిళనాడులోని మదురైలో అనుషథిన్ అనుగ్రహ సంస్థ చైర్మన్ నెల్లై బాలు పూజలు

చొరబాటుదారుల కూటమి

జేఎంఎం సారథ్యంలోని కూటమిపై ధ్వజమెత్తిన ప్రధాని మోదీ

జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని



రాంచీ: జార్ఖండ్ ఎన్నికల ప్రచారసభలో జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం), కాంగ్రెస్ కూటమి ప్రభుత్వంపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శల వర్షం కురిపించారు. సోమవారం రాష్ట్రంలోని గఢ్వా జిల్లా కేంద్రంలో, పశ్చిమ సింగ్‌బమ్ జిల్లాలోని చాయ్‌బాస పట్టణాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో మోదీ ప్రసంగించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాక ప్రధాని రాష్ట్రంలో పర్యటించడం ఇదే తొలిసారి. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

బుజ్జగింపు రాజకీయాలమయం

''జేఎంఎం, కాంగ్రెస్ నేతలు రాష్ట్రంలో కుంభకోణాలను ఒక పరిశ్రమ స్థాయికి పెంచారు. జార్ఖండ్‌ను అవినీతి చెద పట్టిపీడిస్తోంది. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులకు రాష్ట్రంలోకి స్వాగతం పలుకుతూ ఈ రెండుపార్టీలు చొరబాటుదారుల కూటమిగా అవతరించాయి. మాఫియాకు వీళ్ల కూటమి బానిసగా మారింది. దేశాన్ని అవినీతి చెద గుల్లబారుస్తోంది. మరీముఖ్యంగా జార్ఖండ్‌లో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ అవినీతిలో అన్ని హద్దులను దాటేశాయి. పేద, దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలపై అవినీతి దుష్ప్రభావం తీవ్రంగా ఉంది. జార్ఖండ్ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలను బీజేపీ మాత్రమే 'సువిధ', 'సురక్ష', 'తీర్థ', 'సమృద్ధి'ద్వారా బాగుచేయగలదు. ఇది మోదీ గ్యారెంటీ. తప్పుడు వాగ్దానాలిస్తూ కాంగ్రెస్ హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను నాశనం చేస్తోంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా అందే ఆర్థికసాయాన్ని కేంద్రం మళ్లీ వెనక్కి తీసుకుంటుందని స్వయంగా కూటమి ప్రభుత్వం పుకార్లు పుట్టిస్తోంది. మేం రాష్ట్రంలో అభివృద్ధిని సాకారంచేద్దామనుకుంటుంటే ఇక్కడి సర్కార్ అవరోధాలు సృష్టిస్తోంది''అని అన్నారు.

పేపర్ లీకేజీలు సర్వసాధారణం

''జేఎంఎం పాలనలో ప్రశ్నాపత్రాల లీకేజీలు సాధారణమయ్యాయి. దీంతో యువతలో ఎంతో మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. వారసత్వ రాజకీయాలనే ఈ మూడు పార్టీలు నమ్ముకున్నాయి. మాజీ సీఎం చంపయీ సోరెన్ వంటి నేతలను సైతం ఈ పార్టీలు వంచిస్తున్నాయి. కేంద్రం మంజూరుచేసిన నిధులనూ స్వప్రయోజనాల కోసం దుర్వినియోగం చేశాయి. గిరిజనుల అభ్యున్నతికి మేం శాయశక్తులా కృషిచేస్తున్నాం. వచ్చే ఏడాది గిరిజన యోధుడు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తాం''అని మోదీ చెప్పారు.

గిరిజనుల రిజర్వేషన్లను లాగేస్తారు

''గిరిజనుల హక్కుల పరిరక్షణకు అంబేడ్కర్ పాటుపడ్డారు. దీనిని నెహ్రూ తీవ్రంగా వ్యతిరేకించారు. నెహ్రూ తర్వాత అధికారం వెలగబెట్టినన్ని రోజులూ రిజర్వేషన్లనూ గాంధీల కుటుంబం వ్యతిరేకించింది. ఇప్పుడు కూడా అధికారంలోకి వస్తే గిరిజనుల రిజర్వేషన్లు తొలగిస్తామని కాంగ్రెస్ బహిరంగంగా చెబుతోంది. గిరిజనుల రిజర్వేషన్ ప్రయోజనాలను కాంగ్రెస్ తమ ఓటు బ్యాంక్‌కు ధారాదత్తం చేయనుంది. కాంగ్రెస్ మరో కుట్ర పన్నుతోంది. కొన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను మైనారిటీ సంస్థలుగా ప్రకటించనుంది. దీంతో వాటిల్లో గిరిజనులు, దళితులు, బీసీల రిజర్వేషన్ ఆగిపోనుంది. కాంగ్రెస్‌తో తస్మాత్ జాగ్రత్త''అని మోదీ అన్నారు.

మహిళల్ని కించపరచడం వారికి అలవాటు

జేఎంఎం చీఫ్ శిబూసోరెన్ పెద్ద కోడలు సీత బీజేపీలో చేరడంతో కాంగ్రెస్ మంత్రి ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అంశాన్ని మోదీ ప్రస్తావించారు. ''తిరస్కరణకు గురైన సరకును, అమ్ముడుపోని సరుకును తీసుకొచ్చి బీజేపీ అమ్మాలని చూస్తోంది అంటూ సీతనుద్దేశిస్తూ కాంగ్రెస్ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ దారుణంగా మాట్లాడారు. మహారాష్ట్రలోనూ శివసేన నాయకురాలు షైనీ ఎన్సీపై శివసేన(యూబీటీ)నేత అర్వింద్ సావంత్ ఇలాగే కించపరిచేలా మాట్లాడారు. వీళ్లందరికీ తల్లులు, కూతుళ్లు ఎన్నికల్లో తగిన శాస్తి చేస్తారు''అని మోదీ అన్నారు. ''జార్ఖండ్‌లో గిరిజనులపై కాంగ్రెస్ దారుణ అకృత్యాలకు పాల్పడింది. జార్ఖండ్ రాష్ట్ర అవతరణను ఆర్జేడీ నేతలు మొదట్నుంచీ వ్యతిరేకించారు. ఇప్పుడేమో అదే ఆర్జేడీ నేతల ఒళ్లో జేఎంఎం కూర్చుంది''అని మోదీ విమర్శించారు.

ప్రధాని మా ఇంటికి వస్తే తప్పేముంది: సీజేఐ చంద్రచూడ్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గణపతి పూజ కోసం తన నివాసానికి రావడంలో తప్పేముందని భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ ప్రశ్నించారు. ప్రధాని రాకలో తప్పేమీ లేదన్నారు. ఇలాంటి అంశాల్లో రాజకీయ వర్గాలు పరిణతిని కనబర్చాలని పేర్కొన్నారు. సీజేఐ నివాసానికి ప్రధాని వెళ్లడం తప్పుడు సంకేతాలు వెళ్లడానికి ఆస్కారం కలిగిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆక్షేపించిన విషయం తెలిసిందే. 'గణపతి పూజ నిమిత్తం ప్రధాని మోదీ నా నివాసానికి వచ్చారు. ఇందులో ఏమాత్రం తప్పు లేదు. కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థల మధ్య జరిగే సమావేశాల్లో ఇదో భాగమే. రాష్ట్రపతి భవన్‌లోనూ, గణతంత్ర దినోత్సవం.. ఇలా పలు సందర్భాల్లో కలుస్తుంటాం. ప్రధాని, మంత్రులతో మాట్లాడతాం. మా మధ్య సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న కేసుల ప్రస్తావన రాదు. సామాజిక స్థితిగతులు, ప్రజల జీవితాలపై చర్చ జరుగుతుంది'అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు నిర్వహించిన సదస్సులో సోమవారం ఆయన మాట్లాడారు. రెండు ప్రధాన వ్యవస్థల మధ్య సుహృద్భావ చర్చలుగా తమ భేటీలను చూడాలని పేర్కొన్నారు.

ముడా కేసులో సిద్ధూకు లోకాయుక్త సమన్లు

విచారణ నిమిత్తం 6న హాజరు కావాలని పిలుపు

మైసూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ప్లాట్ల కేటాయింపు కేసులో తమ ఎదుట విచారణకు హాజరు కావాలని లోకాయుక్త పోలీసులు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సమన్లు జారీచేశారు. ఈనెల 6న ఆయన్ను ప్రశ్నిస్తామని తెలిపారు. మైసూరు శివార్లలో సిద్ధరామయ్య భార్య పార్వతికి చెందిన 3.16 ఎకరాలను సేకరించిన ముడా పరిహారంగా ఆమెకు ఖరీదైన ప్రాంతంలో 14 ప్లాట్లను కేటాయించింది. 50: 50 నిష్పత్తిలో ప్లాట్లను కేటాయించింది. ఇందులో అవినీతి జరిగిందని, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శలు వచ్చాయి. దాంతో సిద్ధరామయ్యను ప్రాసిక్యూట్ చేయడానికి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అనుమతి మంజూరు చేశారు. దీన్ని సీఎం సిద్ధరామయ్య హైకోర్టులో సవాల్ చేయగా.. చుక్కెదురైంది. ఈ నేపథ్యంలో లోకాయుక్త పోలీసులు ముడా కేటాయింపులపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

కూలిన మిగ్.. పైలట్ సురక్షితం

ఆగ్రా/న్యూఢిల్లీ: భారత వైమానిక దళానికి చెందిన మిగ్–29 యుద్ధ విమానం ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా సమీపంలో సోమవారం కూలింది. రోజువారీ శిక్షణలో భాగంగా పంజాబ్‌లోని ఆదమ్‌పూర్ నుంచి టేకాఫ్ తీసుకున్న ఈ విమానం ఇంజిన్‌లో లోపం కారణంగా ప్రమాదానికి గురైనట్లు అధికారులు తెలిపారు. అయితే, విమానం పైలట్ అత్యంత చాకచక్యంగా ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరక్కుండా చూశారని, ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారని వెల్లడించారు. ఘటనకు దారి తీసిన కారణాలను కనుక్కొనేందుకు కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించినట్లు ఐఏఎఫ్ 'ఎక్స్'లో పేర్కొంది.

మహారాష్ట్ర డీజీపీపై ఈసీ బదిలీవేటు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర డీజీపీ రశ్మీ శుక్లాపై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసింది. కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు డీజీపీని తక్షణమే బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నెల 20వ తేదీన మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. శుక్లాకు బదులుగా అదే కేడర్‌లోని అత్యంత సీనియర్ ఐపీఎస్ అధికారికి డీజీపీ బాధ్యతలు అప్పగించాలంటూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈసీ ఆదేశాలు జారీ చేసింది. డీజీపీ అర్హతలున్న ముగ్గురు ఐపీఎస్‌ల పేర్లను మంగళవారం మధ్యాహ్నానికల్లా పంపించాలని అందులో వివరించింది.

14 అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల తేదీ మార్పు

సాక్షి, న్యూఢిల్లీ: మూడు రాష్ట్రాల్లోని 14 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13వ తేదీన జరగాల్సిన ఉప ఎన్నిక తేదీని నవంబర్ 20కి మార్చుతున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఉత్తరప్రదేశ్‌లోని 9, పంజాబ్‌లోని 4, కేరళలోని ఒక సీటు పాలక్కాడ్‌తో కలిపి 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ నెల 13న ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే, అదే రోజు సామాజిక, సాంస్కృతిక, మతపరమైన వివిధ కార్యక్రమాలున్నందున ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని బీజేపీ, కాంగ్రెస్ సహా పలు రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థల నుంచి ఈసీకి విజ్ఞప్తులు అందాయి. వీటిని పరిశీలించిన మీదట పోలింగ్ తేదీని నవంబర్ 20కి మార్చుతూ నిర్ణయం తీసుకున్నట్లు సోమవారం ఈసీ ప్రకటించింది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొంది.

వక్ఫ్ జేపీసీకి విపక్షాలు దూరం!

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ నుంచి విపక్ష పార్టీల సభ్యులు వైదొలగే అవకాశముంది. కమిటీ చైర్‌పర్సన్, బీజేపీ సీనియర్ నేత జగదాంబికా పాల్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, నియమ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని విపక్ష సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎదుట తమ నిరసనను తెలిపేందుకు మంగళవారం వీరంతా ఆయనను కలవాలని నిర్ణయించుకున్నారు. పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో తమ అభిప్రాయాలకు పూచికపుల్లంత అయినా విలువ ఇవ్వట్లేరని, ప్రతిపాదిత బిల్లుపై తమకు తీవ్రమైన అభ్యంతరాలు ఉన్నాయంటూ స్పీకర్‌కు ఒక సంయుక్త లేఖ సైతం రాయనున్నాయి. స్వేచ్ఛగా, పారదర్శకంగా కమిటీ సమావేశాలు నిర్వహించేలా జగదాంబికా పాల్‌ను ఆదేశించాలని, లేని పక్షంలో తామంతా కమిటీ నుంచి వైదొలుగుతామని స్పీకర్‌కు విపక్షసభ్యులు మంగళవారం కరాఖండీగా చెప్పబోతున్నట్లు తెలుస్తోంది.

ఖలిస్తానీల దుశ్చర్య

కెనడాలో హిందూ ఆలయం వద్ద భక్తులపై దాడికి తెగబడిన వేర్పాటువాదులు

ఒట్టావా/న్యూఢిల్లీ: కెనడాలోని భారత వ్యతిరేక శక్తులు మరోసారి రెచ్చిపోయాయి. ఒంటారియో ప్రావిన్స్‌లోని బ్రాంప్టన్ నగరంలోని హిందూ సభా మందిర్ ఆలయం వద్ద భక్తులపై ఖలిస్తాన్ వేర్పాటువాదులు ఆదివారం దాడికి తెగబడ్డారు. కర్రలు, ఖలిస్తానీ జెండాలు, తేలికపాటి పోల్స్‌తో కొట్టారు. టొరంటో శివారులోని బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయ ప్రాంగణంలో భారత కాన్సులేట్ ఆధ్వర్యంలో ఒక కార్యక్రమం జరుగుతున్న వేళ ఈ అనూహ్య ఘటన చోటుచేసుకుంది. దాదాపు 35 మంది ఖలిస్థాన్ వేర్పాటువాదులు ఖలిస్తానీ జెండాలు పట్టుకుని ఆలయం వద్ద వీరంగం సృష్టించారు. ఈ వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

అసలేం జరిగింది?

భారతీయ, కెనడియన్ వృద్ధులకు పెన్షన్ ప్రయోజనాలు అందించేందుకు లైఫ్ సర్టిఫికేట్లు అందజేసే కార్యక్రమాన్ని భారత కాన్సులేట్ అధికారులు హిందూసభామందిర్ ప్రాంగణంలో చేపట్టారు. దీనికి వృద్ధులతోపాటు అక్కడి భక్తులు హాజరయ్యారు. ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరుగుతుండగా హఠాత్తుగా దాదాపు 35 మంది ఖలిస్తానీ వేర్పాటువాదులు ఖలిస్తానీ జెండాలు, బ్యానర్లు, కర్రలతో అక్కడికొచ్చి భారత వ్యతిరేక నినాదాలు ఇచ్చారు. కార్యక్రమం కొనసాగించకూడదని అడ్డుతగిలారు. దీంతో భక్తులకు, వేర్పాటువాదులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో వేర్పాటువాదులు కర్రలు, తేలికపాటి పోల్స్‌తో అక్కడి భక్తులను కొట్టి అందర్నీ చెదరగొట్టే ప్రయత్నంచేశారు. దీంతో భక్తులు సైతం వారిని ప్రతిఘటించే ప్రయత్నంచేశారు. దీంతో ఘర్షణకు పెద్దదైంది. తర్వాత పోలీసులు కల్పించుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్

ఘటనపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ''చెత్త రాజకీయాల కోసం ట్రూడో ఇలా భారతీయులను విడగొడుతున్నారు. కలిసి మెలిసి జీవించే హిందువులు, సిక్కులను ఆయన వేరుచేస్తున్నారు'అని కేంద్రమంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ వ్యాఖ్యానించారు. ఒట్టావాలోని భారత హైకమిషన్ సైతం ఒక ప్రకటన విడుదలచేసింది. హిందూసభ ఆలయం వద్ద ఘటన భారత వ్యతిరేక శక్తుల పనేనని స్పష్టంగా తెలుస్తోందని వ్యాఖ్యానించింది. భారత విదేశాంగ శాఖ సైతం దాడిని తీవ్రంగా ఖండించింది.

దాడులు ఆమోదనీయం కాదు: ట్రూడో

ఈ దాడికి పాల్పడింది తామేనని భారత్‌లో నిషేధిత 'సిఖ్స్ ఫర్ జస్టిస్'వేర్పాటువాద సంస్థ ప్రకటించుకుంది. దీంతో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్పందించారు. 'హిందూ మందిర్ వద్ద ఘటన, దాడులు ఏమాత్రం ఆమోదనీయం కాదు. తమ మత విశ్వాసాన్ని స్వేచ్ఛగా ఆచరించే హక్కు ప్రతి ఒక్క కెనడియన్‌కు ఉంది. తక్షణం రంగంలోకి దిగి పరిస్థితి చేయిదాటిపోకుండా చేసిన పోలీసులకు అభినందనలు'అని ట్రూడో 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

పిరికిపందల చర్య: మోదీ

ఘటనపై ప్రధాని మోదీ స్పందించారు. ''భారత దౌత్యవేత్తలను భయభ్రాంతులకు గురిచేసేందుకు పిరికిపందలు చేసిన ప్రయత్నమిది''అంటూ వేర్పాటువాదులపై మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''కెనడాలో హిందూ ఆలయంలో దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. పిరికిపందల చర్యలు భారత ఉక్కు సంకల్పాలను ఏం చేయలేవు. కెనడా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నా. హింసకు కారకులను శిక్షించాలని ఆశిస్తున్నా'' అన్నారు.

కశ్మీర్ అసెంబ్లీలో మొదటి రోజే గందరగోళం

- '370'రద్దుపై తీర్మానం ప్రవేశపెట్టిన పీడీపీ
- తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్ష బీజేపీ


శ్రీనగర్: దాదాపు ఆరేళ్ల తర్వాత జమ్మూకశ్మీర్ అసెంబ్లీ సోమవారం సమావేశమైంది. సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ(పీడీపీ) ఎమ్మెల్యే వహీద్ పారా ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఆర్టికల్ 370ను పునరుద్ధరించాలని, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రతిపక్ష బీజేపీ సభ్యులు మొత్తం 28 మంది లేచి నిలబడి తీవ్ర నిరసన తెలిపారు. అసెంబ్లీ నిబంధనలకు వ్యతిరేకంగా తీర్మానం ప్రవేశపెట్టిన ఎమ్మెల్యే పారాను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నూతనంగా స్పీకర్‌గా ఎన్నికైన అబ్దుల్ రహీం రథేర్ వారిని కూర్చోవాలని పదేపదే కోరినా ఫలితం లేకపోయింది. బీజేపీ సభ్యుల తీరును అధికార నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) సభ్యులు ఆక్షేపించారు. అయితే, రాష్ట్ర హోదా జమ్మూకశ్మీర్ ప్రజల ఆకాంక్ష అనీ, దీనిపై అన్ని పక్షాలు కలిసి ఒక విధానం ప్రకారం ముందుకెళ్లాల్సి ఉందని సీఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. తగు సమయంలో ఆర్టికల్ 370పై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ గొడవ నడుమ స్పీకర్ రథేర్ తీర్మానం అజెండాలో లేదంటూ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం తిరిగి సభ మొదలయ్యాక లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా మొట్టమొదటి ప్రసంగం చేశారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం జమ్మూకశ్మీర్ ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రయత్నిస్తుందని ఆయన చెప్పారు. రాష్ట్ర హోదా, రాజ్యాంగ హామీల పునరుద్ధరణ జమ్మూకశ్మీర్ ప్రజలు ప్రజాస్వామ్య సంస్థలపై ఉంచిన విశ్వాసానికి సముచితమైన ప్రతిఫలం అవుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రధాని మోదీ కూడా పలుమార్లు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజులపాటు కొనసాగుతాయి.

స్పీకర్‌గా అత్యంత సీనియర్ నేత రథేర్

అంతకుముందు, కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ అసెంబ్లీ మొట్టమొదటి స్పీకర్‌గా ఎన్సీకి చెందిన అబ్దుల్ రహీం రథేర్(80) ఎన్నికయ్యారు. అత్యంత సీనియర్ నేత, ఏడు పర్యాయాలు ఎమ్మెల్యే అయిన రథేర్ గతంలో జమ్మూకశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీకి స్పీకర్‌గా వ్యవహరించారు. 2002–08 మధ్య పీడీపీ–కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ప్రొటెం స్పీకర్ ముబారక్ గుల్ చేపట్టారు. స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలబెట్టరాదని ప్రతిపక్షం నిర్ణయించడంతో రథేర్ ఎన్నికను సభ మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఆమోదించింది.

లోయలో పడిన బస్సు

36 మంది మృతి | 27 మందికి గాయాలు | ఉత్తరాఖండ్‌లో ఘటన



మార్చులా(ఉత్తరాఖండ్): సామర్థ్యానికి మించి కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పి లోయలో పడి ఘటనలో 10 మంది మహిళలుసహా 36 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో సోమవారం ఉదయం ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 27 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. దీపావళి పండగ తర్వాత పనులకు బయల్దేరిన కార్మికులతో గర్వాల్ ప్రాంతంలోని పౌరీ నుంచి కుమాన్ ప్రాంతంలోని రాంనగర్‌కు బస్సు బయల్దేరింది. బస్సు సీటింగ్ సామర్థ్యం కేవలం 43 కాగా బస్సులో 63 మంది ఎక్కారు. మరో 35 కిలోమీటర్లు ప్రయాణిస్తే గమ్యస్థానాన్ని చేరుకుంటారనగా సోమవారం ఉదయం 8.45 గంటల సమయంలో మర్చులా ప్రాంతంలో బస్సు అదుపుతప్పి 200 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. ఎత్తులోంచి పల్టీలు కొడుతూ పడటంతో బస్సు పూర్తిగా ధ్వంసమైంది. విషయం తెల్సిన వెంటనే రాష్ట్ర విపత్తు స్పందనా దళం ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యల్లో నిమగ్నమైంది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అల్మోరా జిల్లా విపత్తు నిర్వహణ అధికారి (డీడీఎంఓ) వినీత్ పాల్ తెలిపారు. గాయపడిన ప్రయాణికులను ఆసుపత్రిలో చేర్చినట్లు సాల్ట్ సబ్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ సంజయ్ వెల్లడించారు. ''ఘటనలో చిన్నారులు, మహిళలు చనిపోవడం మనసును కలచివేస్తోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి'అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాప సందేశంలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ సంతాపం తెలిపారు.

ఇండోనేసియాలో అగ్నిపర్వత విస్ఫోటం

పది మంది మృతి



మాపూమెరీ(ఇండోనేసియా): ఇండోనేసియాలోని లెవోటోబి లకీలకీ అగ్నిపర్వతం ఆదివారం బద్ధలైంది. లావాతోపాటు మందపాటి అత్యంత వేడి ధూళి కిలోమీటర్ల దూరాలకు ఎగసి సమీప గ్రామాల్లో ఇళ్లపై పడటంతో అవి అగ్నికి ఆహుతవుతున్నాయి. అగ్నిపర్వత విస్ఫోటన సంబంధ ఘటనల్లో ఇప్పటిదాకా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఊహించని స్థాయిలో వేడి ధూళి ఎగసిపడుతుండటంతో సమీప గ్రామాల ప్రజలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. తూర్పు నుసా టెంగారా ప్రావిన్స్‌లోని సుదూర ఫ్లోర్స్ ద్వీపంలో ఉన్న లకీలకీ అగ్నిపర్వతం గురువారం నుంచి స్వల్పస్థాయిలో లావాను వెదజల్లడం మొదలెట్టింది. ఆదివారం అర్ధరాత్రి భారీ స్థాయిలో బద్దలైంది. దుమ్ముధూళి ఏకంగా 6,500 అడుగుల ఎత్తుకు ఎగసిపడింది. విస్ఫోటనాలు డేంజర్ జోన్‌ను దాటిపోయాయని ఇండోనేసియా విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. విస్ఫోటనాల తర్వాత విద్యుత్ అంతరాయం ఏర్పడింది. పిడుగులతో కూడిన కుండపోత వర్షం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. అగ్నిపర్వతం ప్రమాదకర స్థాయిని 4వ నంబర్‌కు పెంచినట్లు సెంటర్ ఫర్ ఓలక్నాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ ప్రతినిధి హడి విజయ తెలిపారు. అగ్నిపర్వత సమీప గ్రామాల ప్రజలను సుదూరాలకు తరలిస్తున్నారు. బూడిదమయమైన ఇళ్లలో ఇంకా ఎవరైనా మిగిలారేమోనని సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చేపట్టాయి. ఉలాగిటాంగ్, ఇలేబురాజిల్లాల్లో 10 గ్రామాల ప్రజలపై ఈ అగ్నిపర్వత ప్రభావం కొనసాగుతోంది. లకీలకీ అనేది జంట అగ్నిపర్వతాల్లో ఒకటి. లకీలకీ అనగా అబ్బాయి. లెవోటోబి అనగా అమ్మాయి. భార్యాభర్తలు అన్న అర్థంలో వీటికి ఈ పేర్లు పెట్టారు.

వరుస విస్ఫోటాలు

ఇండోనేసియా 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్'లో ఉంది. ఇది బహుళ టెక్టోనిక్ ప్లేట్లపై అధిక భూకంప కార్యకలాపాలు జరిగే ప్రాంతం. దీంతో ఇక్కడ అగ్నిపర్వతాల వరుస విస్ఫోటనాలు జరుగుతుంటాయి.

ఎన్నికల్లో మేమెవ్వరికీ మద్దతివ్వం

మరాఠా కోటా ఉద్యమ నేత జరంగే యూ–టర్న్

జల్నా(మహారాష్ట్ర): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కీలక పరిణామమిది. మరాఠాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలంటూ ఉద్యమిస్తున్న మనోజ్ జరంగే యూ–టర్న్ తీసుకున్నారు. 20వ తేదీన జరిగే ఎన్నికల్లో తాము ఏ పార్టీకి గానీ, ఏ అభ్యర్థికి గానీ మద్దతివ్వబోమని ప్రకటించారు. ఇప్పటికే నామినేషన్లు వేసిన తన మద్దతుదారులను పోటీ నుంచి తప్పుకోవాలంటూ పిలుపునిచ్చారు. నామినేషన్ల ఉపసంహరణకు సోమవారమే చివరి రోజు కావడం గమనార్హం. జరంగే సోమవారం ఉదయం అంతర్వాలి సారథి గ్రామంలో మీడియాతో మాట్లాడారు. 'పలు విడతలుగా చర్చలు జరిపిన మీదట రాష్ట్రంలో అభ్యర్థులను బరిలో నిలపరాదని నిర్ణయించుకున్నాం. ఎవరిని ఓడించాలి, ఎవరిని గెలిపించాలనే నిర్ణయాన్ని మరాఠా ప్రజలకే వదిలేస్తున్నాం. మరాఠాల కోసం పనిచేసే వారికే ఓటేస్తారు. ఏ పార్టీని గానీ, అభ్యర్థిని గానీ బలపరచట్లేదు'అని వెల్లడించారు.

సాక్షి ప్లస్
మంగళవారం। 5-11-2024

భారత పార్లమెంట్ సమావేశాలు దేనితో ప్రారంభమవుతాయి?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారత పార్లమెంట్

1. లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో-ఇండియన్ల రిజర్వేషన్లను ఎన్నో రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 2030 సంవత్సరం వరకు పొడిగించారు?
   1) 101 2) 102 3) 103 4) 104

జ. 4;
వివరణ: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 330, 331, 332, 333 ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో ఇండియన్లకు రిజర్వేషన్లను కల్పిస్తూ, ఇవి 10 సంవత్సరాల పాటు అంటే 1960 వరకు ఉంటాయని ఆర్టికల్-334లో పేర్కొన్నారు. కానీ దీన్ని ఇప్పటికి 7సార్లు పొడిగించారు.

ఇటీవల మోడీ ప్రభుత్వం 126వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టగా పార్లమెంట్ ఆమోదం అనంతరం రాష్ట్రపతి సంతకంతో 2019 డిసెంబర్ 12న 104వ రాజ్యాంగ సవరణ చట్టంగా అమలులోకి వచ్చింది. ప్రస్తుతం ఆర్టికల్ 334 ప్రకారం ఈ రిజర్వేషన్లు 80 సంవత్సరాలపాటు (రాజ్యాంగం అమలులోకి వచ్చిన 1950 సంవత్సరం నుంచి) అంటే 2030 వరకు అమలులో ఉంటాయి. ప్రస్తుతం లోక్‌సభలో ఎస్సీలకు 84 స్థానాలు, ఎస్టీలకు 47 స్థానాలు రిజర్వ్ చేశారు.

2. భారత పార్లమెంట్ తొలిసారిగా ఎప్పుడు సమావేశం అయింది?
   1) 1952 మార్చి 13 2) 1952 మే 13
   3) 1953 మార్చి 13 4) 1953 మే 13

జ. 2;
వివరణ: భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత రాజ్యసభ 1952 ఏప్రిల్ 3న ఏర్పడింది. లోక్‌సభ 1952 ఏప్రిల్ 17న ఏర్పడింది. ఈ రెండు సభలతో కూడిన భారత పార్లమెంట్ తొలిసారిగా 1952 మే 13న సమావేశం అయింది. భారత పార్లమెంట్ 2002 మే 13న స్వర్ణోత్సవాలు జరుపుకోగా, 2012 మే 13న వజ్రోత్సవ ఉత్సవాలు జరుపుకుంది.

3. లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య ఎంత?
   1) 545 2) 550 3) 552 4) 543

జ. 3;
వివరణ: లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 552. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి ఎన్నిక కాగా, 20 మంది కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ఎన్నికవుతారు. మిగిలిన ఇద్దరు ఆంగ్లో-ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తారు. కానీ ప్రస్తుతం లోక్‌సభలో 545 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 530 మంది రాష్ట్రాల నుంచి, 13 మంది కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యారు. మిగిలిన ఇద్దరు ఆంగ్లో-ఇండియన్ సభ్యులను రాష్ట్రపతి నియమిస్తాడు.

4. లోక్‌సభలో అతి తక్కువగా అంటే ఒక్కొక్క స్థానం ఉన్న రాష్ట్రాలు ఏవి?
   1) సిక్కిం, నాగాలాండ్, గోవా
   2) సిక్కిం, గోవా, మణిపూర్
   3) సిక్కిం, నాగాలాండ్, మిజోరాం
   4) సిక్కిం, మిజోరాం, మణిపూర్

జ. 3;
వివరణ: సిక్కిం, నాగాలాండ్, మిజోరాం రాష్ట్రాల నుంచి లోక్‌సభలో ప్రాతినిధ్యం ఒక్క సీటు మాత్రమే ఉంది. అరుణాచల్‌ప్రదేశ్, గోవా, మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాల నుంచి ఇద్దరు సభ్యుల చొప్పున ఉన్నారు. లోక్‌సభలో ఎక్కువ సభ్యులు ఉన్న మొదటి మూడు రాష్ట్రాలు ఉత్తరప్రదేశ్ (80), మహారాష్ట్ర (48), పశ్చిమ బెంగాల్ (42).

5. రాజ్యసభకు 233 మంది ఎన్నిక ద్వారా వచ్చే సభ్యుల ఎన్నిక విధానం ఏ విధంగా ఉంటుంది?
   1) సాధారణ మెజారిటీ పద్ధతి, రహస్య ఓటు పద్ధతి
   2) సాధారణ మెజారిటీ పద్ధతి, బహిరంగ ఓటు పద్ధతి
   3) నైష్పత్తిక ప్రాతినిధ్య, రహస్య ఓటు పద్ధతి
   4) నైష్పత్తిక ప్రాతినిధ్య, బహిరంగ ఓటు పద్ధతి

జ. 4;
వివరణ: రాజ్యసభలో 245 మంది సభ్యులు ఉండగా, 233 మంది సభ్యులు రాష్ట్రాల అసెంబ్లీ సభ్యులు ఎన్నుకోగా మిగిలిన 12 మంది సభ్యులను వివిధ రంగాల్లో ప్రముఖులను రాష్ట్రపతి నియమిస్తాడు. వీరి ఎన్నిక నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు బదిలీ పద్ధతిలో బహిరంగ ఓటు విధానం ద్వారా జరుగుతుంది. రాజ్యసభ సభ్యుని ఎన్నికల్లో ఓటువేసే ఎం.ఎల్.ఎ. తాను వేసిన ఓటును పార్టీ నియమించిన ఏజెంట్‌కు చూపవలసి ఉంటుంది. క్రాస్ ఓటింగ్‌ను నిరోధించటానికి రాజ్యసభకు 2003 సంవత్సరం నుంచి బహిరంగ ఓటు విధానాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యసభ సభ్యుని ఎన్నిక విధానాన్ని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

6. పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థి చెల్లించవలసిన డిపాజిట్ ఎంత?
   1) 10,000 2) 15,000
   3) 20,000 4) 25,000

జ. 4;
వివరణ: లోక్‌సభ లేదా రాజ్యసభకు పోటీచేసే అభ్యర్థి రూ.25,000 డిపాజిట్ చెల్లించాలి. లోక్‌సభ విషయంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రం రూ.12,500 చెల్లిస్తే సరిపోతుంది. రాజ్యసభలో ఎస్సీ, ఎస్టీలకు ఎటువంటి రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి డిపాజిట్ చెల్లింపులో ఎటువంటి మినహాయింపు ఉండదు. పోలై చెల్లిన ఓట్లలో 1/6వ వంతు ఓట్లు వస్తే డిపాజిట్ వాపస్ వస్తుంది. లేనిచో డిపాజిట్ గల్లంతు అవుతుంది.

7. భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం ఎన్నిసార్లు సమావేశం కావాలి?
   1) ఒకసారి
   2) రెండుసార్లు 3) మూడుసార్లు
   4) నిర్ణీత కనీస పరిమితి లేదు

జ. 2;
వివరణ: రాజ్యాంగం ప్రకారం భారత పార్లమెంట్ సంవత్సరానికి కనీసం రెండుసార్లు సమావేశం కావాలి. ఒక సమావేశానికి మరొక సమావేశానికి మధ్య 6 నెలల వ్యవధి ఉండరాదు. కానీ ప్రస్తుతం భారత పార్లమెంట్ సంవత్సరానికి మూడుసార్లు సమావేశం అవుతుంది. అవి
   1) బడ్జెట్ సమావేశాలు(ఫిబ్రవరి నుంచి ఏప్రిల్)
   2) వర్షాకాల సమావేశాలు (జూలై నుంచి సెప్టెంబర్)
   3) శీతాకాల సమావేశాలు(నవంబర్ నుంచి డిసెంబర్)

అదే విధంగా భారత పార్లమెంట్ సంవత్సరానికి గరిష్ఠంగా ఎన్నిసార్లు అయినా సమావేశం కావచ్చు.

8. కింది ఏ బిల్లుల విషయంలో పార్లమెంట్ ఉభయ సభలకు సమాన అధికారం ఉంది?
   ఎ) సాధారణ బిల్లు
   బి) రాజ్యాంగ సవరణ బిల్లు
   సి) నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లు
   డి) ద్రవ్యబిల్లు
   1) ఎ, బి 2) ఎ, సి
   3) ఎ, బి,సి 4) ఎ, బి, సి, డి

జ. 3;
వివరణ: సాధారణ బిల్లు, రాజ్యాంగ సవరణ బిల్లు నూతన రాష్ట్రాల ఏర్పాటు బిల్లులను పార్లమెంట్ ఉభయసభల్లో దేనిలోనైనా ప్రవేశపెట్టవచ్చు. వీటి విషయంలో రెండు సభల ఆమోదం అవసరం. అదే విధంగా రెండు సభలకు సమాన అధికారాలు ఉన్నాయి.

కానీ ద్రవ్యబిల్లు విషయంలో లోక్‌సభకే ఎక్కువ అధికారాలు ఉన్నాయి. స్పీకర్ ఒక బిల్లుని ద్రవ్యబిల్లు అని నిర్ణయించాక రాష్ట్రపతి అనుమతితో దానిని ముందుగా లోక్‌సభలో మాత్రమే ప్రవేశపెట్టాలి. లోక్‌సభ ఆమోదించిన ద్రవ్యబిల్లుని రాజ్యసభ 14 రోజుల లోపు ఆమోదించాలి లేనిచో అది ఆమోదించినట్లుగా భావించి రాష్ట్రపతి ఆమోదానికై పంపబడును.

9. సభలో సభ్యుడు కాకున్న సభకు అధ్యక్షతవహించే వ్యక్తి?
   1) లోక్‌సభ స్పీకర్
   2) లోక్‌సభ డిప్యూటీ స్పీకర్
   3) రాజ్యసభ ఛైర్మన్ 4) పై ముగ్గురూ

జ. 3;
వివరణ: భారత ఉపరాష్ట్రపతి పదవీ రీత్యా రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరిస్తాడు. వాస్తవానికి ఇతను రాజ్యసభ సభ్యుడు కాకున్నప్పటికీ సభకు అధ్యక్షత వహించి బిల్లుల ఆమోదానికి, సభ సజావుగా సాగటానికి కృషి చేస్తాడు. ఇతనికి మాములు సందర్భంలో ఓటు హక్కు ఉండదు. కానీ ఒక బిల్లుకి అనుకూలంగా, వ్యతిరేకంగా సమాన ఓట్లు వచ్చినప్పుడు ఓటు హక్కు ఉంటుంది. దీనినే 'కాస్టింగ్ ఓటు' లేదా 'నిర్ణాయక ఓటు' అని అంటారు.

10. లోక్‌సభలో అధికారికంగా గుర్తింపు పొందిన తొలి ప్రతిపక్ష నేత ఎవరు?
   1) జె.బి. కృపలానీ 2) మొరార్జీ దేశాయ్
   3) చరణ్‌సింగ్ 4) వై.బి. చవాన్

జ. 4;
వివరణ: పార్లమెంట్‌లో ఒక పార్టీకి ప్రతిపక్ష హోదా లభించాలంటే ఆయా సభలో 10 శాతం సీట్లను గెలుచుకోవాలి. తొలిసారిగా 1977లో జనతాపార్టీ మొరార్జీ దేశాయ్ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా 154 స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్ ప్రతిపక్షంగా గుర్తించబడింది. కాంగ్రెస్ నేత వై.బి.చవాన్ అధికారికంగా ప్రతిపక్షనేతగా గుర్తింపు పొందాడు. అదే సంవత్సరం (1977)లో కమలాపాటి త్రిపాఠి రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాడు.

11. లోక్‌సభకు తొలిసారిగా మధ్యంతర ఎన్నిక ఎప్పుడు జరిగింది?
   1) 1967 2) 1971
   3) 1977 4) 1980

జ. 2;
వివరణ: సాధారణంగా లోక్‌సభ కాల పరిమితి 5 సంవత్సరాలు. కానీ ప్రధాని సలహా ప్రకారం దానిని ముందే రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఆ సందర్భంలో నిర్వహించే ఎన్నికను మధ్యంతర ఎన్నికలు అంటారు. 1967లో జరిగిన నాలుగో లోక్‌సభను ఒక సంవత్సరం ముందు 1971లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ సలహాపై రాష్ట్రపతి వి.వి. గిరి రద్దు చేశాడు. ఈ విధంగా తొలిసారిగా 1971లో మధ్యంతర ఎన్నిక జరిగింది. అనంతరం 1980లో రెండోసారి మధ్యంతర ఎన్నిక జరిగింది. లోక్‌సభకు 17 సార్లు ఎన్నికలు జరిగితే ఇందులో 7 సార్లు మధ్యంతర ఎన్నికలు (1971, 1980, 1984, 1991, 1998, 1999, 2004) జరిగాయి.

12. ఎంపీల్యాడ్స్ స్కీమ్ కింద ఒక్కొక్క ఎం.పి.కి సంవత్సరానికి నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని కోట్లు ఇస్తున్నారు?
   1) 1 2) 3 3) 5 4) 10

జ. 3;
వివరణ: పీవీ నరసింహారావు భారత ప్రధానిగా ఉన్నప్పుడు 1993లో ఎంపీల్యాడ్స్ స్కీమ్‌ను ప్రారంభించారు. మెంబర్ ఆఫ్ పార్లమెంట్ లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్‌గా పిలిచే దీని కింద 1993లో ఒక్కొక్క ఎంపీకి నియోజ వర్గ అభివృద్ధికి సంవత్సరానికి 5 లక్షలు కేటాయించారు. దీనిని 1994లో 1 కోటి, 1998లో 2 కోట్లు, 2011 నుంచి 5 కోట్లకు పెంచారు.

13. ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు పొందిన భారత ప్రధానులు ఎంతమంది ఉన్నారు?
   1) 2 2) 3 3) 4 4) 5

జ. 2;
వివరణ: పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు పార్లమెంట్ విలువలను పెంపొందించిన వ్యక్తులకు మాజీ హోంశాఖ మంత్రి పండిత్ గోవింద్ వల్లభ్ పంత్ పేరు మీద ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును 1993 నుంచి ఇస్తున్నారు. ఈ అవార్డును 1993లో ఇంద్రజిత్ గుప్తా పొందగా చివరగా 2017 సంవత్సరానికి భర్తృహరి మహతాబ్‌కు లభించింది.

ఈ అవార్డును ముగ్గురు ప్రధానమంత్రులు పొందారు. వారు అటల్ బిహారీ వాజ్‌పాయ్ (1994), చంద్రశేఖర్ (1995), మన్మోహన్ సింగ్ (2002).

14. ఇప్పటి వరకు లోక్‌సభకు 18 సార్లు ఎన్నికలు జరగ్గా అతి ఎక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ ఎన్నోది?
   1) 3 2) 5 3) 7 4) 9

జ. 2;
వివరణ: ఐదో లోక్‌సభ 1971లో ఏర్పడింది. దీని పదవీ కాలం 1976 వరకు ఉంది. కానీ ఇందిరా గాంధీ ప్రభుత్వం 1975లో ఎమర్జెన్సీ విధించాక, 42వ రాజ్యాంగ సవరణ చట్టం (1976) ద్వారా 5వ లోక్‌సభ కాల పరిమితిని ఒక సంవత్సరం అంటే 1977 వరకు పొడిగించారు.

అదే విధంగా అతి తక్కువ కాలం కొనసాగిన లోక్‌సభ 12వ లోక్‌సభ. ఇది కేవలం 13 నెలలు(1998-99) మాత్రమే కొనసాగింది. లోక్‌సభ కాల పరిమితిని పెంచే అధికారం పార్లమెంట్‌కు ఉండగా, దానిని ముందే రద్దుచేసే అధికారం రాష్ట్రపతికి ఉంది.

15. పార్లమెంట్ సభ్యులు ఎన్ని రోజుల పాటు పార్లమెంట్ సమావేశాలకు హాజరు కాకుంటే సభ్యత్వం రద్దు అవుతుంది?
   1) 30 రోజులు 2) 60 రోజులు
   3) 3 నెలలు 4) 6 నెలలు

జ. 2;
వివరణ: పార్లమెంట్ సభ్యుడు 60 రోజుల పాటు సభాధ్యక్షుని అనుమతి లేకుండా సభకు గైర్హాజరు అయితే సభ్యత్వం కోల్పోతాడు. 1976-77 లో తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్య స్వామి ఈ విధంగానే రాజ్యసభ సభ్యత్వం కోల్పోయాడు.

అదే విధంగా పార్లమెంట్ సభ్యుడు పార్టీ ఫిరాయింపుకు పాల్పడితే సభాధ్యక్షుడు అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు. అతని ఎన్నిక చెల్లదు అని హైకోర్టు లేదా సుప్రీంకోర్టు తీర్పునిస్తే రాష్ట్రపతి అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తాడు.

16. రాష్ట్ర జాబితాలోని అంశాలపై కూడా పార్లమెంట్ ఏ సందర్భంలో శాసనాలు రూపొందించవచ్చు?
   1) జాతీయ ప్రయోజనం
   2) రెండు రాష్ట్రాలు ఉమ్మడి ప్రయోజనం కోసం
   3) అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు
   4) పై అన్నీ సందర్భాల్లో

జ. 4;
వివరణ: ఆర్టికల్-249 ప్రకారం జాతీయ ప్రయోజనం దృష్ట్యా రాష్ట్ర జాబితాలోని అంశంపై శాసనం చేయాలని రాజ్యసభ 2/3వ వంతు మెజారిటీతో తీర్మానం చేసినప్పుడు పార్లమెంట్ రాష్ట్ర జాబితాలోని అంశంపై కూడా శాసనం చేయవచ్చు.

ఆర్టికల్-250 ప్రకారం అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నప్పుడు కూడా రాష్ట్ర జాబితాలోని అంశంపై కూడా పార్లమెంట్ చట్టం చేయవచ్చు.

ఆర్టికల్-252 ప్రకారం రెండు లేదా ఎక్కువ రాష్ట్రాలు తమ ఉమ్మడి ప్రయోజనం కోసం రాష్ట్ర జాబితాలోని అంశంపై చట్టం చేయాలని కోరితే పార్లమెంట్ చట్టం చేస్తుంది.

17. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ సభ్యుల సంఖ్యను ఏ సంవత్సరం వరకు మార్చకూడదు?
   1) 2025 2) 2026
   3) 2030 4) 2035

జ. 2;
వివరణ: 84వ రాజ్యాంగ సవరణ చట్టం (2001) ద్వారా ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్యను 2026 వరకు మార్చకూడదని పేర్కొన్నారు. నియోజక వర్గాలను పునర్విభజించటానికి పై సవరణ ద్వారా 4వ డీలిమిటేషన్ కమిషన్‌ను జస్టిస్ కుల్‌దీప్ సింగ్ నేతృత్వంలో వేసినప్పుడు ఈ అంశాన్ని చేర్చారు. వాస్తవానికి ప్రారంభంలో లోక్‌సభ సభ్యుల సంఖ్య 489 ఉండేది. దానిని 1956లో 525కి, 1973లో 552కి పెంచారు. ఇది 2026 వరకు కొనసాగుతుంది.

18. భారత పార్లమెంట్ సమావేశాలు దేనితో ప్రారంభమవుతాయి?
   1) శూన్య సమయం
   2) ప్రశ్నోత్తరాలు సమయం
   3) అరగంట చర్చ 4) సావధాన తీర్మానం


జ. 2;
వివరణ: పార్లమెంట్ సమావేశాలు ప్రతిరోజూ ప్రశ్నోత్తరాల సమయంతో ప్రారంభమవుతాయి. ఇది ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో ఉంటుంది. ప్రశ్నలు 3 రకాలు.

1. నక్షత్రపు గుర్తు ప్రశ్నలు: వీటికి 10 రోజుల ముందు సభాధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. దీనికి మంత్రులు మౌఖికంగా సమాధానం చెప్పాలి.

2. నక్షత్రపు గుర్తు లేని ప్రశ్నలు: వీటికి కూడా 10 రోజుల ముందు సభాధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. దీనికి మంత్రులు రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి.

3. స్వల్ప వ్యవధి ప్రశ్నలు: అతి ముఖ్య విషయాలపై 3 నుంచి 10 రోజుల లోపు ముందస్తు అనుమతితో సభ్యులు ప్రశ్నలు అడగవచ్చు.

హృదయ స్పందన పెరగడానికి కారణమయ్యే హార్మోన్?



జనరల్ స్టడీస్ - ప్రత్యేకం

బయాలజీ

ప్రశ్నలు- వివరణలు

1. ఒక జీవిని 'ఎండమిక్ జీవి' గా పేర్కొనడానికి గల కారణం.
   1) దాని జనాభా తరిగిపోవడం
   2) భూమిపై అలాంటి జీవి ఒక్కటి కూడా మిగలకపోవడం
   3) దానిని వేటాడడం నిషేధించడం
   4) ఒక ప్రత్యేక ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉండడం

జ. 4;
వివరణ: జీవులు కొన్ని ప్రత్యేక ప్రాంతాలకే పరిమితమవుతాయి. వీటిని అరుదైన జాతులు లేదా ఎండమిక్ జాతులు అంటారు.
ఉదా: కంగారూ, ఆస్ట్రేలియా, కివీపక్షి-న్యూజిలాండ్ మొదలైనవి.

2. కింది పటంలోని ప్రయోగం ద్వారా నిరూపించే అంశం



   1) జీవులు, ఉద్దీపనలకు ప్రతిస్పందిస్తాయి
   2) జీవక్రియలు కాంతి సమక్షంలో మాత్రమే జరుగుతాయి
   3) జంతువులు మాత్రమే కాంతికి ప్రతిస్పందిస్తాయి
   4) మొక్కలు మాత్రమే కాంతికి ప్రతిస్పందిస్తాయి

జ. 1;
వివరణ: పటంలోని ప్రయోగాల్లో గాజు సీసాను చీకటి, వెలుతురు తగిలేలాగ రెండు భాగాలుగా విభజించి అందులో వానపామును వదిలి మూత మూశారు. కాంతిని ప్రసరింప చేసినపుడు అది కాంతిపడే ప్రాంతానికి ప్రయాణిస్తుంది. జీవులు ఉద్దీపనాలకు ప్రతిస్పందిస్తాయని తెలుసుకోవచ్చు.

3. వృక్షకణం ప్రత్యేకంగా ఏ కణాంగాలను కలిగి ఉంటుంది.
   1) మైటోకాండ్రియా, రైబోజోమ్లు, ప్లాస్టిడ్లు
   2) ప్లాస్టిడ్లు, కణత్వచం, లైసోజోమ్లు
   3) ప్లాస్టిడ్లు, కణకవచం, పెద్దరిక్తికలు
   4) ప్లాస్టిడ్లు, మైటోకాండ్రియా, లైసోజోమ్లు

జ. 3;
వివరణ: వృక్షకణంలో ప్లాస్టిడ్‌లు(వర్ణదాలు) కణకవచం, పెద్దరిక్తికలు ఉంటాయి. స్పష్టమైన కణకవచాన్ని చూపుతుంది. జంతు కణంలో పలుచని ప్లాస్మాత్వచం, చిన్న రిక్తికలు ఉంటాయి. ప్లాస్టిడ్‌లు ఉండవు.

4. ఏ రకపు పేపిల్లే ద్వారా ఎలాంటి రుచిని తెలుసుకోలేం?
   1) ఫిలిఫార్మ్ పాపిల్లే 2) ఫోలియేట్ పాపిల్లే
   3) సర్కంవేలేట్ పాపిల్లే 4) ఫంగిఫార్మ్ పాపిల్లే

జ. 1;
వివరణ: నాలుకపై సుమారు పదివేల రుచి కణికలు ఉంటాయి. ఇందులో ఫిలిఫార్మ్ పాపిల్లే పొలుసుల లాగా ఉంటుంది. ఇందులో ఎలాంటి రుచికణికలు ఉండకపోవడం వల్ల అవి రుచిని తెలుసుకోలేవు.

5. 'బయోపెస్టిసైడ్'గా ఉపయోగపడే బ్యాక్టీరియం ఏది?
   1) అజటోబ్యాక్టర్
   2) అజోస్పైరిల్లం
   3) బాసిల్లస్ తురెంజియన్సిస్
   4) బాసిల్లస్ పోపిల్లె

జ. 3;
వివరణ: బాసిల్లస్ తురంజెయన్సిస్(BT) జీవరసాయన ఎరువుగా ఉపయోగపడుతుంది. దీన్ని అనేక పరిశోధనల్లోనూ ఉపయోగిస్తున్నారు.

6. పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో ఒక పెద్దపామును చూసిన అనిల్ హృదయ స్పందన పెరిగింది. అతని హృదయ స్పందన పెరగడానికి కారణ మయ్యే హార్మోన్ ఏది?
   1) థైరాక్సిన్ 2) అడ్రినలిన్
   3) థైరోట్రోపిన్ 4) గ్రీలిన్

జ. 2;
వివరణ: అడ్రినలిన్ హార్మోన్ శరీరంలోని అధివృక్క గ్రంధిలో విడుదలవుతుంది. ఈ హార్మోన్ మానసిక ఉద్వేగాలను నియంత్రిస్తుంది. అందువల్ల దీనిని 'పోరాట పలాయన హార్మోన్' అని అంటారు.

7. కింది వానిలో ఎక్కువ పీచు పదార్థాలను ఉన్నవేవి?
   అ. పాలు ఆ. తృణధాన్యాలు
   ఇ. నీరు ఈ. ఆకుకూరలు
   1) అ, ఆ 2) ఆ, ఇ
   3) ఇ, అ 4) ఈ, ఆ

జ. 4;
వివరణ: తృణధాన్యాలైన అన్నిరకాల గింజలు, ఆకుకూరల్లో పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి జీర్ణనాళంలో ఆహారాన్ని బరువును పెంచి సులభంగా జారే విధంగా చేస్తుంది. మలబద్ధకాన్ని నిరోధిస్తుంది.

8. కింది వానిలో సరికాని జత ఏది?
   1) పత్రవృంతము: పత్రాన్ని కాండంతో జతపరుస్తుంది
   2) అంచులు: పత్రానికి ఆకారము ఇస్తాయి
   3) పత్రదళం: భాష్పోత్సేకంలో సహకరిస్తుంది
   4) నడిమి ఈనె: నీటిని మాత్రమే రవాణా చేస్తుంది.

జ. 4;
నడిమి ఈనె పత్రంలో మధ్యభాగంలో ఉంటుంది. ఇందులో ప్రసరణ కణజాలం ఉంటుంది. నీటితోపాటు పోషక పదార్థాలను సరఫరా చేయడానికి నాళికాపుంజాలను కలిగి ఉంటుంది.

9. కింది జీవుల్లో కేంద్రక పూర్వక జీవులకు సంబంధించిన జత ఏది?
   1) నీలి ఆకుపచ్చ శైవలాలు, బ్యాక్టీరియా
   2) బ్యాక్టీరియా, స్పంజికలు
   3) రైజోపస్, నీలి ఆకుపచ్చ శైవలం
   4) ఈస్ట్, పుట్టగొడుగు

జ. 1;
వివరణ: కేంద్రకం చుట్టూ నిర్దిష్టమైన త్వచం లేని కణాలను కేంద్రక పూర్వక కణాలు అంటారు. నీలి ఆకుపచ్చ శైవలాలు, బ్యాక్టీరియాల్లో ఈ స్థితి కనిపిస్తుంది. వీటిని కేంద్రక పూర్వ జీవులు అంటారు.

10. నేలను దున్నడం, పెల్లగించడం అనే ప్రక్రియ కింది వానిలో ఏ అంశానికి సహాయపడదు?
   1) వేళ్లు నేలలోకి సులభంగా చొచ్చుకొని పోవడానికి
   2) కొన్ని అపాయకరమైన సూక్ష్మజీవులను చంపడానికి
   3) భూసారాన్ని పెంచడానికి
   4) నీరు ఇంకే సామర్థ్యాన్ని వృద్ధి చేయడానికి

జ. 3;
వివరణ: వ్యవసాయంలో నేలను దున్నడం ముఖ్యమైన ప్రక్రియ. భూసారాన్ని పెంచడం కోసం నేలను దున్నుతారు. దీని వల్ల కింద ఉన్న మట్టిపైకి, పైనున్న మట్టి కిందికి వెళ్లడంతో పాటు గాలి చొరబడుతుంది.

11. మొదటిసారిగా జన్యువుని కృత్రిమంగా సంశ్లేషణ చేసిన శాస్త్రవేత్త ఎవరు?
   1) హరగోవింద ఖొరానా
   2) పంచానన్ మహేశ్వరి
   3) బీర్బల్ సాహిని
   4) ఎల్లాప్రగడ సుబ్బారావు

జ. 1;
వివరణ: హరగోవింద ఖొరానా భారతీయ శాస్త్రవేత్త. కణంలోని కేంద్రకంలో జన్యువు ఉంటుంది. ఇది జీవుల లక్షణాలకు మూలప్రమాణం. దీన్ని 1972లో కృత్రిమ పద్ధతుల్లో ఖొరానా బృందం ఆవిష్కరించింది. నేడు బయోటెక్నాలజీలో, జీన్ ఎడిటింగ్‌లో ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది.

ఇండియన్ జాగ్రఫీ

1. భారతదేశంలో తోట వ్యవసాయాన్ని ప్రవేశపెట్టిన విదేశీయులు ఎవరు?
   1) పర్షియన్లు 2) పోర్చుగీసువారు
   3) బ్రిటిషర్లు 4) అరబ్బులు

2. మనదేశంలో విస్థాపన వ్యవసాయానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఆంధ్రప్రదేశ్ - పోడు వ్యవసాయం
   2) మధ్యప్రదేశ్ - బేవార్
   3) అస్సాం - కురువా 4) కేరళ - పోనమ్

3. విస్తృత వ్యవసాయానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) ఈ వ్యవసాయ పద్ధతికి భూకమతం ఎక్కువగా ఉండాలి
   బి) ఈ పద్ధతికి జనసాంద్రత తక్కువగా ఉండాలి
   సి) ఈ పద్ధతిలో నీటిపారుదల ఎక్కువగా, యంత్రాల వినియోగం తక్కువగా ఉండాలి
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, సి 4) ఎ, బి, సి

4. భూకమత పరిమాణం తక్కువగా ఉండి, జనసాంద్రత ఎక్కువగా ఉన్న దేశాల్లో యాంత్రీకరణ లేకుండా చేసే వ్యవసాయాన్ని ఏమని పిలుస్తారు?
   1) మిశ్రమ వ్యవసాయం
   2) జీవనాధార వ్యవసాయం
   3) సాంద్ర వ్యవసాయం
   4) విస్తృత వ్యవసాయం

5. కింది వాటిలో తోట పంట కానిది ఏది?
   1) రబ్బరు 2) టీ
   3) కొబ్బరి 4) జనుము

6. వివిధ పరిశోధన కేంద్రాలు, అవి ఉన్న ప్రదేశాలకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ప్రపంచ వరి పరిశోధన కేంద్రం - మనీలా (ఫిలిప్పీన్స్)
   2) జాతీయ వరి పరిశోధన కేంద్రం - కోల్‌కతా
   3) భారత వ్యవసాయ పరిశోధన కేంద్రం - న్యూఢిల్లీ
   4) భారత చెరకు విత్తన పరిశోధన కేంద్రం - కోయంబత్తూర్

7. గోధుమ పంటకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) ఇది సమశీతోష్ణ మండలం పంట
   బి) ఇది రెండో ప్రధాన ఆహార పంట
   సి) ఇది ఖరీఫ్ కాలానికి చెందిన పంట
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, సి 4) ఎ, బి, సి

8. కింది వాటిని జతపరచండి.
   జాబితా - I
   i) ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
   ii) ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పల్సెస్ రీసెర్చ్
   iii) కేంద్ర సముద్ర చేపల పరిశోధన సంస్థ
   iv) నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్
   జాబితా - II
   a) ఆనంద్ b) కొచ్చిన్
   c) ఢిల్లీ d) కాన్పూర్
   1) i - c, ii - d, iii - b, iv - a
   2) i - c, ii - a, iii - d, iv - b
   3) i - d, ii - c, iii - a, iv - b
   4) i - b, ii - c, iii - d, iv - a

9. భారతదేశంలో వరిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం ఏది?
   1) మధ్యప్రదేశ్ 2) ఉత్తరప్రదేశ్
   3) పశ్చిమబెంగాల్ 4) తమిళనాడు

10. హరిత విప్లవానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) హరిత విప్లవం అనే పదాన్ని మొదట ఉపయోగించిన వ్యక్తి 'విలియం. ఎస్ గాడ్'
   బి) హరిత విప్లవాన్ని మొదటిసారిగా ప్రపంచంలో వ్యాప్తి చేసిన వారు 'నార్మన్ బోర్లాగ్'
   సి) భారతదేశంలో హరిత విప్లవాన్ని అధికంగా వ్యాప్తి చేసినవారు ఎం.ఎస్. స్వామినాథన్
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి

11. కింది వాటిని జతపరచండి.

జాబితా - I	జాబితా - II
i) క్షీర విప్లవం	a) పండ్లు
ii) వెండి విప్లవం	b) చేపలు
iii) బంగారు విప్లవం	c) పాలు
iv) నీలి విప్లవం	d) కోడి గుడ్లు

   1) i - c, ii - a, iii - d, iv - b
   2) i - d, ii - c, iii - a, iv - b
   3) i - c, ii - d, iii - a, iv - b
   4) i - b, ii - d, iii - a, iv - c

12. హరిత విప్లవం వల్ల మన దేశంలో అత్యధికంగా ప్రయోజనం పొందిన పంట ఏది?
   1) వరి 2) మొక్కజొన్న
   3) జొన్న 4) గోధుమ

13. కింది వాటిలో 'గోల్డెన్ ఫైబర్' లేదా 'బంగారు పీచు' అని దేన్ని పిలుస్తారు?
   1) జనుము 2) పత్తి
   3) పొగాకు 4) సుగంధ ద్రవ్యాలు

14. పత్తి పంటకు సంబంధించి కింది వాటిలో సరైన వాక్యం ఏది?
   1) దీన్ని 'తెల్ల బంగారం' అని పిలుస్తారు
   2) పత్తిని అత్యధికంగా నల్లరేగడి నేలలో పండిస్తారు
   3) దేశంలో అత్యధికంగా ఉత్పత్తి చేసే రాష్ట్రాలు గుజరాత్, మహారాష్ట్ర
   4) పైవన్నీ సరైనవే

15. భారతదేశంలో 'ఇంద్రధనస్సు విప్లవం'ను దేనిలో భాగంగా ప్రకటించారు?
   1) మొదటి హరిత విప్లవం
   2) రెండో హరిత విప్లవం
   3) జాతీయ వ్యవసాయ విధానం - 2000
   4) జాతీయ వ్యవసాయ విధానం - 2006

16. మొదటి హరిత విప్లవం వల్ల దేశంలో తక్కువ ప్రయోజనం పొందిన పంట ఏది?
   1) పప్పుధాన్యాలు 2) నూనె గింజలు
   3) మొక్కజొన్న 4) 1, 2

17. దేశంలో పంటలు, వాటిని అత్యధికంగా పండించే రాష్ట్రాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.

జాబితా - I	జాబితా - II
i) సజ్జలు	a) కర్ణాటక
ii) రాగులు	b) మహారాష్ట్ర
iii) జొన్న	c) రాజస్థాన్

   1) i - c, ii - b, iii - a
   2) i - c, ii - a, iii - b
   3) i - a, ii - b, iii - c
   4) i - b, ii - a, iii - -c

18. బీరు, విస్కీ తయారీలో ఏ పంట గింజలను ఉపయోగిస్తారు?
   1) బార్లీ 2) సజ్జ 3) రాగులు 4) సామలు

19. 1965-66లో హరిత విప్లవాన్ని మొదటి సారిగా ఏ ప్రాంతంలో ప్రవేశపెట్టారు?
   1) పంజాబ్ 2) హర్యానా
   3) పశ్చిమ ఉత్తరప్రదేశ్ 4) పైవన్నీ

20. రెండో హరిత విప్లవానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) దీన్ని 2006 మే 26న అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించారు
   బి) ఇది పప్పుధాన్యాల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి సరైనవి 4) ఏదీకాదు

సమాధానాలు

1) 3	2) 3	3) 1	4) 3	5) 4
6) 2	7) 1	8) 1	9) 3	10) 4
11) 3	12) 4	13) 1	14) 4	15) 3
16) 4	17) 2	18) 1	19) 4	20) 3

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సాక్షి ప్లస్
మంగళవారం । 5-11-2024

విష్ణుకుండినులు తమ రాజ్యాన్ని దేనితో పోల్చుకున్నారు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

దక్షిణ భారతదేశ చరిత్ర

1. విష్ణుకుండినులు ఏర్పాటు చేసిన 'ఘటికలు' అంటే ఏమిటి?
   1) వర్తక కేంద్రాలు 2) ఓడరేవు కేంద్రాలు
   3) విద్యా కేంద్రాలు 4) పన్నులు

జ. 3;
వివరణ: సంస్కృత భాషలో బోధించే విద్యాకేంద్రాలను 'ఘటికలు' అంటారు. తెలుగు నేలలో విష్ణుకుండినులు వీటిని ప్రథమంగా ఏర్పాటు చేశారు. భాష, సాహిత్యంను వీరు ప్రోత్సహించారు. ఘటికలలో వేదాల అధ్యయనం కీలకమైంది.

2. 'త్రివర నగర భవనగత సుందరీ హృదయ నందన' అనే బిరుదు ఉన్న విష్ణుకుండిన రాజు?
   1) రెండో మాధవ వర్మ 2) మొదటి గోవింద వర్మ
   3) రెండో విక్రమేంద్ర వర్మ 4) రెండో ఇంద్రవర్మ

జ. 1;
వివరణ: పొలమూరు శాసనం ప్రకారం రెండో మాధవ వర్మకు ఉన్న బిరుదు ఇది. త్రివర నగరం నర్మదా నదిపై ఉన్న జబల్‌పూర్ సమీపంలోని 'త్రిపురి' అని కొందరి అభిప్రాయం. రెండో మాధవ వర్మ కాలాన్ని విష్ణుకుండినుల పాలనా చరిత్రలో 'స్వర్ణయుగం' అంటారు.

3. 'ఉత్పత్తి పిడుగు' అనే లేఖనం ఎక్కడ లిఖించారు?
   1) మొగల్‌రాజపురం 2) భైరవకోన
   3) ఉండవల్లి 4) గుమ్మడిదుర్రు

జ. 3;
వివరణ: విష్ణుకుండినుల కాలంలో మొగల్‌రాజపురంలో ఐదు గుహలు ప్రాధాన్యత పొందాయి. ఇందులో అర్ధనారీశ్వరమూర్తి విగ్రహం ఉంది. భైరవకోన 8 గుహలు కలిగిన శివాంకిత ప్రాంతం. ఉండవల్లిలో అనంతశయనశాయి విగ్రహం ప్రాధాన్యత పొందింది. గుమ్మడిదుర్రు ప్రముఖ బౌద్ధ క్షేత్రం.

4. భైరవకోనలోని ఎనిమిది గుహలు ఏ దేవునికి అంకితం చేశారు?
   1) విష్ణువు 2) ఇంద్రుడు
   3) బ్రహ్మ 4) శివుడు

జ. 4;
వివరణ: భైరవకోనలో విష్ణుకుండినులు 8 గుహలను తొలిపించారు. ఇవి అన్నీ శివునికి అంకితం చేశారు. ఇక్కడే త్రిముఖ దుర్గ విగ్రహం కూడా ఉంది. కుంభ శీర్షాలతో ఉన్న సింహపాద స్తంభాలు ఉన్నాయి. కాపాలికులకు ఈ ప్రాంతం రెండో కేంద్రం శ్రీశైలం (మొదటిది).

5. భూతగ్రహస్వామి అని ఏ దేవునిని అంటారు?
   1) వినాయకుడు 2) యమధర్మరాజు
   3) బ్రహ్మదేవుడు 4) పరమేశ్వరుడు

జ. 2;
వివరణ: విష్ణుకుండినుల కాలంలో యముడిని భూతగ్రహస్వామి అని పిలిచేవారు. వినాయకుడిని దంతముఖస్వామి అని వ్యవహరించారు. తర్వాత బ్రహ్మను పద్మ సంభవుడు అని, పరమేశ్వరుని అర్ధనారీశ్వరుడు అని అంటారు. వివిధ కాలాల్లో ఈ పేర్లతో దేవుళ్ళను పిలిచేవారు.

6. జతపరచండి.

జాబితా-1
1. అర్ధనారీశ్వర గుహాలయం
2. త్రిముఖ దుర్గ శిల్పం
3. పూర్ణకుంభం 4. బౌద్ధక్షేత్రం

జాబితా-2
ఎ. బొజ్జన్నకొండ బి. ఉండవల్లి
సి. భైరవకోన డి. మొగల్‌రాజపురం

   1) 1-డి, 2-బి, 3-ఎ, 4-సి
   2) 1-బి, 2-డి, 3-సి, 4-ఎ
   3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   4) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి

జ: 3;
వివరణ: విష్ణుకుండినులు వివిధ ప్రాంతాలలో తమ శిల్పకళలు విస్తృతపరిచారు. అర్ధనారీశ్వరుడు అంటే శివుడు స్త్రీ, పురుష భంగిమలో కనిపిస్తాడు, దుర్గమాతకు మూడు ముఖాలతో భైరవకోనలో శిల్పీకరణ చూపరులను ఆకట్టుకుంటుంది. ఉండవల్లిలో ఉన్న పూర్ణకుంభంను చూసి సూరిశెట్టి ఆంజనేయులు చిత్రీకరించారు. దీనినే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిహ్నంగా స్వీకరించారు. (ఇప్పుడు పూర్ణఘటం). బొజ్జన్నకొండలో బుద్ధుణ్ణి బొజ్జన్న అని పిలుస్తారు.

7. విష్ణుకుండినులు తమ రాజ్యంను దేనితో పోల్చుకున్నారు?
   1) పాంచజన్యం 2) ఖట్వాంగం
   3) కౌస్తుభం 4) స్వస్తిక్

జ. 3;
వివరణ: కౌస్తుభం అనేది మహా విష్ణువు రత్నం. ప్రపంచంలో అత్యంత విలువైనదిగా పేర్కొంటారు. ఖట్వాంగం శివుని ఆయుధం, పాంచజన్యం శ్రీకృష్ణుని శంఖం, స్వస్తిక్ సర్వాభివృద్ధికి సంకేతం.

8. విష్ణుకుండినుల రాజ్యాన్ని అంతం చేసిన పశ్చిమ చాళుక్య రాజు?
   1) మొదటి పులకేశి 2) మంగళేసు
   3) రెండో పులకేశి 4) రవికీర్తి

జ. 3;
వివరణ: చివరి విష్ణుకుండిన రాజు అయిన మంచన భట్టారకుడిని ఓడించి క్రీ.శ.624లో రెండో పులకేశి ఆ రాజ్యాన్ని ఆక్రమించాడు. తర్వాత తన సోదరుడైన కుబ్జవిష్ణువర్ధనుడికి ఆ రాజ్యాన్ని ఇచ్చాడు. ఆ రాజ్యమే వేంగి సామ్రాజ్యంగా అభివృద్ధి చెందింది.

9. గజదళాధిపతిని ఏమని పిలుస్తారు?
   1) హస్తికోశ 2) వీరకోశ
   3) స్కంధావారం 4) గుల్మిక

జ. 1;
వివరణ: హస్తి అంటే ఏనుగు లేదా గజరాజు. ఈ రకమైన దళాన్ని హస్తికోశ అని పిలుస్తారు. ఈ ఏనుగుల దళం యుద్ధ సమయాలలో అత్యంత కీలకమైన దళం. వీరకోశ అంటే పదాతి దళం. స్కంధావారం అంటే శాతవాహనుల కాలం నాటి తాత్కాలిక సైనిక శిబిరం, గుల్మిక అంటే సరిహద్దు రక్షణాధికారి అని శాతవాహనుల కాలం వివరాల ద్వారా తెలుస్తుంది.

10. శాలంకాయన రాజు హస్తివర్మ కాలంలో వేంగిపై దండెత్తిన గుప్తరాజు ఎవరు?
   1) శ్రీగుప్తుడు 2) మొదటి చంద్రగుప్తుడు
   3) సముద్రగుప్తుడు 4) భానుగుప్తుడు

జ. 3;
వివరణ: అలహాబాద్ శాసనం ప్రకారం గుప్తరాజు సముద్రగుప్తుడు తన దక్షిణ దిగ్విజయ యాత్రలలో భాగంగా వేంగిపై దండెత్తాడు. ఈ శాసనంను హరిసేనుడు రచించాడు. గోదావరి నది ప్రాంత విషయాలు ఈ శాసనంలో ఉన్నట్లు తెలుస్తోంది.

11. చిత్రరథస్వామి పాదభక్తులము అని చెప్పుకున్న రాజులు?
   1) విష్ణుకుండినులు 2) ఇక్ష్వాకులు
   3) శాతవాహనులు 4) శాలంకాయనులు

జ. 4;
వివరణ: శాలంకాయనుల ఆరాధ్య దైవం చిత్రరథ స్వామి. ఈ దైవ స్వరూపంను సూర్యుడు అని, కొందరు శివుడు అని వ్యవహరిస్తున్నారు. శాలంకాయన అంటే నంది అని అర్థం. టాలమీ లాంటి విదేశీయులు వీరిని గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు.

12. సప్త మాతృక విగ్రహాలు ఉన్న ప్రాంతం ఏది?
   1) నారాయణ వనం 2) నందిగామ
   3) సోమశిల 4) చేజెర్ల

జ. 4;
వివరణ: తొలిసారి శక్తి ఆరాధనకు హారితీ దేవాలయం (నాగార్జున కొండ), పెదముడియాల మొదలగు ప్రాంతాలను ఉదహరించవచ్చు. దేవాలయాలలో సప్తమాతృకలను నెలకొల్పి ఆరాధించేవారు. చేజెర్లలో సప్తమాతృకల విగ్రహాలున్నాయి. ఆదిపరాశక్తి రూపాలే ఇవి. బ్రాహ్మణి, వైష్ణవి, మహేశ్వరి, ఇంద్రాణి, కౌమారి, వారాహి, చాముండి ఈ రూపాలు.

13. త్రిమూర్తి ఆరాధనకు ప్రాచీన ఆంధ్ర దేశంలో లభించిన ఆధారం ఏ ప్రాంతంలో ఉంది?
   1) భైరవకోన 2) సంగమయ్య గుహ
   3) బెలుంగుహలు 4) ఏనుగు మల్లమ్మ కొండలు

జ. 1;
వివరణ: భైరవకోనలో శివునికి ద్వారపాలకులుగా బ్రహ్మ, విష్ణు శిల్పాలు ఉన్నాయి. ఈ ప్రాంతం కాపాలికులకు రెండో కేంద్రం (మొదటిది శ్రీశైలం), సంగమయ్య గుహ శ్రీకాకుళంలో, బెలుంగుహలు కర్నూలులో, ఏనుగు మల్లమ్మ కొండలు మదనపల్లి (చిత్తూరు)లో చారిత్రాత్మక ప్రాంతాలు.

14. జతపరచండి.

రాజవంశం:
1. వేంగి చాళుక్యులు 2. ఆనంద గోత్రజులు
3. విష్ణుకుండినులు 4. రాష్ట్రకూటులు

చిహ్నం:
ఎ. వృషభం బి. వరాహం
సి. పంజా విసిరిన సింహం డి. గరుడ

   1) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి
   2) 1-బి, 2-ఎ, 3-సి, 4-డి
   3) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
   4) 1-డి, 2-బి, 3-ఎ, 4-సి

జ. 2;
వివరణ: వరాహం వేంగి చాళుక్యుల చిహ్నం. ఈ రూపం విష్ణువు మూడో అవతారం (దశావతారాలలో). వృషభం ఆనందగోత్రజుల చిహ్నం. పంజా విసిరిన సింహం విష్ణుకుండినుల చిహ్నం. రాష్ట్రకూటుల చిహ్నం గరుడ (విష్ణువు వాహనం).

15. బృహత్పలాయనుల రాజధాని ఏది?
   1) వేంగి 2) కోడూరు
   3) తుమ్మలగూడెం 4) హన్మకొండ

జ. 2;
వివరణ: కోడూరు లేదా గుడూరు కృష్ణా జిల్లా మచిలీపట్నం అని గుర్తించారు. ఇది బృహత్పలాయనుల రాజధాని. వేంగి శాలంకాయనుల రాజధాని ఆ తర్వాత తూర్పు చాళుక్యుల రాజధాని, తుమ్మలగూడెం విష్ణుకుండినుల రాజధాని, హన్మకొండ తొలి కాకతీయుల రాజధాని.

16. గోలాంగులము అంటే?
   1) గరుడ 2) కోతి
   3) పంజా విసిరే సింహం 4) సింహం

జ. 2;
వివరణ: ఆనందగోత్రజుల విజయకేతనం గోలాంగులము (కోతి) అని చేజెర్ల శిలా శాసనం చెబుతుంది. అయితే వీరి రాజలాంఛనం వృషభం. సింహం శాతవాహనులకు, పంజా విసిరే సింహం విష్ణుకుండినులకు, గరుడ గుప్తరాజుల రాజ చిహ్నాలు. ఇవి వారి వారి మత విశ్వాసాలను కూడా వ్యక్తీకరిస్తాయి.

17. తాడికొండలో శాక్యభిక్షు విహారం నిర్మించింది ఎవరు?
   1) పృథ్వీమూలుడు 2) హరివర్మ
   3) రెండో విక్రమేంద్ర వర్మ 4) అనంతవర్మ

జ. 2;
వివరణ: హరివర్మ తాడికొండలో శాక్యభిక్షు విహారం నిర్మించాడు. ఈయన బౌద్ధ మతాభివృద్ధికి కృషి చేశాడు. ఆదుర్రులో కూడా విహారం నిర్మించి, తండ్రి పృథ్వీమూలుని నుంచి పొందిన కట్టు చెరువు గ్రామాన్ని దానం చేశాడు. మహామేఘవాహన విహారానికి కల్వచెరువును దానం చేశాడు. ఇది వర్ధమానపురంలో ఉంది. గుణపాశపురంలో ఉన్న లోకవిఖ్యాత మహా విహారానికి అట్టలువుడ గ్రామాన్ని దానం చేశాడు.

18. శాలంకాయన అంటే అర్థం ఏమిటి?
   1) చిలుక 2) సింహం
   3) నెమలి 4) నంది

జ. 4;
వివరణ: ఇక్ష్వాకుల అనంతరం ఉత్తర తీరాంధ్రలో అధికారంలోకి వచ్చినవారు శాలంకాయనులు. శాలంకాయన అంటే అర్థం నంది. శాలంకాయన అనేది గోత్రనామం. వీరు శైవ మతాభిమానులు.

19. హిరణ్య గర్భయాగం అంటే ఏమిటి?
   1) పుట్టుకతో బ్రాహ్మణుడు కాకున్నా యాగంతో కావడం
   2) పుట్టుకతో క్షత్రియుడు కాకున్నా యాగంతో కావడం
   3) పుట్టుకతో వైశ్యుడు కాకున్నా యాగంతో కావడం
   4) పుట్టుకతో శూద్రుడు కాకున్నా యాగంతో కావడం

జ. 2;
వివరణ: పుట్టుకతో క్షత్రియుడు కాకున్నా హిరణ్యగర్భయాగంతో క్షత్రియుడు కావచ్చు. ఉదాహరణకు శాలంకాయన రాజు అత్తివర్మ హిరణ్యగర్భ ప్రసవుడను అని చెప్పుకున్నాడు. పాలకులు సంతానం కోసం పుత్రకామేష్టి యాగం, రాజ్య విస్తరణకు అశ్వమేధ యాగం మొదలగు యాగాలు చేసేవారు.

20. ఖారవేలుడు జారీ చేసిన హతిగుంఫా శాసనం ఏ భాషలో ఉంది?
   1) ప్రాకృతం 2) సంస్కృతం
   3) తెలుగు 4) ఒరియా

జ. 1;
వివరణ: కళింగ రాజు ఖారవేలుడు హతిగుంఫా శాసనంను జారీ చేశాడు. ఇది ప్రాకృత భాషలో ఉంది. ఆయన 'మూషికాధిపతి' అని పిలువబడ్డాడు. ఈ శాసనంలో ఆయన రాజ్య విస్తీర్ణం మొదలగు విషయాలు ఉన్నాయి.

21. విజయనగర రాజులు ఆదరించిన తొలి తెలుగు కవి?
   1) తెనాలి రామలింగకవి 2) ధూర్జటి
   3) పింగళి సూరన 4) నాచన సోముడు

జ. 4;
వివరణ: సంగమవంశ విజయనగర రాజు మొదటి బుక్కరాయలు ఆదరించిన తొలి తెలుగు కవి నాచన సోముడు. ఈ కవికి పెంచికలదిన్నెను బహూకరించాడు. ఉత్తర హరివంశం అనే గ్రంథాన్ని ఈయన రాశాడు. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మహత్యం, తెనాలి రామలింగకవి పాండురంగ మహత్యం, పింగళి సూరన కళాపూర్ణోదయం మొదలగు గ్రంథాలు రాసిన ప్రముఖులు.

22. రామప్ప దేవాలయంను నిర్మించిందెవరు?
   1) రేచర్ల ప్రసాదాదిత్యుడు 2) గోన గన్నారెడ్డి
   3) రేచర్ల రుద్రుడు 4) గోన బుద్ధారెడ్డి

జ. 3;
వివరణ: క్రీ.శ. 1213లో గణపతి దేవుని సామంతుడు రేచర్ల రుద్రుడు, పాలంపేటలో రామప్ప దేవాలయంను నిర్మించాడు. దీని ఇటుకలు నీటిలో బెండు వలె తేలే స్వభావాన్ని కల్గి ఉన్నాయి. రంగనాథ రామాయణం రాసింది గోన బుద్ధారెడ్డి, రుద్రమకు సహకరించింది రేచర్ల ప్రసాదాదిత్యుడు, గోన గన్నారెడ్డి. వీరు కాకతీయుల కాలంలో గల ప్రముఖులు.

23. బ్రహ్మ నాయుడు పంచలోహ స్తంభంను ఎక్కడ నాటించాడు?
   1) మోటుపల్లి 2) త్రిపురాంతకం
   3) పులికాట్ 4) చేజెర్ల

జ. 2;
వివరణ: పల్నాటి బ్రహ్మనాయుడు వీర వైష్ణవాన్ని ప్రచారం చేశాడు. పంచలోహ స్తంభాన్ని త్రిపురాంతకంలో నాటించాడు. అందరూ ఒక్కటే అనేది ఆయన అభిమతం. మోటుపల్లి కాకతీయుల ఓడరేవు, పులికాట్ (ప్రళయకావేరి) వేంగి చాళుక్యుల సామంతుడు పండరంగడు నిర్మాణాలు ఉన్న ప్రాంతం, చేజెర్ల కపోతేశ్వర ఆలయం గల ప్రాంతం.

24. శ్రీలక్ష్మీ, శంఖంలను తమ శాసనాలపై చిహ్నాలుగా లిఖించుకున్న తొలి రాజులు?
   1) విష్ణుకుండినులు 2) శాలంకాయనులు
   3) తూర్పు చాళుక్యులు 4) కాకతీయులు

జ. 1;
వివరణ: శ్రీలక్ష్మి రాజ్య ఆర్థికాభివృద్ధికి చిహ్నం. మహా విష్ణువుకు ప్రతిరూపం శంఖం, హైందవ సంస్కృతిని వ్యాప్తి చేయటంలో విష్ణు కుండినులు కీలక పాత్ర పోషించారు.

25. రాణి రుద్రమదేవి కాలంలో ప్రసూతి వైద్యశాల నిర్మించిన ప్రాంతమేది?
   1) మందడం 2) త్రిపురాంతకం
   3) చందుపట్ల 4) పానగల్లు

జ. 1;
వివరణ: రాణి రుద్రమ దేవి కాలంలో మందడం అనే ప్రాంతంలో ఉచిత ప్రసూతి వైద్యశాలను నిర్మించారు. త్రిపురాంతకం ప్రముఖ శైవ క్షేత్రం. చందుపట్ల రుద్రమదేవి మరణ వివరణ ఉన్న శాసనం గల ప్రాంతం, ఛాయా సోమేశ్వరాలయం గల ప్రాంతం పానగల్లు. దీనిని కుందూరు చోడులు నిర్మించారు.

What is the meaning of the phrase 'substantial moderation'



BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.No 1-10): Read the following passage carefully and answer the questions that follow.

Five years ago, any sign of weakness in the Rupee would have been the cue for RBI officials, ministers and sundry economic commentators to lash out at Indian households for their unreasonable and unpatriotic love for gold.

And it is true that gold imports had a big role to play in India's yawning trade deficit and precarious balance of payments position in 2013. But as the Rupee has entered shaky territory again it is oil rather than gold that has been the hot topic of debate. There's good reason for this shift.

A break down of India's import bill suggests that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. In fact, data suggest that the Indian saver's love affair with gold may be well past its prime.

When India faced a run on the Rupee and a widening trade deficit in 2013, its annual gold import bill had topped $50 billion for the second year running. Between FY10 and FY13, India saw consistently high demand for gold jewellery, bars and coins despite **galloping** global gold prices. The bloated the country's gold import bill from about $28 billion in FY10 to a record $56 billion in FY12.

But gold imports have since seen **substantial moderation** from those excessive levels. In FY18, India's dollar outgo on gold imports amounted to just $34 billion, having shrunk 40 percent from the peak six years ago. Lest you think this is an **aberration**, gold imports have hovered in a narrow range of $27 billion to $35 billion for five years now. Bullion accounted for nearly 12 percent of the country's import bill in FY12. But its contribution is now down to about 7 percent.

This explains why debates around the current account deficit no longer **obsess** over the yellow metal.

Trends in domestic demand, tracked by the World Gold Council, show that Indian consumers have been cutting back on the volume of gold purchases in the last five years. In the years from 2010 to 2012, consumers accumulated anywhere between 900 and 1,000 tonnes of bullion a year. Jewellery accounted for about two-thirds of this volume, with bars and coins making up a third.

In the last five years though, bar and coin demand has halved from 355 tonnes in 2012 to 164 tonnes in 2017. Jewellery demand, after rising from 595 tonnes to 662 tonnes between 2012 to 2015, has flat-lined, slipping back to 573 tonnes in 2017.

As a result, aggregate domestic demand for gold has fallen by 20 percent between 2012 and 2017. So, what has made Indian consumers cold-shoulder their favorite asset? Several factors seem to be at play.

Indian gold buyers view bullion as much as an investment as an item of adornment. We all know that any investment is most sought-after when its returns are soaring. So it was with gold.

In the five years following the global financial crisis in 2008, gold churned out bumper returns for Indian investors who hoarded it, thanks to a global flight to safe-haven assets and a steadily depreciating Rupee.

With domestic gold holders earning a 20 percent plus return for five consecutive years until 2013, investment demand for the yellow metal sky-rocketed. Gold is also seen as a hedge against inflation and the runaway price-spike in this period also **stoked** demand.

But with the global stock and bond markets staging a recovery from 2013, and inflation flagging, gold began to lose its **mojo**. As the Rupee stabilized, domestic gold investments suffered three consecutive years of negative returns from 2015 to 2017, dousing investor interest. Purchases of bars and coins, which topped 340 tonnes in 2013, had crashed to 164 tonnes by 2017.

1. The author of the passage asserts that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. Then who is the real culprit?
   1) Major steps of economic reforms taken by the incumbent government.
   2) Price hike of crude oil in global market and its impact of Indian economy.
   3) Exemption of petrol and diesel from GST
   4) All (1), (2) and (3)
   5) Only (1) and (2)
2. What is the meaning of the phrase 'substantial moderation' as used in the passage?
   A) Remarkable downward trend
   B) Noticeable upward movement
   C) Either upward or downward trend
   1) Only A 2) Only B 3) Only C
   4) None of these
   5) Other than those given as options
3. What was the impact of Indian households' unreasonable and unpatriotic love for gold in 2013 on Indian economy?
   A) Due to excessive demand by Indian household the government earned huge revenue through taxation resulting in improvement in Indian economy.
   B) The unreasonable demand of gold by Indian household gave rise to a situation of trade deficit.
   C) As a result of excessive demand of gold in Indian bullion market the balance of payments position improved.
   1) Only A 2) Only B 3) Only C
   4) Both A and B 5) All A, B and C
4. Find the incorrect statement on the basis of the given passage.
   1) Bullion accounts for about 7 per cent of the country's import bill as of now.
   2) The consistent high demand for gold jewellery, bars and coins bloated the country's gold import bill to a record $56 billion in FY12.
   3) As per the observation of the World Gold Council, Indian consumers showed heightened inclination towards purchase of yellow metal in the last five years.
   4) Between 2012 to 2017 the aggregate domestic demand for gold has come down by 20 percent.
   5) None of the above
5. Why did people prefer to invest in gold rather than in other class of investments during the period following the global financial crisis in 2008 till 2013? Answer on the basis of the given passage.
   1) Because gold gave attractive returns on its sale
   2) Because the investment in gold was seen as a hedge against inflation
   3) Because of easy liquidity of gold
   4) Only (1) and (2)
   5) All (1), (2) and (3)

Directions (Q.No 6-8): Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in bold as used in the passage.

6. **Obsess**
   1) Repulse 2) Dominate
   3) Exude 4) Distract 5) Rely
7. **Stoked**
   1) Slumped 2) Declined
   3) Surged 4) Supplied 5) Relied
8. **Mojo**
   1) Poison 2) Price
   3) Junk 4) Life 5) Charm

Directions (Q.No 9-10): Choose the word which is MOST OPPOSITE in meaning of the word printed in bold as used in the passage.

9. **Galloping**
   1) Jumping 2) Running
   3) Speedy 4) Halted 5) Flying
10. **Aberration**
   1) Conformity 2) Peculiarity
   3) Delusion 4) Weirdness
   5) Deviation

Directions (Q.No 11-15): Read each sentence to find out whether there is any grammatical or idiomatic error in it. The error, if any, will be in one part of the sentence, the number of that part is the answer. If there is "No error", the answer is 5. (Ignore errors of punctuation, if any).

11. (1) It is amazing how concern for / (2) the common man and the inconvenience caused to them / (3) has suddenly become / (4) a huge issue for the Opposition. / (5) No error
12. (1) Casting aspersions on the suitability / (2) of Donald Trump as president of the United States/ (3) amounts to disrespecting / (4) the American people's verdict. / (5) No error
13. (1) While Modi continues his harangue, / (2) some BJP members are behaving like Nero/ (3) playing the fiddle / (4) while Rome burnt. / (5) No error
14. (1) For India to remain a constitutional democracy / (2) we need a Supreme Court that operates/ (3) as an effective check on majority / (4) legislative and executive power. / (5) No error
15. (1) The Indian embassy in Beijing has now asked / (2) the government to consider extending / (3) the March 31 deadline for NRI / (4) as many cannot travel to India before then. / (5) No error

Directions (Q.No16-20): In the following questions, a sentence has been given with some of its parts in bold. To make the sentence grammatically and idiomatically correct, you have to replace the bold part with the correct alternative given below. If the sentence is correct as it is, give (5) as your answer (i.e, No correction required).

16. Those with ears to the ground can hear the buzz of a movement that **are in way in** rural UP.
   1) is on the way in
   2) is towards the way of
   3) is way of 4) is underway in
   5) No correction required
17. Legalising betting will curtail the influence of unethical elements **on the** sports.
   1) of the 2) in the
   3) over 4) against
   5) No correction required
18. Researchers have found that **learning by doing** practice tests, a strategy known as retrieval practice, can protect memory against the negative effects of stress.
   1) learning by giving
   2) learning by taking
   3) learning by making
   4) learning by having
   5) No correction required
19. Growth of digital economy has given rise to hackers and fraudsters who take advantage of the weak **links to** the internet.
   1) links of 2) links in
   3) links from 4) link attached to
   5) No correction required
20. Because of the higher prices, many buyers of Indian Pepper **has switched to** Indonesia and Vietnam.
   1) have switched over to
   2) switched over to
   3) had switched into
   4) have to switched to
   5) No correction required

Directions (Q.No 21-23): Below in each question some parts of a sentence are given. Find the part of the sentence which is not really contributing to the main theme of the sentence and rearrange the remaining parts of the sentence to make a meaningful and grammatically correct sentence. If the given sentence is correct as it is then choose (5). If the sequence is the one which is not given then choose option (4) as your choice.

21. The two adventurous economic disruptions (A) / And approved rating (B) / Made him the darling of (C) / Bestowed Modi the mantle of a socialist messiah and (D) / The underprivileged (E).
   1) EDCA 2) ABDE 3) ADCE
   4) None of these
   5) NO correction required
22. A de facto majoritarian state is in existence (A) / whereby critiquing the BJP is tantamount to treason, (B) / Criticising the government is equivalent to sedition (C) / A new language has been invented (D) / And questioning the establishment is downright blasphemous. (E)
   1) ABED 2) DBCE 3) CABD
   4) None of these
   5) NO correction required
23. Amid a looming threat of stringent US sanctions (A) / Has requested an extra one million barrels of oil from the National Iranian Oil Co. (NIOC) (B) / Agreed to provide almost free shipping to Indian refiners in 2018 / 19, an incentive that significantly reduces the landed cost of Iranian oil (C) / Indian state refiner Bharat Petroleum Crop. (D) / For June, two industry sources said. (E)
   1) DBEA 2) ADBE
   3) ADCB 4) None of these
   5) NO correction required

KEY

1) 2 2) 1 3) 2 4) 3 5) 4
6) 2 7) 3 8) 5 9) 4 10) 1
11) 2 (Replace 'them' with 'him'
12) 5 13) 4 (Replace 'burnt' with 'burns')
14) 3 (Replace 'majority' with majoritarian')
15) 3 (Replace 'NRI' with 'NRIs')
16) 4 17) 5 18) 2 19) 2 20) 1
21) 3 ('B' does not contribute to the main theme of the sentence)
22) 2 ('A' does not contribute to the main theme of the sentence)
23) 2 ('C' does not contribute to the main theme of the sentence)